సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 25

బుధవారం 17-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

నేడు శ్రీరామనవమి

పితృవాక్పాలన, ధర్మవర్తన, సదా సత్యమే పలకడం, ప్రజానురంజకమైన పాలనను అందించడం.. వంటి ఎన్నో లక్షణాలను బట్టి అందరి గుండెల్లో దేవుడిగా కొలువు తీరాడు రాముడు. అయితే మన నిత్యజీవితంలో అసలు రామ శబ్దం లేనిదెప్పుడు? చిన్నప్పుడు లాల పోసి శ్రీరామ రక్ష చెప్పడం దగ్గరనుంచి 'రామాలాలీ.. మేఘశ్యామా లాలీ' అనే జోలపాటతో బిడ్డలను నిద్ర పుచ్చడం వరకు... అందరి జీవితాలలో రాముడు ఒక భాగంగా మారిపోయాడు. నేడు ఆ జగదభిరాముడు ఇలపై పుట్టిన రోజు.. అంతేనా... ఆదర్శదంపతులుగా పేరు పొందిన సీతారాముల పెళ్లిరోజు కూడా. ఈ సందర్భంగా ఆ పురుషోత్తముడి గురించి...

దివ్యం.. భవ్యం.. రమ్యం

రామచరితం



ఆయన ఇక్ష్వాకు కుల తిలకుడు. దశరథ మహారాజ తనయుడు. తండ్రి మాటను నిలబెట్టడం కోసం రాజ్యంతోబాటు సర్వ సంపదలనూ, అన్ని సుఖాలనూ విడనాడి నారదుస్తులు ధరించి పదునాలుగేళ్లపాటు అరణ్యవాసం చేశాడు. ఎన్ని కష్టాలొచ్చినా వెరవలేదు. తాను నమ్మిన సత్య, ధర్మ మార్గాలనే అనుసరించాడు. ఒక మంచి కొడుకులా, అనురాగాన్ని పంచే భర్తలా, ఆత్మీయతను అందించే అన్నలా, ప్రజలను కన్నబిడ్డల్లా పాలించే రాజులా ... అందరితో అన్ని విషయాలలోనూ వినమ్రతతో మెలిగే మర్యాద పురుషోత్తముడిలా... ఇలా ఎవరితో ఏవిధంగా ఉండాలో ఆ విధంగానే నడుచుకున్నాడు. అన్నివేళలా ధర్మాన్నే పాటించాడు. ఆపన్నులకు స్నేహహస్తాన్ని అందించాడు. ఆత్మీయులకు, మిత్రులకు అండగా నిలిచాడు. తాను అవతార పురుషుడినని అనలేదు. అనుకోలేదు కూడా... దేవుడినని ఎన్నడూ చెప్పుకోలేదు. ఎవరికీ ఏ ధర్మాన్నీ బోధించలేదు. తాను ఆచరించినదే ధర్మం – అనుకునే విధంగా వ్యవహరించాడు. అందుకే ధర్మం రూపు దాల్చితే రాముడిలా ఉంటుందేమో అనుకునేలా ప్రవర్తించాడు.

సంపూర్ణావతారం

ధర్మ పరిరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాలన్నింటిలోనూ సంపూర్ణమైనవి రామావతారం, కృష్ణావతారాలే. మిగిలినవి అంశావతారాలు. అంటే అప్పటికప్పుడు ఆవిర్భవించినవి. మత్స్య, కూర్మ, హయగ్రీవ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, కల్కి అవతారాలు. మానవాళిని సత్యవాక్య పాలకులుగా తీర్చిదిద్ది, సన్మార్గంలో నడిపించడం కోసం మానవుడిలా పుట్టాడు. అందరిలాగే ఎన్నో కష్టనష్టాలను అనుభవించాడు. అయితేనేం, ధర్మాన్ని ఎక్కడా తప్పలేదు. అందుకే కదా... అతి సామాన్యులనుంచి అసామాన్యుల వరకు అందరికీ ఆరాధ్య దైవమయ్యాడు. ఉత్తమ మానవుడు ఎలా ఉండాలో తన నడవడిక ద్వారా నిరూపించి, సకల గుణాభిరాముడయ్యాడు.

కల్యాణ వైభోగం

ఆ శ్రీహరి రామునిగా ఇలపై అవతరించిన పుణ్య తిథి శ్రీరామ నవమి. ఈ పండుగను తొమ్మిది రోజులు జరుపుతారు. చైత్ర శుక్ల పాడ్యమి నుంచి శ్రీరామనవమి వరకూ పూజాదికాలు, రామనామ పారాయణం చేస్తారు. అసలు చైత్ర మాస ప్రారంభం నుంచే ఇంటింటా, వాడవాడలా, వీధివీధినా చలువ పందిళ్లు, మామిడాకు తోరణాలు... ఇలా ప్రతిచోటా కళ్యాణోత్సవ సంరంభాలు మొదలవుతాయి. కంచర్ల గోపన్న భక్తరామదాసుగా శ్రీరామసేవా దీక్షను స్వీకరించాడు. ప్రతి సంవత్సరం శ్రీరామ జన్మదినోత్సవమైన శ్రీరామనవమి నాడు శ్రీసీతారాములకు తిరుకల్యాణ మహోత్సవాన్ని జరిపించే సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టాడు. సిరికల్యాణ తిలకంతో, మణిమయ బాసికాలతో ఆణిముత్యాలే తలంబ్రాలుగా జాలువారే ముగ్ధమోహనమైన, మనోరంజకమైన సీతారాముల పెళ్ళి వేడుక జగదానందకారకమై భాసిస్తుంది. శ్రీరామనవమి మరుసటి రోజు దశమి నాడు శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు.

తారక మంత్రం

'శ్రీరామ రామరామేతి రమే రామే మనోరమే .. సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే' అనే శ్లోకం విష్ణుసహస్ర నామంతో సమానమైనదంటారు. మోక్షాన్ని ప్రసాదించే మహామంత్రాలు ఓం నమో నారాయణాయ. ఓం నమశ్శివాయల నుంచి తీసుకున్న అక్షరాల కలయిక అయిన రామనామాన్ని జపిస్తే ఈ రెండు మంత్రాలను జపించడం వల్ల కలిగే ఫలితం కంటె ఎక్కువ ఫలం కలుగుతుంది. మన పెద్దలు రామనామం లోని 'రా' అనే అక్షరాన్ని పలికినపుడు మనలోని పాపాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. 'మ' అనే అక్షరాన్ని ఉచ్చరించినప్పుడు అవి లోపలకు రాకుండా మూసుకుంటాయి. కాబట్టి 'రామ' అనే రెండక్షరాల తారక మంత్రాన్ని సదా స్మరిస్తుండడం వల్ల పాపాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని కబీరుదాసు, భక్త రామదాసు, తులసీదాసు వంటి మహాభక్తులు ఉవాచించారు.

పుట్టినరోజునే పెళ్ల వేడుకలా..!?

శ్రీరాముడు జన్మించిన పుణ్యతిథి చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రం, కర్కాటక రాశి, కర్కాటక లగ్నం. ఆనాడు రాముని జన్మదిన వేడుకలు జరిపించాలి. అయితే శ్రీ సీతారామకళ్యాణం జరిపించడంలోని అంతరార్థం ఏమిటనేదానికి పురుషోత్తమ సంహిత అనే ఆగమ శాస్త్ర గ్రంథం ఏమి చెబుతోందంటే– ఆ పరమాత్ముడు అవతారమూర్తిగా ఏ రోజున ఈ పుణ్యపుడమిపై అవతరిస్తే ఆ రోజునే కళ్యాణం జరిపించాల్సి ఉందనీ, ఒకవేళ ఆ తిథి తెలియకపోతే ఏకాదశి రోజున కళ్యాణం జరిపించడం సంప్రదాయమని పేర్కొంది. అందుకే లోక కళ్యాణం కోసం సీతారాములకు పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమినాడు అభిజిత్ లగ్నంలో పెళ్లి వేడుకలు జరిపిస్తున్నారు.

శుభప్రదం... రామచరిత పారాయణం

రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలా నడిచింది. దేశం సుభిక్షంగా ఉంది. అందుకే నేటికీ ప్రజలు రాముని వంటి రాజుకోసం– రామరాజ్యం నాటి పాలన కోసం పరితపిస్తుంటారు. తులసీదాసు, రామదాసు, కబీరుదాసు వంటి వారందరూ ..."అంతా రామ మయం.... ఈ జగమంతా రామమయం" అని వేనోళ్ల స్తుతించారు. ఆ పురాణ పురుషుని పుణ్యచరితమైన రామాయణాన్ని విన్నా, చదివినా, అందులోని శ్లోకాలను, ఘట్టాలను మననం చేసుకున్నా, శుభం కలుగుతుందని ప్రతీతి.

12 గంటలకు ఎందుకు?

రాముడు త్రేతాయుగంలో వసంత రుతువు, చైత్ర శుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నం, అభిజిత్ ముహూర్తం అంటే మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి రోజున శ్రీరాముడి వివాహం, పదునాలుగు సంవత్సరాల అరణ్యవాసం, రావణ సంహారం తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడు అయిన రోజు కూడా చైత్ర శుద్ధ నవమి. శ్రీరామ నవమి రోజున ప్రతి శ్రీరాముని దేవాలయాలలో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించి సాయంత్రం వీధులలో ఊరేగిస్తారు. శ్రీరాముడు మధ్యాహ్నం 12:00 గంటలకు పుట్టాడు కాబట్టి శ్రీరామనవమి రోజున మధ్యాహ్నం 12 గంటలకు పూజ చేస్తే శ్రీరామానుగ్రహంతో కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం.

శ్రీరామ నవమినాడు ఏం చేయాలి?

ఈరోజు రామునితోబాటు సీతాదేవి ని, ఆంజనేయుని, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను కూడా పూజించాలి. రామునికి జన్మనిచ్చిన కౌసల్యను, దశరథుని కూడా స్తుతించడం సత్ఫలితాలనిస్తుంది. సీతారామ కళ్యాణం జరిపించడం, ఆ వేడుకలలో పాల్గొనడం, చూడడం, శ్రీరామ నవమి వ్రతాన్ని ఆచరించడం, విసనకర్రలు దానం చేయడం మంచిది.

సమర్పించవలసిన నైవేద్యం

పానకం, వడపప్పు, చలిమిడి, మామిడిపండ్లు, చక్కెర పొంగలి, చెరకు, విప్పపూలు నివేదించాలి. సీతా రామ కళ్యాణ తలంబ్రాలను ధరిస్తే ఆటంకాలు తొలగి సత్వరం వివాహం అవుతుందని పెద్దలంటారు.

ఏటా చైత్రశుద్ధ నవమి రోజున పునర్వసు నక్షత్రంలో అభిజిత్ లగ్నంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం శ్రీసీతారామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని భద్రాద్రిలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలను తిలకించేందుకు దేశం నలు మూలల నుంచి భక్తులు తరలివస్తారు. తానీషా గోల్కొండ నవాబుగా ఉన్న కాలం నుంచి– ఆనాటి సాంప్రదాయం మేరకు నేటికీ భద్రాద్రిలో జరిగే శ్రీ సీతారామ కళ్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సమర్పించడం ఆనవాయితీ.

నిత్యజీవితంలో రాముడు...

లాల పోసేటప్పుడు శ్రీరామ రక్ష,
జోలపాడేటప్పుడు రామాలాలీ మేఘ శ్యామాలాలీ... ఓదార్పుగా అయ్యోరామ...
అనకూడని మాట వింటే రామ రామ...
పద్దు పుస్తకాలను ప్రారంభిస్తూ శ్రీరామ...
కూర్చునేటప్పుడు లేచేటప్పుడూ రామా...
ఇలా ఆయన అందరి నాలుకలమీదా నర్తిస్తూనే ఉన్నాడు... ఉంటాడు.
అల్లరి చేస్తే కిష్కింద కాండ,
కఠినమైన ఆజ్ఞ ఇస్తే సుగ్రీవాజ్ఞ
విశాలమైన ఇంటి గురించి చెప్పేటప్పుడు లంకంత ఇల్లు
పాతవాటి గురించి చెప్పాలనుకుంటే ఇక్ష్వాకుల కాలం నాటిది...

సామెతలు: రామాయణంలో పిడకల వేట; రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందన్నట్టు... చూసి రమ్మంటే కాల్చి వచ్చినట్టు

ఆకారం గురించి చెప్పాలంటే రాముడిలా ఆజానుబాహువంటారు.
ఎంతకీ చూడ్డానికి రాబోతే సీతకన్నేశావంటారు
సైన్యంలా వస్తే రామదండు అంటారు.
చక్కని జంటను సీతారాముల్లా ఉన్నారంటారు.
ఎవరైనా కొట్టుకుంటే రామరావణ యుద్ధమంటారు.
అందరిళ్లలోని గిల్లి కజ్జాలను ఇంటింటి రామాయణమంటారు.

రాముడు మనకు విలువలను, వ్యక్తిత్వాన్నీ నేర్పితే రామాయణం మనకు జీవిత పాఠాలు బోధిస్తుంది.

రామచంద్ర ప్రభువు చల్లని చూపులు మనందరి మీదా ప్రసరించాలని కోరుకుంటూ....

– డి.వి.రామ్ భాస్కర్

---

* వయసు @ 70

సోలో ట్రావెలర్



నీరూ సలూజా

"వయసు కాదు ప్రతి ఒక్కరూ తమ హృదయ లయను అర్థం చేసుకొని, దానిని అనుసరించాలని నమ్ముతాను. ఇతరుల గుండె చప్పుడులో జీవించాలని ఎప్పుడూ అనుకోవద్దు" అంటోంది రిటైర్డ్ ప్రొఫెసర్ జైపూర్‌వాసి నీరూ సలూజా. జీవితం ఎప్పుడూ ఒక కంఫర్ట్ జోన్ బయటే ఉంటుందనే వాస్తవాన్ని గట్టిగా నమ్మే ఈ ప్రొఫెసర్ డెబ్బై ఏళ్ల వయసులో సోలో ట్రావెలర్‌గా 80 దేశాలు చుట్టొచ్చింది. భిన్న సంస్కృతులను, పర్యావరణాన్ని అర్థం చేసుకోవడానికి, ఎంతో మందిని కలుసుకొని కొత్త ఉత్తేజాన్ని పొందడానికి ఈ ప్రయాణం ఎంతగానో తోడ్పడింది అని చెబుతుంది.



"పసిఫిక్‌లోని గాలా పాగోస్ దీవుల నుండి అట్లాంటిక్ మంచుతో నిండిన క్షితిజాల వరకు చేసిన పర్యటనల ద్వారా ఎన్నో స్మారక చిహ్నాలను సేకరించాను. వాటితో అలంకరించిన నా ఇంటిని చూసిన వాళ్లు ప్రపంచ మ్యాప్‌లా ఉంటుందని అంటారు. ఈ జ్ఞాపకాలు అన్నీ ఇప్పటి వరకు నేను చేసిన సాహసాలను గుర్తుచేస్తాయి. ఇంకా నా ఇంటి గోడలపై మిగిలిన ఖాళీ స్థలాలు రాబోయే చిహ్నాల కోసం నాతో సవాల్ చేస్తున్నట్లుగా కనిపిస్తాయి.



కల వెనకాల రహస్యం

నాకు ప్రయాణాల పట్ల ఆసక్తి కలగడానికి స్కూల్ రోజుల్లోనే బీజం పడింది. స్కూల్‌కి సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదానికి గురై ఎడమ కాలు విరిగింది. ఫిజియోథెరపీ సెషన్‌లతో పాటు నెలల తరబడి బెడ్‌రెస్ట్‌లో ఉండిపోయాను. ఇతర పిల్లలు స్కూల్లో ఉంటే నేను గదికి పరిమితం అయ్యాను. అప్పట్లో వినోదానికి టీవీ లాంటి ఏ సాధనమూ లేదు. దీంతో పడకగదిలోని కిటికీ లోంచి బయటకు చూస్తూ గంటల తరబడి కాలం గడపవలసి వచ్చింది. అక్కడ నుంచి ఆకాశం కేసి చూస్తూ ఉండేదాన్ని. ప్రపంచాన్ని అన్వేషించాలనుకునేదాన్ని. దాదారు ఆరు దశాబ్దాల తరువాత అలా నా కల నిజమైంది.

ప్రేమ వారసత్వం

కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగ నిర్వహణ, భార్యగా విధులు, తల్లిగా బాధ్యతలు, ఇంటి నిర్మాణం.. అన్నీ నిర్వర్తించాను. నా పిల్లలు స్థిరపడ్డారు. నా భర్తతో కలిసి చాలా టూర్లకు వెళ్లే వాళ్లం. ఆయన నాకు భర్త మాత్రమే కాదు నా ట్రావెలర్ ఫ్రెండ్ కూడా. 2010లో ఆయన మరణించడంతో మా ప్రేమ వారసత్వాన్ని నేను కొనసాగించాలని నిర్ణయించుకున్నాను. స్నేహితులు, కుటుంబ సభ్యుల రాక కోసం ఎదురుచూస్తూ ఉండలేను. ఆ విధంగా ఎనభైకి పైగా దేశాలను చుట్టొచ్చాను. ప్రపంచాన్ని అన్వేషించగలగడం ఒక అదృష్టంగా భావించకూడదు. అదొక ప్రయాణం.

దృష్టి కోణాన్ని మార్చింది

మొదటి ఒంటరి ప్రయాణం మాత్రం నాకు ఒక సాహసమే అని చెప్పగలను. 2014లో యూరప్ క్రిస్మస్‌కి క్రూయిజ్ ద్వారా వెళ్లాను. ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. ఒంటరిగా ప్రయాణించడం ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ యాత్రతో నాకు అర్థమైంది. నిరుత్సాహమైనదని కొందరు అంటుంటారు. కానీ, నేనది అంగీకరించను. ప్రయాణ ప్రణాళికను బాగా ప్లాన్ చేసుకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముందు తెలుసుకున్నాను. మనతో ఒకరు తోడు కావాలనుకుంటే మాత్రం మార్గంలో ఎంతో మంది కొత్త స్నేహితులు కలుస్తారు. కాబట్టి నిజంగా ఒంటరిగా ఉన్నాననే ఆలోచనే రాదు. ఈ యాత్ర నా దృష్టి కోణాన్ని పూర్తిగా మార్చింది. ఒంటరిగా ప్రయాణించడం, గమ్యాలను, ప్రయాణ మార్గాలను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఇదే ఒక సమూహం, కుటుంబ పర్యటన అయితే ఒక సమయపాలనకు కట్టుబడి ఉండాలి. ఆ గ్రూప్‌లో ఎవరు ఏం చేస్తారో మీరూ అదే చేయాల్సి ఉంటుంది. కానీ, ఒంటరి యాత్రికుల విషయంలో అలాంటి డిమాండ్స్ ఏవీ ఉండవు.



అడుగడుగునా ఉత్సుకత

నా జీవితంలో అతి ఎక్కువగా గుర్తుండిపోయేది 2017 చలికాలంలో స్వీడన్ పర్యటన. నార్తర్న్ లైట్స్‌కు ప్రసిద్ధి చెందిన స్టాక్ హోమ్ నుండి అబిస్కోకు రైలు ఎక్కడం ద్వారా ఇది ప్రారంభమైంది. మన దేశం రైళ్లకు, అక్కడి రైళ్లకు ఏ మాత్రం పోలిక లేదు. బోర్డింగ్‌లో ప్రతి వ్యక్తికీ వాష్ రూమ్‌కి ఒక కీ ఇస్తారు. అదొక ఖరీదైన హోటల్ లాంటిది. అక్కడి బాత్రూమ్‌లో ఒక గంట సమయం గడపాలనుకున్నాను. తిరిగి కంపార్ట్‌మెంట్‌కు వచ్చినప్పుడు అది లాక్ అయిపోయింది. ఎవరూ సాయం చేసేవాళ్లు లేరు. కంగారు పడ్డాను. కానీ, చివరకు మార్గాన్ని కనుక్కోగలిగాను. ఇలాంటి ఎన్నో ఉత్కంఠలు, ఉత్సుకతలు, సాహసాలు.. ఒక్కరోజులో చెప్పలేను. అబిస్కోలో ఒక మంచు గదిలో బస. అక్కడ అది ఎంతో అందంగా, సహజంగా ఉంది. కానీ, బాత్‌రూమ్‌లు లేవని ఆలస్యంగా తెలిసింది. అక్కడ పడిన పాట్లు ఒక్క మాటలో చెప్పలేను. మాస్కో నుండి బీజింగ్ వరకు ట్రాన్స్ –సైబీరియన్ రైలు ప్రయాణం.. అదొక ప్రపంచం. మెల్‌బోర్న్‌లో 12 వేల అడుగుల నుండి స్కై డైవింగ్ చేయడం అత్యంత ఉత్కంఠను కలిగించింది. ఇలా చెబుతూ పోతే ఎన్నో జ్ఞాపకాలు. ఒక స్వేచ్ఛ విహంగమై చేస్తున్న ప్రయాణం నాకు ఎన్నో తీరాలను పరిచయం చేస్తోంది" అని వివరిస్తుంది ఈ ట్రావెలర్.



నీరూ సలూజా

యూత్ పల్స్

కథర్నాక్

'కథలు చెప్పకు' అని పేరెంట్స్‌తో, ఫ్రెండ్స్‌తో సుతిమెత్తని తిట్లు తినని వారు యూత్‌లో తక్కువగానే ఉంటారు. అయితే ప్రసిద్ధ బ్రాండ్స్ మాత్రం 'కథలు చెప్పండి ప్లీజ్' అంటూ యంగ్ టాలెంట్‌కు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రకటనలకు సంబంధించి ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్ అనేది బ్రాండ్స్‌కు, కన్స్యూమర్‌లకు మధ్య బలమైన వారధిగా మారింది. రకరకాల బ్రాండ్‌లకు సంబంధించి భావోద్వేగాలతో మిళితమైన యాడ్స్ యువ సృజనకారులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



అమూల్ బ్రాండ్ 'అమూల్ గర్ల్' ద్వారా సమకాలీన సంఘటనలతో కనెక్ట్ కావడానికి చేస్తున్న టాపికల్ యాడ్స్ పాపులర్ అయ్యాయి. నగల బ్రాండ్ 'తనిష్క' తమ వ్యాపార ప్రకటనల్లో 'స్టోరీ టెల్లింగ్' ఫార్మట్‌ను బలంగా ఉపయోగించుకుంటుంది. ఇక 'లైఫ్‌బాయ్' దగ్గరకు వస్తే... ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్ అనేది ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేయడానికే కాదు పబ్లిక్ హెల్త్ అవేర్‌నెస్ విషయంలోనూ ఉపయోగపడుతుందనేది అర్థమవుతుంది.

శాస్త్ర, సాంకేతిక విషయాలపై వినియోగదారుల్లో ఆసక్తి కలిగించడానికి, పెంచడానికి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, స్టేజ్‌డ్ విజువల్స్‌ను ఉపయోగించుకుంటుంది అమెరికన్ మల్టీనేషనల్ కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్.

బ్రాండ్‌లు విస్తృత స్థాయిలో కన్స్యూమర్‌లతో కనెక్ట్ కావడానికి తమ ప్రాడక్ట్‌కు సంబంధించిన అడ్వర్‌టైజింగ్ విషయంలో భావోద్వేగాలతో కూడిన ఎఫెక్టివ్ స్టోరీ టెల్లింగ్‌ను కోరుకుంటున్నాయి. అడ్వర్‌టైజింగ్ ప్రపంచంలో స్ట్రాటజిక్ స్టోరీ టెల్లింగ్ అనేది కీలకంగా మారింది. ఈ పవర్‌ఫుల్ టూల్ బ్రాండ్స్‌కు, కన్స్యూమర్‌లకు మధ్య బలమైన వారధిగా మారింది.

సర్వేల ప్రకారం ప్రాడక్ట్‌లకు సంబంధించి సంప్రదాయ అడ్వర్‌టైజింగ్‌ల కంటే మిత్రుల మాటలనే విశ్వసిస్తోంది యువత. వారిలో నమ్మకం కలిగించాలంటే యాడ్ అనేది యూత్‌ఫుల్‌గా, మిత్రుడు కొత్త విషయం చెప్పినట్లుగా ఉండాలి. ఇందుకోసం బ్రాండ్స్ యువ స్టోరీ టెల్లర్స్‌ను ఉపయోగించుకుంటున్నాయి.

వారి స్టోరీ టెల్లింగ్‌లోని తాజాదనానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. థీమ్‌ను గుర్తించడం, సెంట్రల్ క్యారెక్టర్స్‌ను డిజైన్ చేసుకోవడం, కస్టమర్‌ల హృదయాలను తాకేలా యాడ్‌ను తీర్చిదిద్దడం అనేవి స్టోరీ టెల్లింగ్‌లో కీలక విషయాలు. ఇలాంటి విషయాలలో యువ సృజనకారులు తమలోని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు.

ఈ డిజిటల్ శకంలో స్టోరీ టెల్లింగ్ అనేది కొత్త రూపాలతో సృజనాత్మకంగా వికసిస్తోంది. వర్చువల్ రియాలిటీ(వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), గేమింగ్ టెక్నాలజీ... మొదలైనవి స్టోరీ టెల్లింగ్‌లో కొత్త ద్వారాలు తెరుస్తున్నాయి.

'స్టోరీ టెల్లింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది బలమైన సాధనం. టార్గెట్ ఆడియెన్స్‌ను మెప్పించేలా స్టోరీ టెల్లింగ్ కోసం ఏ.ఐ సాంకేతికత ఉపయోగపడుతుంది. పవర్‌ఫుల్ స్టోరీ టెల్లింగ్ ఉనేది బలమైన భావోద్వేగాల సమ్మేళనం' అంటున్నాడు 'పోకో' ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్.

సినిమాల నుంచి ఇంటర్వ్యూల వరకు యూట్యూబ్ వీడియోలు చూస్తున్నప్పుడు ప్రకటనలు ప్రత్యక్షమైతే చిరాగ్గా అనిపిస్తుంది. కోల్‌కతాకు చెందిన ఇరవై రెండు సంవత్సరాల నివేదిత మాత్రం పనిగట్టుకొని రకరకాల అడ్వర్‌టైజ్‌మెంట్స్‌ను చూస్తుంటుంది.


'ఒకప్పటి వ్యాపార ప్రకటనల్లో వారి బ్రాండ్‌కు సంబంధించిన గోల మాత్రమే ప్రధానంగా కనిపించేది. ఇప్పటి ప్రకటనల్లో మాత్రం ఇంటలెక్చువల్ ఫ్లేవర్, క్రియేటివిటీ కనిపిస్తోంది. వాటిని చూస్తుంటే ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. నాకు కూడా రకరకాల ఐడియాలు వస్తుంటాయి' అంటుంది నివేదిత.

ముంబైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ వికాస్ స్టోరీ టెల్లింగ్ ఫార్మాట్‌లో 'నేను అయితే ఈ యాడ్‌ను ఇలా తీస్తాను' అంటూ నోట్స్ రాసుకోవడం అలవాటు.

ఒక్కముక్కలో చెప్పాలంటే నివేదిత, వికాస్‌లాంటి యువ ఉత్సాహవంతులను బ్రాండ్స్ కోరుకుంటున్నాయి. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రతిభను నిరూపించుకుంటే ఇక వారికి తిరుగేలేదు.

స్టోరీ టెల్లింగ్ మంత్ర

యాడ్‌లో స్టోరీ టెల్లింగ్ ఫార్మట్ అనేది కంపెనీకి, కస్టమర్‌లకు మధ్య భావోద్వేగాలతో కూడిన ఒక బంధాన్ని ఏర్పరుస్తుంది. ఎక్కడ.. ఎలా... ఎంత చెప్పాలో అంతే చెప్పాలనేది స్టోరీ టెల్లింగ్‌లో భాగం. మిస్ ఫైర్ అయితే మొదటికే మోసం వస్తుంది. ప్రకటనలకు సంబంధించి కొన్ని కంపెనీలు విఫలం కావడానికి కారణం... తమ ప్రాడక్ట్ గురించి తప్ప కన్స్యూమర్ గురించి పట్టించుకోకపోవడం. అందుకే కన్స్యూమర్‌ను హీరో చేసేలా స్టోరీ బిల్డ్ చేయాలి అనేది ముఖ్యమైన స్టోరీ టెల్లింగ్ మంత్ర. 'ఫలానా యాడ్ ఎందుకు విఫలమైంది' అనే విషయంలో యువ సృజనకారులు పోస్ట్ మార్టం చేయడంతో పాటు ఒక యాడ్ సూపర్ డూపర్ హిట్ కావడంలోని కీలక అంశాలను ఔపాసన పడుతున్నారు. 'వాట్ మేక్స్ ఏ గ్రేట్ స్టోరీ' అనే కోణంలో కస్టమర్ ఛాలెంజ్‌లను అధ్యయనం చేస్తున్నారు.


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 25

బుధవారం 17-4-2024



రాయల్స్‌కు బట్లర్ జోష్

ఓపెనర్ వీరోచిత శతకం.. 2 వికెట్ల తేడాతో కోల్‌కతాపై రాజస్తాన్ గెలుపు - 12లో



మూడో రోజూ పతనమే

సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్.. నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాజ్యాంగానికి రుణపడి ఉన్నా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తాను ఎంతగానో రుణపడి ఉన్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸



కాంగ్రెస్ చెమటోడ్చాల్సిందే!

247 స్థానాలున్న 12 రాష్ట్రాల్లో పూర్వవైభవం సాధించడం కాంగ్రెస్‌కు ఈసారి కూడా తలకు మించిన భారంలా తయారైంది.

వివరాలు 6లో ▸



బహిరంగ క్షమాపణ చెప్పండి

కోర్టు ధిక్కార కేసులో వారంలోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణను సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸





ఇదిగో రామరాజ్యం

ఏపీలో పాలన ఎక్స్‌ట్రార్డినరీ.. అంతే

సినీ నటుడు రఘుబాబు

అచ్చోట ముచ్చేమట

- వివరాలు I, II, III, IVలో



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

పేదలపై బాణాలా?

చంద్రబాబుకు పది మంది సేనానులు.. మీ గురి ఎవరిపై?.. భీమవరం మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్

ప్రజలకు అందుతున్న పథకాలు, వ్యవస్థలపై బాణాలా?

నేను ఒక్కడినే కానీ ఒంటరిని కాదు.. నాకు తోడుగా పేదల సైన్యం

- రాష్ట్రమంతటా కోట్ల హృదయాలు జగన్‌ను కోరుకుంటున్నాయి
- రొయ్యకు మీసం.. బాబుకు మోసం పుట్టుకతోనే వచ్చాయ్
- బాబుకు - అభివృద్ధికి ఏం సంబంధం? అంతా సెల్ఫ్ డబ్బా..
- సింగపూర్ కట్టాడా? మైక్రోసాఫ్ట్ తెచ్చాడా? బుల్లెట్ ట్రైను తెచ్చాడా?
- కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు తెచ్చాడా? జిల్లాకో హైటెక్ సిటీ కనిపించిందా?
- బాబు రిపోర్ట్ అంతా బోగస్.. మన ప్రోగ్రెస్ రిపోర్ట్ మీరే చూడండి
- కొంగ జపం ఎందుకని నిలదీస్తే నాపై శాపనార్థాలు.. కోపంతో ఊగిపోతున్నారు
- దత్తపుత్రుడు కార్లు, భార్యల మాదిరిగా నియోజకవర్గాలనూ మారుస్తున్నాడు
- నిన్ను మిగతా వాళ్లు అనుసరిస్తే అక్కచెల్లెమ్మల బతుకులు ఏం కావాలి?

10లో

పోటెత్తిన 'పశ్చిమ'

సీఎం జగన్ రాకతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కొత్త శోభ

ఉమ్మడి జిల్లాలో సంబరంలా 16వ రోజు మేమంతా సిద్ధం బస్సుయాత్ర

భారీ ఎత్తున పోటెత్తిన జనసంద్రం

అడుగడుగునా ఎదురొచ్చి దిష్టితీసి, హారతులు పట్టిన అక్కచెల్లెమ్మలు

అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, చిన్నారులను బస్సుదిగి పలకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

11లో

ఇదంతా సీబీఐ, సునీత ఆడుతున్న డ్రామా



- వివేకా కేసులో సీబీఐ దర్యాప్తు లోపభూయిష్టం
- హత్య చేసినట్లు దస్తగిరే ఒప్పుకున్నాడు.. వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదు?
- అతనికి ముందస్తు బెయిల్ వచ్చేలా సీబీఐ, సునీత సహకరించారు
- ఆ తర్వాత అప్రూవర్ వ్యవహారాన్ని బయటకు తెచ్చారు
- ముందస్తు బెయిల్ వచ్చిన తర్వాత అప్రూవర్ అరెస్టు ఉండదు
- ఇలా దస్తగిరికి ప్రయోజనాన్ని కల్పించి, వారికి కావల్సిన పేర్లను చెప్పించారు
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

3లో

సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

మొదటి వంద ర్యాంకుల్లో నలుగురు మనోళ్లే

- అఖిల భారత స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన అనన్య రెడ్డి
- నందాల సాయికిరణ్‌కు 27వ ర్యాంకు
- చందన జాహ్నవికి 50వ ర్యాంకు
- మేరుగు కౌశిక్‌కు 82వ ర్యాంకు
- కేంద్ర సర్వీసులకు మొత్తం 56 మందికి పైగా తెలుగువారు ఎంపిక
- సివిల్స్ సాధించినవారిలో సాధారణ రైతు, నిరుపేద కుటుంబాల యువకులు

సివిల్స్ టాపర్ ఆదిత్య

అనిమేశ్ ప్రధాన్‌కు రెండో ర్యాంకు

అఖిల భారత సర్వీసులకు 1,016 మంది ఎంపిక



జాతీయ పోలీసు అకాడమీలో శ్రీవాస్తవతో సహచరుల సంబరం




కుటుంబసభ్యులతో సంతోషం పంచుకుంటున్న అనన్యరెడ్డి

- వివరాలు 2,6లో

బస్తర్ అడవుల్లో నెత్తుటేరులు

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 29 మంది మావోయిస్టుల మృతి

- కాంకేరు జిల్లా ఛోట్ బెటియా ప్రాంతంలో ఘటన
- మావోయిస్టుల సమావేశంపై పక్కా సమాచారంతో కూంబింగ్ చేపట్టిన భద్రతా దళాలు
- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఎదురుకాల్పులు
- మృతుల్లో ఏపీకి చెందిన అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ శంకర్‌రావు
- ఆయన తలపై రూ. 25 లక్షల రివార్డు.. ఇద్దరు తెలంగాణ వాసులు కూడా గుర్తింపు
- మరికొందరు కూడా మరణించి ఉంటారనే అనుమానాలు
- ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలు
- ఘటనా స్థలంలో ఏడు ఏకే-47లు, మూడు ఎల్ఎంజీలు, ఇతర ఆయుధాలు స్వాధీనం



శంకర్‌రావు (ఫైల్)



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్ సందర్భంగా భద్రతా దళాల కదలికలు

సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో రక్తం ఏరులై పారింది. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న భీకర ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మరణించారు. భద్రతా దళాలకు చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. మృతుల్లో ఇప్పటివరకు ముగ్గురిని గుర్తించగా.. వారిలో ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మరికొందరు తెలంగాణ వాసులు కూడా మృతి చెంది ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఎస్ఎఫ్, డీఆర్‌జీ బలగాలు.. మావోయిస్టులకు మధ్య మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్, ఎస్పీ కళ్యాణ్ ఎలిసెల్లి మంగళవారం రాత్రి వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మృతుల్లో

మిగతా 2వ పేజీలో ▶



కన్నుమూసి తెరిచేలోపు..

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ఐదుగురు దుర్మరణం

మృతులంతా హైదరాబాద్‌లో స్థిరపడిన నెల్లూరు జిల్లా వాసులు

- వివరాలు 5లో

ఇదండీ జగత్



ఇంకా ఏమీ అల్లర్లు జరుగలేదట మేడం! మీ దీక్ష ఫ్లాపవుతుందేమోననిపిస్తుంది!!



పోలీసుల అదుపులో అనుమానితుడు!

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తులో పురోగతి

ఐదుగురిని లోతుగా విచారిస్తున్న పోలీసులు

వారిలో ఒకరు కీలక వ్యక్తి.. మిగతా వారు సహకరించినట్లు భావన

విజయవాడకు చెందిన ఓ టీడీపీ నాయకుడిని కూడా విచారిస్తున్న పోలీసులు

త్వరలోనే కేసును ఛేదిస్తామని పోలీసుల ధీమా

మీడియాలో వచ్చిన కథనాలను నిర్ధారించని పోలీసులు

తాము చెప్పేవరకు ఎటువంటి కథనాలూ నమ్మవద్దని వినతి

2లో



బెయిలు షరతులు ఉల్లంఘించకూడదు

చంద్రబాబుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. బాబు బెయిలు రద్దుపై విచారణ వాయిదా

3లో

మూడు రోజులు తేలికపాటి వర్షాలు



- రాయలసీమపై ఉపరితల ఆవర్తన ప్రభావం
- కొన్నిచోట్ల 44–46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండీ

5లో

నిజాలకు పాతర.. అబద్ధాల జాతర

'బందిపోటు పాలన'ంటూ రామోజీ వీరంగం
రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేష్ వ్యాఖ్యలకు వక్రీకరణ

- ఆయన మాటలను రాష్ట్రానికి అంటగడుతూ రామోజీ బరితెగింపు
- రాష్ట్రం అప్పులు ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఉన్నా వికృత రాతలు
- కేంద్ర గణాంకాల మేరకు 2023–24లో జీఎస్‌డీపీ వృద్ధిలో ఏపీది ఆరో స్థానం
- చంద్రబాబు పాలన కన్నా జీఎస్‌డీపీ పెరుగుదలలో భారీ వృద్ధి
- ఏ సీఎం అయినా ఏ అధికారైనా రాజ్యాంగం, చట్టాల మేరకే పాలన
- కొత్తగా పీవీ రమేష్ చెప్పారంటూ ఏపీలో అందుకు విరుద్ధ పాలన సాగుతున్నట్లు ఈనాడు పైత్యం



- అభివృద్ధి, సంక్షేమం సమతుల్యతతో ఐదేళ్లుగా సీఎం జగన్ పాలన
- 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా?
- అవినీతిలేకుండా పేదలకు నేరుగా నగదు బదిలీచేస్తే వారిది అభివృద్ధి కాదా?
- సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ముసుగులో వంధిమాగధులతో రామోజీ చర్చాగోష్ఠి

14లో

క్లుప్తంగా...

తెలుగు వారందరికీ సీఎం జగన్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: శ్రీరామ నవమి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రానికి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తెలుగు తేజాలకు సీఎం జగన్ అభినందన

సాక్షి, అమరావతి: యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో సత్తా చాటిన తెలుగు తేజాలను ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన అనన్యారెడ్డితో పాటు 27వ ర్యాంకర్ నందాల సాయికిరణ్, 82వ ర్యాంకర్ మేరుగు కౌశిక్, ఇతర తెలుగు అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కెరీర్‌లో ఉజ్వల భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి గాజు గ్లాసు గుర్తును కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రీయ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మంగళవారం తీర్పు వెలువరించారు. తాము గాజు గ్లాస్ గుర్తు కోసం ముందుగా దరఖాస్తు చేసినా.. ఆ గుర్తును తమకు కేటాయించలేదని, ఆ గుర్తుని తమకు కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం వాదనలు వినిపిస్తూ గాజు గ్లాస్ కోసం ముందు జనసేన పార్టీ దరఖాస్తు చేసుకుందని తెలిపింది. ముందు ఎవరు వస్తే వారికే అన్న ప్రాతిపదికన గాజు గ్లాస్ గుర్తును జనసేన పార్టీకి కేటాయించామని తెలిపింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.

కేసుల వివరాలు అందజేశాం

హైకోర్టుకు నివేదించిన పోలీస్ శాఖ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతలపై నమోదు చేసిన కేసుల వివరాలను వారికి అందజేశామని పోలీస్ శాఖ హైకోర్టుకు నివేదించింది. వివరాలు అందుకున్నట్టు సంబంధిత నాయకులు తిరుగు రసీదు కూడా ఇచ్చారని పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరు మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు టీడీపీ నేతల వ్యాజ్యాలను పరిష్కరించారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు సహా పలువురు నేతలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఏబీ వెంకటేశ్వరరావు పిటిషన్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: ఏపీ సర్కార్ తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. ఏపీ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరాం సమర్పించిన ఆధారాలను పరిశీలించి ఈ నెల 23న తీర్పు వెల్లడిస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసింది. ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. అనంతరం సస్పెన్షన్ పూర్తయి ఆయన విధుల్లో చేరారు. విధుల్లో చేరిన తర్వాత తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మరోసారి ఆయనను సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ వెంకటేశ్వరరావు గత ఏప్రిల్‌లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరాం, జీపీ పాండురంగారెడ్డి వాదనలు వినిపించారు. వాదనలకు సంబంధించిన డాక్యుమెంట్లను ధర్మాసనానికి అందజేశారు.

కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

22న విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రౌజ్ అవెన్యూకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించాల్సి ఉంది. కానీ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో విచారణ వాయిదా పడింది. దీంతో, ఈ నెల 22న ఈడీ కేసులో బెయిల్‌తోపాటే ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి విచారించనున్నట్లు కోర్టు తెలిపింది.



శ్రీరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో శ్రీరాముడి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ నిర్వహించారు. తొలుత ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్ పుట్టమన్నును ఆలయంలోకి తీసుకువచ్చారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు వేదమంత్రాల నడుమ శాస్త్రోకంగా అంకురార్పణ నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

బుధవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పోతన జయంతి నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9.30 గంటల వరకు కవి సమ్మేళనం, శేషవాహన సేవ జరుపుతారు



నవమికి భద్రాద్రి ముస్తాబు

- నేడు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం
- ఎటపాకలో జటాయువు మండపం, గుండాలలో వేడినీళ్ల బావి సిద్ధం

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): శ్రీరామనవమిని పురస్కరించుకుని రాష్ట్ర సరిహద్దులోని భద్రాచలంలో రాములోరి పెండ్లి సందడి ఆరంభమైంది. శ్రీసీతారాముల దేవస్థానం వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. బుధవారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. భద్రాద్రి ఆలయానికి అనుబంధంగా సరిహద్దుకు ఇవతల ఏపీ పరిధిలో ఉన్న ఎటపాకలోని జటాయువు మండపం, గుండాల గ్రామం వద్ద ఉష్ణగుండాల పవిత్ర గోదావరి నదిలో వేడినీళ్ల బావిని భక్తుల దర్శనార్థం సిద్ధం చేశారు. ప్రతీ ఏటా భద్రాద్రిలో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం, ముక్కోటి పర్వదినాల్లో వేలాది మంది భక్తులు జటాయువు మండపం, ఉష్ణగుండాలను దర్శించుకుంటారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 3.54లక్షల దరఖాస్తులు

సాక్షి, అమరావతి/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2024కు ఇప్పటి వరకు 3,54,235 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

23న కూడా పరీక్ష

ఏపీ ఈఏపీసెట్ పరీక్షను మే 23వ తేదీ ఉదయం సెషన్‌లో కూడా నిర్వహిస్తామని సెట్ కన్వీనర్ ఆచార్య వెంకటరెడ్డి తెలిపారు. తొలుత మే 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా విభాగానికి, 18 నుంచి 22వరకు ఇంజనీరింగ్ విభాగానికి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని, ఈ ఏడాది అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో 23వ తేదీ ఉదయం సెషన్‌లో కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.5వేల అపరాధ రుసుముతో 10 వరకు, రూ.10వేల అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సందేహాలను https://cets. apsche.ap.gov.in వెబ్‌సైట్, 0884-2359599, 0884-2342499 నంబర్లను, helpdeskapeapcet@apsche.org మెయిల్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు.

సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

మొదటి వంద ర్యాంకుల్లో నలుగురు మనోళ్లే



అశ్విన్ మణిదీప్



అన్నపూర్ణ ప్రత్యూష



గొబ్బిళ్ల శ్రీకృష్ణవాస్తవ్



బాణ్న వెంకటేశ్



దొనక పృథ్వీరాజ్



సాయితేజ



ఉదయ్ కృష్ణారెడ్డి



ధనుంజయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్స్ -2023 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అఖిల భారత స్థాయిలో వంద లోపు ర్యాంకుల్లో నలుగురు తెలుగువాళ్లు ఉండటం విశేషం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దోనూరు అనన్య రెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకుతో సత్తా చాటారు. నందాల సాయికిరణ్ 27వ ర్యాంకు, కేఎన్ చందన జాహ్నవి 50వ ర్యాంకు, మేరుగు కౌశిక్ 82వ ర్యాంకు సాధించారు. మొత్తం మీద కేంద్ర సర్వీసులకు 56 మందికి పైగా తెలుగు తేజాలు ఎంపికవడం విశేషం. అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా సివిల్స్ ర్యాంకులను యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది.

గుంటూరు యువకుడికి 148వ ర్యాంకు

గుంటూరుకు చెందిన కాకుమాను అశ్విన్ మణిదీప్ 148వ ర్యాంకు సాధించారు. కేరళలోని తిరువనంతపురంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన మణిదీప్ 2021లో తొలిసారిగా సివిల్స్ రాశారు. అప్పుడు 238వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. మళ్లీ ఐఏఎస్ లక్ష్యంగా 2023లో మరోసారి సివిల్స్ రాసి 148వ ర్యాంకు దక్కించుకున్నారు.

'పశ్చిమ' యువతికి 198వ ర్యాంకు

పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలికి చెందిన గణేశ్న భానుశ్రీ లక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష 198వ ర్యాంకు సాధించారు. ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రత్యూష గతేడాది ఆగస్టులో విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్.

అన్న డిప్యూటీ కలెక్టర్, తమ్ముడు సివిల్స్

అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన నిమ్మనపల్లి ప్రదీప్‌రెడ్డి 382వ ర్యాంక్‌తో సత్తా చాటారు. 2022 ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో ఆయన అన్న మనోజ్ రెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కాగా ఇప్పుడు ప్రదీప్‌రెడ్డి సివిల్స్‌లో ర్యాంకు సాధించడం విశేషం. పదోతరగతి వరకు రాయచోటిలో, ఇంటర్ విజయవాడలో చదివాడు.

అక్క బాటలోనే తమ్ముడు

తన అక్క విద్యాధరి ఐఏఎస్ సాధించడంతో ఆమె బాటలోనే తమ్ముడు గొబ్బిళ్ల కృష్ణవాస్తవ్ కూడా సివిల్స్‌లో 444వ ర్యాంకును సాధించారు. అన్నమయ్య జిల్లా నాగిరెడ్డిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కృష్ణవాస్తవ్ గొబ్బిళ్ల అనంతపురం జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. 2023 గ్రూప్-1లో జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు.

రైతు కుమారుడికి 467వ ర్యాంక్

శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బాణ్న వెంకటేశ్ రెండో ప్రయత్నంలో 467వ ర్యాంక్ సాధించారు. పదో తరగతి వరకు శ్రీకాకుళం శార్వాణి పాఠశాలలో విద్యనభ్యసించారు. ఇంటర్ విశాఖపట్నం శ్రీ చైతన్యలో, ఇంజనీరింగ్ ఎన్ఐటీ తిరుచిరాపల్లిలో చదివారు.

పార్వతీపురం యువకుడికి 493వ ర్యాంకు

పార్వతీపురం యువకుడు దొనక పృథ్వీరాజ్ 493వ ర్యాంకు సాధించాడు. కోచింగ్ తీసుకోకుండానే మూడో ప్రయత్నంలో లక్ష్యాన్ని అందుకున్నారు.

నాయుడుపేట కుర్రాడికి 558వ ర్యాంకు

తిరుపతి జిల్లా చిలమత్తూరుకు చెందిన యువకుడు 558వ ర్యాంకు సాధించాడు. చిలమత్తూరుకు చెందిన నెల్లూరు శ్రీనివాసులు ఉపాధ్యాయుడిగా, ఆయన భార్య సరస్వతి హెల్త్ సూపర్‌వైజరుగా పని చేస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు సాయితేజ మూడో ప్రయత్నంలో 558వ ర్యాంకు సాధించారు.



ప్రదీప్ రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తల్లి కళావతి, తండ్రి సహదేవరెడ్డి

ప్రకాశం జిల్లా యువకుడికి 780వ ర్యాంకు

ప్రకాశం జిల్లా ఊళ్లపాలేనికి చెందిన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డి 780వ ర్యాంకు సాధించారు. 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో 2019లో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంకు సాధించారు.

చిత్తూరు యువకుడికి 810వ ర్యాంకు

చిత్తూరు పులిచెర్ల మండలం మతుకువారిపల్లె పంచాయతీ గువ్వలవారిపల్లె దళితవాడకు చెందిన వి.ధనుంజయ కుమార్ 810వ ర్యాంకు సాధించారు. ధనుంజయకుమార్ ఇంటర్ వరకు మదనపల్లె నవోదయ, బీటెక్ (ఈసీఈ) శ్రీకాళహస్తి సమీపంలోని స్కిట్‌లో చదివారు. చదువు పూర్తికాగానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటీ మేనేజర్‌గా 2018 వరకు పనిచేశారు. 2018లో ఏపీపీఎస్సీలో గ్రూప్ 1లో ఎంపికయ్యారు. కడపలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

తెలుగు విద్యార్థుల ర్యాంకులు

దోనూరు అనన్య రెడ్డి	3
నందాల సాయికిరణ్	27
కేఎన్ చందన జాహ్నవి	50
మేరుగు కౌశిక్	82
రావుల జయసింహారెడ్డి	104
కాకుమాను అశ్విన్ మణిదీప్	148
పెంకీసు ధీరజ్ రెడ్డి	173
జి.అక్షయ్ దీపక్	196
గణేశ్న భానుశ్రీ లక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష	198
దయ్యాల తరుణ్	231
ఎన్మోదా ముఫస్సిర్	278
బుద్ధి అఖిల్	321
నిమ్మనపల్లి ప్రదీప్ రెడ్డి	382
గొబ్బిళ్ల కృష్ణవాస్తవ్	444
బాణ్న వెంకటేశ్	467
కదుమూరి హరిప్రసాద్ రాజు	475
పూల ధనుష్	480
దొనక పృథ్వీరాజ్	493
కె.శ్రీనివాసులు	526
కొయ్యడ ప్రణయ్‌కుమార్	554
నెల్లూరు సాయితేజ	558
కిరణ్ సాయింపు	568
మర్రిపాటి నాగభరత్	580
పోతుపురెడ్డి భార్గవ్	590
కె.అర్పిత	639
ఐశ్వర్య నెల్లిశ్యామల	649
సాక్షి కుమారి	679
చౌహాన్ రాజ్‌కుమార్	703
గాదె శ్వేత	711
కొటె అనిల్‌కుమార్	743
మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డి	780
వి.ధనుంజయ్ కుమార్	810
లక్ష్మీ బానోతు	828
ఆదా సందీప్‌కుమార్	830
జె.రాహుల్	873
హనిత వేములపాటి	887

పోలీసుల అదుపులో అనుమానితుడు!

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తులో పురోగతి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. సీఎం వైఎస్ జగన్ శనివారం రాత్రి విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో 'మేమంతా సిద్ధం' యాత్ర నిర్వహిస్తుండగా పదునైన రాయితో ఆయనపై దాడి చేసిన అనుమానితుడిని గుర్తించినట్టు సమాచారం. అతనితోపాటు మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ నాయకుడిని కూడా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. అజిత్‌సింగ్ నగర్ డాబా కొట్ల జంక్షన్ వద్ద వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి పదునైన రాయితో సీఎం జగన్‌పై దాడికి పాల్పడినట్టు పోలీసులు ఇప్పటికే నిర్ధారించారు. ఐపీసీ 307 కింద హత్యాయత్నంగా కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక బృందాలతో కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. వీడియో ఫుటేజీలు, కాల్ డేటా, ఇతర శాస్త్రీయ ఆధారాలను అన్ని కోణాల్లో విశ్లేషించారు. అజిత్ సింగ్ నగర్‌తోపాటు ఆ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 60 మంది అనుమానితులను విచారించారు. వారిలో నేర చరితులు, అసాంఘిక శక్తులు, ప్రతిపక్ష టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే ముఠాల సభ్యులు, వ్యసనపరులైన అసాంఘిక శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన యువత వంటి వారు ఉన్నారు. అనుమానితులను విడివిడిగా విచారించి కీలక సమాచారాన్ని రాబట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన రోజుకు (శనివారానికి) రెండు రోజుల ముందు నుంచి వారు ఎక్కడెక్కడ సంచరించారో వివరాలు సేకరించారు. వారు చెప్పిన సమాచారాన్ని కాల్ డేటా, సీసీ కెమెరాల వీడియో ఫుటేజీలతో పోల్చి చూశారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా కొందరు యువకులపై పోలీసులకు సందేహం కలిగింది. వారిని మరింత లోతుగా విచారించి, కీలక సమాచారాన్ని రాబట్టారు. ఆ యువకుల గుంపే హత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వారిలో ఒకరు ప్రధాన నిందితుడిగా, మిగిలినవారు అతనికి సహకరించినట్లు భావిస్తున్నారు. దీనిపై ఇంకా పోలీసులు పూర్తి నిర్ధారణకు రాలేదు. తొందర పడకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఒకటికి రెండుసార్లు పరిశీలించి తుది నిర్ధారణకు రావాలని భావిస్తున్నారు. కాగా హత్యాయత్నానికి పాల్పడిన వారిని గుర్తించడంపై మంగళవారం వివిధ టీవీ చానళ్లు ప్రసారం చేసిన వార్తలను పోలీసులు నిర్ధారించలేదు. అవన్నీ మీడియా ఊహాగానాలేనని చెప్పారు. ఏదైనా విషయాన్ని తాము అధికారికంగా ప్రకటించేంతవరకు నమ్మవద్దని కోరారు. అప్పటివరకు తాము విచారించిన వారందరూ అనుమానితులే తప్ప నిందితులుగా భావించవద్దని చెప్పారు. ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని పోలీసు వర్గాలు తెలిపాయి.

గుడివాడ సిద్ధం సభలో మరో దాడికి కుట్ర

- సిద్ధం సభకు మద్యం తాగి రాయితో వెళ్లిన యువకుడు
- చెకింగ్ పాయింట్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుడు మంతెన గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు కోటా శరత్

కంకిపాడు: కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన మేమంతా సిద్ధం సభ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మరో దాడికి కుట్ర జరిగింది. విజయవాడలో శనివారం సీఎంపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. గుడివాడలో సోమవారం మరోసారి దాడిచేసి, అల్లర్లు సృష్టించటమే లక్ష్యంగా టీడీపీ సానుభూతిపరుడు కుట్రపన్నాడు. మద్యం తాగి రాయితో సభా ప్రాంగణంలోకి ప్రవేశించే యత్నం చేసిన యువకుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకోవటంతో కుట్రభగ్నమైంది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఈ కుట్రపై అన్ని కోణాల్లోను దర్యాప్తు చేపట్టారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం మంతెన గ్రామానికి చెందిన కోటా శరత్ అలియాస్ రాఘవులు మద్యం తాగి రాయితో సభా ప్రాంగణానికి ప్రవేశించే యత్నం చేశాడు. పోలీసులు శరత్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద రాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడు టీడీపీ సానుభూతిపరుడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గుడివాడ పట్టణ పోలీసులు మంగళవారం మంతెన గ్రామంలో విచారించారు. శరత్‌తో పాటు మరో ముగ్గురు టీడీపీ సానుభూతిపరులు కూడా సిద్ధం సభకు వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. సభలో కల్లోలం సృష్టించటం లక్ష్యంగా జరిగిన కుట్ర వెనుక వాస్తవాలను నిర్ధారించేందుకు పోలీసులు అన్ని కోణాల్లోను విచారిస్తున్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

గుడివాడలో జరిగిన సిద్ధం సభకు యువకుడు రాయితో ప్రవేశించబోతే సిబ్బంది తనిఖీల్లో పట్టుబడిన మాట వాస్తవమే. సభలో అల్లర్లు, దాడి చేసేందుకు రాయితో వచ్చాడా? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? కారణం ఏంటి? అనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం.

– అద్నాన్ నయీమ్ అస్మి, కృష్ణాజిల్లా ఎస్పీ

సివిల్స్ ఫలితాల్లో నారాయణ జయభేరి



సాక్షి, హైదరాబాద్: యూపీఎస్సీ-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు అనన్యరెడ్డి, 493వ ర్యాంకు పృథ్వీరాజ్‌కుమార్, 545వ ర్యాంకు సీహెచ్ నరేంద్ర పడాల్, 919వ ర్యాంకు ధరావత్ సాయిప్రకాశ్ సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ కోహెడలోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 21 ఏళ్లకే ఐఏఎస్ కలను నెరవేర్చేందుకు నారాయణ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమీని తీర్చిదిద్దినట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. నారాయణ ఐఏఎస్ అకాడమీ కోర్ డీన్ ఎస్.రామలింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర ప్రతాప్, డీన్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

బస్తర్ అడవుల్లో నెత్తుటేరులు

▶ మొదటి పేజీ తరువాయి

మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామపురం గ్రామానికి చెందిన ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. మరోవైపు దండకారణ్యం స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాంధర్ అలియాస్ మజ్జిదేవ్ కూడా మరణించినట్లు తెలుస్తోంది. గడిచిన పదిహేనేళ్లలో బస్తర్ అడవుల్లో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్‌గా పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

మావోయిస్టుల సమావేశంపై సమాచారంతో..

బస్తర్ అటవీ ప్రాంతంలో మొత్తం ఏడు జిల్లాలు ఉండగా కాంకేరు జిల్లా ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలోని బినాగుండ, కరోనార్ మధ్య హపటోలా, (ఛోట్ బెటియా పోలీస్ స్టేషన్‌కు తూర్పున 15 కి.మీ దూరంలో) మాడ్ సమీప అటవీ ప్రాంతంలో ఈ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాడ్ ప్రాంతంలో మావోయిస్టు నేతలు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయాన ఇరువర్గాల మధ్య హోరాహోరీగా ఎదురు కాల్పులు మొదలయ్యాయి. ఎన్‌కౌంటర్ రాత్రి వరకు కొనసాగగా..ఎదురుకాల్పుల తర్వాత మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనా స్థలంలో ఏడు ఏకే-47 రైఫిల్స్, మూడు లైట్ మిషన్ గన్స్, రెండు ఇన్సాస్ రైఫిళ్లతో పాటు పెద్ద సంఖ్యలో ఆయుధాలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు భావిస్తున్నారు.

మృతుల్లో మజ్జిదేవ్ భార్య లలిత!

ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారిని గుర్తించే పనిలో ఉన్న పోలీసులు అజ్ఞాతంలో ఉన్న అనుమానిత మావోయిస్టుల కుటుంబాలకు సమాచారం పంపి ఆరా తీస్తున్నారు. 1995 నుంచి మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న చిన్నన్న 2000 సంవత్సరంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. పార్టీలో వెళ్లేకంటే ముందే వివాహం చేసుకున్న ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన సిరిపల్లె సుధాకర్ అలియాస్ శంకర్, ఆయన భార్య అదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూరుకు చెందిన ఆశ్వర్ సుమన అలియాస్ రజిత మరణించినట్లు తెలుస్తోంది. సిరిపల్లె సుధాకర్ దండకారణ్యంలోనే డీవీసీలో పని చేస్తుండగా.. ఆయన భార్య రజిత అదే ప్రాంతంలో డీసీఎస్ స్థాయిలో ఉందని సమాచారం. అదే విధంగా దండకారణ్యం స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాంధర్ అలియాస్ మజ్జిదేవ్ భార్య లలిత కూడా మృతి చెందినట్లు తెలిసింది. లలిత మహారాష్ట్రకు చెందిన వారని గుర్తించారు. అలాగే దండకారణ్యం ఐదవ కంపెనీకి చెందిన కమాండర్ రాజు సలామ్ కూడా మృతుల్లో ఉన్నట్లు తెలిసింది. ఈయనది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంగా చెబుతున్నారు.

మజ్జిదేవ్ కూడా ఉన్నారా?

ఈ ఎన్‌కౌంటర్ మృతుల్లో దండకారణ్యం అగ్రనేత మజ్జిదేవ్ కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆయన భార్య లలిత మృతి చెందడంతో.. మజ్జిదేవ్ కూడా మృతుల్లో ఉండే అవకాశం లేకపోలేదంటున్నారు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమాల్లో కీలకంగా పనిచేస్తున్న మజ్జిదేవ్ పేరు ఇటీవలే వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇక మరణించిన వారిలో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు మావోయిస్టులు కూడా ఉండే అవకాశం ఉందని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అటవీ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ జరుగుతోందని తెలిపాయి. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు డీఆర్జీ పోలీసులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించాయి.

ఈ ఏడాది 79 మంది

లోక్‌సభ ఎన్నికల ముంగిట బస్తర్ అడవుల్లో భీతావహ పరిస్థితి నెలకొంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు పట్టుదలగా అడవుల్లోకి చొచ్చుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి ఇప్పటివరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీకి చెందిన 79 మంది మరణించారు. ఇందులో మిలీషియా సభ్యులు మొదలు కంపెనీ కమాండర్ల వరకు వివిధ స్థాయి నేతలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 19న లోక్‌సభ ఎన్నికల తొలి విడత, 26న రెండో దశ పోలింగ్ జరగనుంది.



గాయపడిన పోలీసు

ఇదంతా సీబీఐ, సునీత ఆడుతున్న డ్రామా

హియర్ సే ఎవిడెన్స్ ఆధారమంటూ కట్టుకథ అల్లారు ● గూగుల్ టేకౌట్‌కు ఎలాంటి శాస్త్రీయతా లేదు

- చేయని నేరానికి నా తండ్రి ఏడాదిగా జైలులో మగ్గుతున్నారు
- వివేకా చనిపోయేంత వరకు నాకోసం పనిచేశారు
- సునీత కూడా మొదట్లో ఈ విషయాన్ని చెప్పింది
- అలాంటపుడు ఎంపీ టికెట్ మోటివ్ అని ఎలా చెబుతారు?
- సీబీఐ ఎప్పటికైనా లెంపలేసుకోక తప్పదు : కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్లు సునీతక్క చెబుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు శాస్త్రీయ విధానంలో కాకుండా, పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని అన్నారు. ఇదంతా దస్తగిరిని అడ్డం పెట్టుకొని, హియర్ సే ఎవిడెన్స్ అంటూ సీబీఐ, సునీత తదితరులు కలిసి ఆడుతున్న డ్రామా అని స్పష్టం చేశారు. ఎంపీ అవినాశ్ మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసలు దస్తగిరి అప్రూవర్‌గా మారకముందే ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. 'వివేకా హత్య జరిగిన 40 రోజుల తర్వాత దస్తగిరి సీబీఐ ముందు వాంగ్మూలమిస్తూ అతనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలి. కానీ, సీబీఐ అతన్ని అరెస్టు చేయలేదు. పైగా, అతనికి ముందస్తు బెయిలు వచ్చేలా సీబీఐ, సునీత సహకరించారు. 2021 అక్టోబరు 21న కోర్టులో దస్తగిరి ముందస్తు బెయిల్ పిటిషన్ వేస్తే సీబీఐ అభ్యంతరం లేదని చెప్పింది. సునీత అభ్యంతరం చెప్పలేదు. ముందస్తు బెయిల్ వచ్చేంత వరకూ వేచి ఉండి, ఆ తర్వాత అప్రూవర్ వ్యవహారాన్ని తీసుకొచ్చారు. ఐపీసీ 306(4)ఏ ప్రకారం అప్రూవర్ అయితే కోర్టులో విచారణ అయ్యే వరకు బెయిల్ రాదు. కాబట్టే బెయిల్ వచ్చిన తర్వాత 306 (4)బి ప్రకారం అప్రూవర్‌గా మార్చారు. ఇక అతను జైలుకెళ్లే అవకాశం లేదు. సీబీఐ, సునీత ఈ విధానాన్ని వాడుకున్నారు. ఒకవేళ హంతకుడినని ఒప్పుకొన్న అతన్ని అరెస్టు చేసి ఉంటే జీవిత కాలం బెయిల్ వచ్చి ఉండేది కాదు. అందుకే హంతకుడినని ఒప్పుకొన్న దస్తగిరి ఒక్క రోజు కూడా జైలులో ఉండకుండా అతనికి ముందస్తు బెయిలు వచ్చేలా సహకరించి, ఆ తర్వాత అప్రూవర్ వ్యవహారాన్ని బయటకు తెచ్చారు. ఇక జీవిత కాలం ఈ కేసులో అతని అరెస్టు ఉండదని హామీ ఇచ్చి, ఈ ప్రయోజనాన్ని కల్పించినందుకు వారికి కావల్సిన పేర్లను అతనితో చెప్పించుకున్నారు. ఇదంతా డ్రామా కాదా?' అని అవినాశ్ ప్రశ్నించారు. దస్తగిరి హియర్ సే ఎవిడెన్స్ అంటూ అప్పటి దర్యాప్తు అధికారి రామ్‌సింగ్, సునీత కలిసి కట్టుకథ అల్లారని, అందువల్లే తన తండ్రి చేయని నేరానికి ఏడాదిగా జైల్లో మగ్గుతున్నారని, రెండున్నరేళ్లు శివశంకర్‌రెడ్డి జైల్లో ఉండాల్సి వచ్చిందని తెలిపారు. గూగుల్ టేకౌట్‌కు కచ్చితత్వం ఉండదని గూగులే వెల్లడించిందని, అయినా దాని ఆధారంగా ఎందుకు దర్యాప్తు చేస్తున్నారని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మేన్ రంగన్న నలుగురి పేర్లు చెప్పినప్పటికీ, వారిని దర్యాప్తు అధికారి అరెస్టు చేయలేదని, కస్టడీలోకి తీసుకొని విచారణ జరిపి వాస్తవాలు రాబట్టలేదని తెలిపారు.

సునీత అప్పుడొకలా.. ఇప్పుడొకలా..

వివేకా హత్యపై నర్రెడ్డి సునీత మొదట్లో ఒకలా, ఇప్పుడు ఒకలా మాట్లాడుతున్నారని అవినాశ్ అన్నారు. '2020 జూలై 20న సీబీఐకి సునీత వాంగ్మూలమిస్తూ ఆమె భర్త సెల్‌ఫోన్‌లో వివేకా రాసిన డెత్ నోట్ ఫోటో చూపించారని, అందులో మా తండ్రి డ్రైవర్ ప్రసాద్‌ను డ్యూటీకి త్వరగా రమ్మన్నానని చచ్చేలా కొట్టాడని, ఈ లెటర్ రాసేందుకు చాలా కష్టపడ్డానని, డ్రైవర్ ప్రసాద్‌ను వదిలిపెట్టవద్దని రాసి ఉన్నట్లు చెప్పింది. 2020 ఆగస్టు 27న లెటర్ గురించి ఏమీ తెలియదని, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చూపించారని చెబుతోంది. ఇలా నెలలోనే ఎందుకు మాట మార్చింది? హత్య జరిగిన 10 రోజులకు నాన్నగారు అవినాశ్‌ను ఎంపీని చేసేందుకు, జగనన్నను సీఎంను చేసేందుకు ఏమేమి చేయాల్నో అంతా చేశారని సునీత చెప్పింది. ఈరోజు హత్యకు ఎంపీ టికెట్ మోటివ్ అని చెబుతున్నారు. నాలుగేళ్ల తర్వాత 2023 మే31న సీబీఐ దగ్గరికి వెళ్లి అప్పట్లో సజ్జల రామకృష్ణారెడ్డి ఎలా చెప్పమంటే అలా చెప్పానంది. అప్పటికే 13 సార్లు సీబీఐకి వాంగ్మూలం ఇచ్చిన సునీత ఏనాడూ ఈ విషయాన్ని చెప్పలేదు. అప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పమంటే.. ఇప్పుడు చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణ చెప్పమంటే చెబుతున్నారా' అని అన్నారు.

శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేస్తేనే వెళ్లాను

'ఆ రోజు జమ్మలమడుగు వెళ్తున్న నాకు వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేశారు. వివేకా చనిపోయినట్లు చెప్పి విలపించారు. వెంటనే ఇంటికెళ్లమన్నారు. నేను వెళ్లి డెడ్‌బాడీని చూసి బయటకు వచ్చేశాను. సీఐకి ఫోన్ చేసి త్వరగా రమ్మన్నాను. డెత్ నోట్‌లో ఉన్న వాస్తవ విషయాన్ని చెప్పకుండా ఘటన స్థలంలోకి నన్ను వెళ్లమని ఎందుకు చెప్పారు? లెటర్‌లో ఉన్న విషయం తెలిసిన వెంటనే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు పోలీసులకు చెప్పలేదు? ఇంక థర్డ్ పర్సన్ ఫోన్‌కాల్ కోసం వెయిటింగ్ ఎక్కడ?

మా ఇద్దర్నీ గెలిపించాలని వివేకా పిలుపు

'నేను చేసే ప్రతి కార్యక్రమాన్నీ వివేకా బలపర్చేవారు. 2014లో వేంపల్లెలో వీధి వీధీ తిరుగుతూ జగన్నను సీఎం చేయాలని, నన్ను ఎంపీగా గెలిపించాలని కోరారు. 2019ఎన్నికల్లో చివరిరోజు కూడా ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించామని చెబుతున్నారు. 854 మంది ఓటర్లలో ఒక్కరినైనా సీబీఐ విచారించిందా? మీకంటే చిన్నోడినైన నాపైన ఎందుకింత ద్వేషం' అని ప్రశ్నించారు.

వాళ్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే

ఆరోజు రాత్రి అంతా నేను ఫోన్ వాడినట్లు సునీత చెబుతోంది. నేను ఆరోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేచాను. ఫోన్ నెట్ ఆన్‌లో ఉంటే మేసేజ్‌లు వస్తుంటాయి. నానుంచి ఎవరికీ మెసేజ్ కానీ, ఫోన్‌కాల్ కానీ వెళ్లలేదు. ఎర్ర గంగిరెడ్డి నుంచి నాకు ఎలాంటి మేసేజ్ రాలేదు. అంటే వాళ్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా న్యాయమే గెలుస్తుంది. సీబీఐ ఎప్పటికైనా లెంపలేసుకోక తప్పదు. నాకు న్యాయస్థానాలపై నమ్మకం, గౌరవం ఉంది. షర్మిల, సునీత ఆరోపణలను ప్రజలు విశ్వసించరు. తాను బీజేపీకిలోకి వెళ్తాననడం 'జోక్ ఆఫ్ ది సెంచరీ' అని ఓ విలేకరి ప్రశ్నకు సమాధానంగా అవినాశ్ రెడ్డి చెప్పారు.

శివప్రకాష్‌రెడ్డి థర్డ్ పర్సనా? వివేకా చివరి రెండేళ్లు డబ్బు కోసం చాలా ఇబ్బందులు పడ్డారని పని మనుషులు వాంగ్మూలమిచ్చారు. ఆస్తి అమ్మే అవకాశం లేదు. చెక్ పవర్ రద్దు చేశారు. రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడి కోసం ఇబ్బందులు పడ్డారు. డబ్బు కోసం డైమండ్స్, సెటిల్‌మెంట్లు అంటూ తిరగడం ఆరంభించారు' అని తెలిపారు.

హార్ట్ ఎటాక్ అన్నది సునీత కుటుంబం చేసిన ప్రచారమే

'హార్ట్ ఎటాక్ అన్న విషయం సునీత కుటుంబం నుంచే ప్రచారమైంది. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సైతం అదే రోజు మీడియాతో మాట్లాడుతూ హార్ట్ ఎటాక్‌తో వివేకానందరెడ్డి చనిపోయినట్లు శివప్రకాష్‌రెడ్డి చెప్పినట్లుగా తెలిపారు. అదే విషయాన్ని వీడియో ద్వారా వివరించారు. హార్ట్ ఎటాక్ అని ఫిర్యాదు చేయాలని పీఏ కృష్ణారెడ్డికి చెప్పినట్లు సునీత చెప్పారు. డెత్‌నోట్ చదివాక కూడా హార్ట్ ఎటాక్ అని ఎందుకు చెప్పారు' అని ప్రశ్నించారు.

స్వయం సహాయక సంఘాలను ప్రభావితం చేసే కార్యక్రమాలొద్దు

పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలకు ఏపీ సీఈవో మీనా ఆదేశం



సాక్షి, అమరావతి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో స్వయం సహాయక బృందాల సభ్యులను ప్రభావితం చేసేలా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకూడదంటూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. రాష్ట్ర పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి, రాష్ట్ర పురపాలక– పట్టణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పనిచేసే సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఎవరూ స్వయం సహాయక బృందాల సభ్యులను ప్రభావితం చేసేలా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకూడదన్నారు. కోడ్ అమల్లో ఉన్నంత వరకూ స్వయం సహాయక బృందాల సభ్యులను వ్యక్తిగతంగా, సమష్టిగా రాజకీయ కోణంలో అభిప్రాయానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రభావితం చేసే ఏ విధమైన సమీకరణ, అవగాహన, సర్వే వంటి ఇతర కార్యకలాపాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిబంధనల అమల్లో సెర్ప్ సీఈవో, మెప్మా మిషన్ డైరెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపాలని ఆదేశించారు.

మహిళల గౌరవానికి పెద్దపీట

ఎన్నికల ప్రచారంలో మహిళల గౌరవం విషయంలో కఠిన వైఖరిని అమలుచేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. మహిళలను కించపరిచేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన పార్టీల నాయకులకు తక్షణం నోటీసులివ్వడం ద్వారా మహిళల గౌరవం విషయంలో గట్టి వైఖరిని అమలు చేస్తున్నట్లు తెలిపింది. పార్టీ నేతలు, ప్రచారకర్తలు ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలను ఆశ్రయించకుండా చూసుకోవడానికి పార్టీ ముఖ్యులు/అధ్యక్షులు జవాబుదారీతనం వ్యవహరించాలని కోరింది.

రేపటి నుంచి ఎన్నికల ప్రక్రియకు సిద్ధంకండి

ఈ నెల 18న (రేపు) నోటిఫికేషన్ జారీతో ప్రారంభమయ్యే అసలైన ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధం కావాలని మీనా ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించడంతోపాటు రోజూ క్రమం తప్పకుండా నివేదికలను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 18న నోటిఫికేషన్ జారీ నుంచి రోజూ ఈసీఐకి నివేదికలు పంపాలని చెప్పారు. ఈ విషయంలో అలసత్వం వహించరాదన్నారు. ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీపై మే 4న ఈసీఐ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ లోపు కార్డుల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. సీ–విజిల్ ఫిర్యాదులను అధికారులు సంతృప్తకరస్థాయిలో పరిష్కరిస్తున్నారని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలకు పరిశీలకులను నియమించే విషయంలో ఈసీఐ మార్గదర్శకాలను పాటించాలని, అదనంగా కావాల్సిన పరిశీలకులు, ఏఆర్వోల ప్రతిపాదనలను సాధ్యమైనంత త్వరగా పంపాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ, కేంద్రాలు వెబ్‌కాస్టింగ్ ద్వారా గరిష్టస్థాయిలో కవర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలి

ఆయన అనుచిత వ్యాఖ్యలపై సీఈవోకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



సీఈవో మీనాకు ఫిర్యాదు చేసిన రావెల కిషోర్ బాబు, కల్పలతారెడ్డి, ఎ. నారాయణమూర్తి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుపై మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు రావెల కిషోర్‌బాబు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, నాయకుడు ఎ.నారాయణమూర్తి సీఈవో ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఆ వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలు అందజేశారు. చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నారా లోకేశ్‌పై చర్యలు తీసుకోండి

ఈసీకి వైఎస్సార్‌సీపీ న్యాయవాదుల ఫిర్యాదు



నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నాన్ని వక్రీకరిస్తూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌పై వైఎస్సార్‌సీపీ న్యాయవాదులు మంగళవారం జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకుమాను మంగపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసరెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్వో కె.వినాయకంకు ఫిర్యాదు సమర్పించారు. 'రాయి రాయి ఎక్కడి నుంచి వచ్చావు, ఇంకెక్కడి నుంచి వస్తా, తాడేపల్లి ప్యాలెస్ నుంచి వస్తా' అంటూ లోకేశ్ పెట్టిన పోస్ట్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని వెంటనే లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వివేకా హత్య కేసులో నిజాలు బయటికి రావాలి

వైఎస్ వివేకా కుమార్తె సునీత



కడప వైఎస్ఆర్ సర్కిల్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలు బయటికి రావాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత అన్నారు. ఆమె మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ద్వేషంతో అవినాశ్‌ను టార్గెట్ చేశామంటున్నారని, ఆయనతో పరిచయం తక్కువని, తమకు ఆయనపై ద్వేషం ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. వైఎస్ వివేకా కేసు ఒక హెడ్ కానిస్టేబుల్ దర్యాప్తు చేస్తే సరిపోయే కేసని, రాజకీయ జోక్యంతో ఇంతవరకు వచ్చిందన్నారు. అప్రూవర్ అయినంత మాత్రాన దస్తగిరి నిర్దోషి కాదని, అతను కేసు నుంచి తప్పించుకోలేడని చెప్పారు. అవినాశ్‌కి ధైర్యం ఉంటే ఫోన్ తెచ్చి సీబీఐకి అప్పగించాలన్నారు. వివేకాది మర్డర్ అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవినాశ్ చెబితే వెంటనే డీజీపీకి లేదా డీఐజీకి ఎందుకు ఫోన్ చేయలేదని ప్రశ్నించారు. జగనన్న మీద ప్రేమతోనే అవినాశ్ కోసం వివేకానందరెడ్డి ప్రచారం చేశారన్నారు. జగన్ ముఖ్యమంత్రి, షర్మిల ఎంపీ కావాలని వివేకా చివరి కోరిక అని చెప్పారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన షర్మిల గురించి మాట్లాడే అర్హత వైఎస్సార్‌సీపీకి లేదన్నారు.

పోలింగ్ ముందు రోజు ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

సమాచారశాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పోలింగ్ రోజు, ముందురోజు రాష్ట్ర/జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ల ముందస్తు అనుమతి లేకుండా ప్రింట్ మీడియాలో రాజకీయ ప్రకటనలను ప్రచురించకూడదని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా గతంలో ప్రింట్ మీడియాలో అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచురితమైనట్లు ఎన్నికల సంఘం దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనల వల్ల ప్రభావితమయ్యే అభ్యర్థులు, పార్టీలకు అటువంటి సందర్భాల్లో వివరణ/ఖండన ఇచ్చే సమయం కూడా ఉండనందున ఎన్నికల చివరిదశలో ఇటువంటి ప్రకటనలు ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించిందని పేర్కొన్నారు. రాజకీయ ప్రకటనల్లోని విషయాలు రాష్ట్ర/జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ముందస్తుగా ధ్రువీకరిస్తే తప్ప ఏ రాజకీయ పార్టీ, అభ్యర్థి, మరే ఇతర సంస్థ, వ్యక్తి.. పోలింగ్ రోజున, పోలింగ్‌కు ఒకరోజు ముందు ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటన ప్రచురించకూడదని స్పష్టం చేశారు. వార్తాపత్రిక ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడానికి రాష్ట్ర/జిల్లా స్థాయిలో ఎంసీఎంసీలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రాజకీయపార్టీలు, అభ్యర్థులు, ఇతర సంస్థల నుంచి అందిన ప్రకటనలన్నింటినీ ఈ కమిటీలు త్వరితగతిన పరిశీలించి, ముందస్తుగా ధ్రువీకరిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వార్తాపత్రికలు రాజకీయ ప్రకటనల విషయంలో ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల్లో వీడియో రికార్డింగ్ చేపట్టండి

ఈసీఐకి ఏపీ ఎన్‌డీఏ కూటమి నేతల విజ్ఞప్తి

సాక్షి,న్యూఢిల్లీ: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ఎన్‌డీఏ కూటమి నేతలు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)కి విజ్ఞప్తి చేశారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల్లో వీడియో రికార్డింగ్ చేపట్టాలని కోరారు. కూటమి నేతలు కనకమేడల (టీడీపీ) నాదెండ్ల మనోహర్ (జనసేన) జీవీఎల్, అరుణ్ సింగ్, సంజయ్ మయూఖ్ (బీజేపీ) తదితరులు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం కూటమి నేతలు మీడియాతో మాట్లాడుతూ..ఏపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోన్న అధికారులను బదిలీ చేయాలని కోరినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నేతలపై రాళ్ల దాడులు జరుగుతున్న విషయాన్ని ఈసీఐ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

బెయిలు షరతులు ఉల్లంఘించకూడదు

చంద్రబాబుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ ● బెయిలు రద్దుపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు బెయిలు షరతులను ఉల్లంఘించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. చంద్రబాబు బెయిలు రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు ప్రారంభిస్తూ... కేసులో ఛార్జిషీటు దాఖలు చేశారన్నారు. ఈ దశలో జస్టిస్ త్రివేది జోక్యం చేసుకొని.. బెయిలు రద్దుకు సంబంధించి ప్రధాన ఆరోపణ ఏమిటని ప్రశ్నించారు. దీనికి ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. నిందితుడికి హైకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిలు మంజూరు చేసిందని తెలిపారు. నిందితుడు బెయిలు షరతులు ఉల్లంఘించారన్నారు. నిందితుడి కుమారుడు అధికారులను బహిరంగంగా బెదిరిస్తున్నారని, దర్యాప్తునకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించిన అధికారుల పేర్లు ఎర్రబుక్కులో నమోదు చేశానని, అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తానని నిందితుడి కుమారుడు అంటున్నారని తెలిపారు. తన దగ్గర అన్ని వివరాలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాక చూసుకుంటానని నిందితుడి కుమారుడు అన్నారని వివరించారు. అనంతరం ఏపీ సీఐడీ దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌ను రికార్డు చేస్తున్నట్లు జస్టిస్ త్రివేది చెప్పారు.

శిరోముండనం కేసులో 18 నెలల జైలు శిక్ష

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహా 9 మందికి శిక్ష ఖరారు.. ఆపై బెయిల్ మంజూరు

విశాఖ లీగల్: సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహా 9 మందికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. ఒక్కొక్కరూ రూ.42 వేల చొప్పున మొత్తం రూ.3,78,000 జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి లాలం శ్రీధర్ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో స్పష్టం చేశారు. నిందితులు హైకోర్టులో అప్పీల్ చేసుకోవడానికి వీలుగా న్యాయస్థానం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది.

ఇదీ కేసు..

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. 1996 డిసెంబర్ 26న కోనసీమ జిల్లా (పూర్వ తూర్పు గోదావరి జిల్లా) రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెంలో దళిత యువకులు కోటి చినరాజు, దడాల వెంకటరత్నం అనే వారికి శిరోముండనం చేయగా.. చల్లపూడి పట్టాభిరామయ్య, పువ్వుల వెంకటరమణ, కనికెళ్ల గణపతి అనే మరో ముగ్గురిని తీవ్రంగా హింసించినట్టు కేసు నమోదైంది. అప్పటి ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు ప్రోద్బలంతోనే వారికి శిరోముండనం చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో తోట త్రిమూర్తులు, తోట బాబులు, తోట రాము, తోట పుండరీకాక్షుడు, తోట పుండరీకాక్షుడు (ఇద్దరు పేర్లు ఒకటే), తలాటం మురళీమోహన్, దువ్వల కిషోర్, తోట శ్రీను, మంచం ప్రకాశ్, ఆచంట రామసత్యనారాయణ అనే వారిని పోలీసులు దోషులుగా తేల్చారు. కేసు విచారణ జరుగుతుండగా ఆరో నిందితుడు తోట మురళీమోహన్ మృతి చెందారు.

ప్రధాన ఆరోపణల్ని కొట్టేసిన కోర్టు

కేసులో ప్రధాన ఆరోపణలను న్యాయస్థానం కొట్టివేసింది. బాధితులను స్వల్పంగా గాయపర్చి, కులం పేరుతో దూషించారన్న అభియోగాలను పరిగణనలోకి తీసుకుంది. జరిమానా సొమ్ము నుంచి మొదటి ఇద్దరి బాధితులకు రూ.1.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి లాలం శ్రీధర్ ఆ తీర్పులో ఆదేశించారు.

తప్పుడు రాతల ఆధారంగా చేసిన సస్పెన్షన్లు ఎత్తివేయాలి

సాక్షి, అమరావతి : ఎన్నికల కోడ్ ఉల్లంఘించకున్నా కొన్ని పత్రికల్లో వచ్చిన తప్పుడు రాతల ఆధారంగా ఏపీపీటీడీకి చెందిన 11 మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారని, ఆ సస్పెన్షన్లను ఎత్తివేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకట్రామిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. మార్చి 31వ తేదీన ఫెడరేషన్ చైర్మన్ హోదాలో ఏపీ పీటీడీ ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి వైఎస్సార్ జిల్లా బద్వేల్, మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి వారి సమస్యల గురించి చర్చించినట్లు వినతి పత్రంలో వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. అక్కడ తాము ఎలాంటి ప్రసంగాలు చేయలేదని, ఎన్నికలు, రాజకీయాల గురించి మాట్లాడలేదని తెలిపారు. అయితే కొన్ని పత్రికలు తమను టార్గెట్ చేసి ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేసినట్టు తప్పుడు వార్తలు రాశారని.. వాటి ఆధారంగా 11 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడమే కాకుండా నాలుగు కేసులు పెట్టారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశాలు నిర్వహించిమరీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, పార్టీల పేర్లు, పార్టీ అధ్యక్షుల పేర్లు ప్రస్తావిస్తూ విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారి మీద ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. అలాగే ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడితేనే ఎన్నికల కోడ్ వర్తిస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఎన్నికల కోడ్ వర్తించదా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాల్సిందిగా కోరారు. తమ మీద నమోదైన కేసులను ఉపసంహరించాలని, ఉద్యోగుల సస్పెన్షన్లను ఎత్తివేయాలని సీఈవోను వెంకట్రామిరెడ్డి కోరారు.



ఒకరు చెడు కోరికలతో చెడ్డపనులు చేసి, దానికి తగిన దుఃఖం పొందితే, మరొకరు మంచి కోరికలతో మంచి పనులు చేసి అందుకు తగిన దుఃఖం పొందుతారు. దీనర్థం మంచిపనులు చెయ్యొద్దని కాదు ; సామాన్యుడు గమనించలేని సున్నితమైన దుఃఖం ఉందని!

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 17 ఏప్రిల్ 2024

సంకల్పం సరిపోతుందా?

కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు దేశం సిద్ధమవుతున్న వేళ పాలక బీజేపీ తన 'సంకల్ప పత్రం'తో ముందుకొచ్చింది. అధికారంలోకి వచ్చాక రాగల అయిదేళ్ళలో తన ప్రణాళికలు ఎలా ఉంటాయో ప్రజల ముందు ఉంచింది. దశాబ్ద కాలంగా ఢిల్లీ గద్దెపై ఉంటూ, రాజకీయాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించిన ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సైతం అందుకు తగినట్టే సాగింది. విశేష ప్రజాకర్షక పథకాల జోలికి పోలేదు. ప్రస్తుత విధానాల కొనసాగింపునే ప్రధానంగా ఆశ్రయించింది. పార్టీ కన్నా ప్రధాన రథసారథికే అధిక ప్రాధాన్యమిస్తూ, 'మోదీ కీ గ్యారెంటీ' అంటూ ప్రచారం చేస్తోంది. ఇది మునుపెన్నడూ కాషాయపార్టీలో కనిపించని చిత్రం. ఎన్నికల్లో విజయం కోసం మోదీపై ఆ పార్టీకి ఉన్న నమ్మకానికి నిదర్శనం. ప్రచారంలో ప్రతిచోటా ప్రవచిస్తున్న 'వికసిత భారత్' స్వప్నానికి అనుసంధాయకంగా అభివృద్ధి, ప్రాథమిక వసతి కల్పన, సంక్షేమం, విద్య, పారిశ్రామిక రంగం, అంకుర వ్యవస్థ, ఉత్పాదక రంగం, రైల్వే వగైరాలకు సంబంధించి 'మోదీ గ్యారెంటీ'లను ఈ మేనిఫెస్టోలో జొప్పించడం విశేషం.

వరుసగా మూడోసారి సైతం తమ పార్టీకి అధికార పగ్గాలు దక్కడం ఖాయమన్న ఆత్మవిశ్వాసంతోనో ఏమో ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలను కొనసాగిస్తే చాలనే భావన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కనిపించింది. గడచిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్నికల ముందస్తు వరాలు కురిపించకుండా ఆర్థికంగా పొదుపు మంత్రాన్ని పఠిస్తూ, పాత విధానాల కొనసాగింపునే కమలనాథులు ఆశ్రయించారు. ఇప్పుడీ సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలోనూ అదే ధోరణిని అనుసరించారు. ప్రజల నుంచి వచ్చిన దాదాపు 15 లక్షల దాకా సూచనలను పరిగణనలోకి తీసుకొని, 'వికసిత భారత్' స్వప్నానికి అనుగుణంగా ఈ మేనిఫెస్టోను రూపొందించామని బీజేపీ చెబుతోంది. మళ్ళీ అధికారంలోకి వచ్చే జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)కి దిశానిర్దేశంగా ఈ 'సంకల్ప పత్రం' పనిచేస్తుందని కమలనాథుల ఉవాచ. వచ్చే 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా, విశ్వశక్తిగా మారుస్తామనేది వారు చూపిస్తున్న సుందర స్వప్నం.

మోదీ ఆదివారం విడుదల చేసిన ఈ 'సంకల్ప పత్రం' ఇప్పటికే సర్కారు అమలు చేస్తున్న ఉచిత రేషన్ పథకం, సురక్షిత మంచినీటి సరఫరా, గృహనిర్మాణం లాంటి దారిద్ర్య నిర్మూలన పథకాలను ఏకరవు పెట్టింది. గత పదేళ్ళలో 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటపడేశామనీ, సామాజిక న్యాయానికి కట్టుబడి ఇతర వెనుకబడిన వర్గాలు, గిరిజనులు, దళితులకు ప్రభుత్వంలో భాగం కల్పించామని చెప్పుకుంది. అదే సమయంలో ఈ 'సంకల్పం'లో కొన్ని వివాదాలూ ఉన్నాయి. ఈసారి ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామాలయ ప్రారంభం చేసి చూపిన బీజేపీ మూడోసారి గద్దెనెక్కితే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తేవాలని చూస్తోంది. అయితే, తెలివిగా యూసీసీ, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 'ఒకే దేశం – ఒకే ఎన్నిక', సార్వత్రిక ఎన్నికల జాబితా తదితర విస్తృత చర్చనీయాంశాలను తన సైద్ధాంతిక ఎంపికలుగా కాక, సుపరిపాలనకు తప్పనిసరి అన్నట్టు చిత్రిస్తూ మేనిఫెస్టోలో పెట్టింది. అదే సమయంలో 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న వివాదాస్పద 'పౌరుల జాతీయ చిట్టా' అంశాన్ని ఈసారి ప్రస్తావించలేదు. వ్యవసాయ చట్టాలపై ఎదురుదెబ్బ తగిలేసరికి, ఈ తడవ వాటి ఊసెత్తకుండా జాగ్రత్తపడింది. రైతులకు గట్టి హామీలివ్వకుండా దాటేసింది.

ప్రధాన ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్‌ల ఎన్నికల వాగ్దానపత్రాలను విశ్లేషకులు సహజంగానే పోల్చి చూస్తున్నారు. బీజేపీ మేనిఫెస్టో విధానాల కొనసాగింపు ధోరణిలో సాగితే, కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజాకర్షక బాటన నడిచింది. ముందుగా ప్రకటించిన కాంగ్రెస్‌ది 'న్యాయ్ (గ్యారెంటీల) పత్రం' అయితే, ఆనక వచ్చిన బీజేపీది 'సంకల్ప పత్రం'. యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారీ న్యాయ్‌లు అయిదు ప్రధానాంశాలుగా, 25 గ్యారెంటీలతో కాంగ్రెస్ ముందుకొచ్చింది. మహిళలు, యువతరం, అణగారిన వర్గాలు, రైతులు... ఈ నాలుగు వర్గాలూ దేశాభివృద్ధికి నాలుగు స్తంభాలని బీజేపీ సంకల్పం చెప్పుకుంది. కనీస మద్దతు ధరకు 'చట్టపరమైన గ్యారెంటీ' ఇస్తామని కాంగ్రెస్ పేర్కొంటే, బీజేపీ మాత్రం పంటలకు కనీస మద్దతు ధరల్ని 'ఎప్పటికప్పుడు' పెంచుతామన్నదే తప్ప, చట్టంగా భరోసా ఇవ్వలేదు. కులగణనకు కాంగ్రెస్ కట్టుబడితే, అలాంటి డిమాండ్లపై బీజేపీ తన అభిప్రాయం పంచుకోనే లేదు.

రెండు మేనిఫెస్టోల్లో కొన్ని మంచి విషయాలూ లేకపోలేదు. రాగల అయిదేళ్ళలో వ్యవసాయ పరిశోధనలకు రెట్టింపు నిధులిస్తామన్నది కాంగ్రెస్ వాగ్దానం. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద త్వరితగతిన చెల్లింపులు జరుపుతామనీ, పంట నష్టాన్ని మరింత కచ్చితంగా అంచనా వేసేలా సాంకేతికతను వినియోగిస్తామనీ బీజేపీ హామీ ఇస్తోంది. అయితే, దురదృష్టవశాత్తూ రెండు పార్టీలూ వ్యవసాయ రంగానికి సరైన దిశానిర్దేశంలో విఫలమయ్యాయి. నీరు, ఎరువులు, ఇంధనాలను తక్కువగా వినియోగిస్తూనే ఎక్కువ దిగుబడి లాంటి వాటిపై అవి దృష్టిపెట్టలేదు. ఇక, సాంస్కృతిక జాతీయవాదంతో తమిళుల్ని ఆకర్షించేలా 'తిరువళ్ళువర్ సాంస్కృతిక కేంద్రాల' ఏర్పాటు, సామాన్యుల సాధారణ రైలు ప్రయాణ కష్టాల్ని పక్కనబెట్టి ఖరీదైన 'వందేభారత్ రైళ్ళ' విస్తరణ లాంటివి బీజేపీ అనవసర ప్రాధాన్యాలే. దేశంలో ప్రస్తుత ప్రధాన సమస్యలు నిరుద్యోగం, ధరల పెరుగుదల అని సర్వేలన్నీ తేల్చినందున ఏ పార్టీ అయినా వాటిపై దృష్టి పెట్టడం ప్రయోజనం. ఆ మాటకొస్తే ఓటర్లను ఆకర్షించడమే కీలకమైన ఎన్నికల్లో, మేనిఫెస్టోలను తప్పనిసరిగా అమలు చేసి తీరాలన్న చట్టం లేని భారత్‌లో... 'సంకల్పం' శుష్కవచనమైతే నిష్ప్రయోజనం.

ఆ చట్టానికి కోరలు ఎక్కువే!

విశ్లేషణ



ఉత్కర్ష్ ఆనంద్

ప్రారంభం నుంచీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) వరుసగా అనేక సవరణలకు గురై మరింత కఠినంగా మారింది. దాంతో చట్ట అన్వయానికీ, వ్యక్తిగత స్వేచ్ఛకూ మధ్య సాధించాల్సిన సమతూకపు ఆవశ్యకత పెరుగుతోంది. పీఎంఎల్‌ఏ నిబంధనలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేదని చెప్పడం ద్వారా ఈడీకి ఉన్న విస్తారమైన అధికారాలను 2002లో సుప్రీంకోర్టు తీర్పు దృఢపరిచింది. ఈ తీర్పు ఫెడరల్ ఏజెన్సీకి అనవసరమైన వెసులుబాటు కల్పించిందని మానవ హక్కుల న్యాయవాదులు విమర్శించారు. ఏ రుజువూ లేకుండానే ఆరు నెలలు నిర్బంధంలో గడిపి, బెయిల్ మీద విడుదలైన 'ఆప్' ఎంపీ సంజయ్ సింగ్ కేసు ప్రాథమిక హక్కులపై పీఎంఎల్‌ఏ కలిగిస్తున్న ప్రభావాలను పునఃపరిశీలించవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది.

ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్‌ఏ) ఒక ముఖ్యసాధనం. 2005 జూలైలో అమలులోకి వచ్చినప్పటి నుండి ఈ చట్టం సమూల మార్పులకు గురైంది. 2009, 2012, 2015, 2018, 2019, 2023లో ఈ చట్టానికి చేసిన పలు సవరణలు... అక్రమ ఆస్తులకు వ్యతిరేకంగా దేశం ప్రదర్శిస్తున్న కఠిన వైఖరిని ప్రతిబింబిస్తాయి.

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన తాజా పరిణామం... కఠినమైన చట్టాన్ని అన్వయించడంలో న్యాయపరమైన పర్యవేక్షణ, జవాబుదారీతనాలకు సంబంధించిన క్లిష్టమైన అవసరాన్ని గుర్తించింది. మనీలాండరింగ్‌లో తన ప్రమేయం ఉన్నట్లు రుజువు లేకుండానే ఆరు నెలలు నిర్బంధంలో గడిపిన తర్వాత, సింగ్ బెయిల్ పిటిషన్‌పై సవాలు చేయకూడదని ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) నిర్ణయించుకుంది.

గత కొన్ని సంవత్సరాలుగా, ప్రత్యేకించి 2022లో 'విజయ్ మదన్‌లాల్ చౌదరి' కేసుపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తర్వాత, మనీలాండరింగ్ చట్టం నిబంధనలను రాజ్యాంగ సూత్రాలతో సమతుల్యం చేయాలని సుప్రీంకోర్టును ఎక్కువగా కోరడం జరుగుతోంది. పీఎంఎల్‌ఏ నిబంధనలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించలేదని నొక్కి చెబుతూ ఈడీకి ఉన్న విస్తారమైన అధికారాలను ఆ తీర్పు దృఢపరిచింది. జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం (ఈయన పదవీ విరమణ చేశాక లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు), అక్రమాస్తుల నిరోధ సమస్యను పరిష్కరించడానికి కఠినమైన చర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. పైగా, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) కింద భారతదేశ బాధ్యతలను నెరవేర్చడంలో ఈ చట్టం పాత్రను ధర్మాసనం గుర్తించింది. ఈ తీర్పు ఈడీని బలోపేతం చేసినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛలు, విధానపరమైన భద్రతలను పణంగా పెట్టి, ఫెడరల్ ఏజెన్సీకి అనవసరమైన వెసులుబాటు కల్పించిందని న్యాయ నిపుణులు, మానవ హక్కుల న్యాయవాదులు విమర్శలు గుప్పించారు. న్యాయం, వ్యక్తిగత హక్కుల ప్రయోజనాలను సమతుల్యం చేయడానికి బదులుగా, ఈ తీర్పు ఈడీ అధికారాన్ని దుర్వినియోగం చేయగలదనే భయాందోళనలకు తావిచ్చింది.

ఈ తీర్పు వెలువడిన కేవలం ఒక నెల తర్వాత, మరో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ దానిపై రివ్యూ పిటిషన్లను అంగీకరించింది. నిందితులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) కాపీని తిరస్కరించడం, నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యత నిందితుడి మీద ఉండటం– రెండు అంశాలను పునఃపరిశీలించడానికి ధర్మాసనం అంగీకరించింది. 2022 తీర్పుపై రివ్యూ పిటిషన్ పెండింగులో ఉండగా, వివిధ ఇతర కేసుల్లో మనీలాండరింగ్ చట్టం నిబంధనలను సుప్రీంకోర్టు వివరించాల్సి వచ్చింది, కొన్నిసార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాల పరిధిని న్యాయస్థానం పరిమితం చేసింది. తదనంతరం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులలో కొన్ని విజయ్ మదన్ లాల్ చౌదరి తీర్పునకు విరుద్ధమైన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాయి.



ఉదాహరణకు, 2023 అక్టోబర్‌లో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ భిన్నమైన దృక్పథాన్ని తీసుకుంది. మనీలాండరింగ్ కేసుల్లో నిందితులకు వారిని అరెస్టు చేసిన కారణాల కాపీని ఈడీ తప్పనిసరిగా అందించాలని ధర్మాసనం ఆదేశించింది. మౌఖికంగా మాత్రమే సమాచారాన్ని అందించడం రాజ్యాంగ హక్కు ఉల్లంఘనగా పరిగణించబడుతుందని పేర్కొంది. అయితే, 2022 తీర్పు, నిందితుడిని అరెస్టు చేయడానికి గల కారణాలను వెల్లడించడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1)కి తగినంత సమ్మతి కలిగి ఉందని చెప్పింది. వారి అరెస్టుకు కారణాలు తెలియజేయకుండా లేదా వారు ఎంచుకున్న న్యాయవాదిని సంప్రదించే హక్కును తిరస్కరిస్తూ, అరెస్టు చేసిన ఎవరినైనా సరే కస్టడీలో ఉంచకూడదని పేర్కొంది. 2023 తీర్పును సమీక్షించాలని కేంద్రం, ఈడీ గతనెలలో చేసిన అభ్యర్థనను కూడా తోసిపుచ్చడమైనది.

అదేవిధంగా, 2023 ఆగస్టులో తమిళనాడు మంత్రి వి సెంథిల్ బాలాజీ మెడికల్ బెయిల్ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో, అక్రమాస్తుల నిరోధక చట్టంలోని సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారాలను జాగ్రత్తగా ఉపయోగించాలని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. విధానపరమైన లేదా ముఖ్యమైన ఉల్లంఘనలు ఉన్నట్లయితే, అరెస్టు చేసిన వ్యక్తిని న్యాయమూర్తులు వెంటనే విడుదల చేయాలని ఈ తీర్పు పేర్కొంది. ఈ తీర్పు అధికార దుర్వినియోగాన్ని నిరోధించడంలోనూ, సరైన కారణం లేకుండా అరెస్టులు శిక్షార్హమైనవి కాదని నిర్ధారించడంలోనూ న్యాయవ్యవస్థ పాత్రను బలపరిచింది.

2023 అక్టోబర్‌లో, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన మరో తీర్పు, సత్వర విచారణను కోరుకోవడం ప్రాథమిక హక్కుగా నొక్కి చెప్పింది. అదే సమయంలో అక్రమాస్తుల నిరోధక చట్టంలోని సెక్షన్ 45 ఆరోపించినట్లుగా నేరాభియోగాలకు తాము పాల్పడలేదని నిందితులే రుజువు చేసుకోవాలంటూ వారిపై ప్రాథమికంగా మోపే భారం అనేది వారి బెయిల్ మంజూరుకు సంపూర్ణ అడ్డంకి కాదని స్పష్టం చేసింది. 'నిందితుడికి నిమిత్తం లేని కారణాల వల్ల విచారణ కొనసాగనప్పుడు, సరైన కారణాలు ఉంటే తప్ప, బెయిల్ మంజూరు చేసే అధికారాన్ని ఉపయోగించుకునేలా న్యాయస్థానం మార్గనిర్దేశం చేయవచ్చు. విచారణకు సంవత్సరాల కాలం పట్టే చోట ఇది నిజం' అని చెప్పింది.

2023 నవంబర్‌లో పవన దిబ్బూర్ కేసులో ఇచ్చిన తీర్పులో, మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించడానికి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120బీ కింద శిక్షార్హమైన నేరపూరిత కుట్ర మాత్రమే సరిపోదనీ, 2002 చట్టం కింద షెడ్యూల్డ్ నేరంగా ఆ కుట్ర ఉండాలనీ ప్రకటించింది. ఈ తీర్పు ఆధారంగానే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై నమోదైన కేసును సుప్రీంకోర్టు గత నెలలో కొట్టేసింది.

సంజయ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం, మనీలాండరింగ్ నిరోధక చట్టం విషయంలో పురోగమిస్తున్న న్యాయశాస్త్రానికి మరొక ఉదాహరణ. రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం చట్టపరమైన యంత్రాంగాలను దుర్వినియోగం చేయకుండా నిరోధించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తుంది. ఈ కేసు దృఢమైన న్యాయ పరిశీలన ప్రాముఖ్యతను గుర్తుచేస్తోంది. మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడంలో ప్రభుత్వ అధికారాల మధ్య సమతుల్యతను తిరిగి అంచనా వేయడానికీ, పునశ్చరణ చేయడానికీ ఒక విస్తృత ధర్మాసనం ద్వారా 2022 తీర్పును సమగ్రంగా సమీక్షించవలసిన అవసరాన్ని కూడా ఇది గుర్తుచేస్తోంది.

ఇతర కేసులతో పాటు సంజయ్ సింగ్ కేసు, మనీలాండరింగ్ చట్టపరిధిలో ఉన్న కీలకమైన అంశాన్ని సూచిస్తోంది. ప్రాథమిక హక్కులపై మనీలాండరింగ్ చట్టం కలిగిస్తున్న ప్రభావాలను పూర్తిగా పునఃపరిశీలించవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. స్వేచ్ఛను కాపాడడానికి ఉద్దేశించిన న్యాయం రాజీ పడకుండా చూసేందుకు ఒక విస్తృత ధర్మాసనం ద్వారా పునఃపరిశీలన చేయాలని ఇది సూచిస్తోంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రాథమిక స్వేచ్ఛలను సవాలు చేస్తూనే ఉన్నందున, అమలు యంత్రాంగాలు న్యాయ, నిష్పక్షపాత సూత్రాలను అధిగమించకుండా చూడటంలో న్యాయవ్యవస్థ జాగరూకతా పాత్ర అనివార్యమవుతోంది.

వ్యాసకర్త జర్నలిస్ట్, కాలమిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోల్పోయాను!



చాలాకాలంగా నా ప్రియమైన స్నేహితుడు అయిన ద్వారకేశ్ మరణం బాధాకరం. కమెడియన్‌గా (కన్నడ సినీరంగంలో) కెరీర్‌ను ప్రారంభించి, పెద్ద నిర్మాతగా, దర్శకుడిగా ఎదిగారు. ఎన్నో మంచి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక నివాళి.

– రజినీకాంత్, నటుడు

ఓం శాంతి



సెంట్రల్ కశ్మీర్ నుంచి దారుణ వార్త. పాఠశాలకు వెళ్తున్న చిన్నారుల పడవ ఝీలం నదిలో బోల్తాపడింది. పౌర యంత్రాంగం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్, సైన్యం బాడీల వెలికితీతలో పాల్గొంటున్నాయి. కానీ లైఫ్ జాకెట్స్ ఏమయ్యాయి? బాధ్యులను జవాబుదారీగా నిలబెట్టాలి.

– శేష్ పాల్ వైద్, జమ్ము–కశ్మీర్ మాజీ డీజీపీ

వాళ్లు చెబితే గొప్పా?



తెల్లవాళ్ల ధ్రువీకరణ బలహీనత నుంచి బయటపడాలి. తమ వాదనలు బలపరుచుకోవడానికి అమెరికన్లు విదేశీయుల అభిప్రాయాలను ఉపయోగించుకోరు. కానీ ఇండియన్స్ (లెఫ్ట్, రైట్ రెండు పక్షాలు) తమ పాయింట్ చెప్పడానికి ప్రతీ తెల్ల చెత్తను ఉటంకిస్తారు. కొంత స్వీయ గౌరవం ఉండనీ!

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

అదీ పరిస్థితి



మణిపూర్‌లో కుకీ–జోలు మైదాన ప్రాంతానికి వెళ్లలేరు: మైతేయిలు కొండ ప్రాంతాలకు పోలేరు. కానీ మాదక ద్రవ్యాలు మాత్రం అంతటికీ వెళ్లగలవు.

– అంగనా చక్రవర్తి, జర్నలిస్ట్

పరిమిత స్పందన



ఇరాన్‌తో బైడెన్ యుద్ధం కోరుకోవడం లేదనేది స్పష్టం. ఇది ఇజ్రాయెల్ అవకాశాలను బలంగా పరిమితం చేస్తుంది. అలాగని ఇరాన్ దాడికి స్పందించకుండానూ ఇజ్రాయెల్ ఉండలేదు. అంటే, ప్రాంతీయ యుద్ధం రేగని స్థాయిలో మాత్రమే జీజీ (బెంజమిన్ నెతన్యాహూ) స్పందించాల్సి ఉంటుంది.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ప్రజాస్వామ్యానికి ప్రమాదకారులెవరు?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

'మనదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడను ప్రదర్శిస్తోంది. దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలను తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటోంది' అని మోదీ వ్యతిరేక రాజకీయ నాయకులు చేసే వాదనలలో సత్యాసత్యాలను పరిశీలిద్దాం!

2014లో నరేంద్ర మోదీ ప్రధాని పీఠంపై కూర్చుండే నాటికి దేశ ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉండేది? 2004 నుండి 2014 వరకు సోనియాగాంధీ డైరెక్షన్‌తో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా రెండు విడతల యూపీఏ ప్రభుత్వం అనేక కుంభకోణాల్లో పీకల లోతు వరకు కూరుకుపోయింది. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు మన దేశానికి అప్పులు ఇవ్వడానికి మొఖం చాటేశాయి. కాంగ్రెస్ నాయకులు, వారితో జతకట్టిన ప్రాంతీయ పార్టీల నాయకులు అనూహ్యంగా కోట్లకు పడగలెత్తారు. కాంగ్రెస్ పాలన నుండి విముక్తి కావాలని దేశ ప్రజలు కోరుకున్నారు. 2014లో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ అఖండ విజయాన్ని సాధించింది. గుజరాత్ మత ఘర్షణలను పదేపదే చెప్పి, మోదీ ప్రధానమంత్రి అయితే ముస్లింలు ఈ దేశంలో బ్రతకలేరనీ, ముస్లింలందరినీ పాకిస్తాన్‌కి వెళ్లగొడతారనీ, ముస్లింల మత స్వేచ్ఛకు ఇబ్బందులు ఏర్పడతాయనీ మోదీకి వ్యతిరేకంగా విష ప్రచారం చేశారు. అయినప్పటికీ ధర్మం గెలిచింది. మోదీ వ్యతిరేకులకు చావు దెబ్బ తగిలింది.

2019లో సైతం ఇలాంటి భంగపాటే మోదీ వ్యతిరేకులకు ఎదురైంది. 2016 నవంబర్ 8వ తేదీన నోట్ల రద్దుతో మోదీ వ్యతిరేకులకు, తీవ్రవాద సంస్థలకు, మత మార్పిడి సంస్థలకు చావు దెబ్బ తగిలింది. మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశ గౌరవ ప్రతిష్ఠలు అత్యున్నత స్థాయికి చేరడం, ప్రపంచ దేశాలలో మోదీకి సాటి అయిన నాయకుడు లేకపోవడం, ప్రపంచంలో మోదీ హవా సాగడం ఆయన వ్యతిరేకులకు కంటగింపుగా మారింది. 'మా దేశంలో ప్రజాస్వామ్యం మసకబారుతోంది, మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అనుసరిస్తోంది' అని ప్రపంచ వేదికల ముందు మొరపెట్టుకోవడం... అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు, యుఎన్ఓ ప్రతిపక్షాల వాళ్లను తృప్తిపరచడం కోసం కంటితుడుపు ఆరోపణలు గుప్పించడం, ఇందుకు ప్రతిగా మోదీ ప్రభుత్వం ఘాటుగా స్పందించడం సర్వసాధారణమైంది.

నిజానికి కాంగ్రెస్ పాలనలోనే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. 1975లో ఎమర్జెన్సీ విధించి, వేల మంది రాజకీయ నాయకులను కార్యకర్తలను జైళ్లలో పెట్టి, వేధించినప్పుడు; ఇందిరాగాంధీ హత్యను సాకుగా చూపి, వేలమంది నిరపరాధులైన సిక్కులను ఊచకోత కోసినప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడలేదా? లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, జగన్ మోహన్ రెడ్డిలపై కేసులు మోపి, జైలుకు పంపించింది కాంగ్రెస్ ప్రభుత్వం కదా? ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌లను అవినీతి కేసుల్లో జైలుకు పంపితే వితండవాదం ఎందుకు చేస్తున్నారు? ఒక 'చాయి వాలా'కు వ్యతిరేకంగా ఇంత మంది ఎందుకు పోరాటం చేస్తున్నారు అనేది సామాన్యుడి ప్రశ్న.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సుప్రీంకోర్టు తీర్పులనూ ప్రజలకు చెప్పరా?

అభిప్రాయం



డా॥ నాగసూరి వేణుగోపాల్

ఒకటిన్నర దశాబ్దం క్రితం ఓ పత్రికా యజమాని విశాఖపట్నంలో తన మీద వచ్చిన ఒక వాజ్యం సంబంధించి ఆరోపణ ఎదుర్కొని, విచారణ కోసం కోర్టు కొచ్చారు. అయితే, కోర్టు నుంచి బయటకు వస్తున్నప్పుడు ఆయన మొహం కనబడకుండా, ఇతరులు అసలు చూడకుండా ఫోటోలు తీయకుండా సెక్యూరిటీ సిబ్బందితో బోలెడు గొడుగులు అడ్డం పెట్టుకుని సాగిపోయారు. అది గ్లామరస్ డైరెక్టర్ కె రాఘవేంద్రరావు వలపు పాటల చిత్రీకరణలో పూలల్లో హీరోయిన్ పూర్తిగా కప్పబడినట్టు, ఈ పత్రికా యజమాని గొడుగుల లోపల అదృశ్యమైపోయారు. అది మహాద్భుతమైన వార్తా సందర్భం. తెలుగు పత్రికా రంగం కొన్ని వార్తలను పకడ్బందీగా దాచి పెడుతుంది కనుక, ఆ వార్త ఏ ఇతర ప్రాంతంలో రాలేదు, ఒక్క లీడర్ రమణమూర్తి సంపాదకత్వం వహించే వైజాగ్ దినపత్రికలో ఆ పెద్ద వార్త తొలి పేజి ఫోటోతో తప్పా. ఈ పత్రికా యజమాని, భారత రాజ్యాంగం ప్రకారం నడిచే కోర్టు విచారణ తర్వాత కెమెరాల నెదుర్కోకుండా మొహం దాచుకోవాల్సిన అగత్యం ఏమిటో?



అది పదేళ్ల క్రితం ఒక తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోతున్న సందర్భం. పార్లమెంట్‌లో మైకులు ఆపివేసి, తలుపులు మూసివేసి నిర్ణయాలు తీసుకుంటున్న సమయం కూడా! సరిగ్గా ఆ రోజునే హైదరాబాదులోని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఒక కేసును ఎటువంటి సమగ్రమైన విచారణ లేకుండా కొట్టి వేసింది. అదే కేసు 10 ఏళ్ల తర్వాత 2024 ఏప్రిల్ 9న సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాల అభిప్రాయం ఏమిటో తెలుసుకోవాల్సిన అగత్యం ఉందనీ, దీని కోసం పోరాడుతున్న ఉండవల్లి అరుణ్ కుమార్ వాదన కూడా తెలుసుకోవాలనీ, అటు పిమ్మటే దీనికి సంబంధించి పూర్తి తీర్పు చెప్పండనీ... మళ్లీ ఆ కేసును తెలంగాణ హైకోర్టుకి సుప్రీంకోర్టు వెనక్కి పంపించింది. ఈ విషయం రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించింది. ఆ కేసు ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా ప్రాంతానికి చెందిన పత్రికా యజమానిది. కాగా, బాధితులు రెండు రాష్ట్రాల్లోనూ ఉన్నారు, ఆయన వాణిజ్య సామ్రాజ్యమంతా హైదరాబాదులో ఉంది. అయితే ఈ సుప్రీం కోర్టు తీర్పును అసలు చెప్పకుండా, దాని ఊసెత్తకుండా దాచి పెట్టి, మరేవో వేరే వార్తలను పేజీలకు పేజీలు నింపడం ఏమిటో? పదహారేళ్ళ క్రితం విశాఖపట్నం గొడుగులు వ్యవహారం లాంటిదే ఏప్రిల్ 10న ఆ వార్తను కొన్ని పత్రికలు, కొన్ని టీవీ ఛానళ్లు పూర్తిగా చెప్పకుండా దాచడం.

నాలుగు దశాబ్దాల క్రితం ప్రసంగ ప్రతులు ఎన్టీ రామారావుకు ఇచ్చి ఎన్నికల ప్రచారం చేయించి, దాన్నే మరుసటి రోజు వార్తలుగా పెద్ద పెద్ద ఐటమ్స్‌గా పేజీలు నింపేయడంతో మొదలు కొని... నిద్రిస్తున్న బిచ్చగాళ్లను ఫోటోలు తీసి, వాళ్లంతా తెలుగు దేశం పార్టీ టికెట్ల కోసం పడిగాపులు కాస్తున్నారన్నట్టు వార్తలు సృష్టించడం 40 ఏళ్ల క్రితపు విషయం. ముఖ్యమంత్రిని ఒకరు పడదోస్తే వెన్నుపోటు, మరొకరు పడదోస్తే ప్రజాస్వామ్యం అనే పద్ధతిలో ప్రచారం చేసి తెలుగు వారినే కాకుండా మొత్తం భారతదేశాన్ని నమ్మింపజేశారు. తమ వ్యాపారానికి సహకరించే నాయకులకు వత్తాసు పలకడం, తమకు తగరనుకున్న వారి మీద నిందలు తయారు చేయించి, అలాంటి సమాచారాన్నే వార్తల బురదగా చల్లడం... అనేది పాటించిన మరో విధానం.

అయితే ఇప్పుడు మరికొన్ని కొత్త పాత్రలు ప్రవేశించి, వార్తలను ఆక్రమించాయి. తమ పలుకుబడి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో చిట్ ఫండ్ చట్టం రాకుండా కొన్ని దశాబ్దాలు ఆపగలిగిన వీరు, తామే వార్తలను సృష్టించి, చెలరేగి కొందరిని అందలం ఎక్కించి, మరికొందరిని పంకిలంలో పడదోసే ధోరణి ఇంతవరకు సాగింది. అయితే ఇప్పుడు విశాఖపట్నంలో భవనం, విజయవాడలో భవనం ఎలాగో మిగతావి కూడా అదే పద్ధతిలో తోక ముడిచే రోజులు ఎంతో దూరంలో లేవు. ప్రపంచాన్ని అరచేత్తో మూసి పెట్టి ఈ బొమ్మరిల్లు జర్నలిజాన్ని ఎంతో కాలం నడిపించలేరు.

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి
మొబైల్: 94407 32392

దివ్య మంగళ స్వరూపులు

సీతారామ కల్యాణ విశేషాలను వాల్మీకి రామాయణం కంటే తులసీ రామాయణం కొంత విపులంగా వర్ణిస్తుంది. శివధనుర్భంగానికి ముందే మిథిలలో ఒక ఉద్యానవనంలో సీతారాముల చూపులు తొలిసారి కలిశాయంటారు తులసీదాసు. సౌందర్యానికి మూర్తీభావమైన సీతను చూసి రాముడు ముగ్ధుడై కళ్ళప్పగించాడు, నోట మాట రాలేదు.

సీతకూ అంతే. అయితే ఆమె తెలివిగా ఒక పని చేసింది. కంటిచూపుతో రాముడిని కట్టి తెచ్చేసుకొని తన హృదయంలో బంధించి, తప్పించుకోకుండా తన కనురెప్పల కవాటాలు మూసేసి తాదాత్మ్య స్థితిలో ఉండిపోయింది.



జ్యోతిర్మయం

ఆ సాయంత్రం ఆకాశంలో చంద్రుడిని చూసినప్పుడు, శ్రీరాముడికి శీతాంసుడిలో సీతే స్ఫురించింది. కానీ క్షణం ఆలోచించిన తరువాత పెదవి విరిచాడు. 'అబ్బే! ఈ చంద్రుడు కళంకితుడు. కాలకూట విషానికి తోబుట్టువు. రాత్రిపూట ఓ వెలుగు వెలుగుతాడు, కానీ పగలు వెలవెలబోతాడు. కొన్నాళ్ళు వృద్ధి, కొన్నాళ్ళు క్షయం. మధ్యలో గ్రహణాలు. ఇన్ని పరిమితులున్న ఇందుబింబాన్ని, ఎల్లవేళలా ఎనలేని స్వయంప్రకాశంతో అలరారే అయోనిజతో పోల్చడం అసమంజసం' అనుకొన్నాడు.

జానకి సౌందర్యం వర్ణించడానికి తులసీదాసు జంకుతారు. లోకంలో ఉన్న వెర్రి మొర్రి ఉపమానాలు చెప్పి పేలవంగా ఆమెను వర్ణిస్తే, 'ఏమి కుకవి!' అని నలుగురూ నవ్వుతారు. పోనీ ఏ దివ్య స్త్రీలతోనో పోల్చాలంటే మాత్రం ఎవరున్నారు? వాగ్దేవి గొప్పదే కానీ మాటల మారి. అంబిక పూర్తి శరీరమే లేని అర్ధనారి. శ్రీదేవి అంటారా... ఆమె అందం ఆదివిష్ణువుకెరుక కానీ ఆమె కల్లుకూ, కాకోలానికీ చెల్లెలుగా పుట్టిందని జగద్విదితం కదా!

రాముడిదీ అలాంటి అతిలోక సౌందర్యమే. అందుకే సీతా స్వయంవర సభలో రాముణ్ణి చూసి, చతుర్ముఖ బ్రహ్మగారు, 'నాకు ఎనిమిది కళ్లే ఉన్నాయి. ఇవి చాలడం లేదు' అనుకొంటే, ఆరు ముఖాల కుమార స్వామి, 'నాకు పన్నెండు కళ్ళు, బ్రహ్మగారికంటే నేనే భాగ్యశాలిని!' అని భావించాడట. సహస్రాక్షుడు దేవేంద్రుడయితే, 'ఆరోజు గౌతముడు నాకిచ్చిన వెయ్యి కళ్ళ శాపం, ఈరోజు నా పాలిటి వరమైంది' అని ఆనందించాడట.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యై చ తస్యై జనకాత్మజాయై!

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు శ్రీరామ నవమి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.నవమి సా.5.27 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పుష్యమి ఉ.7.41 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.9.30 నుండి 11.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.24 వరకు, **అమృత ఘడియలు:** లేవు, శ్రీరామనవమి : **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.11.

క్లుప్తంగా...

19 నుంచి ఇంద్రకీలాద్రిపై బ్రహ్మోత్సవాలు

- 22న ఆది దంపతుల కళ్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థాన వైదిక కమిటీ ఏర్పాట్లు చేసింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారికి 19న వెండి పల్లకీ సేవ, 20న రావణ వాహన సేవ, 21న వెండి రథోత్సవం, 22న నంది వాహన సేవ, 23న సింహ వాహన సేవ నిర్వహించనున్నారు. ఆయా సేవల్లో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లు నగర వీధుల్లో విహరిస్తారు. అలాగే 22వ తేదీ రాత్రి 8 గంటల నుంచి మల్లేశ్వర స్వామి ఆలయ రాయబార మండపంలో ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 10.30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దివ్య కళ్యాణ మహోత్సవం జరుగనుంది. 24వ తేదీ పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పవిత్ర కృష్ణానదిలో హంస వాహనంపై తెప్పోత్సవం జరుగనుంది. అదే విధంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఆది దంపతులకు పవళింపు సేవను ఆలయ అర్చకులు నిర్వహిస్తారు.

ఎయిరిండియా హైదరాబాద్- విజయవాడ సర్వీస్ ప్రారంభం



ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందజేస్తున్న ఏపీడీ లక్ష్మీకాంతరెడ్డి

విమానాశ్రయం (గన్నవరం): విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్-విజయవాడ మధ్య సర్వీస్‌ను మంగళవారం ప్రారంభించింది. 186 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737-800 విమానం హైదరాబాద్ నుంచి ఉదయం 8.30 గంటలకు ఇక్కడికి చేరుకుంది. అనంతరం 8.55 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లింది. విమాన సర్వీస్ ప్రారంభోత్సవ వేడుకలను ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లో ఎయిరిండియా ఆధ్వర్యంలో నిర్వహించగా.. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్(ఏపీడీ) ఎం.లక్ష్మీకాంతరెడ్డి కేక్ కట్ చేసి తొలి ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ఈ సర్వీస్ ప్రతిరోజు ఉంటుందన్నారు. ఇందులో 8 బిజినెస్ క్లాస్, 178 ఎకానమీ క్లాస్ సీట్లు ఉంటాయన్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మార్చిన లోగో, కలర్స్, ఆధునీకరించిన కేబిన్ ఇంటీరియర్స్‌తో విమానం ఆకట్టుకుంది. ఎయిరిండియా స్టేషన్ మేనేజర్ పార్థసారథి, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజర్ సుబ్రమణ్యేశ్వర్ పాల్గొన్నారు.

ఏపీ బెవరేజస్ ఎండీ వాసుదేవరెడ్డి బదిలీ

సాక్షి, అమరావతి: ఏపీ బెవరేజస్ లిమిటెడ్ ఎండీ డి.వాసుదేవరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎండీగా కింది స్థాయి అధికారులకు బాధ్యతలను అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఏపీ బెవరేజస్ లిమిటెడ్ ఎండీని తక్షణం బదిలీ చేయాలంటూ మంగళవారం ఉదయం వచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా జవహర్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. వాసుదేవరెడ్డికి ఎటువంటి ఎన్నికల విధులు అప్పగించకూడదని ఈసీ ఆదేశించింది. ఎండీ స్థానంలో కొత్తవారిని నియమించడానికి గడిచిన ఐదేళ్లుగా ఎటువంటి విజిలెన్స్ దర్యాప్తు లేని ముగ్గురు ఐఏఎస్‌ల పేర్లతో జాబితా పంపించాల్సిందిగా ఈసీ ఆదేశాల్లో పేర్కొంది.

కంచికచర్ల పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్రం బృందం

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ బృందం పరిశీలించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వైద్య విభాగంలో అమలవుతున్న తీరుతెన్నుల గురించి వైద్యులను అడిగి తెలుసుకుంది. ఆసుపత్రుల్లో ఆన్‌లైన్‌లో చేస్తున్న పనులు, ఫిజికల్ రికార్డులు, రోగుల గురించి తీసుకుంటున్న జాగ్రత్తల గురించి విచారించారు. అనంతరం ఆసుపత్రిలో వాతావరణం, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో కేంద్ర బృందంతో పాటు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పీజే అమృతం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నోడల్ అధికారి డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి, విశాఖపట్నం: రాయలసీమపై మంగళవారం నుంచి ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మరోవైపు వచ్చే మూడు రోజులు కోస్తాంధ్ర రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో 44నుంచి 46 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల పలుచోట్ల వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

కొవిలంలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మంగళవారం రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా కొవిలంలో 45.4 ఉష్ణోగ్రత రికార్డయింది. తుమ్మికపల్లి (విజయనగరం)లో 45.2, రావికమతం (అనకాపల్లి)లో 45.1, మక్కువ (పార్వతీపురం మన్యం)లో 44.4, గోస్పాడు (నంద్యాల)లో 44.3 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. 88 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 89 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. కాగా.. బుధవారం 46 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 175 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. వీటిలో శ్రీకాకుళం జిల్లాలో 12, విజయనగరం 18, పార్వతీపురం మన్యం 12, విశాఖపట్నం 2, అనకాపల్లి 2, కాకినాడ 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, శ్రీకాకుళం జిల్లాలో 11, విజయనగరం 6, పార్వతీపురం మన్యం 3, అల్లూరి సీతారామరాజు 12, విశాఖపట్నం 3, అనకాపల్లి 15, కాకినాడ 15, కోనసీమ 9, తూర్పు గోదావరి 18, పశ్చిమ గోదావరి 18, ఏలూరు 13, కృష్ణా 10, ఎన్టీఆర్ 6, గుంటూరు 15, పల్నాడు 22, బాపట్ల 2, ప్రకాశం 8, ఎస్పీఎస్సార్ నెల్లూరు 1, తిరుపతి జిల్లాలో 3 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయి.

తీవ్ర వడగాడ్పులకు అవకాశం

గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లోను, శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో, ఈనెల 20న అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులకు ఆస్కారం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. తీవ్ర వడగాడ్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలు, వడగాడ్పుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	43.8	27.3
కర్నూలు	43.0	28.3
నందిగామ	42.3	26.1
రాజమహేంద్రవరం	42.0	25.0
తాడేపల్లిగూడెం	42.0	24.0
కడప	41.6	26.2
విజయనగరం	41.0	35.0
విజయవాడ	41.0	28.0
ఏలూరు	41.0	25.0
విశాఖపట్నం	40.8	25.8
మార్కాపురం	40.0	27.8
గుంటూరు	40.0	27.0
నెల్లూరు	39.7	26.5

ముక్కంటి సేవలో క్రీడాకారిణి పీవీ సింధు

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద కుటుంబ సభ్యులతో పీవీ సింధు

కన్ను మూసి తెరిచేలోపు..

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు • ఐదుగురు దుర్మరణం
- మృతులంతా హైదరాబాద్‌లో స్థిరపడిన నెల్లూరు జిల్లా వాసులు

కావలి: మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో రెండేళ్ల చిన్నారి సహా ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం గౌరవరం వద్ద మంగళవారం ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మృతులంతా హైదరాబాద్‌లో స్థిరపడిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం చామదల వాసులుగా గుర్తించారు. కావలి రూరల్ సీఐ కే శ్రీనివాసరావు కథనం మేరకు.. జలదంకి మండలం చామదలకు చెందిన దావులూరి శ్రీనివాసులు (51) బేల్దారి మేస్త్రీగా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. కుటుంబంతో సహా చుట్టపు చూపుగా గ్రామానికి వచ్చిన శ్రీనివాసులు, అతని భార్య వరలక్ష్మి (45), వదిన లక్ష్మమ్మ (48), కుమార్తె నీలిమ (24), మనుమడు నందు (2)తో కలిసి కావలి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. చామదల నుంచి కొండబిట్రగుంట మీదుగా ముంగమూరు తోటల వద్ద హైవేపైకి చేరుకుని కావలి వైపు వెళ్లే క్రమంలో వేగం పెంచాడు. సుమారు 110 కిలో మీటర్ల వేగంతో కావలి వైపు వెళుతుండగా గౌరవరం వద్ద ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. దీంతో కారు లారీ కిందకు దూసుకుపోయింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. కారు నడుపుతున్న దావులూరి శ్రీనివాసులుతో పాటు ముందు సీట్లో కూర్చున్న భార్య వరలక్ష్మి, వెనుక సీట్లో ఉన్న వదిన లక్ష్మమ్మ, కుమార్తె నీలిమ, మనుమడు నందు అక్కడికక్కడే మృతి చెందారు. కావలి డీఎస్పీ వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

టీడీపీ అంతమే.. మా పంతం

- భర్త సమాధిపై శపథం చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లే శివబాల
- పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

అనంతపురం క్రైం: 'టీడీపీ కోసం నా భర్త, బావ ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో ఏళ్లుగా ఆ పార్టీకి సేవ చేస్తున్నాం. అయినా మాకు తీవ్ర అన్యాయం చేశారు. డబ్బున్నోళ్లకు సీట్లు అమ్ముకుని కురుబ కులస్తులకు మొండిచేయి చూపారు. ఆ పార్టీని బొంద పెట్టేదాకా విశ్రమించం. రాష్ట్రంలోని కురుబలంతా టీడీపీ ఓటమే ధ్యేయంగా పనిచేస్తాం' అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కురుబ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ బుల్లే శివబాల ధ్వజమెత్తారు. ఆమె మంగళవారం అనంతపురం నగర శివారులోని చెరువుకట్ట శ్మశాన వాటికలో భర్త నాగరాజు సమాధిపై ఉన్న 'టీడీపీ కార్యకర్త' అనే నేమ్‌బోర్డును తొలగించారు. ఆ పార్టీని బొంద పెట్టేదాకా విశ్రమించబోమని భర్త సమాధిపై శపథం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నలభై ఏళ్లుగా టీడీపీనే కుటుంబంగా..కుటుంబమే పార్టీగా పని చేశామన్నారు. పార్టీ కోసం తన భర్తతో పాటు బావ పావురాల కిష్టాను కోల్పోయామని చెప్పారు. తనకు అనంతపురం అసెంబ్లీ లేదా పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం ఇస్తామని లోకేశ్ పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. అనంతపురం అర్బన్‌తో కనీస పరిచయం లేని దగ్గుపాటికి సీటిచ్చిన చంద్రబాబు.. పార్టీ కోసం కష్టపడిన ప్రభాకరచౌదరికి మొండిచేయి చూపారని మండిపడ్డారు. చంద్రబాబు నా వెంట్రుకతో సమానమన్న గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు అభ్యర్థిగా, కాంట్రాక్టులు చేసుకునే అమిలినేని సురేంద్రబాబుకు కళ్యాణదుర్గం అభ్యర్థిగా అవకాశం కల్పించి.. చాలా ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని ఉన్న తనలాంటి బీసీలకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. బీసీల పార్టీ అని పదేపదే చెప్పే టీడీపీ అధినేత చంద్రబాబు వాస్తవానికి బీసీలను ఏనాడూ పట్టించుకోలేదని శివబాల విమర్శించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురు కురుబలకు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు గుర్తింపు దక్కిందని చెప్పారు.



భర్త సమాధిపై 'టీడీపీ కార్యకర్త' అనే నేమ్‌బోర్డును తొలగిస్తున్న బుల్లే శివబాల

తిరుపతిలో హథీరాంజీ బావాజీ విగ్రహ ప్రతిష్ట

- స్వామి హథీరాంజీ మఠం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం
- బావాజీ విగ్రహానికి బంజారాల ప్రత్యేక పూజలు



తిరుపతిలో ఏర్పాటు చేసిన స్వామి హథీరాంజీ బావాజీ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

తిరుపతి రూరల్: శ్రీవారి ప్రియ భక్తుడు, స్వామి వారితో కలిసి పాచికలు ఆడిన స్వామి హథీరాంజీ బావాజీ విగ్రహాన్ని ప్రపంచంలోనే ప్రప్రథమంగా తిరుపతిలో మంగళవారం ప్రతిష్ఠించారు. స్వామి హథీరాంజీ మఠం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో స్వామి హథీరాంజీ బావాజీకి ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారా జాతికి చెందిన ప్రముఖులు ఇక్కడకు చేరుకుని స్వామి బావాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా స్వామి హథీరాంజీ మఠం పరిరక్షణ సమితి నాయకులు శివా నాయక్ మాట్లాడుతూ తిరుమల, తిరుపతితో పాటు చుట్టుపక్కల సుమారు రూ.20 వేల కోట్ల విలువైన ఆస్తులు స్వామి హథీరాంజీ బావాజీ మఠానికి ఉన్నాయన్నారు. స్వామి వారి ఆస్తుల పరిరక్షణ, స్వామి వారి విశిష్టతను భావితరాలకు చాటి చెప్పేందుకు ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఇక్కడే దేశ, విదేశాల నుంచి వచ్చే బంజారా జాతి భక్తుల కోసం వసతి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

18న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూలై నెల కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. ఈ టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు, శ్రీవారి సేవ కోటాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ కోటాను మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

సలహాదారులకూ ఎన్నికల నియమావళి వర్తింపు

సాక్షి, అమరావతి: కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా నియమితులై, కేబినెట్ మంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీతభత్యాలు పొందుతున్న దాదాపు 40 మంది ప్రభుత్వ సలహాదారులకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని భారత ఎన్నికల సంఘం మంగళవారం స్పష్టం చేసింది. ప్రభుత్వ సలహాదారులు నిర్దేశిత పనికి బదులు రాజకీయ ప్రచారంలో భాగంగా ప్రతిపక్షాలను విమర్శిస్తూ విలేకరుల సమావేశాలు పెడుతున్నారంటూ అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొంది. దీనిని సమీక్షించిన అనంతరం మంత్రికి వర్తించే విధంగా సలహాదారులు కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోకి వస్తారని ఈసీఐ ఆదేశాలు జారీ చేసింది. సలహాదారులు ఎన్నికల నిబంధనలకు లోబడి నడచుకోవాలని.. లేకుంటే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

బాబు స్వార్థం కోసమే బీజేపీతో పొత్తు

- 'మేమంతా సిద్ధం' రోడ్‌షోకు వచ్చిన స్పందన చూసి ఓర్వలేకే సీఎం జగన్‌పై హత్యాయత్నం
- విజయవాడ ఎంపీ కేశినేని నాని




ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు కేవలం తన స్వార్థం కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారనేది బహిరంగ రహస్యమని విజయవాడ ఎంపీ, వైఎస్సార్‌సీపీ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)విమర్శించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని మంగళవారం స్థానిక 52వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు బెజవాడ అంటే చిన్నచూపని, అందువల్లే ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. టీడీపీ నేత బొండా కూడా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రౌడీయిజం, కబ్జాలు, ఆయన దందాలు అందరికీ తెలిసినవేనని చెప్పారు. బొండా ఉమాతోపాటు ఆయన కుమారులు సైతం ఏమి చేస్తున్నారనేది విజయవాడ ప్రజలు చూస్తున్నారన్నారు. విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. సీఎం జగన్‌కు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్చుకోలేని వ్యక్తులు ఆయనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు, సుజనాచౌదరి చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మడం లేదన్నారు.

సమృద్ధిగా తాగునీరు అందించండి

అధికారులకు సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రమంతటా సమృద్ధిగా తాగునీరు అందించాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ విభాగాలపై సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'తాగునీటి ఎద్దడి గల ఆవాసాలకు జూన్ నెలాఖరు వరకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయండి. ఇందుకు సంబంధించి ఇంకా 2 జిల్లాల నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉంది. అవి కూడా వస్తే రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో చర్చించి తగిన అనుమతులిస్తాం. తాగునీటి అవసరాల కోసం ఈ నెల 8 నుంచి నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తారు. వాటిని ఉపయోగించి పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులన్నీ నింపాలి. అలాగే ఈనెల 6 నుంచి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, బాపట్ల జిల్లాలకు ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ వెంటనే అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపండి. ఈ వేసవిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకూడదు. ఈ మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోండి. రాష్ట్రంలో 1,669 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు రూ.101 కోట్లతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఆ పనులన్నీ వారంలోగా పూర్తవ్వాలి. ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించిన వాటర్ కన్జర్వేషన్ పనులను వెంటనే మొదలుపెట్టాలి. గత మూడు రోజుల్లో ఉపాధి హామీ రోజువారీ పనులు 11 లక్షల నుంచి 22 లక్షల పనిదినాలకు పెరగడం అభినందనీయం.


చంద్రబాబు వ్యాఖ్యలకు, సీఎం జగన్‌పై దాడికి సంబంధం

మంత్రి చెల్లుబోయిన, ఎంపీ మార్గాని

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో హింసను ప్రేరేపిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని, విజయవాడలో సీఎం జగన్‌పై జరిగిన దాడికి, ఆయన వ్యాఖ్యలకు సంబంధం ఉందని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం వారు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, కానీ చంద్రబాబు.. రాళ్లతో కొట్టండి, దేనితోనైనా కొట్టాలని పిలుపునిచ్చారని చెప్పారు. ఆయన ప్రోత్సాహంతోనే సీఎం జగన్‌పై రాళ్ల దాడి జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై దుష్ట శక్తులు కుట్రలు పన్నాయని ధ్వజమెత్తారు.

ఆ సీట్లపై ఇంకా నాన్చుడే

- కూటమి సీట్లపై ఇప్పటికీ అయోమయంలో చంద్రబాబు
- రఘురామకృష్ణరాజు కోసం రకరకాల విన్యాసాలు
- నర్సాపురం ఎంపీ లేదా ఉండి అసెంబ్లీ స్థానాల్లో ఒకటి ఇవ్వాలని ప్రయత్నాలు
- నర్సాపురం నుంచి బీజేపీని తప్పించడానికి ప్రత్యామ్నాయాలు
- ఏలూరు ఎంపీ అభ్యర్థిని మారుస్తారనే ప్రచారం
- దెందులూరు, అనపర్తి, మాడుగుల స్థానాలపైనా లీకులు
- మరికొన్ని స్థానాల్లోనూ మార్పు తథ్యమని హడావుడి
- నామినేషన్ల పర్వం మొదలవుతున్నా ఇంకా రాని స్పష్టత



సాక్షి, అమరావతి: ఎన్నికల నామినేషన్లకు సమయం ముంచుకొస్తున్నా నలభై ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల సీఎం అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు ఇప్పటికీ కొన్ని సీట్లలో టీడీపీ అభ్యర్థులపై తేల్చుకోలేక తిప్పలు పడుతున్నారు. ఇప్పటికీ నాన్చుతూనే ఉన్నారు. సుమారు 20 సీట్లలో అభ్యర్థులను మారుస్తామని సంకేతాలు ఇచ్చినా ఇంతవరకు నిర్ణయం తీసుకోలేకపోవడంతో ఆ నియోజకవర్గాల్లో టీడీపీ క్యాడర్ అసహనంతో ఉంది. ప్రధానంగా నర్సాపురం ఎంపీ స్థానంపై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడంలో చంద్రబాబు తడబడుతున్నారనే అభిప్రాయం టీడీపీ నేతల నుంచే వినిపిస్తోంది. రాజకీయ బ్రోకర్ రఘురామకృష్ణరాజుకు భయపడి ధైర్యంగా ముందుకెళ్లలేకపోతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. నర్సాపురం ఎంపీ స్థానాన్ని ఆయనకిచ్చేందుకు బీజేపీ నిరాకరించింది. దీంతో ఆయన తన బాధ్యతనంతా చంద్రబాబుపైనే పెట్టారు. వెంటనే టీడీపీలో చేరిపోయి తనకు సీటు ఇవ్వాల్సిందేనని ఒత్తిడి తెచ్చారు. నర్సాపురం ఎంపీ, ఉండి ఎమ్మెల్యే స్థానాల్లో ఏదో ఒకటి ఆయనకు కట్టబెట్టేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉండి అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా ఇప్పటికే రామరాజును ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయనను తప్పించి ఉండి సీటును రఘురామకి ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో నర్సాపురం ఎంపీ స్థానాన్ని రఘురామకు ఇవ్వడం కోసం దాన్ని బీజేపీ నుంచి తీసుకునేందుకు ప్రతిపాదన పెట్టారు. నర్సాపురం ఎంపీ సీటును తమకు ఇస్తే దాని బదులు ఉండి ఎమ్మెల్యే సీటును బీజేపీకి ఇస్తామని, నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా ఉన్న శ్రీనివాసవర్మను ఉండిలో నిలబెట్టాలని ప్రతిపాదించారు. లేనిపక్షంలో ఏలూరు ఎంపీ సీటును బీజేపీకి ఇస్తామని, నర్సాపురం ఎంపీ సీటును తమకు ఇవ్వాలని కోరుతున్నారు. ఇదంతా తన అనుంగు బ్రోకర్ నేత రఘురామకృష్ణరాజు కోసమే కావడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ నేతలంతా ఆగ్రహంతో రగిలిపోతున్నారు. స్వార్థ రాజకీయాల కోసం సొంత పార్టీ నేతలను ఇబ్బంది పెట్టడం, రఘురామకృష్ణరాజుకు లబ్ధి చేకూర్చడం కోసం ఎంత మందినైనా బలి పెట్టేందుకు చంద్రబాబు సిద్ధమవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు దెందులూరు ఎమ్మెల్యే స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌ను తప్పించి దాన్ని కూడా బీజేపీకి ఇస్తారనే ప్రచారమూ జరుగుతోంది. అక్కడ బీజేపీ నేత గారపాటి చౌదరి టిక్కెట్ కోసం గట్టిగా పట్టుబడుతుండటం, బీజేపీ అధిష్టానం నుంచి ఆ దిశగా ఒత్తిడి పెంచడంతో దానికీ బాబు తలొగ్గుతున్నట్లు చెబుతున్నారు.

తన బినామీ కోరిక తీర్చడానికి

అనకాపల్లి జిల్లా మాడుగుల స్థానాన్ని చంద్రబాబు ఇప్పటికే ఎన్ఆర్ఐ పైలా ప్రసాద్‌కు కేటాయించారు. అయితే, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి, తన బినామీ సీఎం రమేష్ మాడుగుల నుంచి ప్రసాద్‌ను తప్పించి, ఆ స్థానాన్ని బండారు సత్యనారాయణ మూర్తికి ఇవ్వాలని కోరారు. ఇందుకు కూడా చంద్రబాబు సిద్ధపడ్డారు. అక్కడ పైలా ప్రసాద్‌ను తప్పించి బండారుకు టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి సీటును బీజేపీ నుంచి వెనక్కి తీసుకునేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. చింతలపూడి, తిరువూరు, సత్యవేడు స్థానాల్లోనూ అభ్యర్థులను మార్చి, కొత్తవారిని పెట్టాలని ఆలోచిస్తున్నారు. మరికొన్ని స్థానాల్లోనూ అభ్యర్థుల మార్పు ఉంటుందని సంకేతాలు ఇస్తున్నారు. అయితే, ఈ స్థానాలన్నింటిపైనా ఇప్పటికీ చంద్రబాబు నిర్ణయం తీసుకోలేకపోతుండటంతో క్యాడర్‌లో అయోమయం నెలకొంది.

బ్రాహ్మణ సంక్షేమంలో జగన్‌ది చెదరని సంతకం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

తిరుపతి కల్చరల్: బ్రాహ్మణ సంక్షేమంలో సీఎం జగన్‌ది చెదరని సంతకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. మంగళవారం తిరుపతిలో ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పథకాల అమలుకు ఐదేళ్లలో రూ.216.57 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.780.94 కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. బాబు హయాంలో 50,000 మంది బ్రాహ్మణులకు లబ్ధి చేకూరితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1.31 లక్షల మంది బ్రాహ్మణ కుటుంబాలకు కార్పొరేషన్ ద్వారా పలు పథకాలలో లబ్ధి చేకూరిందని వివరించారు. బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రూ.100 కోట్ల రుణాలు అందించి బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ చేయూతనిచ్చారని చెప్పారు. టీడీపీ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని ఆరోపించారు.


1 ఆదిత్య శ్రీవాస్తవ


2 అనిమేశ్ ప్రధాన్


3 దోనూరు అనన్య రెడ్డి

సివిల్స్ టాపర్ ఆదిత్య

- అనిమేశ్ ప్రధాన్‌కు రెండో ర్యాంకు
- తెలుగమ్మాయి దోనూరు అనన్యరెడ్డికి మూడో ర్యాంకు
- సివిల్స్-2023 ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023 తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం ప్రకటించింది. అఖిలభారత స్థాయిలో తొలి ర్యాంకును ఆదిత్య శ్రీవాస్తవ, రెండో ర్యాంకును అనిమేశ్ ప్రధాన్ సొంతం చేసుకున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దోనూరు అనన్యరెడ్డి ఆలిండియా మూడో ర్యాంకు దక్కించుకోవడం విశేషం. నాలుగు ర్యాంకు పి.కె.సిద్ధార్థ్ రామ్‌కుమార్‌కు, ఐదో ర్యాంకు రుహానీకి లభించింది. అఖిలభారత సర్వీసులకు మొత్తం 1,016 మంది ఎంపికయ్యారు. వీరిలో 664 మంది పురుషులు, 352 మంది మహిళలు ఉన్నారు. టాప్-5 ర్యాంకర్లలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు.. టాప్-25 ర్యాంకర్లలో 15 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో 30 మంది దివ్యాంగులు ఉన్నట్లు యూపీఎస్సీ వెల్లడించింది.

సివిల్స్-2023కి 10.16 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 5.92 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 14,624 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరిలో 2,855 మంది పర్సనాలిటీ టెస్టు(ఇంటర్వ్యూ)కు అర్హత సాధించారు. చివరకు 1,016 మందిని కేంద్ర సర్వీసులకు యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఇందులో జనరల్ కేటగిరీ అభ్యర్థులు 347 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 115 మంది, ఓబీసీలు 303 మంది, ఎస్సీలు 165 మంది, ఎస్టీలు 86 మంది ఉన్నారు. సివిల్స్-2023 ఫలితాల పూర్తి వివరాలను http:// www.upsc.gov. in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

టాప్-10 ర్యాంకర్లు

1	ఆదిత్య శ్రీవాస్తవ
2	అనిమేశ్ ప్రధాన్
3	దోనూరు అనన్యరెడ్డి
4	పి.కె.సిద్ధార్థ్ రామ్‌కుమార్
5	రుహానీ
6	సృష్టి దబాస్
7	అన్మోల్ రాథోడ్
8	ఆశిష్ కుమార్
9	నౌషీన్
10	ఐశ్వర్యం ప్రజాపతి

విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు

సివిల్ సర్వీసెస్ పరీక్షలో నెగ్గి, కేంద్ర సర్వీసులకు ఎంపికైన విజేతలకు ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. వారి అంకితభావం, శ్రమకు తగిన ప్రతిఫలం లభించిందని పేర్కొన్నారు. విజేత కృషి, ప్రతిభ దేశ భవిష్యత్తుకు తోడ్పడుతుందని వివరించారు.

మెరిసిన ఐఐటీ గ్రాడ్యుయేట్

సివిల్స్ తొలి ర్యాంకర్ ఆదిత్య శ్రీనివాస్తవ మెయిన్స్‌లో తన ఆప్షనల్‌గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నారు. ఆయన ఐఐటీ-కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్(బీటెక్) పూర్తిచేశారు.

రెండో ర్యాంకర్ అనిమేశ్ ప్రధాన్ ఐఐటీ-రూర్కెలాలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ అభ్యసించారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆప్షనల్‌గా సోషియాలజీని ఎంచుకున్నారు.

తెలుగు యువతి, సివిల్స్ మూడో ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డి ఢిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్(ఆనర్స్) జాగ్రఫీ చదివారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆమె ఆప్షనల్ సబ్జెక్టు ఆంత్రోపాలజీ.

చెమటోడ్చాల్సిందే!

12 కీలక రాష్ట్రాల్లో పేలవంగా కాంగ్రెస్ పరిస్థితి

- 247 సీట్లకుగాను 232 చోట్ల పార్టీ ఓటమి
- ఈ రాష్ట్రాల్లో 93 శాతం సీట్లు సాధించిన ఎన్డీఏ కూటమి
- ఢిల్లీ, గుజరాత్, రాజస్తాన్, హరియాణా, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ఖాతా తెరవక హస్తం డీలా

లోక్‌సభ ఎన్నికల రణక్షేత్రంలో బీజేపీతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైన కాంగ్రెస్, తన కూటమి పక్షాలకు క్షేత్రస్థాయి పరిస్థితులు, గత ఎన్నికల ఫలితాలు నీడలా వెంటాడుతున్నాయి. అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి పరాభవాన్ని ఎదుర్కొంది. 247 స్థానాలున్న 12 రాష్ట్రాల్లో కేవలం ఏడు శాతం ఓట్లనే ఒడిసిపట్టగలిగింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాల్లో మళ్లీ పూర్వవైభవాన్ని సాధించడం కాంగ్రెస్‌కు తలకు మించిన భారంలా తయారైంది. ఇక్కడ సీట్లు పెంచుకుంటే కానీ అధికారం దక్కే అవకాశం లేకపోవడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కాళ్లకు బలపం కట్టుకుని మరీ విస్తృతస్థాయి ప్రచారం చేస్తున్నారు.

బీజేపీ హవాకు బ్రేకులు వేయాల్సిందే

2019 ఎన్నికల్లో కీలక రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్తాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాల హవా కొనసాగింది. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల చాణక్యం పనిచేయడంతో గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, హరియాణా, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ ఒంటరిగానే క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తంగా ఈ 12 రాష్ట్రాల పరిధిలో 247 లోక్‌సభ స్థానాలుండగా, బీజేపీ, దాని మిత్రపక్షాలు 232 చోట్ల విజయపతాక ఎగరేశాయి. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు అంతా కలిసి కేవలం 15 చోట్ల గెలుపు అందుకున్నాయి. ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో తన సత్తా చూపేందుకు కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తోంది. అయితే ఇటీవలే ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో ఘోర ఓటమి నేపథ్యంలో అక్కడ కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితులే కనిపిస్తున్నాయి. 29 స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం ఒకే స్థానంలో గెలిచింది. ఇటీవలి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 సీట్లలోగాను బీజేపీ 164 సీట్లను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 65 స్థానాలకే పరిమితం కావడం ఆ పార్టీకి చిక్కులు తేనుంది. రాజస్థాన్‌లో పాతిక సీట్లుంటే హస్తం పార్టీ కనీసం ఒక్క చోట కూడా గెలవలేదు. తాజాగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లకుగాను 69 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోవడంతో కాంగ్రెస్‌కు కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి. గత ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకుగాను కాంగ్రెస్ కేవలం 2 చోట్ల గెలిచింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటమి పార్టీని తీవ్రంగా కలవరపెడుతోంది. బీజేపీని ఎదుర్కొనేందుకు ఇప్పటికే 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డ విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, పరస్పర సహకారంతో ముందుకెళ్తే తప్ప కేంద్రంలో అధికార పీఠం దక్కదు. అందుకే ఈ రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలను సాధించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక 16 పర్యటనలు చేశారు. రాజస్థాన్‌లో 14 చోట్ల సుడిగాలి పర్యటనలు చేసి సభల్లో పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.

ఎలక్షణీయం

చేజారుతున్న నేతలతో కొత్త తలనొప్పులు

గుజరాత్‌లో బీజేపీని ఎదిరించడం కాంగ్రెస్‌కు సాధ్యమయ్యేలా లేదు. మోదీ సొంత రాష్ట్రంలో 26 ఎంపీ స్థానాలకుగాను కనీసం ఐదు స్థానాలైన గెల్చుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా శ్రమిస్తున్నా, అక్కడ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటం పార్టీని ఇబ్బందికరంగా మారింది. బిహార్‌లో తమ కూటమి నుంచి జేడీయూ నేత నితీశ్ కుమార్ వైదొలగడంతో కాంగ్రెస్ కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక్కడ ఆర్‌జేడీతో పొత్తుతో ముందుకెళుతున్నా కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయి పరిస్థితులు అంత అనుకూలంగా లేవనే వార్తలు వినవస్తున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సిద్ధార్థ్ సౌరవ్, మురారీ గౌతమ్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఇదే దారిలో ఉన్నట్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బిహార్ మాజీ అధ్యక్షుడు అనిల్‌శర్మ ఇటీవలే కమలదళంలో చేరిపోయారు. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), శరద్‌పవార్ ఎన్సీపీలతో కలిసి కాంగ్రెస్ బరిలోకి దిగింది. మహారాష్ట్రలోని 41 స్థానాల్లో ఇండియా కూటమి 10 స్థానాలకు మించి తమ ఖాతాలో వేసుకోవడం అసాధ్యంగా తోస్తోంది. చీలిక తెచ్చి పార్టీని అజిత్ పవార్ హస్తగతం చేసుకోవడం, శివసేన సైతం చీలికవర్గం నేత, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వశం కావడం, హిందూత్వ భావజాలం రాష్ట్రంలో తీవ్రం కావడం, అశోక్ చవాన్, మిలింద్ దేవ్‌రా, బాబా సిద్ధిఖీ వంటి సీనియర్లు పార్టీని వీడటం వంటి పరిణామాలు కాంగ్రెస్‌కు కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. హరియాణాలో మాజీ మంత్రి సావిత్రి జిందాల్ రాజీనామా, మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్‌తో పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్ కుమ్ములాటలు పార్టీకి కొత్త ఎన్నికల పరీక్ష పెడుతున్నాయి. ఢిల్లీలో 7 స్థానాలకుగాను ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు కారణంగా కేవలం 3 సీట్లకే కాంగ్రెస్ పరిమితం అయింది.

-సాక్షి, న్యూఢిల్లీ

12 రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపోటములు

రాష్ట్రం	స్థానాలు	గెలిచినవి	ఓడినవి
ఢిల్లీ	7	7	0
ఉత్తరాఖండ్	5	5	0
హిమాచల్	4	4	0
గుజరాత్	26	26	0
రాజస్తాన్	25	25	0
జార్ఖండ్	14	12	2
ఛత్తీస్‌గఢ్	11	9	2
మహారాష్ట్ర	48	41	7
బిహార్	40	39	1
మధ్యప్రదేశ్	29	28	1
కర్ణాటక	28	26	2
హరియాణా	10	10	0



ఎన్నికల విచిత్రం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీకి మహిళా కళాకారులు నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె వారితో అడుగులు కలిపారు. అస్సాంలోని జోర్హాట్ జిల్లాలో మంగళవారం ఈ సన్నివేశం చోటుచేసుకుంది.

ఎలక్షన్ బీట్

సుర్జేవాలాపై 48 గంటల ప్రచార నిషేధం

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ హేమమాలిని ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలాపై ఎన్నికల కమిషన్(ఈసీ) చర్యలు ప్రకటించింది. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలు మొదలుకొని 48 గంటలపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఆయనపై నిషేధం విధించింది. లోక్‌సభ ఎన్నికల మొదటి విడత ప్రచార సమయంలో ఈసీ విధించిన మొదటి నిషేధమిది. హేమమాలినిపై చేసిన వ్యాఖ్యల ఆరోపణలపై ఈసీ గత మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేయగా, అది బీజేపీ సృష్టించిన వీడియో అంటూ సుర్జేవాలా బదులిచ్చారు. హరియాణా రాష్ట్రం కైతాల్ జిల్లా రిటర్నింగ్ అధికారి మాత్రం.. సుర్జేవాలా వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియో వాస్తవమేనని ఈసీకి నివేదిక అందజేశారు.

నెల రోజుల్లో ఈసీకి 200 ఫిర్యాదులు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి నెల రోజుల వ్యవధిలో వివిధ రాజకీయ పార్టీలు, నేతలపై 200 వరకు ఫిర్యాదులు అందినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇందులో 169 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. బీజేపీపై అందిన 51కి గాను 38 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని తెలిపింది. కాంగ్రెస్‌పై వచ్చిన 59 ఫిర్యాదులకుగాను 51, ఇతర పార్టీలపై వచ్చిన 90 ఫిర్యాదులకుగాను 80పై చర్యలు తీసుకున్నామని వివరించింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 15 వరకు నెల రోజుల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను పాటించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే పలు పార్టీల అభ్యర్థుల ప్రచారం తీరు అస్తవ్యస్తంగా ఉందని అభిప్రాయపడింది.

మంత్రికి బదులు ఆయన భార్యకు టికెట్

మరో ఏడు పేర్లతో బీజేపీ జాబితా

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకుగాను మంగళవారం బీజేపీ మరో ఏడుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇందులో మహారాష్ట్రలోని సతారా సీటుకు మరాఠా రాజు ఛత్రపతి శివాజీ వారసుడు ఉదయన్ రాజె భోసలేకు టికెట్ కేటాయించింది. పంజాబ్‌లోని హోషియార్ స్థానంలో కేంద్రమంత్రి సోమ్ ప్రకాశ్‌కు మొండిచేయి చూపింది. మంత్రి స్థానంలో ఆయన భార్య అనితా సోమ్ ప్రకాశ్‌కు అవకాశమిచ్చింది. పంజాబ్‌లోని భటిండాలో మాజీ ఐఏఎస్ అధికారిణి పరంపల్ కౌర్ సిద్ధును, బెంగాల్‌లోని డైమండ్ హార్బర్ నుంచి అభిజిత్ దాస్‌ను బీజేపీ రంగంలోకి దించింది. తాజా జాబితా కలిపితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 543 సీట్లకుగాను 430 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

మోదీ సభల్లో నితీశ్ ఎక్కడ?: తేజస్వీ

పట్నా: బిహార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన రెండు బహిరంగ సభలకు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎందుకు హాజరు కాలేదని ఆర్జేడీ అగ్రనేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మంగళవారం ప్రశ్నించారు. నితీశ్ ఎక్కడున్నారు? ఆయనను బీజేపీ ఎందుకు ఆహ్వానించలేదు? నితీశ్‌పై ఇప్పటికీ నాకు గౌరవం ఉంది. నితీశ్ నేతృత్వంలోని జేడీ(యూ) బీజేపీ మిత్రపక్షంగా కొనసాగుతోంది. అయినప్పటికీ మోదీ సభలకు ఆయన హాజరుకాకపోవడం వెనుక కారణం ఏమిటో బయటపెట్టాలి? అని తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు.

కశ్మీర్‌ను జైలుగా మార్చారు: మెహబూబా

పుల్వామా: జమ్మూ కశ్మీర్‌ను జైలుగా మార్చేశారని, యువతను క్రమంగా అరెస్టు చేస్తున్నారని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆమె మంగళవారం అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి రోడ్‌షోలో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో నిర్బంధం అమలవుతోందని, ఎవరినీ గొంతెత్తనివ్వడం లేదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో అంతా సవ్యంగానే ఉందని కేంద్రం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. అంతా సవ్యంగా ఉంటే వందలాది మందిని ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలన్నారు.

స్టార్ క్యాంపెయినర్లుగా కేజ్రీవాల్ దంపతులు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకుగాను ఆప్ మంగళవారం గుజరాత్ కోసం విడుదల చేసిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తోపాటు ఆయన భార్య సునీత తదితర 40 మంది నేతల పేర్లు ఉన్నాయి. మద్యం కుంభకోణం కేసులోనే జైలులో ఉన్న ఆప్ నేతలైన మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లతోపాటు పంజాబ్ సీఎం మాన్, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లు కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. అయితే, రాజ్యసభ ఎంపీలు హర్భజన్‌సింగ్, స్వాతి మలివాల్‌లకు ఇందులో చోటు దక్కలేదు.

విజయపతాక ఎగరేయాలి

ఆ తర్వాతే ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రకటిస్తాం

- వచ్చే ఐదేళ్ల పాలనపై మోదీ ఏర్పాట్లు ఆయన అతివిశ్వాసానికి పరాకాష్ట
- పీటీఐ ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడిన ఖర్గే

ఇంటర్వ్యూ

బెంగళూరు: వచ్చే ఐదేళ్ల భారతావని దశ, దిశను నిర్దేశించే ఎన్నికల రణరంగంలో విజయబావుటాను ఎగరేశాకే ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థి ఎవరనేది వెల్లడిస్తామని కాంగ్రెస్ సారథి మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మంగళవారం పీటీఐతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. '' గెలిచాక వచ్చే ఐదేళ్లలో చేపట్టాల్సిన పథకాలు, పనుల పట్టికలను ముందుగానే సిద్ధంచేసుకుంటున్నట్లు ప్రధాని మోదీ చెబుతున్నారు. అన్ని మంత్రిత్వ శాఖల కార్యదర్శులను పిలిపించి పనులు పురమాయిస్తున్నారు. గెలవకముందే ఆయన చేస్తున్న హడావిడి అంతాఇంతా కాదు. ఈయన అత్యుత్సాహం, అతి ఆత్మవిశ్వాసం భారత్ లాంటి ప్రజాస్వామ్యదేశానికి ఏమాత్రం మంచిదికాదు'' అని వ్యాఖ్యానించారు. '' కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయాలు లోక్‌సభ ఎన్నికల్లో సానుకూల పవనాలు వీచేలా చేస్తున్నాయి. ఇది నిజంగా శుభపరిణామం. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో ధరవరలను కిందకు దించేలా మేం తెచ్చిన పలు పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను జనం మెచ్చారు. మా గ్యారెంటీ స్కీమ్‌లు ఇదే విషయాన్ని నిరూపించాయి కూడా. అందుకే మా గ్యారెంటీ పథకాలపై ఓటర్లు దృష్టిపెట్టారు'' అని అన్నారు. ఈసారి ఎన్డీఏ కూటమి 400 చోట్ల విజయం సాధిస్తుందని మోదీ ముందే ప్రకటించిన విషయాన్ని ఖర్గే వద్ద ప్రస్తావించగా.. '' ఇంకా నయం. ఆయన ఈసారి 600 సీట్లు మావే అనలేదు. ఇంతటి అతి అత్యాశతో చేసే వ్యాఖ్యానాలు వింటుంటే దేశంలో విపక్షమే లేదు.. అంతా నేనే అన్నట్లుగా ఉంది మోదీ వైఖరి'' అని ఖర్గే అసహనం వ్యక్తంచేశారు.

ఆనాడూ వెలిగిపోతుందన్నారు

'' 2004లోనూ ఇదే సీన్ కనిపించింది. భారత్ వెలిగిపోతోంది(ఇండియా ఈజ్ షైనింగ్) అంటూ దేశవ్యాప్తంగా భారీ ప్రకటనలు, నినాదాలతో నాటి బీజేపీ సర్కార్ మోతెక్కించింది. వాజ్‌పేయీ మాత్రమే ప్రధాని పదవికి అర్హుడు అన్నట్లు ప్రచారం చేశారు. చివరకు ఏమైంది?. మన్మోహన్ సింగ్ సారథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలో మేం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాం. మన్మోహన్ మెరుగైన ప్రధానిగా నిరూపించుకున్నారు'' అని చెప్పారు.

అమేథీ, రాయ్‌బరేలీకి టైం ఉంది

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల నుంచి ఈసారి ఎవరు పోటీ చేస్తారన్న ప్రశ్నకు సమాధానంగా.. ' ఆ స్థానాల్లో పోలింగ్ తర్వాతి ఫేజ్‌లలో ఉందిగా. ఇంకా సమయం ఉంది. ఇప్పుడే చెప్పేస్తే రాజకీయ సర్‌ప్రైజ్ ఏముంటుంది?. ఫీడ్‌బ్యాక్ తీసుకుని అక్కడ అభ్యర్థులు ఎవరు అనేది తర్వాత వెల్లడిస్తాం. అందరి సమ్మతితోనే కాంగ్రెస్‌లో నిర్ణయాలు ఉంటాయి. మోదీలాగా అందరి తరఫున ఇక్కడ ఒక్కరే నిర్ణయాలు తీసుకోరు'' అని అన్నారు. '' ఎలక్టోరల్ బాండ్ల పథకంలో పారదర్శకత లోపించింది. ఒక్క బీజేపీనే భారీగా లాభపడింది. పారిశ్రామికవేత్తలు, సంస్థలను లొంగదీసుకునేందుకు దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపారు. ' చందా ఇచ్చుకో. దందా పుచ్చుకో' అన్న సూత్రం పాటించారు. చేతులు వెనక్కి మెలిపెట్టి మరీ డబ్బులు తీసుకుని ఇప్పుడు పారదర్శకత ఉంది అంటే ఎలా?'' అని ప్రశ్నించారు.



తుక్డే తుక్డే గ్యాంగ్‌కు సుల్తాన్ మోదీనే

''కుల, మత, ప్రాంత, వర్ణ ప్రాతిపదికన దేశ ప్రజలను మోదీ విభజిస్తున్నారు. నిజానికి తుక్డే తుక్డే గ్యాంగ్‌కు సుల్తాన్ మోదీనే. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన ఒక్క బీజేపీ నేతనైనా చూపించండి. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలో ఒక్కరైనా దేశం కోసం పోరాడారా?' అని ఖర్గే ఎద్దేవాచేశారు.


సమాలోచనలతోనే సారథి ఎంపిక

''ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ వచ్చాక విపక్షాల 'ఇండియా' కూటమిలో చర్చలు జరిపి ఏకాభిప్రాయంతో ప్రధాని అభ్యర్థి ఎవరనేది ప్రకటిస్తాం. ఈసారి నేను పోటీ చేయట్లేదు. గుల్బర్గా(కలబురిగి) సీటు వేరే వాళ్లకు ఇచ్చేశారు' అని తాను ప్రధాని రేసులో లేనని పరోక్షంగా చెప్పారు. గుల్బర్గా(కలబురిగి) నుంచి ఈసారి ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి పోటీచేస్తున్నారు. 2009 నుంచి 2014 వరకు ఖర్గే ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచారు.

దోపిడీకి మరో రూపం

ఎలక్టోరల్ బాండ్ల మాటున మోదీ దోచేశారు: రాహుల్

కోజికోడ్/వయనాడ్: ప్రధాని మోదీ చేసే దోపిడీకి మరో రూపమే ఎలక్టోరల్ బాండ్లు అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కొడియత్తూర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచార రోడ్‌షోలో రాహుల్ ప్రసంగించారు. '' పట్టణాలు, పల్లెల్లో కొందరు వీధుల్లో భయపెట్టి దోపిడీ చేస్తుంటారు. కేరళలో అయితే దీనిని కొల్ల అడిక్కల్(లూటీ) అంటారు. ఈ పద్ధతిని మోదీ అయితే ఎలక్టోరల్ బాండ్లు అంటారు. మామూలు దొంగ వీధుల్లో చేసే పనినే మోదీ అంతర్జాతీయ స్థాయిలో చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు కొందరు వ్యాపారవేత్తలనే లక్ష్యంగా చేసుకుని రంగంలోకి దిగుతారు. వారిని లోతుగా విచారిస్తారు. చివరకు మీ వ్యాపారాన్ని అదానీకి ఇచ్చేస్తే బాగుంటుందిగా అంటూ పని ముగిస్తారు'' అంటూ ముంబై ఎయిర్‌పోర్ట్ యాజమాన్య హక్కులు అదానీకి ఇలాగే బదిలీ అయ్యాయని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరిన ఇంకొందరు వ్యాపారవేత్తలు బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో చెల్లింపులు జరిపి సమస్య నుంచి బయటపడతారని రాహుల్ ఆరోపణలు గుప్పించారు. '' దేశంలో ఉపద్రవం ఎదురైనపుడు వెంటనే ఎలా ఎదుర్కోవాలో మోదీకి తెలీదు. కోవిడ్ సంక్షోభం వేళ వంటపాత్రలు మోగించాలని, ఫోన్ టార్చ్‌లు ఆన్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు'' అని ఎద్దేవాచేశారు.



రాజ్యాంగ సవరణే అతిపెద్ద అంశం

''పాతిక మంది సంపన్నుల రూ.16 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను మోదీ మాఫీచేశారు. రైతు సమస్యలు, నిరుద్యోగం, పెరిగిన ధరలపై ఆయన అస్సలు మాట్లాడరు. గెలిస్తే రాజ్యాంగాన్ని సవరించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే అతిపెద్ద అంశం'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

నాపేరు కేజ్రీవాల్.. నేను ఉగ్రవాదిని కాను

తీహార్ జైలు నుంచి ఢిల్లీ సీఎం సందేశం

న్యూఢిల్లీ: 'నా పేరు అరవింద్ కేజ్రీవాల్..నేను ఉగ్రవాదిని కాను' అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి దేశ ప్రజలకు సందేశాన్ని పంపించినట్లు ఆప్ నేత సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌పై బురదచల్లి బీజేపీ దుష్ప్రచారం సాగిస్తోందని, కానీ ఆయన మరింత బలం పుంజుకుంటారని అన్నారు. మంగళవారం సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. జైల్లో కేజ్రీవాల్‌ను ఉగ్రవాదిలాగా చూస్తున్నారని సంజయ్ సింగ్ ఆరోపించారు. తీహార్ జైలులో ఉండే భయంకరమైన నేరగాడికి సైతం బ్యారక్‌లోనే భార్య, లాయర్‌తో మాట్లాడే అవకాశమిచ్చిన అధికారులు.. కేజ్రీవాల్‌కు మాత్రం పంజాబ్ సీఎం మాన్‌తో గ్లాస్ స్క్రీన్ అవతలి నుంచే మాట్లాడేందుకు అనుమతిచ్చారని ఆరోపించారు. తన పట్ల చూపిస్తున్న వివక్షతో విచారం వ్యక్తం చేసిన కేజ్రీవాల్.. నా పేరు కేజ్రీవాల్..నేను ఉగ్రవాదిని కాను' అంటూ దేశ ప్రజలకు సందేశం పంపించారని వెల్లడించారు. దీని ద్వారా కేజ్రీవాల్.. 2010లో షారుఖ్ ఖాన్ నటించిన మై నేమ్ ఈజ్ ఖాన్ సినిమాలోని డైలాగ్‌ను గుర్తుకు తెచ్చారు.


రాజ్యాంగానికి రుణపడి ఉన్నా..

- అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఈ స్థాయికొచ్చా: మోదీ
- బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాంలో ఎన్నికల ప్రచారం

పూర్ణియా/రాయ్‌గంజ్: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తాను ఎంతగానో రుణపడి ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన తాను రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. మోదీ మరోసారి ప్రధాని అయితే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మంగళవారం బిహార్, పశ్చిమ బెంగాల్‌లోని పలు పట్టణాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాలుపంచుకున్నారు. అస్సాంలోని గువాహటిలో రోడ్‌లో పాల్గొన్నారు. రాజ్యాంగం గురించి ఇప్పుడు మాట్లాడుతున్నవారు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నానని, తాను ఆ వర్గాల నుంచి రావడమే అందుకు కారణమని పేర్కొన్నారు.

సీఏఏను అమలు చేసి తీరుతాం...

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు తాము భయపడడం లేదని, చట్టాన్ని అమలు చేసి తీరుతామని అన్నారు. సీఏఏను వ్యతిరేకించేవారంతా మోదీ పట్టుదల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ప్రతిపక్షాలు ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా దేశంలోకి అక్రమ చొరబాట్లు చోటుచేసుకుంటున్నాయని, దీనివల్ల పేదలకు, దళితులకు అన్యాయం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని పెద్ద ఘనతగా మోదీ అభివర్ణించారు. రాజ్యాంగం అంటూ గగ్గోలు పెడుతున్న వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో ఎందుకు అమలు చేయలేదని మండిపడ్డారు.



బహిరంగ క్షమాపణ చెప్పండి

రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: కోవిడ్ సమయంలో అల్లోపతి, ఇతర ఆధునిక వైద్య విధానాలను కించపరుస్తూ ప్రకటనలు ఇచ్చిన ఉదంతంలో బాబా రాందేవ్, పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు మండిపడింది. '' అల్లోపతిని తక్కువచేసి మాట్లాడితే ఊరుకునేది లేదు. గతంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి మళ్లీ తప్పుడు, అసత్య ప్రకటనలు ఇచ్చి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారు. వారంలోపు పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ బహిరంగ క్షమాపణ చెప్పండి'' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహించింది. కోవిడ్‌వ్యాక్సినేషన్‌పై, ఆధునిక వైద్యవిధానాలపై అసత్య ప్రచారం చేస్తూ తప్పుడు ప్రకటనలు ఇచ్చారంటూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేసు వేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా స్వయంగా హాజరవ్వాలన్న కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రాందేవ్ బాబా, బాలకృష్ణ కోర్టుకొచ్చి బేషరతు క్షమాపణలు చెప్పారు. దీనిపై కోర్టు పై విధంగా స్పందించి బహిరంగ క్షమాపణ కోరింది.

ఇద్దరు నిందితుల అరెస్ట్

ముంబై: ముంబైలోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఆదివారం ఉదయం కాల్పులకు పాల్పడిన ఇద్దరు నిందితులను గుజరాత్ పోలీసులు పట్టుకున్నారు. వీరిపై ముంబై పోలీసులు హత్యాయత్నం కేసుతోపాటు ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులను మంగళవారం ఉదయం హెలికాప్టర్‌లో కచ్ నుంచి ముంబైకి తీసుకువచ్చి స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఘటనకు సూత్రధారులెవరో తేల్చేందుకు లోతైన దర్యాప్తు చేపట్టాల్సి ఉన్నందున 14 రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని కోరారు. అయితే, ఈ నెల 25వ తేదీ వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎల్ఎస్ పడెన్ ఆదేశాలిచ్చారు.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



స్లాస్ కేంద్రం పరిశీలన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పటమటలంక బీఎంసీ పాఠశాలలో స్లాస్(స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్‌సర్వే) కేంద్రాన్ని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు శ్రీనివాసరావు పరిశీలించారు.



పీహెచ్‌సీలో కేంద్ర బృందం

కంచికచర్ల: కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ బృందం పరిశీలించింది. పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేసింది.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ దేవినగర్‌కు చెందిన భక్తులు ఈమని శ్రీనివాస్, జ్యోతి మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు పుష్పార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు మంగళవారం తెల్ల చామంతి, సంపెంగ పూలతో అర్చన చేశారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న పుష్పార్చన మంగళవారంతో 8వ రోజుకు చేరుకుంది. తొలుత ఈవో కె.ఎస్.రామరావు, అర్చకులు, ఆలయ అధికారులు అమ్మవారి అర్చనకు వినియోగించే పుష్పాలతో ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు పుష్పాలను సమర్పించిన తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తికి విశేష పుష్పార్చన చేశారు. అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు. అర్చన చేసిన పుష్పాలను భక్తులకు అందజేశారు.

మర్యాదపూర్వక కలయిక



నందిగామ: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను నందిగామ నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని న్యాయమూర్తి చాంబర్‌లో కలిసిన న్యాయవాదులు నందిగామ పట్టణంలోని న్యాయస్థానాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన వారిలో నందిగామ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నండ్రు బాబు విద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఉపాధ్యక్షుడు కురగంటి కృష్ణంరాజు, సహాయ కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, ట్రెజరర్ రవికుమార్, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

డీఆర్ఎం ప్రత్యేక తనిఖీలు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ మంగళవారం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న రైల్ డాబా, క్యాటరింగ్ స్టాల్స్, ఐఆర్‌సీటీసీ ఫాస్ట్ ఫుడ్ స్టాల్స్, వాటర్ వెండింగ్ మిషన్లను తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వెండర్లు, ప్రయాణికులను అడిగి ఆహార పదార్థాల నాణ్యత, పంపిణీపై ఆరా తీశారు. స్టాల్స్, ప్లాట్‌ఫాంలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వేసవి కాలం కావడంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తాగునీటి సదుపాయాన్ని మరింతగా మెరుగుపర్చాలని సంబంధిత అధికారులు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం వి.రాంబాబు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ టోర్నీకి ఏర్పాట్లు పూర్తి



విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ ఫిడే చెస్ టోర్నీని విజయవాడలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని టోర్నీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే పోటీలకు శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్, అమెరికా, ఇండియా నుంచి 400 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను స్కూల్ ఆవరణలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ భారతితో కలిసి ఆవిష్కరించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 20వ తేదీ లోపు ఎంట్రీలు పంపొచ్చని సూచించారు. అంతర్జాతీయ ఆర్బిటర్ జి.వి.కుమార్ టోర్నీ చీఫ్ ఆర్బిటర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

ఫుల్ జోష్

- 'మేమంతా సిద్ధం'తో ఉమ్మడి కృష్ణా వైఎస్సార్ సీపీలో రెట్టించిన ఉత్సాహం
- కనకదుర్గ వారధి నుంచి గుడివాడ వరకు సీఎం జగన్‌పై వెల్లివిరిసిన ప్రజాభిమానం
- ప్రచారంలో దూసుకుపోతున్న అభ్యర్థులు
- కూటమికి ఓటమి భయాన్ని పరిచయం చేసి వెళ్లిన సీఎం జగన్
- సీఎం సమక్షంలో భారీగా చేరికలు



ఉమ్మడి కృష్ణా జిల్లాలో జరిగిన మేమంతా సిద్ధం బస్సుయాత్రలో జన సందోహం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో జోష్ పెంచింది. బస్సు యాత్ర సందర్భంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జన నీరాజనం పలికారు. యాత్ర సూపర్‌సక్సెస్ కావడంతో క్యాడర్‌లో ఆత్మవిశ్వాసం పెంచింది. పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. రెట్టించిన ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు పార్టీ శ్రేణులు ప్రచారంలో దూకుడు పెంచారు. కనకదుర్గమ్మ వారధి నుంచి గన్నవరం, హనుమాన్‌జంక్షన్ మీదుగా గుడివాడ వరకు ఉన్న రహదారులను సీఎం జగన్ జన సంద్రం చేశారు. విజయవాడ తూర్పు, సెంట్రల్, గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో చేపట్టిన బస్సు యాత్రకు స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలు జగన్‌పై వారికున్న అభిమానాన్ని చూపించారు. 'మళ్లీ నువ్వే సీఎం కావాలన్నా' అంటూ ఇచ్చిన నినాదాలు ఇరు జిల్లాల్లోని ఆ పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి.

నూతనోత్సాహం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఆ పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. 58 నెలల్లో ప్రభుత్వం చేసిన ప్రజా హిత పాలనను ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకున్నారనడానికి నిదర్శనం బస్సుయాత్ర సక్సెస్ కావడం, జగనన్నకు మద్దతు పలకడానికి, ఆయనకు ఎన్నికల్లో ఘన విజయం అందించాలనే తపనతో ప్రజలు తరలిరావడం. గుంటూరు జిల్లా నుంచి ఈ నెల 13న బస్సు యాత్ర జిల్లాలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి దాటుకుని విజయవాడ వస్తున్నారన్న వార్త సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ప్రజలు కనకదుర్గ వారధి వద్ద ఒక్కసారిగా పోటెత్తారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉండే వారధి కనీవినీ ఎరుగని రీతిలో జనంతో కిక్కిరిసింది. వారధి మీదుగానే జగన్ విజయవాడకు ఐదు నిమిషాల వ్యవధిలోనే వస్తారని తెలిసినా.. అభిమానతరంగాలు తాడేపల్లి వైపునకు వెళ్లి సీఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. వృద్ధులు, మహిళలు సైతం 'యాత్ర'లో అడుగులు కలిపారు. వారధి జన సంద్రం కావడాన్ని ప్రత్యక్షంగా చూసిన వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, కార్యకర్తల్లో అమితోత్సాహాన్ని తీసుకొచ్చింది.

కూటమిలో వణుకు

సీఎం జగన్ బస్సు యాత్ర కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులకు, ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటమి భయాన్ని పరిచయం చేసింది. యాత్రలో పాల్గొన్న జన సందోహాన్ని ప్రత్యక్షంగానూ, సామాజిక మాధ్యమాల ద్వారా చూసిన కూటమి అభ్యర్థుల్లో వణుకు మొదలైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లబ్ధి పొందిన ప్రజలు అత్యధికంగా ఉండటం.. వారంతా స్వచ్ఛందంగా బస్సు యాత్రలో పాల్గొనడంతో కూటమి అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ' ప్రజలకు ఏ మంచి చేస్తానని చెప్పానో.. అదే 58 నెలల పాలనతో చేసి చూపించా..' 'మళ్లీ అధికారం ఇవ్వండి.. ఇంత కన్నా మంచి చేస్తా..' అని గుడివాడ బహిరంగ సభలో జగన్ ఇచ్చిన వాగ్దానం ప్రజలను ఆకట్టుకుంది. ఇదే తరుణంలో ఏం చేస్తామో.. సక్రమంగా చెప్పలేని.., కేవలం అధికార పార్టీపై పసలేని విమర్శలతోనే కాలం నెట్టుకొస్తున్న చంద్రబాబు నాయుడు అసమర్థతపై కూటమి క్యాడర్‌లో చర్చ నడుస్తోంది. ఇలాగే జరిగితే రానున్న ఎన్నికల్లో.. గతంలో కంటే ఘోర పరాజయాన్ని చవి చూడాల్సి వస్తుందనే ఆలోచన వారి మెదళ్లను తొలుస్తోంది. నాయకుడంటే ప్రజలకు ఏం చేస్తామో చెప్పాలి.. అదే చేసి చూపించాలి.. అంతేకానీ ప్రత్యర్థులపై చేసే విమర్శలే రాజకీయం అనుకుంటూ బతికేయడం.. ఇదే విమర్శలను ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 తదితర మాధ్యమాల్లో చూస్తూ సంబర పడిపోతుంటే.. ప్రజా క్షేత్రంలో ఓటమి తథ్యమని కూటమి కార్యకర్తలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

• రారండోయ్ సీతారాముల కల్యాణం చూద్దాం



విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో సీతారాముల విగ్రహాలు (ఇన్‌సెట్) అపరభద్రాద్రిగా పేరుగాంచిన మోటూరు సీతారామ స్వామి దేవస్థానం

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధమైంది. శ్రీరామ నవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో రామాలయాలను కమిటీల ఆధ్వర్యాన విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. వీధుల్లో చలువ పందిళ్లను ఏర్పాటుచేశారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో ఏర్పాటు చేసిన సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి మూర్తుల విగ్రహాలు ముచ్చటగొలుపుతున్నాయి. నవమి వేడుకల సందర్భంగా జిల్లాలోని కూడళ్లు కళకళలాడుతూ కనిపించాయి.

– సాక్షి నెట్‌వర్క్

ఎన్నికల నిర్వహణకు
సర్వం సిద్ధం

- రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- జిల్లాలో ఇప్పటికే నియోజక వర్గాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల కేటాయింపు
- 650 మంది మైక్రో అబ్జర్వర్లు
- 866 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- మే 4 నుంచి 9 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగం



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ నెల18వ తేదీ గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించడానికి పార్లమెంటుకు సంబంధించి కలెక్టరేట్‌లో, అసెంబ్లీకి సంబంధించి నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ టీవీలు, వీడియోగ్రఫీ, పోలీస్ నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్లకు అభ్యర్థులకు ఇచ్చే ఫారాలు, ఓటర్ల జాబితాలు సిద్ధంగా ఉంచామన్నారు. నామినేషన్ కేంద్రంలోకి మూడు వాహనాలు, అభ్యర్థితో పాటు, నలుగురిని మాత్రమే అనుమతి ఇస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఈ నెల18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 21వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు స్వీకరించరు. 26న నామినేషన్ల పరిశీలన చేస్తారు. 29వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

ఇప్పటికే మొదటి విడతలో ఈ నెల 13, 14 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చాం. ఏప్రిల్ 27న పీఓ, ఏపీఓ, ఓపీఓలకు శిక్షణ ఇస్తున్నాం. మే 4, 6 తేదీల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తాం. 650 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించాం. వీరికి ఏప్రిల్ 28న శిక్షణ ఇస్తున్నాం. మొత్తం 1,792 పోలింగ్ కేంద్రాల్లో 864 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. ఇక్కడ సెంట్రల్, స్టేట్ ఆర్మ్‌డ్ పోలీసులను నియమిస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నాం. మొత్తం ఎన్నికల విధుల్లో 12,500 మంది సిబ్బందిని వినియోగిస్తున్నాం.

167 సెక్టార్లు.. 195 రూట్లు..

మే4 నుంచి 9తేదీ వరకు ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే అవకాశం కల్పిస్తున్నాం. దీనికి సంబంధించి పోలింగ్ కేంద్రాలను విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియం ఏర్పాటులో ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ ఓటు వేయాల్సి ఉంటుంది. బ్యాలెట్ పేపరు బయటికి తీసుకువచ్చి పోస్టులో పంపితే చెల్లదు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 45 శాతం అంగవైకల్యం కలిగిన విభిన్న ప్రతిభా వంతులకు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం మే 6, 7 తేదీల్లో కల్పిస్తున్నాం. ఈ నెల 12న ఆయా నియోజక వర్గ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఈవీఎంలు, మెటీరియల్ పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాటు చేశాం. జిల్లాను 167 సెక్టార్లు ,195 రూట్‌లుగా విభజించి ఆఫీసర్లను నియమించాం.

స్ట్రాంగ్ రూంల ఏర్పాటు...

జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామలో పోలింగ్ రోజు ఆయా నియోజక వర్గ కేంద్రాల్లో ఈవీఎంలను తీసుకుంటారు. అక్కడినుంచి మే14 ఉదయం ప్రత్యేక బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. విజయవాడలోని మూడు నియోజక వర్గాలు, మైలవరానికి సంబంధించిన ఈవీఎంలను, పోలింగ్ సామగ్రి అదే రోజు రాత్రి స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను నోవా ఇంజినీరింగ్, నిమ్రా మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్

జిల్లాలో 1781 పోలింగ్ కేంద్రాలున్నాయి. 1500 ఓటర్ల కంటే ఎక్కువగా ఉండటంతో విజయవాడ సెంట్రల్‌లో 10, విజయవాడ వెస్ట్‌లో 1 అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వీటితో కలిపి మొత్తం 1792 పోలింగ్ కేంద్రాలకు మొత్తం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు 13,236 ను ఇప్పటికే మొదటి దశ ఈవీఎం ర్యాండమైజేషన్‌లో అసెంబ్లీలకు కేటాయించారు. ఈవీఎంలు 120శాతం, వీవీప్యాట్‌లు130 శాతం ఇచ్చారు. రెండవ దశ ర్యాండమైజేషన్ మే1 తేదీన చేస్తున్నారు. ఇందులో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు అలాట్ చేస్తారు. ఈప్రక్రియ ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో జరుగుతుంది. మే 2, 3, 4 తేదీల్లో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగ్ కేంద్రాలకు పంపించే ముందు మాక్‌పోల్ చేస్తారు. ఈవీఎం కమిషనింగ్ చేస్తారు.

మేలిమి కానుక

- పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యాకానుక
- ఎన్టీఆర్ జిల్లాలో నాలుగేళ్లలో రూ.102కోట్లతో కానుక కిట్ల పంపిణీ



జి.కొండూరు ప్రాథమిక పాఠశాలలో విద్యాకానుక కింద విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, ఉపాధ్యాయులు(ఫైల్)

జి.కొండూరు: పేద పిల్లలు.. రేపటి పౌరులంటూ వారికి బంగరు భవితను అందించడానికి ఏపీలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో అనేక మార్పులు చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను అత్యాధునిక సాంకేతికతతో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులకు అవసరమైన విద్యోపకరణాలను సైతం నాణ్యతలో రాజీకి తావులేకుండా స్కూళ్ల ప్రారంభం రోజునే అందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యోపకరణాల పంపిణీని దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జగనన్న విద్యాకానుక పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేవలం టెక్స్ట్ బుక్స్‌ని మాత్రమే అందించి చేతులు దులుపుకొనే వారనే విమర్శలు ఉన్నాయి. అది కూడా పాఠశాలల ప్రారంభ సమయానికి అందేవి కావు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా పాఠశాలల ప్రారంభం రోజు నుంచే విద్యాకానుక కిట్‌ల పేరుతో విద్యార్థులకు అవసరమైన స్కూలు బ్యాగు, రెండు జతల సాక్సులు, 3 జతల యూనిఫాంలు, బెల్టు, నోట్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, ఒక జత బూట్లు, వర్క్‌బుక్స్‌ను అందజేస్తున్నారు. ఈ పథకం అమలుతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు విద్యార్థుల కళ్లలో ఆనందం, వారికి చదువు పట్ల ఇష్టం కలిగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించింది.

జిల్లాలో రూ.102 కోట్లతో..

ఎన్టీఆర్ జిల్లాలో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు విద్యా సంవత్సరాల్లో విద్యా కానుక పథకానికి రూ.102 కోట్లను ఖర్చు చేసింది. 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్య పాఠశాలల్లోని ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు 1,15,674 మందికి కిట్‌లను పంపిణీ చేశారు. ఒక్కొక్క కిట్ ధర రూ.3 వేలు. కానుక అమలు చేసిన మొదటి సంవత్సరంతో పోల్చుకుంటే కిట్‌ల ధర యాభై శాతం పెరిగినా నాణ్యతతో అనుకున్న సమయానికి ముందే పాఠశాలలకు చేర్చి పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో నాలుగేళ్లుగా పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుక వివరాలు

సంవత్సరం	విద్యార్థులు	విద్యాకానుక కిట్ ఖరీదు	మొత్తం ఖర్చు రూ.కోట్లలో
2020–21	1,29,203	1570	20.28 కోట్లు
2021–22	1,43,425	1640	23.52
2022–23	1,19,752	1964	23.51
2023–24	1,15,674	3000	34.70

అన్ని రకాలు వసతులు కల్పిస్తున్నారు



పాఠశాల ప్రారంభం రోజునే విద్యా కానుక ఇస్తున్నారు. గతంలో టెక్స్ట్ బుక్స్ మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు టెక్స్ట్ బుక్స్, వర్క్‌బుక్స్, డిక్షనరీలు, బ్యాగు, బెల్టు, బూట్లు, సాక్సులు, మూడు జతల యూనిఫాం ఇస్తున్నారు. ఎటువంటి లోటు లేకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు.

– ఎస్.ప్రేమలత, 8వ తరగతి, గంగినేని జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వ బడిలోనే చదువుకుంటాం



ప్రయివేటు స్కూళ్లకు పోతే ఫీజులు కట్టి అన్నీ మేమే కొనుక్కోవాలి. గవర్నమెంట్ బడిలో భోజనంతో పాటు చదువుకు అవసరమైనవి అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. అమ్మ ఒడి కింద డబ్బులు ఇస్తున్నారు. పదో తరగతి వరకు గవర్నమెంట్ బడిలోనే చదువుకుని మంచి మార్కులు సాధిస్తాను.

– ఎస్ రేవతి, ఏడో తరగతి, గంగినేని జెడ్పీ హైస్కూల్

మా బడి అందంగా తయారు చేశారు



మా బడిని చాలా అందంగా తయారు చేశారు. గవర్నమెంటు బడిలోనే చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటాను. – వాణి, ఐదో తరగతి, ప్రాథమిక పాఠశాల, గంగినేని

కార్తికేయుని సన్నిధిలో ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ, ఎండోమెంట్) ఆర్.కరికాల వలవన్ మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో బాలకృష్ణ శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వేద పండితులు ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ, మణిదీప్ శర్మ వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు, ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ప్రతి కార్డుదారునికి నిత్యావసర సరుకులు అందించాలి

- 17వ తేదీ మధ్యాహ్నం సచివాలయాల వద్ద రేషన్ పంపిణీ
- జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి కార్డుదారునికి నిత్యావసర సరుకులను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా 17వ తేదీ మధ్యాహ్నం వరకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులు కొంతమంది వినియోగదారులు పొందలేకపోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం నుంచి సంబంధిత గ్రామ వార్డు సచివాలయాల వద్ద మిగిలిన కార్డుదారులకు సమాచారం ఇచ్చి నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను అందిస్తున్న ఆపరేటర్లు వారికి నిర్దేశించిన ప్రాంతాలలోని వార్డు సచివాలయాల వద్ద వాహనాల ద్వారా ఆయా ప్రాంతాలలోని కార్డుదారులకు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని రైస్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని రేషన్ పంపిణీ వాహనాల ఆపరేటర్లు నిత్యావసర సరుకుల పంపిణీని బుధవారం మధ్యాహ్నం వరకు కార్డుదారుల ఇంటి వద్దకు, మధ్యాహ్నం నుంచి గ్రామ/వార్డు సచివాలయాల వద్ద మిగిలిన కార్డుదారులకు సమాచారము అందించి పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా స్లాస్ పరీక్ష



ఈడుపుగల్లులోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

కంకిపాడు: స్లాస్ పరీక్ష పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు. విద్యాశాఖ ఆదేశాలతో స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. నాలుగో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 142 పాఠశాలల్లో స్లాస్ పరీక్ష నిర్వహించారు. 4,162 మంది విద్యార్థులకు గానూ 3,980 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హాజరు శాతం 95.63 శాతంగా ఉంది. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని డీఈఓ తాహెరా సుల్తానా పరిశీలించి, పరీక్ష నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో డైట్ సీనియర్ లెక్చరర్ లలితా మోహన్, ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



కొట్టె సునీల్(ఫైల్)

దబ్బాకుపల్లి(వత్సవాయి): మండలంలోని దబ్బాకుపల్లి గ్రామంలో మంగళవారం ఓ యువకుడు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రధానసెంటర్‌లో నిర్మాణంలో ఉన్న మేరీమాత విగ్రహం వద్ద రంగులు వేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొట్టె సునీల్(28) ఇనుప నిచ్చెనను తీసి పక్కకు వేసేందుకు ప్రయత్నించాడు. నిచ్చెనను పైకి లేపే సమయంలో పైన కరెంట్ తీగలు ఉండడాన్ని సునీల్ గమనించలేకపోయాడు. నిచ్చెన పైకి లేపడంతో అది కరెంట్ తీగలను తాకింది. దీంతో సునీల్ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మరణించాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సునీల్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను వైద్యశాలకు వెళ్లి నివాళులర్పించారు. సునీల్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

నామినేషన్, అఫిడవిట్ సమర్పణలో జాగ్రత్త!

- ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో విజయవాడ లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న సాధారణ ఎన్నికలకు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరగనుందని, నామినేషన్, అఫిడవిట్ల సమర్పణలో అభ్యర్థులు జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. లోక్‌సభ స్థానానికి సంబంధించిన ఫారం 2ఏ నామినేషన్ పేపర్, శాసనసభ స్థానానికి సంబంధించిన ఫారం 2బీ నామినేషన్ పేపర్‌లోని ప్రతి భాగం గురించి క్షుణ్ణంగా వివరించారు. పేరు రాయడంలోనూ, ఫొటోల సమర్పణ విషయంలో సూచనలు చేశారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా ఆర్వోల కార్యాలయాల్లోనూ, పార్లమెంటు స్థానానికి సంబంధించి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. అభ్యర్థితో కలుపుకొని మొత్తం అయిదుగురికి మాత్రమే ఆర్వో చాంబర్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. ఈ నెల 26న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉంటుందన్నారు. ఆ తర్వాత పోటీలో నిలిచిన అభ్యర్థులను ఫారం -7ఏ ద్వారా ప్రకటించనున్నట్లు వివరించారు. జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీలు, ఇతరులను పరిగణనలోకి తీసుకుని తెలుగు అక్షర క్రమంతో బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి రూ. 25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారైతే 50 శాతం మేర సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

అఫిడవిట్ (ఫారం 26) చాలా కీలకం

సరైన విధంగా నామినేషన్ పత్రాలు సమర్పించడంతో పాటు ఫారం 26 అఫిడవిట్ కూడా చాలా కీలకమని, దీని సమర్పణలో జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. పాన్ వివరాలు, ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు స్థితి, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, నేరారోపణ కేసులు, చర, స్థిరాస్తుల తదితర వివరాలను పొందుపరచాల్సి ఉంటుందని తెలిపారు. లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభకు పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు వ్యయం చేసేందుకు అనుమతి ఉందన్నారు. నామినేషన్ దగ్గర నుంచి వ్యయ నమోదు జరుగుతుందని వివరించారు. అభ్యర్థి నిర్వహించాల్సిన రోజువారీ ఖాతాలు, నగదు రిజిస్టర్, బ్యాంకు లావాదేవీల రిజిస్టర్‌ను నామినేషన్ సమయంలో అభ్యర్థికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి మే 11 వరకు మూడు సందర్భాల్లో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రముఖ వార్తా పత్రికలు, చానల్స్‌లో క్రిమినల్ యాంటిసిడెంట్స్‌ను పబ్లిష్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎన్నికల వ్యయ నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ , రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు .

యార్డులో 88,620 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 68,903 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,620 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,678 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైన దశ నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభం కానుందని, ఈ దశను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మంగళవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయ వీసీ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు హాజరయ్యారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రోజువారీ నివేదికల పంపిణీ, ఎపిక్ కార్డుల జనరేషన్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) తదితర అంశాలపై సీఈవో ముకేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ తర్వాత స్క్రూటినీ తదితర కార్యకలాపాలను సజావుగా నిర్వహించేందుకు ఆర్వోల స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా వివిధ మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, నివేదిక నిర్వహణ వ్యవస్థలను సమర్థంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను కూడా పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సమన్వయంతో వ్యవహరిస్తున్నట్లు వివరించారు. జిల్లా స్థాయి గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు సీజర్ కేసులను పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. వీసీ అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీ శంకర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిన చిట్ ఫండ్స్ కంపెనీ

- కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఓ ఉపాధ్యాయుడి ఘరానా మోసం
- రూ.15 కోట్లకు కుచ్చు టోపీ
- బాధితులంతా ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులే
- కుటుంబంతో సహా పరారైన చిట్‌ఫండ్ వ్యాపారి



హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ జనార్దన్‌కు ఫిర్యాదు అందిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీ బాధితులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు ఘరానా మోసానికి పాల్పడ్డాడు. చీటీల పేరుతో రూ.15 కోట్లకు కుచ్చు టోపీ పెట్టాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక విజయవాడ రోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ పేరుతో తురకా పుల్లయ్య అనే విశ్రాంత ఉపాధ్యాయుడు గత 20 ఏళ్లుగా చీటీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఓ ప్రక్క ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే చీటీల వ్యాపారం నిర్వహించేవాడు. తోటి టీచర్లు, ఉద్యోగులు నమ్మకంగా ఈయన దగ్గర చీటీలు వేసేవారు. ఆ విధంగా నమ్మకంగా వ్యాపారం చేస్తూ రూ.కోట్లలో చీటీలు, డిపాజిట్లు కట్టించుకుని చివరికి ఊడాయించాడు. పక్కా పథకం ప్రకారం ముందస్తుగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్‌ఎస్) చేయటంతో పాటుగా, స్థిరాస్తులను ఇతర కుటుంబ సభ్యుల పేరిట బదలాయించి పరారయ్యాడు. గత ఐదు రోజులుగా తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్ రాజులకు చెందిన సెల్‌ఫోన్ నంబర్లు పనిచేయకపోవటం, ఇంటికి కూడా తాళం వేసి ఉండటంతో ఖాతాదారులకు అనుమానం వచ్చింది. తీరా ఆరా తీయటంతో ఒక్కొక్కరిగా బాధితులు బయటపడుతున్నారు. ఇప్పటికే సుమారు 60 మంది బాధితులకు రూ.15 కోట్లకు పైగా బాకీ ఉన్నట్లుగా తేలింది. పెద్ద మొత్తంలో చీటీల పేరిట వసూళ్లు చేయటంతో పాటుగా పలువురు ఖాతాదారులకు వడ్డీ ఆశ చూపించి రూ.కోట్లలో డిపాజిట్లు సేకరించాడు. ఈయనపై గతంలోనూ పలుమార్లు ఆరోపణలు వచ్చినప్పటికీ తన పలుకుబడితో నెట్టుకొచ్చాడు. ప్రభుత్వ ఉద్యోగి కావటంతో తమ డబ్బుకు రక్షణ ఉంటుందని, ఉద్యోగం వదిలి పెట్టి ఎక్కడికి వెళ్లిపోడనే నమ్మకంతో జీతం, పెన్షన్ సొమ్ములను సైతం పుల్లయ్య చేతిలో పెట్టారు. పిల్లల చదువులు, కుమార్తె పెళ్లి, ఇంటి నిర్మాణం కోసం రకరకాల ఆశలతో తమ జీతం సొమ్మంతా చిట్‌ఫండ్ కంపెనీలో చీటీలు, డిపాజిట్ల పేరిట కట్టారు. తీరా పుల్లయ్య గుట్టుచప్పుడు కాకుండా గత నెలలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి కుటుంబంతో సహా ఊరి నుంచి వెళ్లిపోయారు.ఈ విషయం ఆలస్యంగా తెలిసి ఖాతాదారులంతా ఇప్పుడు లబోదిబోమంటున్నారు. బాధితులంతా స్థానిక కాకాని భవన్‌లో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి తురకా పుల్లయ్య బాధితుల సంఘం ఏర్పాటుచేసుకున్నారు. ఆ పేరుతోనే హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్‌ను కలిసి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ మోసాలపై ఫిర్యాదు చేశారు. పుల్లయ్యపై న్యాయ పోరాటం కూడా సాగించాలని తీర్మానించారు. పరారీలో ఉన్న తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజు ఆచూకీ కనిపెట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యనమలకుదురు ఈద్గా దుకాణాల స్వాధీనం



రికార్డులు పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ నుహూఆలీషా అదనపు ఇన్‌స్పెక్టర్ ఎండీ కరీముల్లా

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న ఈద్గా, కబరస్తాన్, దుకాణాల సముదాయాన్ని వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకుందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ నుహూఆలీషా, అదనపు ఇన్‌స్పెక్టర్ ఎండీ కరీముల్లా తెలిపారు.ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ యనమలకుదురు గ్రామంలోని సర్వే నంబర్ 1/1లోని 2.73 ఎకరాల స్థలంలో ఉన్న జన్నతుల్ భకి ఖబరస్తాన్, ఈద్గా, మసీదు, 26 దుకాణాలు వక్ఫ్‌బోర్డు కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ మేరకు ముస్లిం మత పెద్దలు, పోలీసుల సమక్షంలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. గతంలో కమిటీ వారు మసీదు ఆదాయ వనరుల అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఇక మీదట మసీదు పరిధిలో ఉన్న 26 దుకాణాలకు సంబంధించి అద్దె దుకాణాలలో ఉన్న వారు వక్ఫ్ బోర్డుకు మాత్రమే అద్దె చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ రైల్వే వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఇండియన్ రైల్వే 171వ వార్షికోత్సవం సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉన్నత అధికారులతో కలిసి నిర్వహించిన ఈ వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ముందుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 171 సంవత్సరాల క్రితం ఇండియన్ రైల్వే ముంబై నుంచి థానేకు మొట్టమొదటి ప్యాసింజర్ రైలును ప్రయోగాత్మకంగా నడిపిందన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా వార్షిక వేడుకలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ 171 సంవత్సరాలలో రైల్వేలో అనేక విప్లవాత్మకమైన మార్పులు జరిగాయన్నారు. ప్రయాణికులకు రైళ్లలో ప్రయాణం సురక్షితమైనదని నమ్మకాన్ని కలిగించటమే కాకుండా సరుకు రవాణాను తక్కువ సమయంలో సురక్షితంగా చేరుస్తారనే విధంగా ప్రజల్లో నమ్మకం సాధించిందన్నారు. దీనిలో విజయవాడ డివిజన్ ప్రత్యేక స్థానంలో ఉందన్నారు. ప్రతి ఏటా ఇండియన్ రైల్వే ప్రకటించే అవార్డులలో డివిజన్‌లో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి అవార్డులు దక్కటం అభినందనీయమన్నారు. మరిన్ని దశాబ్దాల పాటు ఇండియన్ రైల్వే అభివృద్ధికి మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు పీఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవన్ సెంటిమెంటు బేఖాతరు

పెడన: బహిరంగ సభలు, సమావేశాలు పెట్టుకుంటే సెంటిమెంట్లకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలు టీడీపీ, జనసేన. ఆయా పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కృష్ణాజిల్లా పెడన బస్టాండు వద్ద ఈ నెల 17వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు ప్రజాగళం పేరుతో సభ నిర్వహించనున్నారు. ఈ సభ ఎక్కడ పెట్టాలనే అంశంపై ఇరు పార్టీల నేతలు తర్జనభర్జన పడ్డారు. చంద్రబాబు ఎప్పుడు వచ్చినా సెంటిమెంటుగా పెడన బస్టాండు సమీపంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సభ పెట్టిస్తుంటారు. పవన్ కల్యాణ్ వస్తే బంటుమిల్లి రోడ్డులోని తోటమూల సెంటరులో ఆంజనేయస్వామి గుడిలోని హనుమంతుడిని దర్శనం చేసుకుని సభను ప్రారంభిస్తారు. ఈ విషయంలో ఇరువురూ బాగా సెంటిమెంట్ ఫీల్ అవుతారు. అయితే పెడనలో ప్రజాగళం సభాస్థలి విషయంలో పవన్ సెంటిమెంట్‌ను తెలుగు తమ్ముళ్లు పట్టించుకోవడం లేదు. బాబు సెంటిమెంట్‌కే విలువ ఇస్తూ బస్టాండు సమీపంలోనే బహిరంగ సభా వేదికను సిద్ధం చేశారు. పవన్ సెంటిమెంటుకు విలువ లేకుండా పోయిందని జనసేన కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

ఆనవాయితీకి అడ్డంకులు..

పెడన బస్టాండు ఎదురుగా ఉన్న అభయాంజనేస్వామి దేవస్థానంలో ఏటా శ్రీరామనవమి సందర్భంగా గుడి ముందు తాటాకు పందిరి వేసి అత్యంత భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం చేయడం ఆనవాయితీ. బుధవారం చంద్రబాబు, పవన్ కల్యాణ్ రానున్న నేపథ్యంలో నవమి పందిరి వేయడానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. చంద్రబాబు నాయుడు పుణ్యమా అని పందిరి కూడా వేసుకోనీయలేదని, షామియానా వేసుకుని కల్యాణం జరుపుకోవాలని సూచించారని భక్తులు పేర్కొంటున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే ప్రాంతం తోటమూల కాకుండా ఇరుకుగా ఉండే బస్టాండు సమీపంలో బహిరంగ సభ పెట్టడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఊసే లేదు

పెడనలో బుధవారం జరిగే ప్రజాగళం సభకు ప్రజలు రావాలని పిలుపు ఇస్తూ మైకులో చేస్తున్న ప్రచారంలో కూటమిలో భాగమైన బీజేపీ ఊసే ఎత్తడం లేదు. పొత్తులో ఉన్న బీజేపీ మద్దతుదారులను సభకు ఆహ్వానించకపోవడం బీజేపీ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది.

బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- కబడ్డీలో మెలకువలు నేర్పిస్తానని పిలిచి దారుణం
- వీడియో ఉందని బెదిరించి వరుసగా మూడు రోజులు సామూహిక లైంగిక దాడి
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

అవనిగడ్డ: కబడ్డీలో మెలకువలు నేర్పిస్తానని నమ్మబలికి 16 ఏళ్ల బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. వీడియో అందరికీ షేర్ చేస్తామని బెదిరించి మూడు రోజుల పాటు ముగ్గురు యువకులు ఈ దారుణానికి తెగబడ్డారు. ఈ దారుణ ఘటన కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన తోకల పవన్ (ఆర్నాల్డ్) స్థానికంగా కబడ్డీ కోచ్‌గా వ్యవహరిస్తుంటాడు. ఈనెల 7వ తేదీన ఆర్నాల్డ్ కబడ్డీలో మెలకువలు నేర్పిస్తానని చెప్పి స్థానిక 8వ వార్డులో నివసించే బాలికను మూడో వార్డులో ఉండే ఓ గదికి రప్పించుకున్నాడు. లోపలికి వెళ్లిన తరువాత పవన్‌తో పాటు రామచంద్రపురానికి చెందిన చందు డోజేంద్ర మహావిష్ణు, కె.కొత్తపాలెంకు చెందిన పడమటి కొండలరావు ఆ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మరుసటి రోజు బాధిత బాలికకు ఫోన్ చేసి నిన్న జరిగిన ఘటన వీడియోలు తమ వద్ద ఉన్నాయని, రూముకు రాకపోతే వీటిని అందరికీ పంపిస్తానని బెదిరించారు. దీంతో భయపడిన బాలిక మరోసారి రూంకి వెళ్లింది. ఆ రోజు కూడా ఆ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మూడో రోజు మళ్లీ ఫోన్ చేసి బెదిరించి బాలికను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడ్డారు. నాలుగవ సారి మంగళవారం కూడా ఫోన్ చేసి బెదిరించడంతో ఆ బాలిక తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుతం బాధిత బాలిక మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్టు ఎస్‌ఐ రమేష్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేయగా, డీఎస్పీ పి.మురళీధర్ విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ చెప్పారు.

23న మాజీ సైనికులకు అవగాహన సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులకు ఈనెల 23న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.కళ్యాణవీణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో సదస్సు జరుగుతుందన్నారు. మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులు సదస్సుకు హాజరుకావాలని కోరారు. మాజీ సైనికులు డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఐ కార్డ్, ఆధార్ కార్డ్‌తో రావాలని కోరారు.

● ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి వారికి మంగళవారం అభిషేకాలు, తమలపాకులతో అర్చన జరిగింది. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, దేవస్థాన ఘాట్ రోడ్డులోని స్వామి వారి ఆలయం, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయునికి పూజలు నిర్వహించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన కడప జిల్లా, కలసపాడు మండలం, రాజుపాలెం గ్రామం, డోరు నెం. 2/4కు కాపురస్తులు పోకల మల్లికార్జున రెడ్డి గారి భార్య పోకల వాణి గారి సంజాయిషీ పొంది యీ ప్రకటన తెలియజేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని విజయవాడ కాపురస్తులు వేలురుంట్ల విశ్వనాథరావు గారి భార్య వేలురుంట్ల కనకసీతమ్మ గారు వారి జీవితకాలములో ప్రథమస్య సొమ్ముతో డి.12-09-1956వ తేదీన సికింద్రాబాద్ కాపురస్తులు జెట్టి రామన్న గారి కుమారుడు జగదీశ్వరయ్య వద్దనుండి సదరు క్రయమును పొంది, బెజవాడ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో నెం. 2833/1956రుగా రిజిస్టరుకాబడిన విక్రయ దస్తావేజు ద్వారా సంక్రమించిన ఈ దిగువ షెడ్యూలాస్తి మరియు ఇతర స్థిరాస్తులను గురించి, ఆమె జీవితానంతరం జరుగవలసిన ఏర్పాట్లను ఉదహరించుచూ, డి.20-07-2006వ తేదీన వీలునామా వ్రాయించి, శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయమునందు దస్తావేజు నెం.91/2006రుగా రిజిస్ట్రేషన్ చేయించి సదరు వీలునామాను వారి జీవితకాలములో ఎట్టి మార్పులు, చేర్పులు చేయకుండా డి.10-09-2008వ తేదీన పరమపదించియున్నారు, మరియు వారి మరణానంతరం సదరు వీలునామాలో అంశముల ప్రకారం వారి కుమార్తె అయిన గుండా సుందర శేషమాంబగారికి సంక్రమించిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని స్వాధీన పరచుకొని, సర్వసంపూర్ణ హక్కులతో అనుభవించుచూ ఎట్టి లిఖిత పూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా డి.12-06-2021వ తేదీన పరమపదించినారు. ఇట్టిస్థితిలో ముఖ్యవారసులైన వారి సంతతి షెడ్యూలాస్తిని స్వాధీనపరచుకొని, సర్వహక్కులతో అనుభవించుచున్న ఆస్తిని వారి సోదరులలో ఒకరైన జి.యస్.కె.యస్.ఎల్.ఎల్.కుమార్ గారు డి.19-11-2022వ తేదీన వారి భాగంతోపాటు మరియు వారి సోదర, సోదరీమణుల యొక్క ఆస్తిని కలిపి ఒక జనరల్ పవరాఫ్ అటార్నీ వ్రాయించుకొని, పటమట సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ద.నెం.15257/2022రుగా రిజిస్ట్రీ చేసుకుని, సదరు ఆస్తిని ఇతరులకు విక్రయింప ప్రయత్నం చేస్తున్న క్రమంలో నా క్లయింట్ వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని వారితో విక్రయ ఖరారు పడి కొంత సొమ్మును బయానాగా చెల్లించి యున్నారు. కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవరైనను ఏవిధమైన అన్యాక్రాంతములుగాని, తనఖాలు, కోర్టు జప్తులు, హామీలు, భాగపు తగాయిదాలు, ఇతరత్రా ఏమైనా హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన తేదీనుండి 07 రోజులలోపుగా తమ అభ్యంతరములను ఈ క్రింది చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. సదరు గడువులోపు ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరాలు వగైరాలు రాని యెడల నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నిర్వివాదా ఆస్తిగా భావించి, నా క్లయింట్ పేరున గాని, వారు కోరినవారి పేరునగాని విక్రయ దస్తావేజును పొందగలరు. గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు నా క్లయింట్‌ను గాని, సదరు ఆస్తిని గాని ఏవిధంగానూ బైండు చేయజాలవు.

షెడ్యూలు

యన్.టి.ఆర్.జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ టౌన్, పుష్పమ్మతోటలోగల అర్బన్ రెవిన్యూ వార్డు నెం.17, బ్లాకు నెం.13, యన్.టి.యస్.నెం.381, పాత అసెస్మెంట్ నెం.1762, ప్రస్తుత అసెస్మెంట్ నెం.1073091680, పాత డోరు నెం.24-5, దరిమిలా డోరు నెం.24/18, ప్రస్తుత డోరు నెం.38-3-13వ్న దాఖలా చ.గ.319-90లు స్థిరాస్తి నివేశన స్థలమునకు హద్దులు: తూర్పు: మున్సిపల్ కార్పోరేషన్ వారి రోడ్డు అ.52-0లు, దక్షిణం: శ్రీధర్ గారి ఆస్తి అ.52-6లు, పడమర: పసుపూరి కాశీలక్ష్మీసుందరి గారి ఆస్తి అ.48-8లు, ఉత్తరం: యీ ఆస్తికి, పసుపూరి కాశీలక్ష్మీసుందరి వగైరాలకు హక్కుగల కామన్ దారి అ.62-0లు. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.319-90లు లేక చ.మీ.267-477లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి పాత ఆర్.సి.సి. డాబా ఇంటితో సహా, యీజమెంటు హక్కులతో సహా.

గుజ్జుల నాగిరెడ్డి, అడ్వకేట్
షాపు నెం.2, వి.యం.సి. కాంప్లెక్స్,
పిన్నమనేని కృష్ణారెడ్డి రోడ్డు, రాణిగారి తోట, కృష్ణలంక,
విజయవాడ-520013. సెల్ నెం.98850 84449

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయడంతో పాటు, రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. వీరిద్దరూ మంగళవారం 7వ డివిజన్‌లోని బాడవపేట, నెహ్రూ నగర్, ఉడ్‌పేటల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. విజయవాడ నగరం ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందిందన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారం, గ్రాఫిక్స్‌ను నమ్మవద్దన్నారు. మంచి చేసే వారిని గెలిపిస్తే, మళ్లీ ఐదేళ్లు సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడంతో పాటు, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, పార్టీ నేతలు ఇందుపల్లి సుభాషిణి, బుర్రి జగ్జీవన్‌రావు, సంపత్, కొండా, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆ ప్రాంతంలో నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రతి మహిళ తనకు పథకాలు అందాయని, వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని పేర్కొనడం విశేషం.



బాడవపేటలో ఎంపీ కేశినేని శ్రీనివాస్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీని ఆదరించండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. కృష్ణలంక, 20వ డివిజన్‌లో పోస్టాఫీస్ రోడ్డు, నవభారత్ రోడ్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లోనూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ని, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లెం రవి, 20, 21, 22 డివిజన్ల వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



20వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న క్రాంతి

మంచి చేసే వారిని గెలిపించండి

లబ్బీపేటలో దేవినేని సుధీర, కేశినేని హైమా విస్తృతప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ మంచి చేసిన వారిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని దేవినేని అవినాష్ సతీమణి సుధీర, కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని హైమాలు కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం లబ్బీపేట పైడియ్య వీధి, టెంపుల్ స్ట్రీట్‌లలో వారు ప్రచారం నిర్వహించారు. సుధీర మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా అండగా ఉండే వారిని మంచి మనస్సులో ఆదరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో రెంటు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, మునీర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునీర్ అహ్మద్ షేక్, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, ఎస్‌కే వలీతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్బీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర, కేశినేని హైమా

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

9వ డివిజన్ ప్రచారంలో తూర్పు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, మంచి పనులను చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం 9వ డివిజన్ పటమటలంక ప్రాంతంలో పర్యటించారు. ఆ ప్రాంత నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో తూర్పులో రూ.650 కోట్లు అభివృద్ధి పనులు చేశామన్నారు. మంచి చేయడంతోనే నేడు ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ముందుకు వచ్చి తమకు మద్దతు తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో ఈ ప్రాంతంలో రోడ్లు, చేపల మార్కెట్ అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు.



పటమటలంకలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్

గతంలో కాల్‌మనీకి అడ్డా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గాన్ని కాల్‌మనీ సెక్స్ రాకెట్‌కు అడ్డాగా మార్చారని విమర్శించారు. బెట్టింగ్‌లతో కాలం గడిపారన్నారు. ఏనాడు కూడా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మంచి పనులు చేసిన తమను ప్రజలందరూ ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, గద్దే కల్యాణ్‌రామ్, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనలపై జరిమానా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ 3 కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్ కోర్టులో 33 కేసులు విచారణ జరిగాయి. రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి జరిమానా విధించారు. రోడ్డుపై చెత్త వేసిన, లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 33 కేసులను ఆయన విచారించి వారికి రూ.19,350 జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒకసారి జరిమానా విధించాక రెండోసారి కూడా ఆ తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకొని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. నరసాపురానికి చెందిన గొట్టుముక్కల శ్రీసాయి ఫణీంద్ర వర్మ, మీనా భారతి కుటుంబం సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఏఈవో ఎన్. రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శరత్ చంద్ర విద్యార్థులకు సివిల్స్‌లో ర్యాంకులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సివిల్స్ ఫలితాల్లో విజయవాడ, హైదరాబాద్‌లోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీల్లో శిక్షణ పొందిన వారు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అనన్యరెడ్డి 3వ ర్యాంకు, రుహాని 5వ ర్యాంకు సాధించగా, ఇంకా 16, 19, 42, 61, 91 ఇలా 50వరకు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. వారిలో 19 ర్యాంకులు తెలుగు విద్యార్థులకు వచ్చాయన్నారు. ఇతర ర్యాంకులు తమ ఆన్‌లైన్ క్లాసెస్, ఢిల్లీ బ్రాంచ్, టెస్ట్ సిరీస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు. తెలుగు మీడియం చదివి, కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ సింగరాయకొండకు చెందిన ఉదయ్‌రెడ్డికి 780వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారికి, మహిళలకు అత్యధికంగా ర్యాంకులు రావడం సంతోషకరమన్నారు.



5వ ర్యాంకర్ రుహానీతో ఎండీ శరత్‌చంద్ర

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామన్నారు. వేసవిలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

22 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూవీ రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ కంపెనీలలో సెమినార్‌లు నిర్వహించిన పాగోలు రాజు క్లాసులు తీసుకుంటారని తెలిపారు. ఈ క్లాసులు రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీలోగా తమ కార్యాలయంలో గాని, 0866 2578044, 94900 98408 నంబర్లలో గాని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



భీమవరం 'మేమంతా సిద్ధం' సభకు హాజరైన అశేష జనవాహినికి ర్యాంప్‌పై అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పేదలపై బాణాలా?

చంద్రబాబుకు పది మంది సేనానులు.. మీ గురి ఎవరిపై?: భీమవరం సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ''జగన్ ఎప్పుడూ ఒంటరి కాదు.. అందరికీ మంచి చేసిన జగన్‌కు ప్రతి ఇంటా మద్దతు ఉంది. ఏ ఇంట్లో చూసినా తోడుగా పేదల సైన్యం ఉంది. జగనే మళ్లీ రావాలని కోట్ల హృదయాలు ఆశీర్వదిస్తున్నాయి. ఒక్క జగన్ మీద చంద్రబాబు 10 మంది సేనానులను తోడు తెచ్చుకుని బాణాలు గురి పెడుతున్నారు. అవి తగిలేది జగన్‌కా? లేక పేదలకా?'' అనేది ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. 16వ రోజు బస్సు యాత్ర సందర్భంగా మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏమన్నారంటే..

బాబు గురించి చరిత్ర చెబుతున్న నిజం..

భీమవరంలో జన సముద్రం కనిపిస్తోంది. శబరి, ఇంద్రావతి కలసి ఉప్పొంగిన గోదావరిని తలపిస్తోంది. మంచి చేసి మనం, జెండాలు జతకట్టి వాళ్లు తలపడుతున్న ఈ ఎన్నికల యుద్ధంలో ఆ పేదల వ్యతిరేకులను ఓడించి జరుగుతున్న మంచిని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా? సంక్షేమ రాజ్యాన్ని అబద్ధాలు, కుట్రలతో ధ్వంసం చేసేందుకు చంద్రబాబు కూటమి ప్రయత్నిస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. మీ ఐదేళ్ల భవిష్యత్తు, అక్కచెల్లెమ్మల సాధికారత, పిల్లల చదువులు, అవ్వాతాతల సంక్షేమం, రైతన్నలకు అందుతున్న భరోసా, పేదలకు సామాజిక న్యాయం కొనసాగుతూ మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి మళ్లీ నష్టపోవాలా? అనేది నిర్ణయించే ఎన్నికలు ఇవి. అందుకే మళ్లీ మళ్లీ చెబుతున్నా.. ఇవి మన తలరాతలను మార్చే ఎన్నికలు. ఇవి కేవలం చంద్రబాబు – జగన్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు. పేదలకు – చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు అని గుర్తు పెట్టుకోండి. మీ ప్రతి ఓటు వచ్చే ఐదేళ్లు ఏ దారిలో నడవాలో నిర్ణయిస్తుంది కాబట్టి మీ కుటుంబమంతా కూర్చుని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. జగన్‌కు ఓటు వేస్తే ఇప్పుడు జరుగుతున్న మంచి అంతా కొనసాగుతుంది. అదే చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ అంతటితో ముగిసిపోతాయి. ఇది చరిత్ర చెబుతున్న వాస్తవం. ఆయన సాధ్యం కాని అలవిమాలిన హామీలతో వస్తున్నారనేది నిజం.

కొంగ జపం.. నటిస్తావెందుకయ్యా?

మీరంతా ఈమధ్య చూసే ఉంటారు. చంద్రబాబుకు నాపై కోపం చాలా ఎక్కువగా వస్తోంది. ఆయన మాట్లాడుతున్నప్పుడు హైబీపీ కనిపిస్తోంది. ఏవేవో తిడుతుంటాడు.. శాపనార్థాలు పెడుతుంటాడు. నాకు ఏదో అయిపోవాలని కోరుకుంటూ ఉంటాడు. రాళ్లు వేయండి.. అంతం చేయండని పిలుపునిస్తూ ఉంటాడు ఆ పెద్ద మనిషి. అక్కచెల్లెమ్మలూ.. నాపై చంద్రబాబుకు అంత కోపం ఎందుకో తెలుసా? బాబూ.. చెరువులో కొంగ మాదిరిగా చేపలను తినేందుకు ఎదురు చూస్తూ ఇంకోపక్క జపం చేస్తున్నట్లు నటిస్తావెందుకయ్యా? కొంగ జపాలు ఎందుకు చేస్తున్నావ్? అని అడిగా. అలా అడగడం తప్పా? మీ పేరు చెబితే పేదలకు గుర్తుకొచ్చే పథకంగానీ మంచి పనిగానీ ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? అని చంద్రబాబును అడిగా. ఆయన పేదలకు చేసింది ఏమీ లేకపోగా చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోట్లు, మోసం, దగా, అబద్ధాలు, కుట్రలే గుర్తుకొస్తాయి.

భార్యలను వదిలేసి.. నియోజక వర్గాలనూ మార్చేసి!

ఇక దత్తపుత్రుడి విషయానికి వస్తే.. పెళ్లికి ముందు పవిత్రమైన హామీలిచ్చి పిల్లలను కూడా పుట్టించి నాలుగైదేళ్లకు ఒకసారి కార్లను మార్చేసినట్లుగా భార్యలను వదిలేసి, ఇప్పుడు నియోజక వర్గాలను కూడా అలవోకగా వదిలేస్తున్నావ్! ఏం మనిషివయ్యా నువ్వు? అని ఆయన్ను అడిగా. అందుకే దత్తపుత్రుడిలో కూడా ఈమధ్య బీపీ బాగా కనిపిస్తోంది. ఒకసారి చేస్తే అది పొరపాటు! మళ్లీ మళ్లీ చేస్తే అలవాటు అంటారయ్యా.. దత్తపుత్రా! పవిత్రమైన సాంప్రదాయాన్ని నడి రోడ్డుపైకి తీసుకురావడం, ఆడవాళ్ల జీవితాలను చులకనగా చూపడం ఘోరమైన తప్పుకాదా? ఇదే విషయం నేను అడిగితే తప్పు అట! నిన్ను చూసి అదే తప్పు ప్రతి ఒక్కరూ చేయడం మొదలుపెడితే.. ఇలా నాలుగేళ్లకు, ఐదేళ్లకు ఒకసారి భార్యలను మార్చడం మొదలు పెడితే అక్కచెల్లెమ్మల బతుకులు ఏం కావాలి? అని కనీసం ఆలోచన కూడా చేయడు. ఆ పెద్దమనిషికి నువ్వు చేస్తున్నది తప్పు అని చెబితే బీపీ విపరీతంగా పెరిగిపోతుంది. ఇలా ఇలా.. ఊగిపోతుంటాడు. చేతులు, కాళ్లు, తల..అన్నీ ఊపేస్తుంటాడు. ఇలా అడిగినందుకే బాబుకు, దత్తపుత్రుడికి నాపై కోపం. బాబు వదిన గారికి కూడా కోపం వచ్చింది. బాబు భజంత్రీలకు కూడా పిచ్చి కోపం.. వీళ్లంతా ఊగిపోతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లలో పూనకం వచ్చినట్లుగా ప్రవర్తిస్తుంటారు.

పేదలపై బాబు బాణాలు..

జగన్ ఒక్కడే.. చంద్రబాబుకు మాత్రం పది మంది సేనానులు. వారంతా బాణాలు గురి పెట్టారు. కానీ అవి తగిలేది ఎవరికి? జగన్‌కా? లేక పేదలకు జగన్ అందిస్తున్న పథకాలకా? వలంటీర్లు–సచివాలయాల వ్యవస్థలకా? ఆర్బీకేలు–విలేజ్ క్లినిక్స్ వ్యవస్థలకా? నాడు – నేడు, ఇంగ్లీషు మీడియంతో మారిన పిల్లల చదువులకా? వారి బాణాలు తగిలేది ఎవరికి? ఇంటింటికీ అందించే పెన్షన్లకు వారి బాణాలు తగులుతున్నాయి. మీ బిడ్డ బటన్ నొక్కడంతో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు పలు పథకాల ద్వారా గత 58 నెలల్లో పేదలకు అందాయి. మరి వాళ్లు వేసే బాణాలు జగన్‌కు తగులుతున్నాయా? లేక ఆ రూ.2.70 లక్షల కోట్లు అందుకున్న అక్కచెల్లెమ్మల కుటుంబాలకు తగులుతున్నాయో ఆలోచన చేయమని కోరుతున్నా. వారంతా బాణాలు ఎక్కుపెట్టింది మీ అందరి మంచి కోరుతూ మనం తీసుకొచ్చిన వ్యవస్థలపై, పథకాలపై. అక్కచెల్లెమ్మల సాధికారత, పేద బిడ్డల బంగారు భవిష్యత్తు, అవ్వాతాతల సంక్షేమం, రైతన్నలకు అందుతున్న రైతు భరోసాపై చంద్రబాబు, ఆయన పెత్తందారుల బృందం ప్రకటించిన యుద్ధమిది.

పుట్టుకతోనే రొయ్యకు మీసాలు.. బాబుకు మోసాలు

రొయ్యకు మీసం.. బాబుకు మోసం పుట్టుకతో ఎలా వచ్చాయో భీమవరంలో తేల్చేద్దాం. బాబు వస్తే జాబులు రావడం కాదు.. ఉన్నవి ఎలా ఊడిపోతాయో, రైతులను ఎలా ముంచాడో మొన్ననే పిడుగురాళ్ల సిద్ధం సభలో చెప్పా. టీడీపీ, ఎల్లో మీడియా చంద్రబాబును జాకీలు, పొక్లెయిన్లతో లేవనెత్తుతూ చేస్తున్న మోసాలు, పచ్చి అబద్ధాల గురించి ఇవాళ తేలుద్దాం. ఆ ప్రచారాల్లో ఎంత నిజం ఉందో చూద్దాం. ఖాళీ డబ్బాలో రాళ్లు వేస్తే డబడబ సౌండ్ వచ్చిన తరహాలో బాబు వల్లే అభివృద్ధి అంటూ ఊదరగొడుతుంటారు. అసలు బాబుకు – అభివృద్ధికి ఏమైనా సంబంధం ఉందేమో మీరే చెప్పండి. సెల్‌ఫోన్‌ను కనిపెట్టిందీ, సత్య నాదెళ్లను చదివించిందీ తానేనని చెప్పుకునే బాబు పాత డైలాగులు కాసేపు పక్కనబెట్టి మీ అందరికీ బాగా గుర్తున్న 2014 ఎన్నికల్లో ఆయన ఏం చెప్పారో చూద్దాం. కొత్త రాష్ట్రం కాబట్టి అనుభవజ్ఞుడైన బాబు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందంటూ ఎల్లో గ్యాంగ్ డప్పు కొట్టింది. జగన్‌కు అనుభవం లేదు, పిల్లోడని.. బాబుకైతే బాగా అనుభవం ఉంది, ఆయన వస్తేనే అభివృద్ధి అని ఊదరగొట్టారు.

చంద్రబాబు సెల్ఫ్‌డబ్బా..

అదిగో హైపర్ లూప్.. బుల్లెట్ రైలు.. మైక్రోసాఫ్ట్ వచ్చేసిందని.. ఏపీలో ఒలంపిక్స్ అని.. ఆమ్‌స్టర్‌డ్యామ్, సింగపూర్, వెనిస్‌తో పోటీపడే నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు సెల్ఫ్‌డబ్బా కొట్టుకోలేదా? మరి సింగపూర్ కట్టాడా? హైపర్ లూప్ తెచ్చాడా? బుల్లెట్ రైలు వచ్చిందా? మైక్రోసాఫ్ట్ ఏమైనా తెచ్చాడా? రాష్ట్రంలో ఏమైనా ఒలంపిక్స్ జరిగాయా? కొత్తగా ఏమైనా పోర్టులు కట్టాడా? ఫిషింగ్ హార్బర్లు కట్టాడా? కనీసం ఎయిర్‌పోర్టులు ఏమైనా కొత్తవి కట్టాడా? జిల్లాకో హైటెక్ సిటీ మీకేమైనా కనిపించిందా? ఎక్కడైనా ఓ మెడికల్ కాలేజీ కట్టాడా? ఇవన్నీ కట్టకపోతే పోనివ్వండి. ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ స్కూల్‌ని, కనీసం వార్డునైనా బాగు చేశాడా? ఎక్కడైనా ఒక ఊరిలో సచివాలయం, విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశాడా? గ్రామానికి ఫ్యామిలీ డాక్టర్‌ను తెచ్చాడా? మీ ఇంటివద్దకే ఆరోగ్య సురక్ష వచ్చిందా? డిజిటల్ లైబ్రరీలు, మారుమూల గిరిజన ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పించాడా? రైతన్నకు మేలు చేస్తూ ఆర్బీకే వ్యవస్థను తెచ్చాడా? ఒక వలంటీర్ వ్యవస్థను తెచ్చాడా? మరి ఇలాంటి బాబు ఏం చేశాడని అభివృద్ధి కింగ్ అంటూ జబ్బలు చరుచుకుంటున్నారు? మీదంతా బోగస్ రిపోర్టు కాదా?



మీ జగన్ ప్రోగ్రెస్ రిపోర్టు..

- ✓ వాయువేగంతో ఏకంగా 17 కొత్త మెడికల్ కాలేజీల పనులు
- ✓ కొత్తగా, శరవేగంగా మరో నాలుగు సీ పోర్టుల పనులు
- ✓ కొత్తగా 10 ఫిషింగ్ హార్బర్ల పనులు వడివడిగా
- ✓ కొత్తగా ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు
- ✓ 15 వేలకుపైగా సచివాలయాల ఏర్పాటు
- ✓ నాడు-నేడుతో బాగుపడ్డ స్కూళ్లు, ఆస్పత్రులు
- ✓ కొత్తగా 15 వేలకుపైగా విలేజ్, వార్డు క్లినిక్స్
- ✓ కొత్తగా 11 వేలకుపైగా ఆర్బీకేలు
- ✓ కొత్తగా ఇప్పటివరకు 3 వేలకుపైగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణం
- ✓ గ్రామానికే ఫైబర్ గ్రిడ్ సదుపాయం
- ✓ రాష్ట్రానికి రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడుల రాక
- ✓ విమానాశ్రయాల విస్తరణ, వాయువేగంతో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు
- ✓ 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, ఇండస్ట్రియల్ నోడ్స్, ఎంఎస్ఎంఈలకు ఆపన్న హస్తం
- ✓ స్వయం ఉపాధిని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ ఆసరా, సున్నావడ్డీ, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, చేదోడు, తోడు, నేతన్ననేస్తం,
- ✓ దేశంలో అభివృద్ధిలో టాప్ 5 రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్
- ✓ ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఇంటివద్దకే పథకాలు, సేవలు

మన ఎంపీ అభ్యర్థి ఉమాబాలతోపాటు భీమవరంలో శీనన్న (గ్రంధి శ్రీనివాసరావు), తాడేపల్లిగూడెం నుంచి కొట్టన్న (కొట్టుసత్యనారాయణ), ఆచంట నుంచి రంగరాజు అన్న, ఉండి నుంచి నరసింహరాజు అన్న, పాలకొల్లు నుంచి గోపీ, తణుకు నుంచి కారుమూరి నాగేశ్వరరావు అన్న, నరసాపురం నుంచి పోటీ చేస్తున్న ప్రసాద్‌ను మీ అందరూ ఎన్నికల్లో గొప్ప మెజార్టీతో దీవించాలని సవినయంగా కోరుతున్నా.

జగన్‌కు తోడుగా కోట్ల గుండెలు..

ఈ యుద్ధంలో తలపడటానికి మీరంతా సిద్ధమేనా? జగన్ ఎన్నడూ ఒంటరి కానే కాదు. మంచి చేసిన జగన్‌కు మద్దతుగా ఏ ఇంట్లో చూసినా పేదల సైన్యం తోడుగా ఉంది. ఈరోజు ప్రతి ఇంట్లో జగనే ఉండాలి.. జగనే రావాలి.. మా బిడ్డే కావాలి అని కోట్ల మంది దీవిస్తున్నారు. ఇంటికే వస్తున్న రూ.3 వేల పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు జగన్‌కు తోడుగా ఉన్నారు. అమ్మ ఒడి నుంచి చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా, సున్నావడ్డీ, విద్యాదీవెన, వసతి దీవెన దాకా ప్రతి ఇంట్లో పథకాలు అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు నా తమ్ముడు, నా అన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారు. బాగుపడ్డ ఆస్పత్రులు, మెరుగైన ఆరోగ్యశ్రీ, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, ఇంటివద్దే పరీక్షలు – మందులు .. వీటన్నిటితో జీవితాలు మెరుగైన పేదలంతా మాకు తోడుగా నిలబడే వ్యక్తి ఒక్క జగన్ మాత్రమేనని భావిస్తూ మళ్లీ రావాలని కోరుకుంటున్నారు. జగన్ ఉంటేనే స్కూళ్లు, పిల్లల చదువులు బాగుంటాయని, మరో 10–15 ఏళ్లలో మా బిడ్డలు కూడా పెద్దవారి పిల్లల మాదిరిగా అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడే పరిస్థితి వస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నారు. ఒక్క జగన్ ఉంటేనే క్రమం తప్పకుండా రైతు భరోసా వస్తుందని, గ్రామాల్లో ఆర్బీకేలు పని చేస్తాయని, దళారీలు లేకుండా పంటను అమ్ముకునే పరిస్థితి ఉంటుందని నమ్ముతూ ప్రతి రైతన్నా నాకు తోడుగా ఉన్నాడు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా మంచి జరిగింది కాబట్టే ప్రతి ఇంట్లోనూ జగన్‌కు అండగా ఉన్నారు. మరి ఇన్ని కోట్ల గుండెలు తోడుగా ఉండగా జగన్ ఒంటరి కానే కాదు.

2014లో బాబు మోసాలిలా..

- రూ.87,612 కోట్ల రైతు రుణాలను మాఫీ చేశాడా?
- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రద్దు చేస్తామన్నాడు, కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పన బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా చేశాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు అంటే 60 నెలలు. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కూడా ఇస్తామన్నాడు. ఏ ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలం ఇచ్చారా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి చేశాడా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామని నమ్మబలికిన బాబు చేశాడా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీని నిర్మించాడా?.. భీమవరంలో కనిపిస్తోందా?
- ఇన్ని ప్రధాన హామీల్లో ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేశాడా?
- ప్రత్యేక హోదా తెచ్చాడా?
- సూపర్ సిక్స్, సెవన్ అంటూ ఇప్పుడు మళ్లీ మోసాలకు బాబు తయారు.

వెలిగించండి ఫోన్లలో టార్చిలైట్లు..

ఇవాళ ఎక్కడైనా లంచాలు అనే మాట వినిపిస్తోందా? 58 నెలల్లో ఎలాంటి వివక్ష లేని పారదర్శక వ్యవస్థలను తెచ్చింది మీ బిడ్డ కాదా? గతంలో పెన్షన్ కావాలంటే లంచం.. సబ్సిడీ లోన్లు కావాలన్నా లంచాలే.. చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచాలే. మాయలు, మోసాలు చేసి గ్రాఫిక్స్ చూపించేవాడిని ఏమంటాం? ఛీటర్.. మోసగాడనే కదా? మాయలోడు అనేకదా అంటాం. మన ఖర్మ ఏమిటోగానీ ఐదేళ్ల క్రితం ఆ మనిషిని మనం ముఖ్యమంత్రి అని అన్నాం. చంద్రబాబు చరిత్రను ప్రతి ఒక్కరికీ వివరించండి. మోసాలతో పోరాడుతూ రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? వారి చీకటి యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, వ్యవస్థలు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ సీట్లలో మన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.



సభకు హాజరైన భారీ జనసందోహానికి ర్యాంప్ చివరి వద్దకు వచ్చి అభివాదం చేస్తున్న సీఎం జగన్

హత్యాయత్నంపై దిగజారుడు వ్యాఖ్యలా?

నిత్యం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తపించే ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం చేయడాన్ని ప్రజలు సహించలేకపోతున్నారు. జగనన్నను ఆప్యాయంగా చేయి పట్టుకుని పలకరించేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. భగవంతుడి దయ వల్ల సీఎంకు పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకుంటుంటే మానవత్వం లేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 60 ఏళ్లకే రూ.3 వేల చొప్పున పింఛన్లను ఇంటివద్దే అందిస్తున్నందుకు కక్ష గట్టారా? నిరుపేద బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తున్నందుకు కక్షగట్టారా? సీఎం జగన్‌కు కోట్లాదిమంది ఆశీర్వాదం ఉంది. స్వల్ప వ్యవధిలో సీఎం రెండోసారి భీమవరం రావడం సంతోషంగా ఉంది. పశ్చిమ గోదావరిపై ప్రత్యేకమైన ప్రేమాభిమానాలు చూపుతున్నందుకు ధన్యవాదాలు.

– గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే



సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నేతలు

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్
- కైకలూరు జనసేన ఇన్‌చార్జ్ బీవీ రావు, గురజాల నేత చింతలపూడి శ్రీనివాసరావు తదితరులు చేరిక

సాక్షి,అమరావతి/సాక్షి, భీమవరం: జనసేన, టీడీపీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా నారాయణపురం స్టే పాయింట్ వద్దకు వచ్చిన సీఎం జగన్ సమక్షంలో కైకలూరు, దెందులూరు, గురజాల నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన, యాదవ సంఘ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కైకలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బీవీ రావు, జిల్లా కార్యదర్శి పల్లెం యువాన్, యాదవ సంఘం నాయకుడు పచ్చిగోళ్ల రామకృష్ణకు సీఎం జగన్ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం నుంచి 2019లో జనసేన తరఫున పోటీ చేసిన చింతలపూడి శ్రీనివాసరావు, ఆ పార్టీ నేతలు డాక్టర్ అశోక్‌కుమార్, మందపాటి దుర్గారావు, టీడీపీ నుంచి పిడుగురాళ్ల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు ఎ.పేరయ్య, సీనియర్ నేత గుంటుపల్లి రామారావు వైఎస్సార్‌సీపీలో చేరారు. దెందులూరు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలు ఆకుర్తి శేఖర్, గారపాటి వాసు, గౌడ సంఘం నేత మాదు గంగాధర్ వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. వీరందరికీ సీఎం జగన్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యేలు డీఎన్నార్, అబ్బయ్య చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, కాసు మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా సిద్ధమా?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో తామంతా సిద్ధమంటూ కదం తొక్కి.. సీఎం జగన్‌తో కలిసి బస్సు యాత్రలో పాల్గొన్నారు.

-సాక్షి, అమరావతి

16 వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్

ఎక్స్‌లో ఫొటోలను పోస్టు చేసిన సీఎం

'మేమంతా సిద్ధం బస్సు యాత్రలో 16వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో' అంటూ సీఎం జగన్ మంగళవారం కొన్ని ఫొటోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తమ బిడ్డకు అక్షరాభ్యాసం చేయించాలని తల్లిదండ్రులు కోరడంతో బాబుతో సీఎం వైఎస్ జగన్ చేయిపట్టి అక్షరాభ్యాసం చేయించారు. అలాగే తనను కలిసిన అక్కచెల్లెమ్మలను 'ఏమ్మా ఎలా ఉన్నారు.. పథకాలన్నీ అందాయా? మీకు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను సీఎం వైఎస్ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

- సాక్షి, అమరావతి










ఆరేడు: జై జగనన్నా...


గణపవరం: మేమంతా సిద్ధం బస్సుయాత్రకు హాజరైన భారీ జనసందోహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివాదం

పోటెత్తిన 'పశ్చిమ'

సీఎం జగన్ రాకతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కొత్త శోభ

- ఉమ్మడి జిల్లాలో సంబరంలా 16వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర
- భారీ ఎత్తున పోటెత్తిన జనసంద్రం
- అడుగడుగునా ఎదురొచ్చి దిష్టితీసి, హారతులు పట్టిన అక్కచెల్లెమ్మలు
- భీమవరంలో జనప్రవాహం.. వీధుల్లో కోలాహలం
- ఎండను సైతం లెక్క చేయకుండా సీఎంను చూడాలని గంటల తరబడి ఎదురుచూపులు
- ప్రజలు వెల్లువలా తరలిరావడంతో షెడ్యూల్ కంటే ఆలస్యంగా యాత్ర
- దీంతో ముందుగా నిర్ణయించిన రాత్రి బస ప్రదేశం ఈతకోట నుంచి తేతలికి మార్పు

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొత్త పండుగ శోభను సంతరించుకుంది. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా 16వ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఆయనను చూడటానికి జనసంద్రం పోటెత్తింది. ఊరూవాడా వెల్లువలా ప్రజలు తరలివచ్చారు. అక్కచెల్లెమ్మలు దిష్టితీసి హారతులు పట్టారు. హత్యాయత్నం నుంచి బయటపడి తమ వద్దకు వచ్చిన సీఎం జగన్‌ను చూడటానికి అభిమాన సంద్రం ప్రవాహంలా పోటెత్తింది. తనను చూడటానికి వచ్చిన అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను, చిన్నారులను బస్సు దిగి సీఎం ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఓవైపు మళ్లీ నువ్వే అధికారంలోకి వస్తావంటూ అవ్వాతాతల ఆశీర్వచనాలు, మరోవైపు మా ఓట్లు మీకే అంటూ అక్కచెల్లెమ్మల ప్రేమానురాగాలు, ఇంకోవైపు మేమున్నామన్నా అంటూ యువకుల ఉత్సాహం మధ్య బస్సు యాత్ర ఆద్యంతం సంబరంలా సాగింది.

జననేతకు జన నీరాజనం

సోమవారం గుడివాడ బహిరంగ సభ ముగించుకుని ఏలూరు జిల్లా నారాయణపురం చేరుకుని రాత్రి బస చేసిన సీఎం వైఎస్ జగన్‌ను మంగళవారం ఉదయం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, సీనియర్ కార్యకర్తలను పేరుపేరునా పలకరిస్తూ.. వారి యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నుంచి పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువా కప్పి సీఎం జగన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. నారాయణపురం శివారు ప్రాంతానికి చెందిన ఉంద్రాజవరపు భుజంగరావు, గీతారాణి దంపతులు సీఎం బస్సు వద్దకు వచ్చారు. తమ కుమారుడికి అక్షరాభ్యాసం చేయాలని సీఎం జగన్‌ను కోరగా ఆయన వెంటనే బస్సు నుంచి బయటకు వచ్చి బాలుడితో అక్షరాలు దిద్దించారు. తమ అభిమాన నేతతో తమ బిడ్డకు అక్షరాభ్యాసం చేయించడం పట్ల చాలా సంతోషంగా ఉందని, ఇది ఎన్నటికీ మరువలేమని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే తనపై అభిమానంతో ఓ చెల్లెమ్మ వేసిన పెన్సిల్ స్కెచ్‌పై సీఎం జగన్ సంతకం చేశారు. అనంతరం మేమంతా సిద్ధం బస్సుయాత్ర నారాయణపురం నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైంది. రాచూరు చేరుకున్న సీఎం జగన్‌కు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అవ్వాతాతలు, అన్నా ఎలా ఉన్నావంటూ అక్కచెల్లెమ్మలు సీఎం వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా పలకరించారు. 'మీరంతా నాకు అండగా ఉండగా నాకేం కాదమ్మా' అంటూ వారికి ధైర్యం చెప్పి ఆయన ముందుకు కదిలారు. తర్వాత సీతారామపురం చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు జేజేలు పలికారు. అక్కచెల్లెమ్మలు గుమ్మడికాయలతో దిష్టితీసి హారతులు పట్టారు. దారిపొడవునా మేమంతా సిద్ధమంటూ బారులు తీరి ప్రజలు స్వాగతం చెప్పారు. తర్వాత సీఎం జగన్ గాంధీ నగర్ మీదుగా నిడమర్రు చేరుకున్నారు. అక్కడ అడుగడుగునా అక్కచెల్లెమ్మలు నీరాజనాలు పలికారు. తన కోసం వేచి చూస్తున్నవారిని పలకరిస్తూ సీఎం ముందుకు సాగారు. భువనపల్లి మీదుగా సాగిన సీఎం జగన్ బస్సుయాత్రకు గణపవరంలో జనం పోటెత్తారు. స్థానికులు అఖండ స్వాగతం పలికారు. గణపవరం సెంటర్‌లో తన కోసం ఎదురుచూస్తున్న అశేష జనవాహినికి ముఖ్యమంత్రి జగన్ బస్సుపైకి ఎక్కి అభివాదం చేశారు. ఓవైపు ఎండ మండుతున్నా ప్రజలెవరూ లెక్క చేయలేదు. ప్రవాహంలా కదిలిన జనం బస్సుయాత్రను అనుసరించారు. పాములపర్రు, ఆరేడుల్లో సీఎంకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అక్కడి నుంచి ఉండి చేరుకునే సరికి భారీ ఎత్తున ప్రజలు, పార్టీ నేతలు ఎదురొచ్చి జన నేతకు ఘన స్వాగతం పలికారు.


ఉండి: రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ అభివాదం

తరలివచ్చిన ఊళ్లకు ఊళ్లు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను చూడటానికి.. యోగక్షేమాలు తెలుసుకోవడానికి ఊళ్లకు ఊళ్లే తరలివచ్చాయి. అన్నా..మిమ్మల్ని గెలిపించుకోవడానికి మేమంతా సిద్ధమంటూ యువత నినదించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా స్థానిక నేతలు ప్రత్యేకంగా టెంట్లు, కుర్చీలు వేశారు. అలాగే అడుగడుగునా అన్నదానాలు, మజ్జిగ పంపిణీ చేపట్టారు. జనసంద్రం తరలిరావడంతో బస్సుయాత్ర నిదానంగా ముందుకు సాగింది. అందరినీ పలకరిస్తూ షెడ్యూల్ కంటే ఆలస్యంగా మేమంతా సిద్ధం బస్సుయాత్ర కొనసాగింది. దీంతో ఉండి శివారులో మ.3.53 గంటలకు మధ్యాహ్న విరామ ప్రాంతానికి సీఎం జగన్ వెళ్లారు. ఉండి నియోజకవర్గం కోలమూరు గ్రామంలో మండుటెండను సైతం లెక్కచేయకుండా నాలుగు నెలల బాలింత చంటి బిడ్డతో సీఎం జగన్‌ను చూడాలని వేచి చూసింది.

చిమ్మ చీకట్లోనూ అభిమాన వెలుగు

చీకటి పడినప్పటికీ సీఎం జగన్‌పై ప్రజాభిమానం ఏమాత్రం సడలలేదు.

భీమవరం జనసంద్రం

ఉండి నుంచి భీమవరం బైపాస్ రోడ్ గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కాలేజ్ వద్ద బహిరంగ సభకు సాయంత్రం 5 గంటలకు సీఎం జగన్ రోడ్ షో ద్వారా చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ జరగాల్సి ఉండగా జనాభిమానం వెల్లువెత్తడంతో గంటన్నర ఆలస్యమైంది. అప్పటికే భీమవరం జనసంద్రమైంది. రోడ్లన్నీ జనజాతరను తలపించాయి. డప్పులు, డీజేలు మోగిస్తూ అభిమానులు వీధుల్లో ఆనందతాండవం చేశారు. సభా ప్రాంగణం ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది. ర్యాంప్‌పై నడుస్తూ జనసంద్రానికి సీఎం జగన్ అభివాదం చేశారు. అనంతరం సభలో ప్రసంగిస్తూ 'ఈ మధ్య కోపం ఎక్కువై చంద్రబాబు ఏదేదో మాట్లాడుతున్నారు.. నాకేదో అయిపోవాలని కోరుకుంటున్నారు' అని మండిపడ్డారు. 'అలాగే భార్యల్ని మార్చినట్టు నియోజకవర్గాలను మార్చేస్తున్న దత్తపుత్రుడికి బీపీ పెరిగిపోతోంది' అని సీఎం జగన్ ధ్వజమెత్తారు. దీంతో సభలో ఉన్నవారి నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. సాయంత్రం 6.23 గంటలకు సభ ముగియగానే సీఎం వైఎస్ జగన్ భీమవరం మీదుగా తిరిగి రోడ్ షో కొనసాగించారు. చీకటి పడినప్పటికీ గొల్లలకోడేరులో ప్రజలు తమ అభిమాన నేత రాకకోసం వేచి చూశారు. వారి వద్దకు చేరుకున్న సీఎం జగన్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జన ప్రవాహం భారీగా రావడం వల్ల యాత్ర ఆలస్యమవుతుండటంతో బస ప్రదేశాన్ని అప్పటికప్పుడు మార్చాల్సి వచ్చింది. ముందుగా నిర్ణయించిన తూర్పుగోదావరి జిల్లా ఈతకోట నుంచి తణుకు వద్ద తేతలి గ్రామ శివారులో జాతీయ రహదారిని ఆనుకుని బసను ఏర్పాటు చేశారు.

భీమవరం నుంచి గొల్లలకోడేరు వచ్చే వరకూ ప్రజలు జగన్ రాక కోసం వేచి చూశారు. వారి వద్దకు చేరుకున్న జగన్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అక్కడి నుంచి గరగపర్రు, యండగండి, సాగుపాడు, కేశవరం, అప్పన్నపేట మీదుగా పిప్పర చేరుకున్న జననేత బస్సుయాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. బాణసంచా వెలుగులు, డప్పు వాయిద్యాలతో పిప్పర గ్రామమంతా తరలివచ్చి జగన్‌కు జై కొట్టింది. అగ్రహారం, చిలకంపాడు, ముదునూరు, కాశిపాడు దాటి చింతపల్లి నుంచి రావిపాడు చేరుకుంది. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా తణుకు మండలంలోని దువ్వ గ్రామానికి చేరుకున్న జగన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. పొద్దుపోయినా తమ అభిమాన నాయకుడి కోసం పల్లెలు ఎదురుచూశాయి. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ రాత్రి 10.09 గంటలకు తేతలి శివారులోని రాత్రి బస ప్రాంతానికి జగన్ చేరుకున్నారు. అక్కడికి సైతం వచ్చిన అభిమానులు జగన్‌ను చూసి జగనన్నా మళ్లీ నువ్వే సీఎం అంటూ నినాదాలు చేశారు. వారికి అభివాదం చేస్తూ 16వ రోజు మేమంతా సిద్ధం బస్సుయాత్రను సీఎం జగన్ ముగించారు.

ఆ దుర్మార్గులకు మనసనేది ఉందా?

సీఎం వైఎస్ జగన్ నుదుటన గాయాన్ని చూసి చలించిపోయిన ప్రజలు

బస్సు యాత్రలో దారిపొడవునా ఆప్యాయతానురాగాలు

సాక్షి, భీమవరం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా 16వ రోజు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను చూడటానికి ఊరూవాడా తరలివచ్చింది. ఈ సందర్భంగా ఆయన నుదుటన గాయాన్ని చూసినవారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు మంచి చేస్తున్న మనిషిని మట్టుబెట్టాలన్న ఆలోచన ఎలా వచ్చిందో ఆ దుర్మార్గులకంటూ మండిపడ్డారు. దెబ్బ తగిలినప్పుడు బాధతో ఎంత విలవిలలాడాడో బిడ్డ అంటూ మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. గాయం త్వరగా నయం కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం జాగ్రత్త బాబు అంటూ అవ్వాతాతలు సీఎం జగన్‌పై ఆప్యాయత చూపారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో దారిపొడవునా ఇవే దృశ్యాలు కనిపించాయి.

ఆయనకు ఏమన్నా అయితే మేమేమైపోవాలి..



సీఎం వైఎస్ జగన్ వల్ల మేం చాలా లబ్ధిపొందాం. ఆయన చేసిన సహాయానికి మేము రుణం తీర్చుకుంటాం. ఆయన మాలాంటి పేదలకు చేస్తున్న సేవల్ని అడ్డుకునేందుకు కుట్రపన్ని హత్యాయత్నం చేశారు. ఆయనకు ఏమైనా అయితే మేమేమైపోవాలి?

- ఎం.పావని, గణపవరం

ఎంత విలవిలలాడిపోయారో?



జగన్ సర్ నుదుటన దెబ్బ చూడలేకపోయాం. ఆ దెబ్బ తగలినప్పుడు ఆయన ఎంత విలవిల్లాడిపోయారో. పేదలకు మంచి చేస్తున్న ఆయనపై హత్యాయత్నం చేయడానికి దుర్మార్గులకు మనసెలా వచ్చిందో అర్థం కావడం లేదు. దేవుని దయ, ప్రజల ఆశీస్సులు జగన్ సర్‌పై నిండా ఉన్నాయి. ఆయన్ను ఎవరూ ఏమీ చేయలేరు. పేదలకు మంచి చేస్తున్న ఆయనకు అంతా మంచే జరుగుతుంది.

- కొణిదెల అలంకారం, మండలపర్రు

చాలా బాధనిపించింది..



పేదల కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌పై హత్యాయత్నం చేయడం దారుణం. నాకు చాలా బాధనిపించింది. గాయంతో నడవలేని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ.. ఆయనను చూడాలన్న ఆశతో చుట్టుపక్కల వారి సాయంతో వచ్చాను. సొంత సోదరుడి మాదిరి ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌పై దుర్మార్గులు దాడి చేయడం చాలా నీచమైన పని.

- పత్తివాడ జయలక్ష్మి, నిడమర్రు

ముఖంపై దెబ్బ చూసి తల్లడిల్లిపోయా..



జగన్ బాబు ముఖంపై దెబ్బ చూసి తల్లడిల్లిపోయాను. అంత దెబ్బ ఎలా తట్టుకున్నాడో. జగన్ బాబుకు మంచి జరగాలని దేవుడికి తైలాభిషేకం చేయించాను. ఆయనపై హత్యాయత్నం చేసినవారికి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలి.

- కర్తాకి రాజ్యం, క్రొవ్విడి


సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులు


నారాయణపురం: చిన్నారి పెన్సిల్ స్కెచ్‌పై ఆటోగ్రాఫ్


రాచూరు: సీఎం జగన్‌కు దిష్టితీస్తున్న మహిళ


భువనపల్లి: మండుటెండలో మహిళ సమస్యలు తెలుసుకుంటూ..


గరగపర్రు: దివ్యాంగుని సమస్యలు తెలుసుకుంటూ..


పిప్పర: అభిమాననేత కోసం రాత్రివేళ ఎదురుచూపులు


రావిపాడు: సీఎం జగన్‌కు దిష్టితీసి, హారతిచ్చి స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న అక్కచెల్లెమ్మలు

గుర్తు పట్టి.. బస్సు ఎక్కించుకుని..


బస్సు ఎక్కుతున్న రాజబాబు

ద్వారకా తిరుమల: రహదారి పక్కన నిలబడి సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబుకు ఊహించని అనుభవం ఎదురైంది. జనసంద్రంలో రాజబాబును చూసి గుర్తు పట్టిన సీఎం వైఎస్ జగన్ బస్సు ఆపించి మరీ అందులో ఆయనను ఎక్కించుకుని తన వెంట తీసుకెళ్లడం పార్టీ శ్రేణులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా నారాయణపురం నుంచి భీమవరానికి వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌కు నిడమర్రు వద్ద రాజబాబు అభివాదం చేశారు. ప్రజల్లో ఉన్న రాజబాబును గుర్తు పట్టిన సీఎం జగన్ వెంటనే బస్సు ఆపించి, అందులో ఆయనను ఎక్కించుకున్నారు. ఉండి వరకు సీఎంతోపాటు బస్సులో వెళ్లానని.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను ఆయనకు వివరించానని రాజబాబు తెలిపారు. ఎంతో మంది నాయకుల మధ్యలో ఉన్నా తనను జగనన్న గుర్తుపట్టి, ఉన్నఫళంగా రోడ్డుపై బస్సు ఆపి, ఎక్కించుకుని తీసుకెళ్లడం ఒకింత తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. పార్టీ కోసం కష్టపడే ఏ ఒక్కరినీ జగనన్న మరచిపోరని చెప్పడానికి తనకు ఎదురైన అనుభవమే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.







'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా రాచూరు, నిడమర్రు, గణపవరం, పాములపర్రు గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆప్యాయంగా మాట్లాడుతున్న అవ్వాతాతలు


పాములపర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ షోకు హాజరైన జనసందోహం

‘తప్పించమని నేనే అడిగా’

ఐపీఎల్‌లో వరుస వైఫల్యాల తర్వాత శారీరకంగా, మానసికంగా కూడా విరామం అవసరమని తాను భావించానని...అందుకే తుది జట్టు నుంచి తనను తప్పించాలని తానే కోరినట్లు ఆర్‌సీబీ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వివరణ ఇచ్చాడు. ముంబైతో మ్యాచ్‌లో వేలికి గాయం కాగా, అదే కారణంగా సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్‌ను ఆడించలేదని వినిపించగా... అదేమీ కారణం కాదని అతనే చెప్పాడు. ‘నేను తీసుకుంది సులువైన నిర్ణయం. కెప్టెన్, కోచ్‌ల వద్దకు వెళ్లి నా స్థానంలో మరొకరిని ప్రయత్నించేందుకు ఇది సరైన సమయమని చెప్పా. ప్రస్తుతం నాకు శారీరకంగా, మానసికంగా విరామం తప్పనిసరి అనిపించింది. అన్ని విధాలా కోలుకున్న తర్వాత మళ్లీ వచ్చి మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనని నమ్ముతున్నా’ అని మ్యాక్స్‌వెల్ చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 5.33 సగటుతో 32 పరుగులే చేశాడు. ఇందులో 3 సార్లు డకౌట్ కాగా, ఒక్కటే మ్యాచ్‌లో ఐదుకంటే ఎక్కువ బంతులు ఆడాడు. కోల్‌కతాతో మ్యాచ్‌లో రెండు సార్లు క్యాచ్ జారవిడిస్తే 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు.



రాయల్స్‌కు బట్లర్ జోష్


బట్లర్ విజయానందం

- వీరోచిత శతకంతో గెలిపించిన ఓపెనర్
- 2 వికెట్ల తేడాతో కోల్‌కతాపై రాజస్తాన్ విజయం
- నరైన్ మెరుపు సెంచరీ వృథా

కోల్‌కతా: కోల్‌కతాతో మ్యాచ్‌లో రాజస్తాన్ విజయలక్ష్యం 224...14 ఓవర్ల తర్వాత 128/6తో అసాధ్యంగా కనిపించింది. చివరి 6 ఓవర్లలో 96 పరుగులు కావాలి! ఈ దశలో బట్లర్ 42 పరుగుల వద్ద ఉన్నాడు. కానీ బట్లర్‌తో పాటు పావెల్ బ్యాటింగ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. వరుసగా 6 ఓవర్లలో 17, 17, 16, 18, 19, 9 పరుగుల చొప్పున రాబట్టిన రాయల్స్ విజయాన్ని అందుకుంది. ఇందులో బట్లర్ 6 ఫోర్లు, 5 సిక్స్‌లు బాదగా...పావెల్ 1 ఫోర్, 3 సిక్స్‌లు బాదాడు. ఆఖరి ఓవర్లో తొలి బంతినే సిక్స్‌గా కొట్టి 55 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్న బట్లర్... సింగిల్ తీయకుండా ఆఖరి బంతి దాకా నిలబడి గెలిపించాడు. 15వ ఓవర్లో 36 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన బట్లర్ తర్వాత సంచలన ఇన్నింగ్స్ ఆడిన మరో 21 బంతుల్లోనే వందకు చేరుకున్నాడు. దీంతో మంగళవారం జరిగిన పోరులో రాజస్తాన్ రాయల్స్ 2 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అనూహ్య విజయం సాధించింది. తొలుత నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. సునీల్ నరైన్ (56 బంతుల్లో 109; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) తొలి సెంచరీ సాధించాడు. తర్వాత రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసి గెలిచింది. జోస్ బట్లర్ (60 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. పావెల్ (13 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించాడు.

నరైన్ ధనాధన్

ఫిల్ సాల్ట్ (10) లైఫ్‌ను సద్వినియోగం చేసుకోకపోగా, రఘువంశీ (18 బంతుల్లో 30; 5 ఫోర్లు) రాణించాడు. ఓపెనర్ నరైన్ 4, 6తో జట్టు పవర్‌ప్లేలో 56/1 స్కోరు చేసింది. సగం ఓవర్లు (10) ముగిసేసరికి నైట్‌రైడర్స్ సరిగ్గా 100/1 స్కోరు చేసింది. నరైన్ సిక్సర్‌తో 29 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆ మరుసటి ఓవర్లో కుల్దీప్ సేన్... రఘువంశీ ఆట ముగించడంతో రెండో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7), రసెల్ (13) జతయినా... పెద్ద స్కోర్లేమీ చేయలేకపోయారు. కానీ నరైన్ ఫోర్లు, సిక్స్‌లతో తన ఆట తీరును కొనసాగించాడు. చహల్ 16వ ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదేయడంతో ఆ ఓవర్లో 23 పరుగులు వచ్చాయి. దీంతోనే అతని సెంచరీ 49 బంతుల్లో పూర్తయ్యింది. 18వ ఓవర్లో బౌల్ట్ యార్కర్‌తో నరైన్ పోరాటానికి ముగింపు పలికాడు.


నరైన్

రింకూ సింగ్ (9 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మెరుపులతో నైట్‌రైడర్స్ 200 పైచిలుకు స్కోరు చేసేసింది.

బట్లర్ మెరుపులతో...

ఓపెనర్ యశస్వి జైస్వాల్ (9 బంతుల్లో 19; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడిన అది కాసేపే కావడం, టాపార్డర్‌లో కెప్టెన్ సంజూ సామ్సన్ (12) చెప్పుకోదగ్గ స్కోరే చేయలేక పోవడం రాజస్తాన్ లక్ష్యఛేదనపై ప్రభావం చూపింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఓపెనింగ్ చేసిన బట్లర్ క్రీజును అట్టి పెట్టుకున్నాడు. కానీ ధాటిగా ఆడలేకపోయాడు. రియాన్ పరాగ్ (14 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ఆడే క్రమంలో వికెట్ కోల్పోగా... ధ్రువ్ జురెల్ (2), అశ్విన్ (8), హెట్‌మైర్ (0) చేతులెత్తేయడంతో 121 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X ఢిల్లీ
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	6	4	2	8	0.726
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	6	3	3	6	0.038
గుజరాత్	6	3	3	6	-0.637
పంజాబ్	6	2	4	4	-0.218
ముంబై	6	2	4	4	-0.234
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) అండ్ (బి) అవేశ్ 10; నరైన్ (బి) బౌల్ట్; రఘువంశీ (సి) అశ్విన్ (బి) కుల్దీప్ సేన్ 30; శ్రేయస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 11; రసెల్ (సి) జురెల్ (బి) అవేశ్ 13; రింకూసింగ్ నాటౌట్ 20; వెంకటేశ్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 8; రమణ్‌దీప్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 223. వికెట్ల పతనం:** 1-21, 2-106, 3-133, 4-184, 5-195, 6-215.
బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 4-0-31-1, అవేశ్ ఖాన్ 4-0-35-2, కుల్దీప్ సేన్ 4-0-46-2, చహల్ 4-0-54-1, అశ్విన్ 4-0-49-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) వెంకటేశ్ (బి) వైభవ్ 19; బట్లర్ నాటౌట్ 107; సామ్సన్ (సి) నరైన్ (బి) హర్షిత్ 12; పరాగ్ (సి) రసెల్ (బి) హర్షిత్ 34; జురెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నరైన్ 2; అశ్విన్ (సి) రఘువంశీ (బి) వరుణ్ 8; హెట్‌మైర్ (సి) శ్రేయస్ (బి) వరుణ్ 0; పావెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నరైన్ 26; బౌల్ట్ రనౌట్ 0; అవేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 224. వికెట్ల పతనం:** 1-22, 2-47, 3-97, 4-100, 5-121, 6-121, 7-178, 8-186. **బౌలింగ్:** స్టార్క్ 4-0-50-0, వైభవ్ 3-0-45-1, హర్షిత్ రాణా 4-0-45-2, నరైన్ 4-0-30-2, వరుణ్ 3-0-36-2, రసెల్ 1-0-17-0.


జ్యోతిని వెలిగిస్తున్న నటి మారియా మినా

కౌంట్‌డౌన్ @100

- మరో వంద రోజుల్లో పారిస్ ఒలింపిక్స్
- గ్రీస్‌లో జ్యోతి ప్రజ్వలనం

ఒలింపియా (గ్రీస్): ప్రపంచ క్రీడా పండుగ పారిస్ ఒలింపిక్స్-2024కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో 100 రోజుల్లో ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఒలింపిక్స్ పుట్టిల్లు గ్రీస్‌లో జ్యోతి ప్రజ్వలన ఘట్టాన్ని నిర్వహించారు. తొలి ఒలింపిక్స్ నిర్వహించిన ప్రాచీన ఒలింపియాలో ఈ ఆకర్షణీయమైన కార్యక్రమం జరిగింది. ప్రాచీన సంప్రదాయ వేషధారణలో గ్రీక్ నటి మారియా మినా జ్యోతిని వెలిగించింది. సాధారణంగా సూర్య కిరణాలను అక్కడే ఉంచిన ప్రత్యేక అద్దంపై ప్రసరింపజేసి దాని ద్వారా జ్యోతిని వెలిగిస్తారు. అయితే మంగళవారం అంతా చల్లగా మారి వాతావరణంగా అనుకూలంగా లేకుండా పోయింది. దాంతో అక్కడ అందుబాటులో ఉంచిన ఇతర ప్రత్యామ్నాయ పద్ధతిలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. లాంఛనం ముగిసిన తర్వాత తొలి టార్చ్‌ను రోయింగ్‌లో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అయిన గ్రీస్ ఆటగాడు స్టెఫనోస్ దూస్కస్ అందుకోగా... రెండో టార్చ్ బేరర్‌గా ఆతిథ్య ఫ్రాన్స్‌కు చెందిన మాజీ ఒలింపిక్ స్విమ్మింగ్ చాంపియన్ లారా మనాడూ నిలిచింది. ఈ టార్చ్ ఇక్కడినుంచి మొదలై గ్రీస్ దేశంలో సుమారు 5 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఏప్రిల్ 26న పారిస్ ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ వద్దకు ఇది చేరుతుంది. అనంతరం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు కూడా దీనిని తీసుకెళతారు.


ఒలింపిక్ టార్చ్‌లతో స్టెఫనోస్ దూస్కస్, లారా మనాడూ

అగ్ర స్థానంలోనే గుకేశ్

- హంపికి మరో ‘డ్రా’
- క్యాండిడేట్స్ చెస్ టోర్నీ



టొరంటో: ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు డి.గుకేశ్ పది రౌండ్ల తర్వాత కూడా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. గుకేశ్, నెపోమినియాచి (రష్యా) మధ్య జరిగిన పదో రౌండ్ గేమ్ ‘డ్రా’గా ముగిసింది. ఈ గేమ్ అనంతరం వీరిద్దరు కూడా చెరో 6 పాయింట్లతో సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నారు. ఇతర గేమ్‌లలో ఫిరూజా అలీరెజా (ఫ్రాన్స్)పై ఫాబియానో కరునా (అమెరికా)... నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)పై హికారు నకమురా (అమెరికా) విజయం సాధించారు. ఇద్దరు భారత ఆటగాళ్లు విదిత్ గుజరాతీ, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ ‘డ్రా’ అయింది. ప్రజ్ఞానంద, నకమురా (5.5 పాయింట్లు) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపికి మరో ‘డ్రా’ ఎదురైంది. పదో గేమ్‌లో హంపి, జోంగి తాన్ (చైనా) సమ ఉజ్జీలుగా నిలిచారు. అయితే మరో భారత ప్లేయర్ ఆర్.వైశాలి...సలిమోవా (బల్గేరియా)పై గెలుపొందింది. చైనాకు చెందిన లీ టింగ్‌జీ, జోంగి తాన్ ప్రస్తుతం 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

సినిమా


సాయి పల్లవి



రణ్‌బీర్ కపూర్


‘జై హనుమాన్’ పోస్టర్

అంతా రామమయం... ఈ జగమంతా రామమయం...
ఈరోజు దాదాపు ఎక్కడ చూసినా రామ నామమే.
వెండితెర పైనా రామ నామం వినపడబోతోంది.
రాముడిపై ఇప్పటికే పలు చిత్రాలు వచ్చాయి.
త్వరలో కొన్ని చిత్రాలు రానున్నాయి.
ఈ శ్రీరామ నవమి సందర్భంగా
ఆ శ్రీరాముడి చిత్రాల గురించి
తెలుసుకుందాం.

రాముడి చిత్రమ్

- రాముడు ఆజానుబాహుడు.. అందగాడు... వీరం, కరుణ, ప్రేమ... ఇలా సకల గుణాలూ ఉన్నవాడు. ఎన్ని ఉన్నా అసలు రాముడంటే సౌమ్యంగా కనిపించాలి. రణ్‌బీర్ కపూర్ దాదాపు అలానే ఉంటారు. అందుకే దర్శకుడు నితీష్ తివారీ తన ‘రామాయణ్’ చిత్రానికి రాముడిగా రణ్‌బీర్ కపూర్‌ని ఎన్నుకున్నారు. అందం, అభినయం రెండూ మెండుగా ఉన్న సాయి పల్లవిని సీత పాత్రకు ఎంపిక చేసుకున్నారు. అధికారికంగా ప్రకటించలేదు కానీ ఈ చిత్రం షూటింగ్ ఈ మధ్యే ముంబైలో ఆరంభించారు. ఈ చిత్రానికి నమిత్ మల్హోత్రా ఓ నిర్మాత కాగా ‘కేజీఎఫ్’ ఫేమ్ యశ్ మరో నిర్మాత. ఈ చిత్రంలో రావణుడి పాత్రను కూడా యశ్ చేస్తారట. నేడు ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. వచ్చే ఏడాది దీపావళికి ‘రామాయణ్’ రిలీజవుతుందని సమాచారం.
- ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ వస్తున్న కంగనా రనౌత్‌ది కథానాయికల్లో సెపరేట్ రూట్. స్వతహాగా రాముడి భక్తురాలైన కంగనా ఇప్పటికే రామ మందిరం నేపథ్యంలో ‘అపరాజిత అయోధ్య’ చిత్రాన్ని, ‘సీత: ది ఇన్‌కార్నేషన్’ చిత్రాన్ని ప్రకటించారు. కానీ ఇవి పట్టాలెక్క లేదు. గత ఏడాది తన ‘తేజస్’ చిత్రం విడుదల సందర్భంగా అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరాన్ని సందర్శించారు కంగనా రనౌత్. ఆ సమయంలో అయోధ్యపై తాను కథ సిద్ధం చేశానని పేర్కొన్నారామె. ‘‘ఇది ఆరువందల ఏళ్ల పోరాటం. ఇప్పుడు రామ మందిరం సాధ్యమైంది. అయోధ్యపై కథ రాయడానికి నేను చాలా పరిశోధించాను’’ అని కూడా చెప్పారు కంగనా రనౌత్. అయితే ఈ చిత్రాన్ని ఎప్పుడు ఆరంభిస్తారనేది తెలియజేయలేదు.
- తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ‘హనుమాన్’ గడచిన సంక్రాంతికి విడుదలై, ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఈ చిత్రానికి రెండో భాగంగా ‘జై హనుమాన్’ రానుంది. ‘జై హనుమాన్’ కథ రాయడానికి ఓ పాన్ ఇండియా స్టార్ స్ఫూర్తి అన్నట్లుగా ప్రశాంత్ వర్మ ఓ సందర్భంలో పేర్కొన్నారు. రెండో భాగం ప్రధానంగా హనుమంతుడి నేపథ్యంలో సాగుతుందని టాక్. వార్తల్లో ఉన్న ప్రకారం హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తారట. ‘హను మాన్’ చిత్రం చూసి, ప్రశాంత్ వర్మకు రణ్‌వీర్ ఫ్యాన్ అయ్యారని సమాచారం. ఇటీవల ఈ ఇద్దరి మధ్య ‘జై హనుమాన్’ గురించి చర్చలు జరిగాయని, రణ్‌వీర్‌కు స్క్రిప్ట్ కూడా నచ్చిందని భోగట్టా. కాగా.. ప్రశాంత్-రణ్‌వీర్ కాంబినేషన్‌లో రూపొందనున్నది ‘జై హనుమాన్’ కాదు.. వేరే చిత్రం అనే మరో ప్రచారం కూడా జరుగుతోంది. ఏది ఏమైనా ప్రశాంత్ వర్మ ‘జై హనుమాన్’ తెరకెక్కించడం ఖాయం. ఈ చిత్రం నటీనటుల గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


అరుణ్ గోవిల్

- 1980లలో రాముడంటే బుల్లితెర వీక్షకులు చెప్పిన పేరు అరుణ్ గోవిల్. ‘రామాయణ్’ సీరియల్‌లో రాముడిగా అంత అద్భుతంగా ఒదిగిపోయారాయన. ఇప్పటికీ రాముడంటే చాలామంది అరుణ్ పేరే చెబుతారు. రాముడి కథాంశంతో ఇటీవల విడుదలైన ‘695: ట్రైంప్ ఆఫ్ ఫెయిత్’లో ఆయన నటించారు. ‘‘ఒక కాలాతీత కథలో మళ్లీ నటించడం గౌరవంగా భావిస్తున్నాను. ‘695: ట్రైంప్ ఆఫ్ ఫెయిత్’ అనేది కేవలం సినిమా మాత్రమే కాదు.. మన సాంస్కృతిక వారసత్వం’’ అని పేర్కొన్నారు అరుణ్ గోవిల్. రామ జన్మభూమిపై రజనీష్ బెర్రీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జనవరిలో విడుదలైంది.

ఇవే కాదు.. రాముడిపై ఇటు దక్షిణాది అటు ఉత్తరాదిన మరిన్ని చిత్రాలకు సన్నాహాలు జరుగుతున్నాయి.


కంగనా రనౌత్


విశాల్

‘తమిళనాడు బోర్డర్‌లో ఏం జరుగుతోంది’ అనే డైలాగ్‌తో ‘రత్నం’ సినిమా ట్రైలర్ ఆరంభమైంది. విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘రత్నం’. హరి దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్‌పై కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న

ఆ అమ్మాయి నా ప్రాణం

తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కె. రాజ్‌కుమార్ రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ‘రత్నం’ మూవీ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ‘రేయ్... ఆ అమ్మాయి నా ప్రాణం, నా ఊపిరి... చెయ్యేస్తావారా...’, ‘తిరుత్తణి కాదు... వేలూరు కాదు... తమిళనాడు కాదు... కేరళ కాదు... నిన్ను వెతుక్కుంటూ వచ్చి నరికేస్తాను రా’ అంటూ విశాల్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ‘‘మాస్ యాక్షన్, లవ్ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘రత్నం’. యాక్షన్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న హరి దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీపై మంచి హైప్ ఏర్పడింది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవీశ్రీ ప్రసాద్.

కన్నప్పలో అక్షయ్ కుమార్


మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, విష్ణు మంచు

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ‘కన్నప్ప’ చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతోన్న చిత్రం ‘కన్నప్ప’. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు అక్షయ్ కుమార్. ఈ సందర్భంగా మోహన్‌బాబు, విష్ణు మంచు కలిసి అక్షయ్‌కి స్వాగతం పలికారు. ‘‘శివ భక్తుడైన కన్నప్ప కథను ‘కన్నప్ప’గా తెరపైకి తీసుకొస్తున్నాం. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మూవీ రూపొందుతోంది. హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. అక్షయ్‌తో పాటు ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం’’ అన్నారు మేకర్స్.

త్వరలో వందో సినిమా చేస్తాం

- ఆర్‌బీ చౌదరి

‘‘మా ‘సూపర్ గుడ్ ఫిలింస్’ బేనర్‌లో ‘భవనమ్’ 95వ సినిమా. అలాగే 96, 97, 98వ సినిమాలు కూడా షూటింగ్ జరుపుకుంటున్నాయి. త్వరలో 100 సినిమాల మైలురాయిని చేరుకోబోతున్నాం. ‘భవనమ్’ చిత్రాన్ని బాలాచారి చక్కగా తీశాడు. ఈ మూవీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అని నిర్మాత ఆర్‌బీ చౌదరి అన్నారు. అజయ్, సప్తగిరి, ధనరాజ్, ‘షకలక’ శంకర్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన పాత్రల్లో బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహించిన చిత్రం ‘భవనమ్’. సూపర్ గుడ్ ఫిలింస్ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను, ‘యాదమ్మ..’ అంటూ సాగే జానపద పాటని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బాలాచారి మాట్లాడుతూ– ‘‘సూపర్ గుడ్‌లో ఇరవై ఏళ్ల క్రితం ‘విద్యార్థి’ అనే సినిమా చేశాను. చౌదరిగారు ‘భవనమ్’ కోసం మరో అవకాశం ఇచ్చారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది’’ అన్నారు.


‘షకలక’ శంకర్, ఆర్‌బీ చౌదరి, సప్తగిరి

నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను

- శ్రద్ధా దాస్

‘‘కొంచెం గ్యాప్ తర్వాత నేను తెలుగులో నటించిన సినిమా ‘పారిజాత పర్వం’. ఇందులో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. నా క్యారెక్టర్ సినిమా మొత్తం ఉంటుంది. ఈ మూవీలో కొంచెం సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉంటాయి. అందరూ మా సినిమాని ఆదరిస్తారని ఆశిస్తున్నాను’’ అని హీరోయిన్ శ్రద్ధా దాస్ అన్నారు. సునీల్, శ్రద్ధా దాస్, చైతన్యా రావు, మాళవికా సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన చిత్రం ‘పారిజాత పర్వం’. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘పారిజాత పర్వం ప్రీ కిడ్నాప్ ఈవెంట్’ పేరుతో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ‘‘నిర్మాత మహీధర్‌కి సినిమాలంటే ప్యాషన్. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి’’ అన్నారు. ‘‘సినిమా బాగా వచ్చింది.. అందరూ ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు మహీధర్ రెడ్డి, దేవేష్. ‘‘హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘పారిజాత పర్వం’’ అన్నారు సంతోష్ కంభంపాటి. ‘‘మా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాను’’ అన్నారు చైతన్యా రావు.


శ్రద్ధా దాస్, చైతన్యా రావు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
456	125
72,944	22,148

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,899	△ 13
డోజోన్స్	37,857	△ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,166	△ 89
డాక్స్	15,509	△ 328
షాంఘై	3,007	▽ 50
నికాయ్	38,471	▽ 762

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,302	△1,488
బంగారం (99.5 స్వచ్ఛత)	73,008	△1,487
వెండి (కేజీ)	83,213	▽ 239

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.06
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	106.76
€	యూరో	ఎస్‌బీఐ	87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.20	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.26	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.38

ఎంఎఫ్ ఆస్తులు రూ. 53.4 లక్షల కోట్లు

- 2023-24లో 35 శాతం జూమ్
- వార్షికంగా రూ. 14 లక్షల కోట్ల జమ
- 17.78 కోట్లకు ఫోలియోల సంఖ్య



న్యూఢిల్లీ: దేశీయంగా మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) ఆస్తులు గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో 35% జంప్ చేశాయి. రూ. 53.4 లక్షల కోట్లను తాకాయి. వార్షికంగా రూ. 14 లక్షల కోట్లమేర ఎగశాయి. ఇందుకు ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, లాభాల పరుగు తీస్తున్న ఈక్విటీ మార్కెట్లు ప్రభావం చూపాయి. వెరసి 2020-21 ఏడాది(41 శాతం వృద్ధి) తదుపరి గరిష్టస్థాయిలో ఎంఎఫ్ ఆస్తులు బలపడినట్లు వార్షిక నివేదికలో ఫండ్స్ దేశీ అసోసియేషన్(యాంఫి) వెల్లడించింది. ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) పురోగతి.. ఫండ్స్ పరిశ్రమలో పెరుగుతున్న ఇన్వెస్టర్లను ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొంది. ఫలితంగా మార్చి చివరికల్లా ఫోలియోల సంఖ్య 17.78 కోట్లను తాకింది. ఇది సరికొత్త రికార్డు కాగా.. ఇన్వెస్టర్ల బేస్ 4.46 కోట్లకు చేరింది. ఇన్వెస్టర్ల సంఖ్యలో మహిళల వాటా 23 శాతంకావడం గమనార్హం!

సిప్ దన్ను

క్రమబద్ధ పెట్టుబడుల(సిప్) పథకాలను ఇన్వెస్టర్లు ఆదరిస్తుండటంతో వీటి సంఖ్య బలపడుతోంది. దీంతో నెలవారీ నికర పెట్టుబడులు మార్చిలో రూ. 19,300 కోట్లకు చేరాయి. పూర్తి ఏడాదిలో సిప్ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు లభించాయి. ఇది ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తిని పట్టిచూపుతోంది. అంతేకాకుండా క్రమశిక్షణతోకూడిన పెట్టుబడులను ప్రతిబింబిస్తోంది. దేశీ ఎంఎఫ్ పరిశ్రమకు గతేడాది మైలురాయివంటిదని యాంఫి నివేదిక పేర్కొంది. ఏయూఎం చెప్పుకోదగ్గవిధంగా రూ. 14 లక్షల కోట్లమేర పెరిగి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 53.4 లక్షల కోట్లకు చేరినట్లు వివరించింది. 2022-23లో ఫండ్స్ ఏయూఎం విలువ రూ. 39.42 లక్షల కోట్లు మాత్రమేనని ప్రస్తావించింది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఆధారిత పథకాలు తదితరాలలో ప్రధానంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పరిశ్రమ ఆస్తుల్లో వీటి వాటా 58 శాతంకాగా.. ఫోలియో సంఖ్యలో 80 శాతాన్ని ఆక్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఇవన్నీ ఎంఎఫ్‌ల ద్వారా క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న కుటుంబ మదుపును ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేసింది.

ఈక్విటీకే ఓటు

గతేడాది పెట్టుబడుల్లో ఈక్విటీ ఆధారిత పథకాలు 55 శాతం వృద్ధిని అందుకుని ఆస్తులలో రూ. 23.5 లక్షల కోట్లకు చేరాయి. ఇందుకు పెట్టుబడులతో పాటు.. మార్కుటు మార్కెట్(ఎంటుఎం) లాభాలు సహకరించాయి. అయితే మరోవైపు రుణ పథకాల ఫండ్స్ 7 శాతమే బలపడ్డాయి. ఏయూఎంలో రూ. 12.62 లక్షల కోట్లకు చేరాయి. అయినప్పటికీ అంతక్రితం రెండేళ్లలో ఆస్తులు తగ్గుతూ వచ్చిన అంశంతో పోలిస్తే మెరుగేనని నివేదిక తెలియజేసింది.

మూడోరోజూ పతనమే

- సెన్సెక్స్ 456 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 125 పాయింట్ల క్షీణత
- మూడు వారాల దిగువకు సూచీలు
- శ్రీరామ నవమి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు



ముంబై: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలతో స్టాక్ సూచీలు మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ, మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 456 పాయింట్లు నష్టపోయి 72,944 వద్ద నిలిచింది. నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 22,148 వద్ద స్థిరపడింది. ఇవి 3 వారాల కనిష్ట స్థాయిలు కాగా.. నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 72,685 వద్ద, నిఫ్టీ 147 పాయింట్లు క్షీణించి 22,125 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఆయిల్, విద్యుత్, వినిమయ, పారిశ్రామిక, కన్జూమర్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు దాదాపు సగం నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.05% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,468 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, డీఐఐలు రూ.2,040 కోట్ల షేర్లను కొనుగోలు చేశాయి.

- ➤ శ్రీరామ నవమి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- ➤ అమెరికా వడ్డీ రేట్ల వాయిదా అంచనాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్ 4%, ఎంఫసీస్ 3.50%, కోఫోర్జ్ 3%, పర్సిస్టెంట్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.
- ➤ వెల్త్‌మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ కంపెనీల ఏర్పాటుకు బ్లాక్‌రాక్‌తో ఒప్పందం చేసుకోవడంతో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 2% లాభపడి రూ.362 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% ఎగసి రూ.372 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,733 కోట్లు పెరిగి రూ.2.30 లక్షల కోట్లకు చేరింది.
- ➤ సెన్సెక్స్ మూడు రోజుల్లో 2,094 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈలో మార్కెట్ విలువలో రూ.7.93 లక్షల కోట్లు మాయమ్యాయి.

రికార్డు కనిష్టానికి రూపాయి

- 83.61కి దేశీ కరెన్సీ విలువ



డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ఉద్రిక్తతలతో ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ 5 నెలల గరిష్టానికి బలపడటం ప్రధాన కారణం. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 83.51 వద్ద మొదలైంది. రోజంతా నష్టాల్లో కదలాడి ఇంట్రాడే కనిష్టం(83.61) వద్ద స్థిరపడింది. ఈ ఏడాది మార్చి 22న ఇదే స్థాయి(83.61) వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది. వెరసి గడిచిన నాలుగు వారాల్లో దేశీయ కరెన్సీ రెండోసారి జీవితకాల కనిష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

మళ్లీ మెరిసిన పసిడి, వెండి

బంగారం కొత్త రికార్డు రూ. 73,750

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల భయాలతో పసిడి, వెండి పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ధోరణులకు తగ్గట్లు దేశీయంగా వెండి, బంగారం ధరలు మంగళవారం మరో రికార్డు స్థాయిని తాకాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రకారం దేశ రాజధానిలో ఉదయం పసిడి 10 గ్రాముల ధర రూ. 700 పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి అయిన రూ. 73,750ని తాకింది. అదే విధంగా వెండి ధర కూడా కేజీకి రూ. 800 పెరిగి రూ. 86,500 స్థాయిని తాకింది. ఎంసీఎక్స్‌లో జూన్ కాంట్రాక్టు ధర ఇంట్రా-డేలో రూ. 72,927 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లు చూస్తే కామెక్స్‌లో ఔన్సు (31.1 గ్రాముల) పసిడి ధర 15 డాలర్లు పెరిగి 2,370 వద్ద ట్రేడయ్యింది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగినంత కాలం బంగారం బులిష్‌గానే ఉండనున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు.




కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-4-2024 ఫామ్ ధర...

విశాఖ	419-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404-00
విజయవాడ	404-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

క్రిసిల్ క్యూ1 లాభం డౌన్

షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్ దిగ్గజం క్రిసిల్ ఈ ఆర్థిక సంవత్సరం(2024) తొలి త్రైమాసికం(క్యూ1)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చిలో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతంపైగా క్షీణించి రూ. 138 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలం(క్యూ1)లో రూ. 146 కోట్లు ఆర్జించింది. కంపెనీ కేలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 751 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో రూ. 732 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 539 కోట్ల నుంచి రూ. 563 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. గతేడాది(2023)కిగాను కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 14న డివిడెండ్ చెల్లించనుంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీడీపీ 6.8 శాతం వృద్ధిని సాధించవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

క్రిసిల్ షేరు 3% తగ్గి రూ. 4,700 వద్ద ముగిసింది.

సోనీతో విలీనంపై జీ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: సోనీతో విలీన ప్రతిపాదన అమలయ్యేలా ఆదేశాలివ్వాలంటూ ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌ను జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) ఉపసంహరించుకుంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్న ట్లు వివరించింది. షేర్‌హోల్డర్లకు మరింత విలువ చేకూర్చే అవకాశాలను ఉపయోగించుకోవడంపై, సోనీపై ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడంపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. సోనీ భారత వ్యాపార విభాగం, జీల్ విలీనంపై కొన్నాళ్లుగా కసరత్తు జరిగినప్పటికీ ఒప్పందం కుదరని సంగతి తెలిసిందే.

జ్యువెలరీ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

- రూ. 5 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు
- ఏబీసీ డిజిటల్ సూపర్ యాప్ ఆవిష్కరణ



ముంబై: ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా జ్యువెలరీ రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. మంగళవారం ఆదిత్య బిర్లా క్యాపిటల్ డిజిటల్ (ఏబీసీడీ) సూపర్ యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ చైర్మన్ కేఎం బిర్లా ఈ విషయాలు వెల్లడించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఈ మధ్యే పెయింట్స్ వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు, డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా వచ్చే మూడేళ్లలో 3 కోట్ల మంది పైగా కొత్త కస్టమర్లను చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు బిర్లా వివరించారు. ప్రస్తుతం రుణాలు, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపార విభాగాల ద్వారా ఆదిత్య బిర్లా క్యాపిటల్ సుమారు 3.5 కోట్ల మంది కస్టమర్లకు సేవలు అందిస్తోంది. సూపర్ యాప్‌లో 22 ఉత్పత్తులు, సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

జిల్లా వార్తలు

తలెత్తుకునేలా పాలించారు

- ఎస్సీల ఆత్మగౌరవాన్ని పెంచింది సీఎం జగనే
- జగ్గయ్యపేటలో ఎస్సీల ఆత్మీయ సమావేశంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నందిగం సురేష్, ఎమ్మెల్యే ఉదయభాను, జూపూడి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీలు తలెత్తుకొని తిరిగే విధంగా వారి ఆత్మగౌరవాన్ని పెంచింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ఎస్సీల ఆత్మీయ సమావేశంలో నందిగం సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎస్సీలు అన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నారన్నారు. కొన్ని తరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు జెండాలు మోసి మోసి అలసిపోయారన్నారు. అలాంటి వారిని కుర్చీలపై కూర్చో పెట్టాలన్న ఆలోచనతో ఉన్నత స్థాయి పదవులిచ్చిన దేవుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం జగనన్న బస్సు యాత్రను చూసి భయంతో వణికిపోతున్న చంద్రబాబు, అండ్‌కో యాత్రను ఆపాలని జగనన్నపై రాళ్ల దాడి చేయించారన్నారు. ఇది పేదవానిపై జరిగిన దాడి అని తెలుసుకోవాలన్నారు. మరలా జగనన్న పాలన రాకపోతే మనకు బానిస బతుకులు తప్పవన్నారు. మరలా జగన్ ప్రభుత్వం రాకపోతే పథకాలన్నీ ఆగిపోతాయని, పెత్తందారీ వ్యవస్థ వచ్చి మళ్లీ లంచాల రాజ్యం మొదలవుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పక్కన నందిగం సురేష్, జూపూడి

దళితుల పార్టీ వైఎస్సార్ సీపీనే: ఉదయభాను

చంద్రబాబు, దుష్ట చతుష్టయం పేదలను ఎగతాళి చేస్తూ.. వారిని ఎప్పుడు పేదలుగానే ఉంచాలని ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మరోవైపు నా ఎస్సీ, నాఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అండగా తాను ఉన్నానంటూ వారిని అక్కున చేర్చుకున్నారని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటేనే దళితుల పార్టీ గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని నానీని గెలిపించాలని కోరారు.

దళితులకు గౌరవం..

మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినప్పటికీ ఎవరూ గౌరవించని విధంగా అంబేద్కర్‌కు 205 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని విజయవాడలో నిర్మించి గౌరవించిన జగన్‌మోహన్‌రెడ్డి దళిత బిడ్డలకు అందలం ఎక్కించారన్నారు. నెడ్ క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే దళితులకు సమాజంలో గౌరవం పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, నేతలు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, సామినేని విమలాభాను, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వత్సవాయి జెడ్పీటీసీ ఏసుపోగు దేవమణి పాల్గొన్నారు.

'స్వరలయ' ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం

తెనాలి: పట్టణ సంగీత, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. గత ఆరు దశాబ్దాలుగా సంగీత, నాటక కార్యక్రమాలకు మృదంగ సహకారం అందిస్తూ వచ్చిన మృదంగ విద్వాంసుడు మోదుకూరి నగధరరావును సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. నగధరరావు జీవిత విశేషాలను, ఆయన ప్రతిభను వివరించారు. ముఖ్య అతిథి పొన్నపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటించినప్పటి నుంచి క్రమం తప్పకుండా ఉత్సవాలను నిర్వహిస్తున్న స్వరలయ సంస్థను అభినందించారు. నటుడు, కవి పాతూరి సుబ్రహ్మణ్యం, సీనియర్ డైరీ ప్రసాద్, హేమాచారి, మల్లీశ్వరరావు, రమేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యువత కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలి



రవివర్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

- కెనరా బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ జనరల్ మేనేజర్ రవివర్మ
- ఉత్సాహంగా సాగిన మాగ్నోవా-2కె24

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవడానికి ఏమి చేయాలనే అంశాలపై ఆలోచనలు చేసి ఆచరణలో పెట్టాలని కెనరా బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో మాగ్నోవా-2కె24 పేరుతో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు పోటీలను మంగళవారం నిర్వహించారు. రవివర్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే హార్డ్‌వర్క్‌తోనే సాధ్యమవుతుందనే విషయాన్ని నేటి తరం యువత గుర్తుంచుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల యువతలో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి. జంపాల మాట్లాడుతూ నైపుణ్యాలు పెంచుకున్న వారికే ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందన్నారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి కేవీ రమేష్ చంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫ్యాషన్ షోలో యువతి ర్యాంప్ వాక్

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. మాస్టర్ మైండ్స్(యంగ్ మేనేజర్), బిజ్‌బ్లాస్ట్(బిజినెస్ ప్లాన్), బిజినెస్ బ్రెయిన్ బాటిల్(బి క్విజ్), మార్కెట్ మేకర్స్, మిస్టర్ అండ్ మిస్ మాగ్నోవా, ఐపీఎల్ ఆక్షన్, రీల్ ఇట్ (రీల్ మేకర్) వంటి అంశాల్లో పలు కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ ఫ్యాషన్ దుస్తులు ధరించి విద్యార్థులు చేసిన ర్యాంప్ వాక్, నృత్యాలు అలరించాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీల పక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పిలుపునిచ్చారు. విజయవాడ విద్యాధరపురం బైపాస్ రోడ్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అధ్యక్షతన మంగళవారం రాత్రి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ కేంద్రంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు ఎత్తి వేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సహా బీజేపీ నాయకులు ప్రకటించటం దుర్మార్గమని మండిపడ్డారు. అటువంటి మతతత్వ పార్టీతో జతకట్టిన టీడీపీ, జనసేన పార్టీ కూటమికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. వైఎస్ తర్వాత ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న హఫీజ్ ఖాన్, ఆసిఫ్

మైనార్టీల ద్రోహి చంద్రబాబు కూటమి..

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు కూటమి అని, టీడీపీ ప్రభుత్వంలోనే గుంటూరులో జరిగిన నారా హమారా సభలో తమ సమస్యలపై ప్రశ్నించిన మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసు పెట్టి జైల్లో పెట్టించి చితక్కొట్టించటమే అందుకు నిదర్శనమని హఫీజ్ ఖాన్ గుర్తు చేశారు. విభిన్న మతాలు, కులాలు ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ సామాన్య కార్యకర్త, బీసీ వర్గానికి చెందిన షేక్ ఆసిఫ్‌ను జగనన్న పోటీలో నిలబెట్టారన్నారు. ఆయన స్థానికుడు, అందుబాటులో ఉండే వ్యక్తని అన్నారు. ఆసిఫ్‌పై పొలిటికల్ టూరిస్ట్, పలు బ్యాంకులను మోసం చేసిన పెత్తందారు బరిలో ఉన్నారన్నారు. ప్రజా సేవ ముసుగులో ఇక్కడికి వచ్చిన జాతీయ స్థాయి దోపిడీదారుడిని గెలిపిస్తే పశ్చిమ నియోజకవర్గం మొత్తం దోపిడీకి గురవుతుందని హెచ్చరించారు.

సీఎం జగన్ సమక్షంలో భారీగా చేరికలు



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన ఉక్కు కాకాని మనవడు విజయ్‌కుమార్, చిత్రంలో మంత్రి జోగి రమేష్, దేవినేని అవినాష్





టీడీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు అన్నవరపు అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీ కేశినేని నాని

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బస్సు యాత్ర సందర్భంగా కేసరపల్లిలోని రాత్రి బస పాయింట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్ హుస్సేన్, టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ ముస్తాఫా మొమిన్, నందిగామ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ కీలకనేత చిరుమామిళ్ల శ్రీనివాసరావు(బుజ్జి), నందిగామ పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ వడ్డెలి శ్రీనివాసరావు, నందిగామ మున్సిపల్ టీడీపీ కీలక నేత వై.రామారావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోడపాటి బాబూరావు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ షేక్ హసీనా, టీడీపీ సీనియర్ నేత కొమ్ము విజయరాజులు, కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం టీడీపీ నాయకురాలు చలసాని స్మిత(చలసాని పండు కుమార్తె), దేవినేని గౌతమ్ దంపతులు, బీసీవై పార్టీ నాయకులు కె. ఉమావల్లియాదవ్, మాదిగ హక్కుల కమిటీ ఫౌండర్ గురివిందపల్లి చిట్టిబాబు మాదిగ, మైలవరం నియోజకవర్గం మద్దిలపర్వ గ్రామానికి చెందిన బీసీ నేత టి.వెంకటరమణ, రెడ్డిగూడెం మాజీ జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, తెలుగు యువత నాయకుడు పి.సురేష్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, 40వ వార్డు టీడీపీ నేత, ప్రొఫెషనల్ వింగ్ జోనల్ కోఆర్డినేటర్ వెలగలేటి భార్గవ రాయుడు, ఎన్టీఆర్ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీ వసీం అక్రం, డివిజన్ అధ్యక్షుడు నీలం మనోజ్, ఎస్సీ విభాగం నాయకుడు అవినాష్, బీసీవై పార్టీ స్టేట్ కన్వీనర్ పట్టబోయిన శివ రామకృష్ణయాదవ్, ఆలిండియా యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్యయాదవ్, బెజవాడ బార్ అసోసియేషన్ ట్రెజరర్ బి.వెంకటేశ్వర్లుయాదవ్, యూత్ లీడర్ గోగుల విజయ్‌కుమార్, ఆటోనగర్ టింబర్ మర్చెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగయ్యయాదవ్, బి. అశోక్‌యాదవ్, మార్కాపురం టీడీపీ యూత్ కన్వీనర్ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, టింబర్ మర్చెంట్ అసోసియేషన్ సభ్యుడు చప్పిడి మల్లేశ్వరయాదవ్‌లు, పామర్రు నియోజకవర్గానికి చెందిన యాదవ మహాసంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డు రమేష్‌యాదవ్ వైఎస్సార్ సీపీలో చేరారు. జగన్‌మోహన్‌రెడ్డి వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి పాలిసెట్ హాల్ టికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన 'పాలిసెట్–2024'కు 1,59,505 దరఖాస్తులు వచ్చినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 442 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

1,000 సీబీఎస్ఈ స్కూళ్ల ఏర్పాటు గొప్ప అవకాశం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1,000 ప్రభుత్వ పాఠశాలలు సీబీఎస్ఈ బోధనకు అనుమతి పొందడం గొప్ప విషయమని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఇదో సదవకాశంగా భావించి అంకితభావంతో పనిచేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. 'సీబీఎస్ఈ 9,10 తరగతుల నిర్మాణాత్మక బోధన, పాఠ్య ప్రణాళిక రూపకల్పన'పై రిసోర్స్ పర్సన్లకు పాఠశాల విద్యాశాఖ శిక్షణ నిర్వహించింది. విజయవాడలో 2 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం మంగళవారం ముగిసింది. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడారు.

ఏబీడీఎంతో హెల్త్ రికార్డుల అనుసంధానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల హెల్త్ రికార్డుల్ని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)కు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏబీడీఎం రాష్ట్ర నోడల్ అధికారి బి.వి.రావు తెలిపారు. డీఎంఈ పరిధిలోని వైద్యులు, సిబ్బందికి మంగళగిరిలో నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లు, నర్సుల హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర జనాభాలో 4.13 కోట్ల అంటే 80 శాతం మందికి ఏబీడీఎం ఖాతాలు సృష్టించామన్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచే విషయంలో ఏపీ వైద్య శాఖ ముందడుగు వేసిందన్నారు.సెకండరీ హెల్త్ ఏబీడీఎం నోడల్ అధికారి నాగలక్ష్మి పాల్గొన్నారు.

3,320 పాఠశాలల్లో 'శ్లాస్' పరీక్ష

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం అంచనా కోసం నిర్వహణ

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ముగింపు దశలో నాలుగో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు 'స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే' (శ్లాస్) పరీక్షను మంగళవారం నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 3,320 పాఠశాలల్లో 82 వేల మంది విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన శ్లాస్‌కు 3,400 మంది సీఆర్పీలను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించినట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నిజాలకు పాతర.. అబద్ధాల జాతర

'బందిపోటు పాలన'ంటూ రామోజీ వీరంగం / రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేష్ వ్యాఖ్యలకు వక్రీకరణ / ఆయన మాటలను రాష్ట్రానికి అంటగడుతూ రామోజీ బరితెగింపు


బందిపోటు పాలన
సీఎంను కాబట్టి ఏదైనా చేసేస్తాననే ధోరణి సరికాదు
రాష్ట్రంలో అప్పులు దారుణం

సాక్షి, అమరావతి: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ఉంది ఈనాడు రామోజీ పరిస్థితి. కళ్ల ముందు కనిపిస్తున్న నిజాలను దాచి, అబద్ధాల కథనాలు అచ్చోస్తే ప్రజలు నమ్మేస్తారులే అన్న భ్రమల్లోనే ఆయన ఇంకా ఉన్నారు. ఇదే భ్రమలతో ఏది రాసినా చెల్లుతుందని గుడ్డిగా నమ్ముతూ రోజుకో అంశంపై ఆయన విషం కక్కుతున్నారు. పాఠకులు ఏమనుకుంటారనే ఇంగిత జ్ఞానం, సిగ్గూఎగ్గూ లేకుండా సీఎం జగన్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారు. అప్పుడెప్పుడో ఈట్ క్రికెట్.. స్లీప్ క్రికెట్.. డ్రింక్ క్రికెట్ అన్న ప్రకటన మాదిరిగా రామోజీ ఏ పనిచేస్తున్నా అందులో భూతద్దం పెట్టి జగన్ వ్యతిరేకతపై రంధ్రాన్వేషణ చేస్తున్నారు. ఇందులో భాగమే ఆయన కనుసన్నల్లో సాగిన తాజా పచ్చపైత్యం 'బందిపోటు పాలన' కథనం. డొంక తిరుగుడు రాతలతో ఎప్పటిలాగే సీఎం జగన్ పాలనపై రామోజీ అక్షరం అక్షరంలో తన అక్కసునంతా వెళ్లగక్కారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ అక్కడక్కడ బందిపోటు పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానిస్తే దాన్ని వక్రీకరించి రాష్ట్రానికి అంటగడుతూ రామోజీ బందిపోటు 'గోల' చేస్తూ పండగ చేసుకున్నారు. నేను సీఎం అయితే ఏ చట్టమైనా చేస్తా, కేసులు పెట్టిస్తా, జైల్లో వేస్తాం, భూములు లాక్కుంటాం అంటే కుదరదని.. అది బందిపోట్లు చేసే పనవుతుందని.. అక్కడక్కడ బందిపోటు పాలకులను చూస్తున్నామని పీవీ రమేష్ వ్యాఖ్యానిస్తే దాన్ని ఈనాడు రామోజీ సీఎం జగన్ పాలనకు ఆపాదిస్తూ పైశాచికానందం పొందారు.

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో..

నిజానికి.. ఏ ముఖ్యమంత్రి అయినా ఏ అధికారైనా రాజ్యాంగం, చట్టాల మేరకే పాలన సాగిస్తారని.. కానీ, ఏపీలో అందుకు విరుద్ధంగా పాలన సాగుతున్నట్లు పీవీ రమేష్ చెప్పారంటూ ఈనాడు తన వక్ర బుద్ధిని, సీఎం జగన్‌పై తన అక్కసును మరోసారి బయటపెట్టుకుంది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో వందిమాగధులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చర్చాగోష్టి పేరుతో సీఎం జగన్ పాలనపై ఈనాడు రామోజీ విమర్శలు చేయించి వాటిని వక్రీకరించీ మరీ అనైతికంగా అచ్చువేశారు. ఏ ప్రభుత్వమైనా దోచుకుంటే అది ప్రజాస్వామ్యం కాదు బందిపోట్ల పాలన అవుతుందని సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించేందుకు ఈనాడు రామోజీ తెగ ఆరాటపడిపోయారు. మరోవైపు.. సంక్షేమం, అభివృద్ధి వేర్వేరు కాదు ఒక్కటే.. రెండూ అవసరమేనని, డబ్బులు పంచడం సులభతరమేనని, అందుకు బటన్ నొక్కితే సరిపోతుందని, అలాగే ఇంటర్నెట్ ఉంటే చాలంటూ పేదలకు నగదు బదిలీ చేయడాన్ని పీవీ రమేష్ అవహేళన చేస్తూ తన పెత్తందారీ ధోరణిని బయటపెట్టుకున్నారు. ఈనాడు రామోజీ కూడా పెత్తందారే కాబట్టి పీవీ రమేష్ మాటలు చాలా రుచికరంగా ఉండటంతో ఆయన మాటలకు అత్యధిక ప్రాముఖ్యతనిచ్చి ప్రముఖంగా అచ్చువేశారు.

గురవింద గింజలా పీవీ రమేష్..

ఇక ప్రజలకు అవసరమైన సేవలందించడమే ప్రభుత్వ పాలనంటూ పీవీ రమేష్ చెప్పారు. సీఎంగా బాధ్యతలు చేపట్టగానే వైఎస్ జగన్ కూడా ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వాల తరహాలో గ్రామీణ, పట్టణ ప్రజలు తమకు అవసరమైన సేవలకు రాజకీయ నేతలు, మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరంలేకుండా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల ముంగిటికే పాలనం దిస్తున్న విషయం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్‌కు కనిపించడంలేదా? కనిపించినా ఈనాడు రామోజీ తనకు కావాల్సినట్లు రాసుకున్నారా? అసలు రమేష్ రిటైర్ కాగానే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగంలో చేరిన ఆయన ఇతరులకు నీతులు చెప్పడం అంటే తన కింద నలుపు చూసుకోకపోవడమే అవుతుంది. ఈనాడు రామోజీ వంటి పెత్తందారుకు కావాల్సినట్లు మాట్లాడాలి కాబట్టి పీవీ రమేష్ కూడా ఆ ముసుగు ధరించారు. ఏ గణాంకాలు చూసినా రాష్ట్రం ప్రగతిపథంలో వెళ్తున్నట్లు కనిపించడంలేదని.. రివర్స్ ఇంజన్‌లో రాంగ్ రూట్‌లో వెళ్తున్నామనే అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించే గణాంకాలను ఈయన చూడలేకపోతున్నట్లు ఉన్నారు. అందుకే గణాంకాలపై కూడా పెత్తందార్లకు ఏదీ కావాలో అదే ఎంపిక చేసుకుని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మేనిఫెస్టోలోని 99 శాతం అంశాలను అమలుచేసి పేదవర్గాలకు పైసా లంచం లేకుండా నగదు బదిలీచేస్తే దాన్ని కూడా పీవీ రమేష్ తప్పుపట్టారంటే పేదలు అభివృద్ధి చెందకూడదనే ధోరణిని ఆయన కూడా చాటుకున్నారు.

ఇవేవీ అభివృద్ధి కావా రమేష్..?

మరోపక్క.. ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ రంగంలో ఏకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడితే ఇది అభివృద్ధిగా రమేష్‌కు కనిపించడంలేదా? ఇదే పీవీ రమేష్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు నాడు–నేడు పేరుతో ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని కూడా మరిచిపోయి ఇప్పుడు పెత్తందారుల పంచన చేరి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అలాగే..

- నాలుగు పోర్టులను, పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇది అభివృద్ధి కాదా పీవీ రమేష్?
- పేదలందరికీ ఇళ్లు పేరుతో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి ఇంటి నిర్మాణాలను చేపట్టారు. ఇది పేదలు అభివృద్ధి చెందడం కాదా?
- గతంలో చంద్రబాబు వ్యవసాయ రుణాలన్నీ మాఫీచేస్తానని చెప్పి రైతులను మోసం చేశారు. ఆ సమయంలో ఇదే పీవీ రమేష్ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. రుణమాఫీకి తూట్లు పొడవడంలో రమేష్ పాత్ర కూడా ఉంది. ఆయన దీనిని మర్చిపోతే ఎలా?
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ఆధారంగా జీఎస్‌డీపీలో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత చంద్రబాబు పాలన కన్నా జీఎస్‌డీపీ పెరుగుదల ఇప్పుడే ఎక్కువగానే ఉంది. దీనిని ఆయన ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించారా లేక రామోజీ ఇచ్చిన స్క్రిప్ట్‌ను బట్టీపట్టారా? ఏం పీవీ రమేష్?
- ఇక రాష్ట్ర అప్పులు కూడా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఉన్నాయి. జీఎస్‌డీపీతో సమానంగా అప్పులున్నాయంటూ పీవీ రమేష్ పచ్చమీడియా వల్లిస్తున్న అబద్ధాలనే వల్లించారు. కార్పొరేషన్ల పేరుతో అప్పులుచేయడం తప్పుగా పీవీ రమేష్ అనడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే.
- ఎందుకంటే.. గత ఎన్నికల ముందు ఇదే పీవీ రమేష్ కేంద్ర గ్రామీణ విద్యుదీకరణ సంస్థలో పనిచేస్తూ అప్పటి సీఎం చంద్రబాబు కోరిక మేరకు 2019 ఎన్నికలకు ముందు పసుపు–కుంకుమ పేరుతో డబ్బులు పంచేందుకు సాగునీటి ప్రాజెక్టులను తాకట్టు పెట్టి అప్పు మంజూరు చేసిన విషయం మరిచిపోతే ఎలా?
- కానీ, ఇందుకు భిన్నంగా సంక్షేమం, అభివృద్ధి సమతుల్యతతో సీఎం జగన్ ఐదేళ్ల పాలన సాగింది.

బందిపోట్ల ముఠా నేత బాబే!

- పచ్చ కళాకారుల గుంపే సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ
- పేదల సంక్షేమానికి రూ.2.75 లక్షల కోట్లు పంచిన సీఎం జగన్ బందిపోటు అవుతారా?
- 14 ఏళ్ల పాలనలో స్కీములన్నీ స్కాములుగా మార్చిన చంద్రబాబు బందిపోటా?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్

సాక్షి అమరావతి: బందిపోటు దొంగల ముఠా నేత చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మండిపడ్డారు. నీరు–చెట్టు పేరుతో మట్టిని దోచుకుని అమ్ముకున్న అసలు బందిపోటు దొంగల ముఠా నాయకుడివి నువ్వు కాదా బాబు?.. రూ.వంద ఖర్చయ్యే కాంట్రాక్టు పనులను మరో వందకు పెంచి ప్రభుత్వ ఖజానాను దోచుకున్న బందిపోటువి నువ్వు కాదా?.. ఫేక్ రాజధాని నిర్మాణం కోసం దేశదేశాలు తిరిగి.. ఫేక్ ప్రయాణపు ఖర్చులు పెట్టి ఫేక్ ముఖ్యమంత్రిగా మిగిలిన అసలు బందిపోటువి నువ్వుకాదా? అంటూ సుధాకర్‌బాబు చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పచ్చ కళాకారుల గుంపే 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' అని ఎద్దేవా చేశారు. దేశంలోనే 99 శాతం మేనిఫెస్టోని అమలుచేసిన తొలి నాయకుడు సీఎం జగన్ సుపరిపాలనలో ఎలాంటి అవినీతి లేకుండా రూ.2.75 లక్షల కోట్ల డబ్బు డీబీటీ ద్వారా ప్రజలకు చేరిందని.. దీనికి ప్రజలే సాక్ష్యమన్నారు. అలాగే,



ముఖ్యమంత్రి 2.31 లక్షల శాశ్వత ఉద్యోగాల కల్పించారని.. ఒక్క సచివాలయ వ్యవస్థలోనే 1.30 లక్షల ఉద్యోగాలు వస్తే ఉద్యోగాలే రాలేదంటారేంటనిఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా మార్చిన చరిత్ర సీఎం జగన్ కాదా? అని ప్రశ్నించారు. సుధాకర్‌బాబు ఇంకా ఏమన్నారంటే..

బాబు హయాంలో స్కీములన్నీ స్కాములే..

14 ఏళ్ల పాలనలో స్కీములన్నీ స్కాములుగా మార్చిన చంద్రబాబు బందిపోటా? కాదా? మార్గదర్శి అక్రమాలపై 'సుప్రీం'కు రామోజీ సమాధానం ఎందుకు చెప్పలేదు? ఒకవైపు మాజీ ఐఏఎస్‌ల పేరుతో ఒక్కొక్కరూ ముసుగు తీస్తున్నా, సీఎం జగన్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఇక సంఘ వ్యతిరేక శక్తిగా పవన్‌కళ్యాణ్ మారిపోయాడు. నీ నరరూప రాక్షసత్వానికి రామోజీ, రాధాకృష్ణ, టీవీ5 నాయుడు తోడయ్యారు. ఈ ముఠాలన్నీ కలిసి సమాజాన్ని దోచుకుని దాడిచేస్తుంటే పేదవాళ్లంతా ఏకమయ్యారు. వారు నమ్ముకున్న అర్జునుడే వైఎస్ జగన్.

ఎక్కడికెళ్లినా పండుగ వాతావరణమే..

ఏ గ్రామానికి వెళ్లినా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ప్రజలు జాతరలా వస్తున్నారు. ఊహించిన దానికంటే, ఈ బస్సుయాత్ర విజయవంతంగా సాగుతోంది. ఇది ఓర్చుకోలేని తెలుగుదేశం మద్దతుదారులైన మాజీ ఐఏఎస్‌లు, మాజీ ఐపీఎస్‌లు ముసుగులు తీస్తున్నారు. చంద్రబాబు సీఎంగా ఉంటేనే వారికి లాభం కాబట్టి మీడియా సంస్థలు ఇప్పటికే బాబు భజన చేస్తున్నాయి. ఈ బందిపోటు ముఠాలను ఆయన ఎదిరిస్తున్నారని, వాళ్లను సమాజంలో నగ్నంగా నిల్చోబెట్టారన్న అక్కసుతో వారు ఆయనపై దాడులకు తెగబడుతున్నారు.

రాష్ట్రాన్ని దోచుకున్న బందిపోట్లు మీరే

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారులపై ఏపీ ఇంటలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం మండిపాటు
- హైదరాబాద్‌లో విలాసవంతమైన భవనాల్లో కూర్చుని రాష్ట్రంపై బురద జల్లడం సరికాదు
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో చంద్రబాబు కొమ్ముకాస్తున్నారు



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రాన్ని దోచుకున్న బందిపోట్లు మీరేనంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారులపై ఏపీ ఇంటలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం మండిపడింది. చంద్రబాబు పాలనలో జరిగిన దోపిడీపై ఎందుకు ప్రశ్నించలేదని నిలదీసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆరోపణలను బ్యానర్ చేసి వార్తా కథనం రాయడం ఏ జర్నలిజం విలువలకు తార్కాణమని ఈనాడు రామోజీని ప్రశ్నించింది. ఏపీ ఇంటలెక్చువల్స్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఐలాపురం హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఫోరం అధ్యక్షుడు పి. విజయబాబు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఐఏఎస్‌లు కొందరు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో చంద్రబాబుకు కొమ్ము కాస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో విలాసవంతమైన భవనాల్లో ఉంటూ అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చి బురద జల్లుతున్నారన్నారు. ఇందులో భాగంగానే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ చేసిన ఆరోపణలను ఈనాడు బ్యానర్ చేసిందని.. మరో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కూడా అదే తీరుగా వ్యవహరించారన్నారు. లోక్‌సత్తా పార్టీ పెట్టిన మరో ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ కూడా అర్జెంట్‌గా పరుగెత్తుకుంటూ రాష్ట్రానికి వచ్చారన్నారు. ఇలా ట్రిప్పుకు ఒకరి చొప్పున హైదరాబాద్ నుంచి రావడం, అవాకులు, చెవాకులు పేలడం చేస్తున్నారన్నారని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని విజయబాబు సవాల్ చేశారు.

ఎవరు ప్రేరేపిస్తే ఇలా మాట్లాడుతున్నారు?

చంద్రబాబు చేసిన అప్పు విలాసాలు, విదేశీ విహారాలు గ్రాఫిక్స్ కోసమైతే.. వైఎస్ జగన్ సంక్షేమానికి అప్పుచేశారన్నారు. చంద్రబాబు హయాంలో విద్యారంగం అట్టడుగు స్థానంలో ఉంటే నేడు జగన్ పాలనలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని విజయబాబు చెప్పారు. గనుల గురించి మాట్లాడే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్‌కు రెవెన్యూ అధికారి వనజాక్షిపై జరిగిన దాడి విషయం గుర్తులేదా.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మీరు రాసిన నోట్‌ఫైల్ గుర్తులేదా అని ప్రశ్నించారు. ఇక పచ్చ పత్రికలో పెట్టిన బంధిపోట్లు శీర్షిక చంద్రబాబుకే వర్తిస్తుందన్నారు. బందిపోట్లలో నేను సైతం అంటూ సంతకం పెట్టిన పీవీ రమేష్‌కు వర్తిస్తుందన్నారు. రాష్ట్రానికి రండి.. ఇక్కడ నివాసం ఉండండి. ఇక్కడ వాస్తవాలను చూడండి.. చూసి మాట్లాడండి అంటూ వారికి విజయబాబు హితవు పలికారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీ కృష్ణంరాజు, న్యాయవాదులు నరహరిశెట్టి శ్రీహరి, పిళ్లా రవి, విఠల్‌రావు, సాయిరాం, ఆడమ్స్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దోపిడీ ఎవరి పాలనలో జరిగిందో కళ్లు తెరిచి చూడాలన్నారు.

బాబు మాటలతోనే ఆయనకు రాజకీయ సమాధి

మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: చంద్రబాబు బరితెగింపు మాటలే ఆయనను రాజకీయ సమాధి చేస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున హెచ్చరించారు. 'చంద్రబాబూ.. రాజకీయాల్లో అహంకార స్వభావంతో ఉండి బరితెగించి మాట్లాడుతున్న నువ్వు ఈరోజు పల్లెల్లోకొచ్చి ఓట్లెలా అడుగుతావు? ఏ ముఖం పెట్టుకుని బీసీ, ఎస్సీ కాలనీలకు వెళ్తావు? వారిని చులకన చేసిన నీకు ఓట్లడిగే అర్హతలేదన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాగార్జున మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ సభకొచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కూలి జనమా?.. మరి, మీ కూటమి సభలకు వచ్చేది పెత్తందార్లా? అని ప్రశ్నించారు. దళితులు, బీసీలంటేనే బాబుకు గిట్టదని.. ఆయన ప్రాయశ్చిత్తపడే రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. నాగార్జున ఇంకా ఏమన్నారంటే..

జగన్‌ని మళ్లీ సీఎం చేసేందుకు అంతా సిద్ధం..

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ఆయా వర్గాల కోసం ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి ఆలోచన చేసిన ఘనత సీఎం జగన్‌కి దక్కుతుంది. రాష్ట్రంలో ప్రజలందరికీ రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా సంక్షేమాన్ని పైసా లంచం లేకుండా సచివాలయ వ్యవస్థతో నేరుగా సీఎం జగన్ జమచేశారు. అలాంటి విప్లవాత్మక దార్శనీకుడైన సీఎం జగన్‌నే మరోమారు సీఎంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

బాబును నిలదీసేందుకు సిద్ధం..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా గతంలో చంద్రబాబు దాష్టీకాలను గుర్తుకు తెచ్చుకుని,నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని నాగార్జున తెలిపారు.

'సింహం గర్జించి' ఆడియోను ఆవిష్కరించిన సజ్జల


ఆడియోను ఆవిష్కరిస్తున్న సజ్జల

సాక్షి,అమరావతి: సినీ ప్రొడ్యూసర్, రమేష్ స్టూడియోస్ అధినేత ధూళిపాళ్ల రమేష్ బాబు రూపొందించిన 'సింహం గర్జించి' అనే ఆడియోను తాడేపల్లిలో మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ..పేద, బడుగు, బలహీన వర్గాల కోసం సీఎం జగన్ అత్యద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. వీటితో అట్టడుగు వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. ఇది చూసి తాను ప్రభావితుడిని అయ్యానని, మరోసారి జగన్ సీఎం కావాలని కోరుతూ 'సింహం గర్జించి' అనే ఆడియోను రూపొందించానని చెప్పారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాటంకంగా ఏపీ పోలీస్ సేవా యాప్

సాక్షి, అమరావతి: ఏపీ పోలీస్ సేవా యాప్ సక్రమంగా పని చేయడం లేదని కొన్ని పత్రికలు, మీడియాల్లో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని పోలీసు శాఖ తెలిపింది. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా పోలీస్ సేవా యాప్‌లో ప్రస్తుతం కొన్ని మార్పులు, చేర్పులు చేస్తున్నందున ఆ యాప్ సేవలన్నీ పోలీస్ వెబ్‌సైట్ ద్వారా అందిస్తున్నామని పోలీసు టెక్నికల్ సర్వీసెస్ విభాగం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. పోలీసు సేవల కోసం పోలీస్ వెబ్‌సైట్ citizen.appolice.gov.inలో సంప్రదించాలని సూచించింది.

సీఏఏపై టీడీపీ, జనసేన వైఖరేమిటి?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: మతోన్మాద బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీ పౌరసత్వ చట్ట సవరణ (సీఏఏ)పై తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, ఆ రెండు పార్టీలు 14 ప్రధాన అంశాలపై ప్రజలు సమాధానం చెప్పి తీరాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక ఎంపీ, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న సీపీఎం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో)ను పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు వై.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, జె.జయరాం, కె.హరికిషోర్‌తో కలిసి శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024
బుధవారం
ఏప్రిల్, 17

జైత్రయాత్ర





గుసగుస

ఇంట గెలవనోడు..



ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది నానుడి. జనసేనాని పవన్‌కల్యాణ్ మాత్రం ఇంటి మాట దేవుడెరుగు.. రచ్చ గెలిచి బీజేపీ అధిష్టానం వద్ద మార్కులు కొట్టేస్తే చాలనుకుంటున్నట్లున్నారు. తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఒక రోజు ప్రచారం చేస్తే.. వారం రోజులు జ్వరం తెచ్చుకునే ఆయన ఇప్పుడు తమిళనాడు బాటపట్టనున్నారు. చెన్నై సౌత్ బీజేపీ అభ్యర్థి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గెలుపు కోసం ఈయన ప్రచారం చేస్తారట. ఇప్పటికే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై కోసం లోకేశ్ ప్రచారం చేసినా.. పెద్దగా ఫాయిదా రాలేదట. ఇప్పుడు పవన్‌ని పంపిస్తే అక్కడున్న తెలుగు వారి ఓట్లన్నీ గంపగుత్తగా వచ్చేస్తాయని, రాష్ట్ర బీజేపీలో ఉంటూ టీడీపీతో అంటకాగే నేతలు చెప్పారట. దీంతో కొన్నాళ్లయినా ఇక్కడి టీడీపీ తరఫున ప్రచారం చేసే అగత్యం తప్పుతుందని, పవన్ బ్యాగ్ సర్దుకుని చెన్నై చెక్కేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాయ పేరు చెప్పి..



చెట్టుపేరు చెప్పి కాయలమ్మడం మనకు తెలుసు. నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ మాత్రం కాయ పేరు చెప్పి.. చెట్టు(తన)ను అమ్మకానికి పెడుతున్నారు. తన కుమారుడు డాక్టర్ కృష్ణ తేజ ఆర్థిక భరోసా, మంది బలానికి తోడు, నిండా ముంచిన జనసేనాని, తన వర్గం (గోరంట్ల బుచ్చయ్యచౌదరి) కోసం సీటు కాజేసిన చంద్రబాబు చెప్పిన మాటల్ని నమ్మి రాజమండ్రి రూరల్‌ని వదిలి నిడదవోలు చేరారు. ఇక్కడ టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ బూరుగుపల్లి శేషారావు, కుందుల సత్యనారాయణ వర్గం దుర్గేష్‌కు అడుగడుగునా ధమ్కీ ఇస్తోంది. కుందుల ప్రచారానికి వస్తే తానొచ్చేది లేదని శేషారావు చెప్పేశారట. దీంతో కుందులతో కందుల కలవలేని పరిస్థితి. బూరుగుపల్లితో కలిసి కందుల ప్రచారం చేయడంతో కుందుల వర్గం రగిలిపోతోందట. తమ నాయకుడి వద్ద భారీగా సొమ్ము తీసుకుని, టికెట్ హామీ ఇచ్చి, మాట తప్పిన లోకేశ్‌కు బుద్ధి చెప్పేందుకైనా కందుల దుర్గేష్‌ను ఓడించి తీరతామని భీష్మ ప్రతిజ్ఞ చేశారట. దీంతో కందుల తనయుడు రాజమండ్రిలోని కడియం నుంచి ఓ 200 మందిని నిడదవోలు పంపించి, తన తండ్రికి ప్రచారంలో సహకారం అందిస్తున్నారట.

పురందేశ్వరి దెబ్బ.. బీజేపీ అబ్బా




రాష్ట్రంలో బీజేపీని మరో పదేళ్ల వరకు కోలుకోలేనంత పెద్ద దెబ్బ కొట్టారట ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి. సోము వీర్రాజు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంత వరకు పార్టీలో లేశమాత్రమైనా జవసత్వాలుండేవి. పురందేశ్వరి ప్రవేశించాక.. గంగ.. చంద్రముఖిలా మారినట్లు బీజేపీని మళ్లీ టీజేపీగా మార్చేశారు. కూటమి సర్దుబాటు సీట్లలో తమకు వచ్చిన స్థానాల్లో కూడా చంద్రబాబు సానుభూతి పరులకే కట్టబెట్టారు. ఇందుకు ప్రతిగా రాజమండ్రిలో తన గెలుపునకు చంద్రబాబు పనిచేస్తారని నమ్ముకున్నారు. ఇప్పటి వరకు బాబు ఆ దిశగా చేసిన ప్రయత్నాలు శూన్యమేనని బీజేపీ శ్రేణులు ఆక్షేపిస్తున్నాయి. బాబు నిర్లిప్తతకు కారణం రఘురామకృష్ణరాజుకు నర్సాపురం సీటు కేటాయించడంలో పురందేశ్వరి విఫలమవడమే. దీంతో కినుక వహించిన బాబు తన పార్టీ శ్రేణుల్ని అలెర్ట్ చేయట్లేదట.

ఫ్యాన్ గాలి ప్రచండం

ఏ ఊళ్లో ఏ నోట విన్నా ఈ మాటే

జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీ సర్వేలదీ అదే మాట
రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులదీ ఆ మాటే
ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
బస్సు యాత్రలో జగన్‌కు అడుగడుగునా నీరాజనాలు పలుకుతుండటమే తార్కాణం
జనసేన, బీజేపీతో జత కలిసిన టీడీపీకి మరోసారి ఘోర పరాభవం ఖాయం
సీఎం జగన్‌పై నమ్మకమే వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయానికి బాట
చంద్రబాబు మోసకారి కావడం వల్లే ఘోర ఓటమి బాటలో కూటమి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని అన్ని వర్గాల ప్రజలు నిర్ధారణకు వచ్చారు. రాజకీయ విశ్లేషకులు, జాతీయ స్థాయి సర్వే సంస్థలు సైతం ఇదే విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. గతంలో ఏం చేశామన్నది చెప్పుకోవడానికి ఏమీ లేక, భవిష్యత్‌లో ఫలానా చేస్తామని నమ్మకంగా చెప్పడంలో విశ్వసనీయత లేక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఓటమి బాటలో పయనిస్తోందని స్పష్టం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయభేరి మోగించింది. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంత భారీ విజయం సాధించిన దాఖలాలు లేవు. అధికారంలోకి వచ్చాక ప్రజా సంకల్ప పాదయాత్రలో.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో తొలి ఏడాదే 95 శాతం.. మొత్తమ్మీద 99 శాతం సీఎం జగన్ అమలు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. లంచాలకు తావు లేకుండా.. వివక్షకు చోటు లేకుండా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా పేదలకు రూ.4.49 లక్షల కోట్ల లబ్ధి కలిగింది. దేశ చరిత్రలో ఈ స్థాయిలో పేదలకు మంచి చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దనే ప్రజలకు అందిస్తున్నారు. వైద్య, విద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంస్కరణలు తెచ్చి.. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. వీటన్నింటి వల్ల సుపరిపాలనతో నవచరిత్ర లిఖించిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది.

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్.. వేదికగా ఒకటే చర్చ.. 'ఈసారీ వైఎస్సార్‌సీపీనే వస్తుంది.. జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేలన్నీ పక్కాగా లెక్కలేసి చెబుతున్నాయి. సైంటిఫిక్ పారామీటర్స్‌తో సర్వే చేసి మరీ నొక్కి వక్కాణిస్తున్నాయి. పత్రికలకు సంపాదకులుగా పని చేసిన వాళ్లు, సీనియర్ పాత్రికేయులు కూడా అదే చెబుతున్నారు. కచ్చితంగా నేను నమ్ముతున్నా. ఎందుకంటే జగన్ చేసిన మంచి పనులు అలాగున్నాయి కాబట్టి' అంటూ ఊరూరా జనం చెబుతున్నారు.

'మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే మా బతుకులు మారతాయని మా నమ్మకం. మేమంతా జగన్ బాటలోనే నడుస్తాం. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఘోర పరాజయం తప్పదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యం. జగన్ అంటే విశ్వాసం.. చంద్రబాబు అంటే మోసం..' అని నిన్న సిద్ధం సభల్లో.. ఇప్పుడు బస్సు యాత్రలో అశేష ప్రజానీకం తేల్చి చెబుతున్నారు.

58% మహిళల ఓట్లు జగన్‌కే



పార్థ దాస్
సెఫాలజిస్ట్, చాణక్య కన్సల్టెన్సీ

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల నాడి తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నాం. 50% కంటే ఎక్కువ ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయం. సీఎం జగన్ నాయకత్వానికి మహిళలు 58% మంది మద్దతు పలుకుతున్నారు. దేశంలో ఏ నాయకుడికీ మహిళల్లో ఇంతటి ఆదరణ లేదు. సంక్షేమ పథకాల నుంచి కేబినెట్, నామినేటెడ్ పదవుల వరకూ మహిళలకు పెద్దపీట వేస్తూ సాధికారతకు జగన్ తీసుకున్న చర్యలే ఆయన నాయకత్వంపై మహిళల్లో అత్యధికంగా ఆదరణ ఉండటానికి కారణం.

జగన్‌పై విశ్వసనీయతే విజయానికి సోపానం

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 50 శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీ సాధిస్తుందని మా సర్వేలో వెల్లడైంది. 21-22 లోక్‌సభ స్థానాలు వైఎస్సార్‌సీపీకి దక్కడం ఖాయం. సానుకూల ఓటుతో ఇంత భారీ విజయం సాధిస్తుండటం గమనార్హం. సీఎం జగన్ చెప్పిన మాటకు కట్టుబడటం.. నిబద్ధత, నిజాయితీగా పని చేస్తుండటంతో ఆయన నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత బలంగా నాటుకుపోయింది. ఇదే వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి బాటలు వేస్తోంది.



పద్మజా జోషి, సీనియర్ న్యూస్ ఎడిటర్, టైమ్స్‌నౌ

మార్చి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకూ జాతీయ మీడియా సంస్థలు, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడైంది ఇదీ..

సర్వే సంస్థ పేరు	వైఎస్సార్‌సీపీ గెలిచే స్థానాలు			టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలిచే స్థానాలు		
	ఓట్ల శాతం	శాసనసభ	లోక్‌సభ	ఓట్ల శాతం	శాసనసభ	లోక్‌సభ
డెక్కన్ 24/7	51	135-140	21-22	46	35-40	3-4
న్యూస్ ఎరినా ఇండియా (ఎలక్‌సెన్స్)	50.38	127	-	45.58	48	-
టైమ్స్‌నౌ-ఈటీజీ	49	-	21-22	45	-	3-4
జీన్యూస్-మాట్రిజ్	48	133	19	44	42	6
బీపీఎస్ (భారత్ పొలిటికల్ సర్వే)	54.2	150-156	21-23	42.9	19-25	2-4
చాణక్య	49.2	102-107	16	45.1	55-60	8
జన్‌మత్ పోల్స్	49.8	120-123	20-21	46.2	52-53	4-5

అప్రతిహతంగా బస్సు యాత్ర

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు (ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల (దక్షిణ కోస్తా)లలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం కడలిలా తరలివచ్చారు. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన బస్సు యాత్రకు జనం అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. సీఎం జగన్‌ను చూసేందుకు యువతీ యువకులతో కలిసి చంటి బిడ్డలను చంకనేసుకుని మహిళలు పోటీపడుతూ బస్సు వెంట పరుగులు తీస్తున్నారు. మండుటెండైనా.. అర్ధ రాత్రయినా సీఎం వైఎస్ జగన్‌ను దగ్గరి నుంచి చూసేందుకు.. కరచాలనం చేసేందుకు.. మాట కలిపేందుకు.. వీలైతే ఫొటో దిగేందుకు జనం పోటీ పడుతున్నారు. మేలు చేశాం.. ఓటేయండి అనేది మామూలుగా నేతల మాట. కానీ.. బస్సు యాత్రలో తద్భిన్నంగా 'మీ పాలన వల్ల మాకు మంచి జరిగింది.. మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం' అంటూ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు భరోసా ఇస్తున్నారు. రాజకీయాలలో ఇలాంటి అరుదైన ఘట్టాలను తానెన్నడూ చూడలేదని సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ జత కలిశాక, చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు జనం ముఖం చాటేస్తుండటం.. నాడు సిద్ధం సభలు.. నేడు బస్సు యాత్రకు

- మిగతా III లో

భూ'దండు' పాళ్యం బ్యాచ్-3

ఓం భూం స్వాహా!

'నా పరిశీలనకు వచ్చిన, తెలియ వచ్చిన విషయాల్ని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఏ వ్యక్తికి లేదా వ్యక్తులకు తెలియపరచనని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను' అని చెబుతూ 2014లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం కుర్చీలో కూర్చున్నాక.. కుట్రలు చేయడంలో, నమ్మిన ప్రజల్ని మోసగించడంలో సిద్ధ హస్తుడైన చంద్రబాబు ఆ ప్రమాణాన్ని నిస్సిగ్గుగా ఉల్లంఘించారు. అత్యంత కీలకమైన రాజధాని రహస్యాన్ని ఎల్లో గ్యాంగ్‌కు లీక్ చేసి సీఎం పదవికే కళంకం తెచ్చారు. అంతర్జాతీయ రాజధాని అంటూ ప్రధానితో పాటు ప్రముఖుల్ని పిలిచి హడావుడి చేసినప్పుడు.. బాబు కుట్రల్ని జనం పసిగట్టలేకపోయారు. ఇదంతా పేదల అసైన్డ్ భూముల స్వాహాకు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ కోసం చంద్రబాబు వేసిన ఎత్తులు, జిత్తులని అప్పుడు వారికి తెలియలేదు.

'రాజధాని ఫైల్స్' డ్రామాలో పేద రైతుల అసైన్డ్ భూములను బెదిరించి బినామీల రూపంలో సొంతం చేసుకుని కథ నడిపించారు. ఎవరికీ చెందని ప్రభుత్వ అసైన్డ్ భూములు తమ వారివే అంటూ రికార్డులు సృష్టించి స్వాహా చేశారు. తన పని పూర్తయ్యాక.. గ్రాఫిక్స్ రాజధాని కట్టలేక చేతులెత్తేసి ఎన్నికల ముందు కొత్త డ్రామాలు అందుకున్నారు. ఈ డ్రామాలో బాబు బృందంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు...ఆయనకు ఆప్తులు అందరూ పాత్రధారులే.. 'చేసేది నువ్వు.. చేయించేది నేను..' రాజధాని ఫైల్స్‌లో చంద్రబాబు డైలాగ్ ఇదే. తెరముందు రాజధాని రూపశిల్పి.. తెరవెనుక రాజధాని లీక్స్ సూత్రధారి. అసలు సూత్రధారులు చంద్రబాబు, లోకేశ్ కాగా.. పాత్రధారులు నారాయణ, లింగమనేని రమేష్, ప్రత్తిపాటి పుల్లారావు, సుజనా చౌదరి, వేమూరి రవికుమార్, మాగంటి మురళీ మోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు ఇలా 1,336 మంది బినామీలున్నారు. అసైన్డ్ భూముల దోపిడీ, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో రూ.లక్షల కోట్ల భూ దందాకు తెగించారు.

కర్త, కర్మ, క్రియ చంద్రబాబే..

- అమరావతి భూ దోపిడీలో చినబాబూ సూత్రధారే
- తెరవెనుక పాత్రధారులుగా బాబు అండ్ కో
- బినామీ పేర్లతో పేదల భూములపై పచ్చదండు దాడి
- రాజధాని లీక్స్‌తో రూ.2 లక్షల కోట్ల భూ దురాక్రమణ
- నారాయణ, లింగమనేని, సుజనా, ప్రత్తిపాటి, ధూళిపాళ్ల దోపిడీ లీలలు.. కొమ్మాలపాటి, కోడెల, పయ్యావుల, మురళీ మోహన్‌ల భూ దందా



అసైన్డ్ దోపిడీ, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో 1,336 మంది బినామీ 'బాబు'ల బాగోతం

సాక్షి, అమరావతి : అమరావతి భూదోపిడీకి కర్త, కర్మ, క్రియ చంద్రబాబే. అసైన్డ్ భూములు, ప్రైవేటు భూములు, క్విడ్ ప్రోకో భూములు, బంగ్లాలు.. ఇలా ఒకటేమిటి.. చంద్రబాబు అక్రమ సామ్రాజ్యంలో అన్నీ భాగమే. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలతో క్విడ్ ప్రోకో ద్వారా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు 14 ఎకరాలు దక్కాయి. కృష్ణానది కరకట్ట మీద ఉన్న లింగమనేని బంగ్లా ఆయన పరమైంది. ఎస్సీ, ఎస్టీ, రైతులను భయపెట్టి బినామీల పేరిట కొల్లగొట్టిన వందలాది ఎకరాలు చంద్రబాబు ఖాతాలోకే వెళ్లాయి. సింగపూర్ కంపెనీ పేరిట స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులోని భూముల అసలు హక్కుదారూ చంద్రబాబు కుటుంబమే. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు ఇరువైపులా, అమరావతి సీడ్ క్యాపిటల్ పరిధి దాటి బినామీల పేరిట కొనుగోలు చేసిన దాదాపు 5 వేల ఎకరాల అసలు యజమాని చంద్రబాబు కుటుంబమే.

చినబాబుది పెద్ద వాటానే

అమరావతి భూ కుంభకోణంలో లోకేశ్‌ది పెద్ద వాటానే. తన బినామీ, ఎన్నారై వ్యవహారాల సలహాదారుగా వ్యవహరించిన వేమూరి రవికుమార్‌తో పాటు మరికొందరు బినామీల పేరిట వేలాది ఎకరాలు దక్కించుకున్నారు. వేమూరి రవికుమార్‌తోపాటు ఆయన భార్య అనూరాధ గోష్పాది గ్రీన్‌ఫీల్డ్స్ పేరిట అమరావతిలోని కోర్ క్యాపిటల్ ప్రాంతంలోనే 500 ఎకరాలకుపైగా స్వాహా చేశారు.

అవినీతి తిమింగలం లింగమనేని

అమరావతిలో అవినీతి తిమింగలం లింగమనేని రమేష్. చంద్రబాబు భూ దోపిడీలో ఇతనూ ఒక ప్రధాన పాత్రధారి. ఆయన కుటుంబానికి చెందిన 355 ఎకరాలను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు. తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట కొనుగోలు చేసిన వందలాది ఎకరాలను భూ సమీకరణ ప్రక్రియ నుంచి తప్పించారు. అమరావతిలో దాదాపు వెయ్యికి పైగా ఎకరాలు లింగమనేని హస్తగతం చేసుకున్నారు.

నారాయణ తంత్రం.. సుజనా, ప్రత్తిపాటి భూదందా

చంద్రబాబు తరువాత అమరావతి భూ దోపిడీలో రెండో పెద్ద దోపిడీదారు నారాయణ. లింగమనేని కుటుంబంతో క్విడ్ ప్రో కో లో ప్రధాన పాత్రధారు. కృష్ణా నదికి ఇటువైపు.. అటువైపు, కృష్ణా జిల్లా పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్‌కు దగ్గరలో వేలాది ఎకరాలు కొనుగోలు చేశారు. అక్కడ నారాయణ విద్యా సంస్థల భూములు ఉన్నాయి. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తన ఉద్యోగులను బినామీలుగా చేసి 162 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు. అసైన్డ్, ప్రైవేటు భూములు కలిపి దాదాపు 3 వేల ఎకరాల వరకు బినామీల పేరిట గుప్పిట పట్టారు. నారాయణ బినామీ కంపెనీ రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌ది అమరావతి భూ కుంభకోణంలో కీలక పాత్ర. అసైన్డ్ భూముల దోపిడీలో ఆ కంపెనీ ఎండీ అంజనీకుమార్ కీలకంగా వ్యవహరించారు. అమరావతిలో దాదాపు 2 వేల ఎకరాలను బినామీలు, ఉద్యోగుల పేరిట రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ కొల్లగొట్టింది.

చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు సుజనా చౌదరి అమరావతి భూ దోపిడీలో అతిపెద్ద వాటాదారు. ఆయన తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఏకంగా 700 ఎకరాల వరకు కొల్లగొట్టారు. అమరావతి భూదోపిడీలో బినామీల పేరిట అసైన్డ్ భూములతో సహా 196 ఎకరాలు దోచుకున్నారు.

- మిగతా III లో

ఆయన అవినీతిలో ఘనాపాఠి.
పదవిని అడ్డం పెట్టుకుని అక్రమాలకు తెరలేపారు.
కుంభకోణాలకు కేంద్ర బిందువుగా నిలిచారు.
భూ ఆక్రమణల నుంచి గ్రావెల్ తవ్వకాల వరకు అంతా దోపిడీ పర్వమే.
రాష్ట్ర స్థాయిలో సంచలనం సృష్టించిన సీసీఐ స్కామ్‌కు సూత్రధారుడు. అగ్రిగోల్డ్ భూముల అక్రమ కొనుగోళ్ల వ్యవహారాల్లో అడ్డంగా దోచేశాడు. బడుగుల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేసిన ఘనుడు. ఇదీ టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు అవినీతి బాగోతం.

సతీ స'మేత'ం



అవినీతిలో మేటి ప్రత్తిపాటి

-వివరాలు II లో

సంక్షేమ పాలనకే పట్టం



మన ప్రజాస్వామ్య వ్యవస్థ సంక్షేమ రాజ్యం. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో రాసుకున్నట్లు సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కారాదు. ప్రజలందరికీ సమానంగా పంచబడాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా చట్టాలు చేయాలి. ప్రజలందరికీ ఉచిత విద్య అందాలి. దళితులు, గిరిజనులు, బడుగు బలహీనవర్గాల ప్రయోజనాలను కాపాడాలి. గత ప్రభుత్వాలు వీటిని తుంగలో తొక్కాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే ఇవన్నీ అమలవుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, నాడు–నేడులో స్కూళ్లు, ఆస్పత్రుల అభివృద్ధి, అవ్వాతాతలకు రూ.3 వేలు పెన్షన్.. ఇలా అందరి కోసం ఆలోచిస్తున్న సీఎం జగన్ మాత్రమే. **-బి.జగన్నాథరావు, విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి, 80 ఫీట్ రోడ్, శ్రీకాకుళం**

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.


ప్రజాస్వామ్యానికి ఎన్నికలే ఆధారం



మన దేశ ప్రజాస్వామ్యం మనుగడకు ఎన్నికలే ప్రధాన ఆధారం. ఎన్నికలకు అసలైన అర్థం పేదల బతుకుల్లో వెలుగులు ప్రసరించినప్పుడే. జాతిపిత గాంధీజీ చెప్పినట్లు అట్టడుగు వర్గాల వారికి అగ్ర ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వాలనే మనం ఎన్నుకోవాలి. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలలో నవ సంస్కరణలకు బాటలు వేసి రాష్ట్రాభివృద్ధిని ప్రగతి వైపు పరుగులు పెట్టించే పాలకులకు ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు పట్టం కట్టాలి. పేదలందరికీ ఉన్నత విద్య, మెరుగైన వైద్యం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వానికి ఓటేయాలి. అలా చేసినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం, అభివృద్ధి సాధ్యమవుతుంది.
- జి.సుధీర్ కుమార్, టీచర్, ఎంపీయూపీ స్కూల్, రామచంద్రాపురం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

సతీ స'మేత'ం

అవినీతిలో మేటి ప్రత్తిపాటి



సీసీఐలో పత్తి కొనుగోలు పేరిట రూ.650 కోట్లు హాంఫట్

మాజీ మంత్రి ప్రత్తిపాటి అక్రమాల చిట్టా	యడవల్లిలో దళితుల భూముల కాజేతకు కుట్ర	రేషన్ బియ్యం మాఫియా కింగ్‌గానూ పేరు

తక్కువ ధరకు అగ్రిగోల్డ్ భూముల స్వాధీనం

భార్య వెంకాయమ్మ పేరుతో రిజిస్ట్రేషన్

చిలకలూరిపేట: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చిలకలూరిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రత్తిపాటి పుల్లారావు 2014–15 కాలంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఈ సమయంలో సీసీఐ కుంభకోణం జరిగింది. దాదాపు రూ.650 కోట్లు అక్రమాలు జరిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో మంత్రి పాత్ర ఉన్నట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కుంభకోణం అప్పటి ప్రభుత్వాన్ని కుదిపేసింది. దీంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన అప్పటి ప్రభుత్వం అనంతరం 2016 నవంబర్‌లో చిలకలూరిపేట మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి కె.నాగవేణి సహా మొత్తం 26 మంది మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులుపేసుకుంది.

అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు

ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం గురిజేపల్లిలో అగ్రిగోల్డ్ వెంచర్లలో 14.81 ఎకరాల భూమిని విడతలవారీగా ప్రత్తిపాటి పుల్లారావు తన సతీమణి ప్రత్తిపాటి తేనె వెంకాయమ్మ(ప్రత్తిపాటి వెంకట కుమారి) పేరుతో కారుచౌకగా కొన్నారు. అప్పటికే అగ్రిగోల్డ్ సంస్థ వివాదాల్లో ఇరుక్కోవడంతో ఆ సంస్థ భాగస్వాములను అధికారం అడ్డంపెట్టుకుని బెదిరించి ఈ భూములను చౌకగా కొట్టేశారనే ఆరోపణలు పుల్లారావుపై వెల్లువెత్తాయి. ఈ మొత్తం భూమిని ఆ తర్వాత గుంటూరుకు చెందిన కామేపల్లి వెంకటేశ్వరరావుకు, పెదకాకాని మండలం, ఉప్పలపాడుకు చెందిన చెరుకూరి నరసింహారావులకు దాదాపు 30 లక్షలు ఎక్కువకు విక్రయించారు. ఈ భూమిని ఎకరా రూ. 20 లక్షలలోపు ధరకు కొన్న ప్రత్తిపాటి ఆ తర్వాత ఎకరా రూ.52 లక్షలకు విక్రయించినట్లు సమాచారం.

గ్రావెల్, రేషన్ మాఫియా

యడ్లపాడు మండలంలోని అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి ప్రత్తిపాటి, ఆయన అనుచరులు రూ.కోట్లాది రూపాయలు గడించారు. చారిత్రాత్మక కొండవీడు కొండలనూ పిండి చేశారు. ప్రత్తిపాటిపై అప్పట్లో అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు బహిరంగ విమర్శలు చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు రేషన్ మాఫియాను ప్రోత్సహించి రూ.కోట్లు వెనుకేశారు. అప్పట్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో ఈయన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. నీరు–చెట్టు పథకంలోనూ ప్రత్తిపాటి అనుచరులు రూ.కోట్లు కొల్లగొట్టారు.

యడవల్లి దళిత భూములు కాజేసే కుట్ర

చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామంలో 1975లో సర్వే నెంబర్ 381లో ఉన్న 416.5 ఎకరాల భూమిని 250 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఏకపట్టాగా అందజేశారు. 1976లో యడవల్లి వీకర్స్ సెక్షన్ ల్యాండ్ కమిటీ పేరుతో లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీలు ఓ సొసైటీగా ఏర్పడి సాగు చేసుకుంటూ వస్తున్నారు. ఈ భూముల్లో విలువైన బ్లాక్ పెరల్ గ్రానైట్ ఉన్నట్టు తెలుసుకున్న ప్రత్తిపాటి సొసైటీనే రద్దు చేయించారు. ప్రభుత్వ భూములుగా ప్రకటింపజేశారు. బినామీలతో అక్రమ మైనింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో వైఎస్సార్ సీపీ, దళిత సంఘాల పోరాటానికి దిగాయి. దళితులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక యడవల్లి దళితులకు న్యాయం జరిగింది.

జర్నలిస్టులపై కక్ష

చిలకలూరిపేట పట్టణానికి చెందిన విలేకరి ఎంవీఎన్ శంకర్ 2014 నవంబర్ 25వ తేదీ విధులు ముగించుకుని రాత్రి వేళ ఇంటి బయట బైక్ పార్క్ చేస్తుండగా ఇద్దరు దాడి చేశారు. అతను గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ కేసులో ప్రత్తిపాటి పాత్రపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. తనకు వ్యతిరేకంగా వార్తలు రాశారన్న అక్కసుతో యడ్లపాడుకు చెందిన మాజీ విలేకరి మానుకొండ సురేంద్రనాథ్‌కు సంబంధించిన భూమిలో మంత్రి అనుచరులు భారీగా గ్రావెల్ తవ్వకాలు జరిపి విక్రయించారు. అదే భూమిని గతంలో ఇతరులకు అమ్మేందుకు సురేంద్ర అడ్వాన్సులు తీసుకున్నాడు. ఆ భూమి వివాదంలోకి వెళ్లడంతో తీసుకున్న అడ్వాన్సులు ఇవ్వలేక సురేంద్ర 2017 డిసెంబర్ 18న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పుల్లా రావు సతీమణి పెత్తనం

పుల్లారావు తన అధికారాన్ని రాష్ట్ర స్థాయిలో విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తే ఆయన సతీమణి వెంకాయమ్మ నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇంటికి వచ్చి తనకు సలాం కొట్టలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.జ్యోతిర్మయితోపాటు ముగ్గురు వైద్యులు, ఓ హెడ్‌నర్సు, నలుగురు స్టాఫ్ నర్సులు, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేయించారు. ఏ కార్యాలయంలోనైనా ఫైల్ కదలాలంటే ముందు మేడమ్‌కు కప్పం కట్టాల్సిందే అన్నంతగా అవినీతికి పాల్పడ్డారు.

పుల్లారావుపై కేసులివే..

– ఎమ్మెల్యే విడదల రజినిపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త పిల్లి కోటిని అరెస్టు చేసినప్పుడు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ప్రత్తిపాటి పుల్లారావుపై చిలకలూరిపేట టౌన్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 45/2020 యూ/ ఎస్ 341.18855/ కింద కేసు నమోదు చేశారు.

మంచినీటి చెరువువద్ద ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్ అనుమతులు లేకుండా ప్రారంభించేందుకు యత్నించి విధుల్లో ఉన్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కోడిరెక్క సునీతపై దాడి చేసినందుకు క్రైమ్ నంబర్ 136/2022 యూ/ఎస్ 353, 509, 506,323 ఆర్/డబ్ల్యూ, 34 ఐపీసీ – సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్),3(2)(వీఏ) ఆఫ్ ఎస్సీ/ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద ప్రత్తిపాటిపై కేసు నమోదైంది.

చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో అరెస్టయినప్పుడు చిలకలూరిపేట జాతీయ రహదారి దిగ్బంధనం చేసి పోలీసు విధులకు ఆటంకపరిచినందుకు క్రైమ్ నంబర్ 238/2023 యూ/ఎస్ 341, 353, 120(బి), 144, 148 ఆర్/డబ్ల్యూ 143 ఐపీసీ – సెక్షన్ 129–149, క్రైమ్ నంబర్ 240/2023 యూ/ఎస్ 435, 353, 120–బి ఆర్/డబ్ల్యూ 149 ఐపీసీ కింద, క్రైమ్ నంబర్ 125/2023 యూ/ఎస్ 353, 341, 147, 143, 120–బి. ఆర్/డబ్ల్యూ 149 కింద మూడు కేసులు నమోదయ్యాయి.

చట్టప్రకారం జరుగుతున్న ఇసుక రవాణాను అడ్డుకుని పోలీసు విధులను అడ్డుకోవడంతో అమరావతి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 93/2023 యూ/ఎస్ 143, 341, 230 ఆర్/డబ్ల్యూ 149 ఐపీసీ కింద కేసు నమోదైంది.

పందికొక్కులు మీరు, మీ బాబే

రేషన్ బియ్యాన్ని మెక్కింది చంద్రబాబు కాదా రామోజీ?

- హెరిటేజ్‌కు ప్రజాధనాన్ని దోచిపెట్టినా తెలియలేదా?
- నాణ్యమైన సార్టెక్స్ రేషన్ జగన్ సర్కారులోనే అమలు
- ఐదేళ్లలో టీడీపీ సబ్సిడీ కింద ఇచ్చింది రూ.15,356 కోట్లు
- జగన్ ప్రభుత్వంలో రూ.28,491 కోట్ల వ్యయం
- 2014–16 వరకు కందిపప్పు పంపిణీ ఊసే లేదు
- నిజాలను దాచి రామోజీ దగా రాతలు

సాక్షి, అమరావతి: పెరిగిన కార్డులను ఒప్పుకోరు. అత్యంత నాణ్యతతో ఇస్తున్న సరుకులను చూడరు. దాదాపుగా రెట్టింపైన సబ్సిడీ గానీ... ఇంటి ముంగిటకే వస్తున్న రేషన్ డెలివరీ గానీ... ఇవేవీ 'నంగనాచి రామోజీ'కి పట్టవు! ఐదేళ్ల జగన్ ప్రభుత్వం 162.15 లక్షల టన్నుల బియ్యం, 3.28 లక్షల టన్నుల చక్కెర, 3.28 లక్షల టన్నుల కందిపప్పు పంపిణీకి రూ.28,491 కోట్లు ఖర్చు చేసినా సరే...రామోజీకి మాత్రం రేషన్ వ్యవస్థ గాడితప్పినట్టు కనిపిస్తోంది. చంద్రబాబు హయాంలో కేవలం 117.45 లక్షల టన్నుల బియ్యం, 3.15 లక్షల టన్నుల చక్కెర, 0.93 లక్షల టన్నుల కందిపప్పు పంపిణీకి రూ.15,356 కోట్లు ఖర్చు చేస్తే అదేదో ఘనకార్యంగా ఈనాడు కీర్తిస్తోంది. భాషా విచక్షణ కోల్పోయిన రామోజీ పరమ నీచపు రాతలు రాస్తున్నారు. 'గాదె కింద పందికొక్కు.. కోతవేసే పప్పూ..ఉప్పు!' అంటూ మంగళవారం ఈనాడులో రేషన్ పంపిణీపై దగాకోరుభాషను వాడారు.


కోతవేసె పప్పూ ఉప్పు!

అప్పట్లో.. రేషన్ కోసం ఫీట్లు..అగచాట్లు...

చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి 1.39 కోట్ల కార్డులు మిగిలాయి. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా నిర్దేశించి, పార్టీల కతీతంగా కార్డులు ఇవ్వడంతో రాష్ట్రంలో 1.49 కోట్లకు కార్డుల సంఖ్య పెరిగింది. చంద్రబాబు హయాంలో ముక్కిపోయిన, పురుగుల పట్టిన, రాళ్లు, నూకలు ఎక్కువగా ఉన్న బియ్యాన్ని ఇస్తే తినలేక జనం బియ్యం జోలికే పోయేవారు కాదు. జగన్ ప్రభుత్వంలో ఇప్పుడిస్తున్నది నాణ్యమైన సార్టెక్స్ బియ్యం. అప్పట్లో నాసిరకం బియ్యాన్నే లబ్ధిదారుల నుంచి బాబు బినామీలు తమ దళారులతో పదీ పరక్కు కొనుగోలు చేసి అక్రమ రవాణా ద్వారా రూ.కోట్ల ప్రజాధనాన్ని మింగేసేవారు. వాస్తవానికి జాతీయ ఆహార భద్రత చట్టం కింద 2.68 కోట్ల మందికి 1.54 లక్షల టన్నులు మాత్రమే కేంద్రం బియ్యాన్ని పంపిణీ చేస్తుంటే.. మిగిలిన 1.68 కోట్ల మంది లబ్ధిదారులకు సీఎం జగన్ ప్రభుత్వం సొంత ఖర్చుతో 0.81 లక్షల టన్నుల బియ్యాన్ని అందిస్తోంది.

హెరిటేజ్ కోసమే పండగ కానుకలు..

చంద్రబాబు ప్రభుత్వం పండగల పేరుతో ప్రజా పంపిణీ వ్యవస్థను హెరిటేజ్‌కు దోచిపెట్టడానికి.. తమ అనుయాయులు స్వాహా చేయడానికే ఉపయోగించుకుంది. నిబంధనలకు విరుద్ధంగా.. టెండర్లు లేకుండా ఇష్టమొచ్చిన ధరలకు అప్పటి ప్రభుత్వానికి సరుకులు సరఫరా చేసిన బాబు అనుయాయులు ప్రజాధనాన్ని మింగేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. 2013లో అప్పటి ప్రభుత్వం తెల్ల కార్డుదారులకు ఇచ్చే 9 రకాల నిత్యావసరాల్లో పామాయిల్ ఉండేది. బాబు ప్రభుత్వం దీన్ని తొలగించింది.

కందిపప్పు పంపిణీ నాడు ఎన్నికల డ్రామా

వాస్తవానికి టీడీపీ ప్రభుత్వం జూన్ 2014 సెప్టెంబర్ నుంచి 2015 జూలై వరకు అసలు కందిపప్పు గురించి పట్టించుకోలేదు. నవంబర్ 2016 నుంచి ఫిబ్రవరి 2018 వరకు గిరిజన ప్రాంతాల్లో మాత్రమే కిలో రూ.40 చొప్పున పంపిణీ చేసింది. 2017–18లో ఎక్కడా పంపిణీ చేయలేదు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మార్చి 2018 నుంచి రెండు కిలోల కందిపప్పు పేరిట వంచి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓపెన్ మార్కెట్‌లో హెచ్చురేటు ఎంత ఉన్నా, సబ్సిడీ భారాన్ని భరిస్తూ రూ.67కే అందిస్తోంది.

ఇదీ.. బాబు చిరుధాన్యాల గుట్టు

టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయంలో రాగులు, జొన్నలు, గోధుమ పిండి, ఉప్పు పంపిణీ ప్రారంభించింది. 1.39 కోట్ల కార్డుల్లో కేవలం 1 శాతానికే వీటినిచ్చినా... అబ్బో అంటున్నారు రామోజీ. ఎన్నికల భయంతో ప్రజలను మభ్యపెట్టేందుకు చివరి సంవత్సరంలో టీడీపీ పంపిణీ చేసిందీ చిరు ధాన్యాల్ని. జగన్ ప్రభుత్వం కరోనా తర్వాత వినియోగదారులకు పౌష్టికాహారం పంపిణీలో భాగంగా ఉత్తరాంధ్రలో రాగులు, రాయలసీమలో రాగులు, జొన్నల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రేషన్‌లో కిలో బియ్యం బదులు కిలో రాగులు, జొన్నలు ఉచితంగా అందిస్తోంది.

రుచీపచీ లేని రాతలు

- ప్రభుత్వాస్పత్రుల్లో రోగులను గాలికి వదిలేసిందని రామోజీ గగ్గోలు
- రూ.40తోనే నాణ్యతలేని భోజనం పెట్టింది మీ బాబే
- రోగులకు పౌష్టికాహారం అందించడంపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ
- డైట్ చార్జీలు రూ.80కు పెంపు


బటన్ల బడాయి.. రోగుల బువ్వకూ బకాయి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మారాయి. అత్యాధునిక వైద్యం అందుతోంది. గ్రామాలు, వార్డుల చెంతకు వైద్యం చేరింది. డాక్టర్లే ప్రజల గుమ్మం వద్దకు వచ్చి ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. మందులకు కొదవ లేదు. విలేజ్, వార్డు క్లినిక్‌లు ఏర్పడ్డాయి. ఇక ప్రధానాసుపత్రుల్లో సేవలు కార్పొరేట్ స్థాయిని తలపిస్తున్నాయి. గడచిన ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో నాడు–నేడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బలోపేతం, డైట్ చార్జీల పెంపు ఇలా అనేక సంస్కరణలతో ప్రభుత్వాస్పత్రులు అభివృద్ధి చెందాయి. ప్రభుత్వ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో అభిమానం వెల్లువెత్తుతోంది. ఇది రుచించని ఈనాడు రామోజీకి ఆసుపత్రుల్లో అందిస్తున్న రుచికరమైన భోజనం నచ్చలేదు. తన బాబు పాలనలో రుచీపచీలేకుండా వండినా, ఆ ఐదేళ్లలో రోగుల మెనూ ఛార్జీ రూ.40 మించకపోయినా, మూడుపూటలా భోజనం అందించకపోయినా ఈ 'పచ్చ'రోగికి వెచ్చగా ఉంది. జగన్ పాలనలో మెనూ చార్జి రూ.80కి పెంచి రుచితో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నా రామోజీకి చప్పగానే ఉంది. అందుకే 'బటన్ల బడాయి.. రోగుల బువ్వకూ బకాయి' అంటూ రుచీపచీలేని ఓ కథనాన్ని వండేశారు.

బాబు పాలనలో ఇదీ గతి

2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఒక్కో రోగికి రూ.40తో భోజనం పెట్టేది. ఇది కూడా 2011లో నిర్దేశించిన ఖర్చు. ఇంత తక్కువ ధరతో ఎలా వీలవుతుందన్న ఆలోచన కూడా అప్పట్లో బాబుకు రాలేదు. ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా డైట్ చార్జీల పెంపుపై బాబు దృష్టి పెట్టిన పాపాన పోలేదు. రోజులో ఒక పూట మాత్రమే కోడిగుడ్డు అందించేవారు. ఇక అప్పట్లో వైద్య సేవల గురించి చెప్పాల్సిన అవసరం కూడా లేదు. గుంటూరు జీజీహెచ్‌లో చిన్నారిని ఎలుకలు కొరికి చంపిన దుర్ఘటనే బాబు పాలనలో కునారిల్లిన వైద్య రంగానికి పెద్ద నిదర్శనం.

జగన్ పాలనలో ఇదీ పురోగతి

2019లో సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ క్రమంలో ఆస్పత్రుల్లో చేరిన రోగులు త్వరగా కోలుకోవాలంటే నాణ్యమైన వైద్య సేవలతో పాటు, పౌష్టికాహారం అవసరమని గుర్తించారు. ఇందులో భాగంగా రూ.80కు డైట్ చార్జీలను పెంచారు. రోగులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అందించేందుకు ప్రత్యేకంగా ఒక మెనూ రూపొందించారు. రూ.100తో గర్భిణులకు నిర్దేశించిన మెనూతో పాటు, అదనంగా చిక్కీలు, రాగి జావ, టీబీ, ఎయిడ్స్, మానసిక రోగులకు హై ప్రొటీన్ డైట్‌ను అందిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా రోగులందరికీ కోడిగుడ్డు ఇస్తున్నారు.

మెనూలో మార్పులు ఇలా

టీడీపీ ప్రభుత్వంలో

రోగికి రోజుకు మూడు పూటలా ఆహారం కోసం రూ.40

బ్రేక్ ఫాస్ట్: బ్రెడ్, పాలు

మధ్యాహ్న భోజనం: అన్నం, సాంబారు, వెజ్ కర్రీ, గుడ్డు, అరటిపండు, మజ్జిగ

రాత్రి భోజనం: అన్నం, సాంబారు, వెజ్ కర్రీ, మజ్జిగ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో

రోగికి రోజుకు మూడు పూటలా ఆహారం కోసం రూ.80 ఖర్చు

బ్రేక్ ఫాస్ట్: ఉప్మా, కిచిడీ, ఇడ్లీ, పొంగలి, కోడిగుడ్డు, పాలు

మధ్యాహ్న భోజనం: అన్నం, సాంబారు, ఆకుకూర పప్పు, అరటిపండు, మజ్జిగ, వెజ్ కర్రీ, గుడ్డు


రాత్రి భోజనం: అన్నం, సాంబారు, పప్పు, అరటిపండు, మజ్జిగ, వెజ్ కర్రీ, సంగటి, చపాతీ(డయాబెటీస్ రోగులకు), గుడ్డు


ఇదిగో రామరాజ్యం..

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ పాలనలో కృష్ణా పుష్కరాలను సాకుగా చూపిస్తూ చంద్రబాబు హిందూ దేవాలయాలను ఇష్టానుసారంగా కూలదోశారు. ఒక్క విజయవాడలోనే 30కి పైగా ఆలయాలను కూల్చివేశారు. దీనిపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైనా లెక్కచేయలేదు. 2019లో జగన్ సీఎంగా పగ్గాలు చేపట్టిన తర్వాత కూల్చేసిన ఆలయాలన్నింటినీ పునర్ నిర్మించారు. 2021 జనవరి 8న ఆలయాలకు శంకుస్థాపన చేసి, 2023 డిసెంబరు 7వ తేదీకల్లా పూర్తి చేసి ప్రారంభించింది. దీంతోపాటు టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో 4,111 కొత్త ఆలయాల నిర్మాణం మొదలుపెట్టి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు అందించింది. ఇందులో దాదాపు 80 శాతం రామాలయాలు ఉన్నాయి. రూ. 411.10 కోట్లతో వీటి నిర్మాణం చేపడుతున్నారు. సీజీఎఫ్ ద్వారా మరో రూ.533.18 కోట్లతో 801 పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 1,807 కోట్లను ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసింది. విజయవాడ దుర్గ గుడి అభివృద్ధికి ప్రభుత్వ నిధుల నుంచి రూ.70 కోట్లు మంజూరు చేసింది.

చిత్రం సాక్షిగా


నాడు అరాచకం





విశాఖలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

నేడు పచ్చతోరణం


విజయవాడ పద్మావతి ఘాట్ సమీపంలో దాస ఆంజనేయ స్వామి ఆలయం



విజయవాడ పద్మావతి ఘాట్ సమీపంలో నూతనంగా నిర్మించిన సీతమ్మ వారి పాదాలు గుడి


బొడ్డు రాయి




దుర్గగుడి సమీపంలో నిర్మించిన శనైశ్చర స్వామి (?) ఆలయం

ఇదీ నవరత్నాల వెలుగులు

ఉన్నత చదువులకు జగనన్న దీవెన

జాన్‌బాబు కుటుంబానికి కలిగిన లబ్ధి	
విదేశీ విద్యాదీవెన రూ.51,00,000	
విద్యాదీవెన రూ.3,28,000	వసతి దీవెన రూ.20,800
అమ్మ ఒడి రూ.75,000	సున్నా వడ్డీ రూ.1,167
ఇంటి స్థలం రూ.6,00,000	
పాస్టర్ల గౌరవ వేతనం రూ.1,25,000 (నెలకు రూ.5 వేలు చొప్పున 25 నెలలు వచ్చాయి)	

మదనపల్లె పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన బోనాసి జాన్‌బాబు మండల పరిధిలోని ఓ చర్చిలో ఫాదర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన భార్య బోనాసి రేచల్ గృహిణి. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అత్త వెంకటమ్మ ఆలనాపాలనా కూడా వీరిదే. చర్చికి వచ్చే దాతలు ఇచ్చే అరకొర కానుకలతో కుటుంబ పోషణ భారంగా నడిచేది. ఇలాంటి తరుణంలో పిల్లల చదువులెలా? అన్న భయం వెంటాడేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కుటుంబం దిశ తిరిగింది. సంక్షేమ పథకాలు ఆ ఇంటి ఇబ్బందుల్ని పూర్తిగా తొలగించాయి.

పాస్టర్ జాన్‌బాబు పెద్ద కుమారుడు బోనాసి విలియమ్‌బాబు మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చేశాడు. విద్యాదీవెన కింద రూ.3,28,000, వసతి దీవెన కింద రూ.20,800 అందాయి. దీంతో విజయ్‌బాబు చదువు సాఫీగా సాగింది. బీటెక్ పూర్తవడంతో విదేశాల్లో ఉన్నత చదువుల కోసం 2023లో విదేశీ విద్యాదీవెన కింద దరఖాస్తు చేసుకున్నారు. రూ.51 లక్షలు మంజూరైంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉన్న మోనాస్ యూనివర్సిటీలో ఎంఎస్ ఫస్టియర్ చదువుతున్నాడు. కుమార్తె బోనాసి ఏంజెల్ ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమెకు అమ్మఒడి పథకంలో ఇప్పటి వరకు రూ.75 వేలు లబ్ధి చేకూరింది. చిన్నబ్బాయి బోనాసి బిడియన్ 7వ తరగతి చదువుతున్నాడు. జగనన్న విద్యాకానుక కింద యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఇలా చదువుకు


కుటుంబసభ్యులతో జాన్‌బాబు

అవసరమైనవన్నీ ప్రభుత్వం ఉచితంగా అందించింది. పైసా ఖర్చు లేకుండానే తన బిడ్డల్ని చదివించుకుంటున్నట్లు జాన్‌బాబు తెలిపారు. పాస్టర్లకు ఇచ్చే గౌరవ వేతనంతో సగర్వంగా బతుకుతున్నట్లు చెప్పారు. ఆయన అత్త వెంకటమ్మకు రూ.3 వేలు వృద్ధాప్య పింఛన్ అందుతోంది. –మదనపల్లె సిటీ

కుటుంబ ఆర్థిక పరిస్థితిలో గణనీయ మార్పు



గతంలో పేద, సామాన్య కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలంటే కష్టంగా ఉండేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నవరత్నాలు పేదల పాలిట వరాలుగా మారాయి. వీరి జీవన ప్రమాణాలు పెరిగాయి. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, విదేశీ విద్యా దీవెన, వసతి దీవెనలతో పేద పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుతున్నారు. ఇలాంటి విద్యార్థుల ఎదుగుదల, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్ని సమూలంగా మార్చివేస్తున్నాయి.

– ఎం.నాగేంద్ర, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్, బీటీ కళాశాల, మదనపల్లె

రాజధాని హంగులు.. సరికొత్త సొబగులు

అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వానికీ మొరపెట్టుకున్నారు... ఓటేసి గెలిపించిన ప్రతి ప్రతినిధికీ వినతులు అందించారు. కాలం మారిపోయింది.. తరాలు తరిగిపోయాయి. కానీ.. జిల్లాను పట్టి పీడిస్తున్న సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. ఇక ఆశలు వదిలేసుకున్న ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త కాంతులు చూపించింది. ఎవరొచ్చినా తీరదనుకున్న సమస్యలకు సైతం పరిష్కారం లభించింది. అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. మామూలు జిల్లాగానే ఉండిపోతుందనుకున్న విశాఖకు రాజధాని యోగం పట్టింది. అందుకు అనుగుణంగా హంగులు సమకూరుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన అనకాపల్లి, అల్లూరిజిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం పరుగులు పెడుతున్నాయి.

-సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి/పాడేరు


విశాఖలోని సీ హేర్రియర్ మ్యూజియం



నగరంలో రోడ్ల విస్తరణ

తూర్పు నియోజకవర్గం పరిధి హనుమంతవాక నుంచి కైలాసగిరి కూడలి వరకు పదేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రారంభమయ్యాయి. దక్షిణ నియోజకవర్గంలో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ రాణిబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, అన్నవరం సత్యదేవుని ఆలయ ఘాట్ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కొండవాలు ప్రాంతాల్లో రూ.9 కోట్లతో రక్షణ గోడలు నిర్మించారు. భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలం పాండ్రంగిలో గోస్తనీ నదిపై రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

హౌసింగ్ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌసింగ్ సొసైటీ భూములకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపించారు. జీవో నంబర్ 301, 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్ అందజేశారు. సుమారు రూ.1500 కోట్ల విలువైన భూమిని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన అందజేశారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న 7026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించారు. 39 మంది ఉక్కు కర్మాగార నిర్వాసితులకు కన్వేయన్స్ పట్టాలు, 40 మంది ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలందించారు.

పారిశ్రామిక హబ్‌గా అనకాపల్లి జిల్లా

కొత్తగా ఏర్పాటైన అనకాపల్లి జిల్లాలో ఒక వైపు సంక్షేమం, మరో వైపు నూతన పరిశ్రమల ఏర్పాటు ఊపందుకుంది.

- మాకవరపుపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.
- అనకాపల్లి మండలం కోడూరులో 70 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కుకు స్థల సేకరణ పూర్తయింది.
- నక్కపల్లిలో డ్రగ్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.
- కోమళ్లపూడిలో మరో ఎస్ఈజెడ్‌కు స్థల కేటాయింపు పూర్తయింది.

మారిన ఏజెన్సీ రూపు రేఖలు

కొత్తగా ఏర్పాటైన అల్లూరి జిల్లాలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ఒకప్పుడు నడవడానికి కూడా దారిలేని గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలిగింది. విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్ల పాలనలో సుమారు రూ.100 కోట్లతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రధాన రోడ్లను తారురోడ్లుగా మార్చారు. రూ.10 కోట్లతో జామిగుడ, గిన్నెలకోట గెడ్డలపై భారీ వంతెనలు నిర్మిస్తున్నారు. మిషన్ కనెక్ట్ పాడేరు పేరుతో రూ.100 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

- పెదబయలు మండలంలోని ఇంజరి పంచాయతీలాంటి అత్యంత మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతానికి రూ.10 కోట్లతో తారురోడ్డు నిర్మిస్తున్నారు.
- రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల పనులు దాదాపు పూర్తికావచ్చాయి.
- పాడేరు జిల్లా ఆస్పత్రి కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చెందింది. చింతపల్లిలో రూ.20 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నారు.

భారీ పరిశ్రమలకు శ్రీకారం

రాజధానిగా రూపాంతరం చెందనున్న విశాఖపట్నంలో భారీ పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థాపనకు మార్గం సుగమం చేశారు. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. రూ.21,844 కోట్ల పెట్టుబడితో 39,815 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు.

- గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, ఇనార్బిట్‌మాల్, టర్బో ఏవియేషన్.. వంటి బహుళ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి.
- ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమేజాన్ తదితర ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. మరో 48 ఐటీ సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటితో పాటు 140కి పైగా స్టార్టప్‌లు నడుస్తున్నాయి.
- ఐదేళ్లలో జిల్లాలో 35 భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే ఇక్కడ 120 భారీ పరిశ్రమలున్నాయి. మొత్తం వీటన్నింటి ద్వారా 14,114 మందికి ఉద్యోగాలు.

ఏజెన్సీ పర్యాటకం అద్భుతం


- అనంతగిరిలోని అంజోడ సిల్క్ ఫామ్‌లో పైన్ ప్లాంటేషన్ ఏర్పాటైంది. నీలగిరి చెట్లు పెరగడంతో అంజోడ పార్కు ఓ పర్యాటక ప్రాంతంగా మారింది. అక్కడ మంచు అందాలు కనువిందు చేస్తూ షూటింగులకు అనుకూలంగా మారింది. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో సుమారు రూ.70 లక్షలతో పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.
- బొర్రా గుహల వద్ద గోస్తనీ లోయపై పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన జిప్‌లైన్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఏపీటీడీసీ సుమారు రూ.65 లక్షలతో ఇక్కడ సాహసక్రీడల్ని ఏర్పాటు చేసింది.
- ఏజెన్సీ నయాగరాగా చెప్పుకునే చాపరాయి జలపాతం వద్ద రూ.40 లక్షలతో కాటేజీలు, రోప్ వేలు ఏర్పాటు చేశారు.


అనంతగిరిలో ఏర్పాటు చేసిన అరకు పైన్ పార్క్


చాపరాయి జలపాతం వద్ద అభివృద్ధి


బొర్రా గుహల వద్ద జిప్‌లైన్

జగన్ పాలనలో జనం హ్యాపీ



- సీఎం వైఎస్ జగన్ హయాంలో భారీగా పెరిగిన తలసరి ఆదాయం
- ఐదేళ్లలో పెరిగిన తలసరి ఆదాయం రూ.**88,448**
- చంద్రబాబు పాలనలో రూ.**60,128** మాత్రమే
- దేశ జాతీయ సగటును మించి రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెరుగుదలే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయనడానికి, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందనడానికి తలసరి ఆదాయమే కొలమానం. చంద్రబాబు ఐదేళ్ల పాలనలోకన్నా గత ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో తలసరి ఆదాయం పెరుగుదల ఎక్కువగా ఉంది. రెండేళ్లు కోవిడ్ సంక్షోభం నెలకొన్నప్పటికీ, దాన్ని అధిగమించి వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.88,448 పెరిగింది. కోవిడ్ సంక్షోభం లేకపోయినప్పటికీ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల రూ.60,128 మాత్రమే. చంద్రబాబు ప్రభుత్వం చివరి ఏడాది 2018–19 లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031 మాత్రమే ఉండగా, సీఎం జగన్ పాలనలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.2,42,479కి పెరిగింది. అంతేకాకుండా 2019–20 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లలో జాతీయ సగటును మించి రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల నమోదైంది. 2019–20లో దేశ జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,34,432 ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,14,000కు చేరింది. ఇదే సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019–20లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,60,341 ఉండగా 2023–24 నాటికి రూ.2,42,479 కు చేరింది. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018–19లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031 తో దేశంలో 17వ స్థానంలో ఉంది. కోవిడ్ సంక్షోభం ఉన్నప్పటికీ 2019–20లో రాష్ట్ర తలసరి ఆదాయం వరుసగా పెరుగుతూ 2022–23 నాటికి దేశంలోనే 9వ స్థానంలో రాష్ట్రం నిలిచింది.

తలసరి ఆదాయం అంటే..

తలసరి ఆదాయం అనేది రాష్ట్ర జనాభా ఆర్థిక శ్రేయస్సు ముఖ్యమైన సూచిక. ఇది వ్యక్తులు, కుటుంబాలపై ఆచరణాత్మక ప్రభావాలను కలిగి ఉంటుంది. తలసరి ఆదాయం అంటే సాధారణంగా ప్రజలు వస్తువులు, సేవలపై ఖర్చు చేయడానికి డబ్బుని కలిగి ఉండటం. ఇది వారి జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, ఇతర అవసరాలను తీర్చడంలో ముఖ్యమైన అంశంగా ఉంటుంది. ఏదైనా రాష్ట్రం, ఆ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కొలమానం తలసరి ఆదాయమే.

జగన్ సర్కారు కోవిడ్ సంక్షోభాన్ని అధిగమించిందిలా..

రెండేళ్ల పాటు కోవిడ్ సంక్షోభంతో రాష్ట్రానికి ఆదాయం తగ్గిపోయినప్పటికీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం నవరత్నాల పథకాలను యథాతథంగా అమలు చేసింది. ఈ సమయంలో ప్రజల చేతుల్లో డబ్బులు ఉంటేనే ఆర్థిక రంగానికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేసింది. జీవనోపాధి కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకొంది. వ్యవసాయంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అభివృద్ధి కార్యకలాపాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంది. ప్రజల ఆదాయ మార్గాలను పెంచేందుకు అన్ని రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగే వాతావరణాన్ని కల్పించింది. ఫలితంగా కోవిడ్ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించింది. రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల ఎక్కువగా నమోదైంది.

ఫ్యాన్ గాలి ప్రచండం

▶ మొదటి పేజీ తరువాయి

వస్తున్న స్పందనను చూస్తుంటే.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని పలువురు రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

మరో చారిత్రక విజయం ఖాయం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ మీడియా సంస్థలు, చాణక్య, బీపీఎస్, జన్‌మత్ పోల్స్, లోక్ పోల్స్, పోల్ స్ట్రాటజీ గ్రూప్, పొలిటికల్ క్రిటిక్, మ్యాట్రిజ్ వంటి పొలిటికల్ కన్సల్టెన్సీలు అటు దేశవ్యాప్తంగా.. ఇటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నాడి తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నాయి. టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్–మ్యాట్రిజ్, డెక్కన్ 24/7 వంటి జాతీయ మీడియా సంస్థలు.. చాణక్య, మ్యాట్రిజ్ నుంచి జన్‌మత్ పోల్స్ వరకూ పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన డజనుకు పైగా సర్వేల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని వెల్లడించాయి. దాంతో జనసేన-బీజేపీతో చంద్రబాబు జట్టుకట్టారు. మూడు పార్టీల జెండాలు జత కలిసినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ముందు కూటమి నిలబడలేదన్నది సర్వేల్లో వెల్లడైంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో మద్దతు పెరుగుతూ వస్తోందని సర్వేలు వెల్లడించాయి. సుమారు 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని మార్చి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు నిర్వహించిన సర్వేలు తేల్చి చెబుతున్నాయి.

ఏపీలో పాలన ఎక్స్‌ట్రార్డినరీ... అంతే!



- మా ఇంట్లో పనివారి జీవితాలే అందుకు సాక్ష్యం
- ప్రస్తుతం నేను రాజకీయాల్లో లేను...
- ఏ పార్టీతోనూ నాకు సంబంధాలు లేవు...
- నేను గమనించిన విషయం చెప్తున్నానంతే...
- ప్రముఖ సినీ నటుడు రఘుబాబు

ఇంటర్వ్యూ

తెలుగు నేలకు తేజస్సు వచ్చింది అంటున్నారు ప్రముఖ సినీ నటుడు రఘుబాబు. 'జగన్ ప్రభుత్వ పరిపాలన గురించి సింపుల్‌గా చెప్పాలంటే ఎక్స్‌ట్రార్డినరీ అంతే. అంతకు మించి చెప్పడానికి మరో మాట నా దగ్గర లేదు.' అంటూ కుండబద్దలు కొట్టేశారాయన. తాను ప్రస్తుతం రాజకీయాల్లో లేననీ ఏ పార్టీతోనూ ఎటువంటి సంబంధాలు లేవనీ. ఏ అవసరం కోసమైనా అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తనకు లేదంటున్న ఆయన తన సొంత ఊరి లోని తన ఇంట్లో పనిచేసే పనివారి జీవితాల్లో వచ్చిన మార్పే ప్రస్తుత పాలనకు నిదర్శనం అన్నారు. 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే...

అనూహ్యమైన పాలన ఇది..

నిజంగా జగన్ పరిపాలన ఈ స్థాయిలో ఉంటుందని గత ఎన్నికల ముందు నేను ఏ మాత్రం ఊహించలేదు. ఈ రకమైన అద్భుతమైన మార్పుల్ని నేను ముందుగా ఊహించలేదనేది నిజం. రాష్ట్రంలో మూలాల నుంచి మార్పును జగన్ కోరుకుంటున్నారనేది నాకు అనిపిస్తోంది. ఇప్పుడు మారుమూల ఊళ్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు చూస్తుంటే విదేశాల్లోని స్కూల్స్ గుర్తొస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం అంటే అవమానంగా భావించేవారు. ఆ దశ పోయి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదని బోర్డులు పెట్టడం అంటే వాటి గొప్పతనం తెలుస్తుంది. అవి కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మారడంతో అంతకు ముందు 20, 30శాతం కూడా విద్యార్థులు కనిపించని పరిస్థితి నుంచి ఇప్పుడు 100శాతం ఆక్యుపెన్సీ నేను గమనించాను.

మా సొంత ఊళ్లో... ఎంత మార్పో !

మాది ప్రకాశం జిల్లాలోని రావినూతల గ్రామం. తరచుగా మా ఊరుకు వెళుతుంటాం. దాంతో ఆ గ్రామంలో వచ్చిన మార్పులు ఎన్నో మాకు తెలుస్తున్నాయి. గ్రామ సచివాలయాలు కావచ్చు, వలంటీర్లు ఇళ్లకు రావడం... ప్రభుత్వ పథకాలు, ప్రతీదీ ఇంటికి తీసుకొచ్చి అందించడం గొప్పగా అనిపిస్తోంది. అక్కడ మా ఇంట్లో పని చేసే పనివాళ్ల పిల్లలు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాల్ని ఉపయోగించుకుని దర్జాగా రాజమండ్రిలోని ఇంజినీరింగ్ కాలేజ్‌లో చదువుకోగలుగుతున్నారు. ఇది మేం ఊహించని మార్పు. మేం వాళ్లు చేసే పనికి తగ్గ జీతాలు ఇచ్చినా... అడపాదడపా అదనంగా ఆర్థిక సాయం చేసినా కూడా వాళ్ల జీవితాల్ని సమూలంగా మార్చలేం. ఇప్పుడు అమలవుతున్న ప్రభుత్వ పథకాల వల్ల వాళ్ల జీవితాలు మారిపోతున్నాయి. పిల్లలు బాగా చదువుకోగలగడం వల్ల ఎన్నడూ చూడనంత ఆత్మవిశ్వాసం వారిలో కనిపిస్తోంది. ఇది మాకు చాలా ఆనందాన్ని అందిస్తోంది. ఈ పథకాలు ఇలాగే కొనసాగాలని, ఈ పాలన పేదలకు మరింత కాలం మేలు కలుగజేయాలని కోరుకుంటున్నాను.

-సత్యార్థ్

మీకు తెలుసా?

వైరిచర్ల వర్సెస్ శత్రుచర్ల

2009లో రద్దయిన పార్వతీపురం (ఎస్టీ) లోక్‌సభ నియోజకవర్గంలో శత్రుచర్ల, వైరిచర్ల గిరిజన రాజవంశీకుల మధ్య పోటీ ఉండేది. 1952 నుంచి 2004 వరకు 14 సార్లు ఇక్కడ ఎన్నికలు జరగగా, ప్రతిసారి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్, శత్రుచర్ల విజయరామరాజు పోటీ పడ్డారు. 1977, 1980, 1984 ఎన్నికల్లో వైరిచర్ల ఎన్నికయ్యారు. 1989, 1991, 1998 ఎన్నికల్లో శత్రుచర్ల గెలిచారు.

టాప్ 3 మెజార్టీలు

2014లో జరిగిన ఉప ఎన్నికల్లో మహారాష్ట్రలోని బీడ్ లోక్‌సభ నుంచి బీజేపీ అభ్యర్థిగా ప్రీతమ్ ముండే కాంగ్రెస్ అభ్యర్థిపై 6,96,321 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో గుజరాత్ నవ్‌సారి ఎంపీ స్థానం నుంచి గెలుపొందిన బీజేపీ అభ్యర్థి సీఆర్ పాటిల్ 6.89 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2019లో హరియాణాలోని కర్నాల్ నుంచి బీజేపీ అభ్యర్థి సంజయ్ భాటియా 6.56 లక్షల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచారు.

పదిసార్లు గెలిచిన తండ్రీకొడుకులు

శ్రీకాకుళం జిల్లా సోంపేట నియోజకవర్గంలో తండ్రీ కొడుకులు పదిసార్లు గెలుపొందారు. గౌతు లచ్చన్న 1952 నుంచి వరుసగా నాలుగుసార్లు, 1978లో ఒకసారి విజయం సాధించగా, ఆయన కుమారుడు గౌతు శ్యామ సుందర శివాజీ 1985 నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందడంతో వీరిద్దరే దాదాపు 50 ఏళ్లు సోంపేటకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నియోజకవర్గం 2009లో రద్దయ్యింది.

లోక్‌సభ, అసెంబ్లీలో ఒకే పార్టీ స్పీకర్లు

అటు పార్లమెంట్‌లోను, ఇటు అసెంబ్లీలోను ఒకే పార్టీ నుంచి ఎన్నికైన వారు స్పీకర్లుగా వ్యవహరించిన అరుదైన సందర్భం ఇది. తుని టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన యనమల రామకృష్ణుడు 1995–99 వరకూ అసెంబ్లీ స్పీకర్‌గా కొనసాగారు. ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసి.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సమయంలోనూ రామకృష్ణుడే స్పీకర్ కావటం విశేషం. 1998లో టీడీపీ తరఫున ఎంపీగా ఎన్నికైన గంటి మోహనచంద్ర బాలయోగి అదే ఏడాది మార్చి 24న లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. భారత పార్లమెంటులో తొలి దళిత స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2002 మార్చి 3న భీమవరం నుంచి ఢిల్లీకి వెళ్తూ కృష్ణా జిల్లా వద్ద హెలికాప్టర్ ప్రమాదంలో బాలయోగి మృత్యువాతపడ్డారు.

ఓం భూం స్వాహా!

▶ మొదటి పేజీ తరువాయి

కొమ్మాలపాటి, కోడెల వాటా

పెదకూరపాడు ఎమ్మెల్యేగా పనిచేసిన కొమ్మాలపాటి శ్రీధర్ కుటుంబం తమ కోటా కింద అమరావతిలో 42 ఎకరాలు సొంతం చేసుకుంది. కోడెల శివ ప్రసాదరావు కుటుంబం ఈ భూదందాలో పాత్రధారు. కోడెల కుమారుడు శివరామకృష్ణ పేరిట 17.3 ఎకరాలు స్వాహా అయ్యాయి.

ధూళిపాళ్ల.. పయ్యావుల బినామీ చిట్టా

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అమరావతిలో అధికారికంగా 3.89 ఎకరాలు, అనధికారికంగా 50 ఎకరాలు తన ఖాతాలో వేసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ 4.09 ఎకరాలు తన వాటాగా పొందారు.

బాలయ్య వియ్యంకుడికి భూ సంతర్పణ

బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు కుటుంబానికి టీడీపీ ప్రభుత్వం భూకట్నం సమర్పించుకున్నారు. ఆయనకు చెందిన వీబీసీ ఫెర్టిలైజర్స్‌కు అమరావతికి సమీపంలోని జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో రూ.300 కోట్ల విలువైన 498 ఎకరాలు కేవలం రూ.4.98 కోట్లకే కేటాయించారు. అడ్డగోలుగా రూ.295 కోట్ల లబ్ధి పొందారు.

మురళీ మోహన్, జీవీ భూ బాగోతం

ఈ భూ బాగోతంలో మురళీ మోహన్ కుటుంబానికి చెందిన జయభేరి రియల్ ఎస్టేట్ సంస్థ 53 ఎకరాలు కొల్లగొట్టింది. టీడీపీ ప్రభుత్వంలో వినుకొండ ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు సీడ్ క్యాపిటల్‌కు సమీపంలోని ఐనవోలులో 4.69 ఎకరాలను హస్తగతం చేసుకున్నారు.

IV సాక్షి జాతీయం
ఎలక్షన్ 2024
బుధవారం ఏప్రిల్, 17

మళ్లీ బీజేపీ పరమేనా?

చురు (రాజస్తాన్, ఏప్రిల్ 19)

కీలక అభ్యర్థులు: దేవేంద్ర ఝఝూరియా (బీజేపీ), రాహుల్ కాస్వాన్ (కాంగ్రెస్)


దేవేంద్ర ఝఝూరియా

ఉత్తర రాజస్తాన్‌లోని ఈ లోక్‌సభ స్థానం థార్ ఎడారికి ముఖద్వారం. బీజేపీ కంచుకోట. రెండుసార్లు పారాలంపిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన జావెలిన్ క్రీడాకారుడు ఝఝూరియా పార్టీ తరఫున బరిలో ఉన్నారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి కాస్వాన్ బీజేపీ మాజీ కావడం విశేషం! గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ తరఫున భారీ మెజారిటీతో నెగ్గారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లోకి ఫిరాయించి పోటీని ఆసక్తికరంగా మార్చేశారు. ఆయన బలమైన జాట్ నేత కావడంతో బీజేపీకి గట్టి పోటీ ఎదురవుతోంది. ఎందుకంటే ఇక్కడి 22 లక్షల మంది ఓటర్లలో నాలుగో వంతు జాట్లే! మహిళా రెజ్లర్ల నిరసనలు, సాగు బిల్లులు తదితరాలతో జాట్లు బీజేపీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దాంతో, 'నరేంద్రుని దేవేంద్రుడు' ప్రచారమే దేవేంద్ర ఝఝూరియాను గట్టెక్కిస్తుందని బీజేపీ ఆశిస్తోంది.

చతుర్ముఖ పోటీ!

నగీనా (యూపీ, ఏప్రిల్ 19)

కీలక అభ్యర్థులు: చంద్రశేఖర్ ఆజాద్ (ఏఎస్పీ-కేఆర్), సురేంద్రపాల్ సింగ్ (బీఎస్పీ), మనోజ్‌కుమార్ (ఎస్పీ), ఓం కుమార్ (బీజేపీ)


చంద్రశేఖర్ ఆజాద్


ఈ లోక్‌సభ ఎన్నికల్లో చతుర్ముఖ పోరాటాలు జరుగుతున్న అతి తక్కువ స్థానాల్లో నగీనా ఒకటి. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) అభ్యర్థి చంద్రశేఖర్ ఆజాద్ రంగప్రవేశమే ఇందుకు కారణం. స్థానికంగా తిరుగులేని ఆదరణ భీం ఆర్మీ చీఫ్ అయిన ఈ దళిత నేత సొంతం. ఈ ఎస్సీ రిజర్వుడు స్థానంలో వారి జనాభా 20 శాతం దాకా ఉంటుంది. అయితే ముస్లింలు 43 శాతమున్నారు. వారి దన్నుకు తోడు రాష్ట్రీయ శోషిత్ సమాజ్ అధ్యక్షుడు స్వామిప్రసాద్ మౌర్య మద్దతు కూడా ఆజాద్‌కు కలిసొచ్చే అంశం. 2009 నుంచి ఏ పార్టీ కూడా ఇక్కడ రెండోసారి గెలవలేదు!

తీవ్ర పోటీకి వేదిక

తిరువనంతపురం (కేరళ, ఏప్రిల్ 26)


కీలక అభ్యర్థులు: శశి థరూర్ (కాంగ్రెస్), రాజీవ్ చంద్రశేఖర్ (బీజేపీ), పన్యన్ రవీంద్రన్ (సీపీఐ)


శశి థరూర్


రాజీవ్ చంద్రశేఖర్

అసలే సంప్రదాయ ప్రత్యర్థి అయిన లెఫ్ట్ ఫ్రంట్. దానికి తోడు బీజేపీ నుంచి కేంద్ర మంత్రి రాజీవ్ రూపంలో గట్టి ప్రత్యర్థి. దాంతో కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ శశి థరూర్ గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఎంపీగా ఆయన పనితీరుపై స్థానిక జనం పెదవి విరుస్తుండటం మరింత ప్రతికూలంగా మారింది. అర్బన్ సీటు కావడంతో పాటు ఏకంగా 66 శాతం హిందూ జనాభా ఉండటం బీజేపీకి కలిసొచ్చే అవకాశముంది. రాజీవ్ గెలిస్తే కేరళలో కాషాయ పార్టీ నెగ్గిన తొలి స్థానంగా తిరువనంతపురం చరిత్ర సృష్టించనుంది. 2005లో ఇక్కడ గెలిచిన సీపీఐ అగ్ర నేత రవీంద్రన్ ఈసారి ఎవరి ఓట్లను ఏ మేరకు చీలుస్తారన్న దాన్ని బట్టి విజేత ఎవరో తేలవచ్చంటున్నారు.

రాముడికి ఓ బెంజ్.. 10 కోట్ల ఆస్తులు!



రఘుకులసోముడైన జగదభిరామునికి బెంజ్ కారేమిటా అనుకుంటున్నారా? ఇది జగదేక చక్రవర్తి శ్రీరాముడి గురించి కాదు. టీవీ రామాయణంలో రాముని పాత్రధారి అరుణ్ గోవిల్ గురించి! 80వ దశకంలో దూరదర్శన్‌లో వచ్చిన రామాయణం సీరియల్‌కు లభించిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఆదివారమొస్తే చాలు.. ఉదయాన్నే దేశమంతా 'వినుడు వినుడు రామాయణ గాథ'ను వింటూ టీవీలకు అతుక్కుపోయిన రోజులవి. ఇప్పటికీ అరుణ్ గోవిల్ ఎక్కడ కన్పించినా రామున్నే చూసినంత ఆనందంతో కాళ్లకు నమస్కరించి భక్తి పారవశ్యంలో మునిగిపోతుంటారు. ఇటీవలే బీజేపీలో చేరిన ఈ 72 ఏళ్ల టీవీ రాముడు యూపీలోని మీరట్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. తనకు రూ.62.99 లక్షల విలువైన మెర్సిడెస్ బెంజ్‌తో పాటు రూ.3.19 కోట్ల చరాస్తులు, రూ.5.67 కోట్ల స్థిరాస్తులు, బ్యాంకులో రూ.1.03 కోట్లు, చేతిలో రూ.3.75 లక్షల నగదు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్లో గోవిల్ వెల్లడించారు. రూ.14.64 లక్షల కారు రుణముందని చెప్పారు. సీరియల్లో రాక్షససంహారం చేసిన ఈ టీవీ రామునిపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవండోయ్!

17 ఏళ్లకు సొంతూరికి...

గోవిల్ పుట్టింది మీరట్‌లోనే. ముంబైలో స్థిరపడ్డారు. రాముడు 14 ఏళ్ల వనవాసం తర్వాత అయోధ్యలో అడుగుపెడితే ఈ టీవీ రాముడు 17 ఏళ్ల 'సిటీ'వాసం తర్వాత సొంతూరికి చేరారు. ఆయన కోసం మీరట్‌లో 2009 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన రాజేంద్ర అగర్వాల్‌ను బీజేపీ పక్కనబెట్టింది! సమాజ్‌వాదీ నుంచి అతుల్ ప్రధాన్, బీఎస్పీ తరఫున దేవవ్రత్ త్యాగి గోవిల్ ప్రత్యర్థులు. "ఈ ఎన్నికలతో నేను కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నా. రాముడి ఆశీర్వాదం తప్పకుండా ఉంటుంది" అని విశ్వాసం వెలిబుచ్చారు గోవిల్. అయోధ్య రామమందిర ప్రారంభ వేడుకల్లో ఆయన సీరియల్ సీత దీపికా చిఖలియా, లక్ష్మణుడు సునీల్ లాహరితో సహా పాల్గొనడం విశేషం.

\- సాక్షి, నేషనల్ డెస్క్

తమిళనాట హోరాహోరీకి వేదిక

కోయంబత్తూర్ (తమిళనాడు, ఏప్రిల్ 19)

కీలక అభ్యర్థులు: కె.అన్నామలై (బీజేపీ), గణపతి పి.రాజ్‌కుమార్ (డీఎంకే), సింగై జి.రామచంద్రన్ (అన్నాడీఎంకే)


కె.అన్నామలై

తమిళనాట పాగా వేయాలన్న బీజేపీ వ్యూహానికి ఈ స్థానం కేంద్ర బిందువుగా మారింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ అన్నామలై బరిలో ఉండటమే అందుకు కారణం. దాంతో పొత్తులో భాగంగా పదేళ్లుగా వామపక్షాలకు కేటాయిస్తూ వస్తున్న ఈ స్థానంలో ఈసారి డీఎంకే పోటీ చేయడ తప్పలేదు. నగర మేయర్ రాజ్‌కుమార్‌ను పార్టీ బరిలో దింపింది. జౌళి పరిశ్రమకు కేంద్రమైన కోయంబత్తూరు మాంచెస్టర్ ఆఫ్ ద సౌత్‌గా పేరుబడింది. స్థానికేతర జనాభా ఎక్కువగా ఉన్న ఈ స్థానంపై బీజేపీ చాలా ఆశలే పెట్టుకుంది. తమిళనాడులో బీజేపీ నెగ్గిన తొట్టతొలి లోక్‌సభ స్థానాల్లో కోయంబత్తూరు ఒకటి. 1998, 1999ల్లో ఇక్కడ ఆ పార్టీ గెలిచింది!

అచ్చోట ముచ్చెమట

తొలి రెండు విడతల్లో 9 'హాట్ సీట్లు'

ముఖాముఖి, త్రిముఖ, చతుర్ముఖ పోటీలు దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తున్న వైనం

లోక్‌సభ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. రెండు రోజుల్లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. కానీ ఈసారి ఎన్నికలు పరమ బోరింగ్‌గా సాగుతున్నాయన్న అభిప్రాయం గట్టిగా విన్పిస్తోంది. కాకపోతే తొలి, రెండో విడతల్లో పోలింగ్ జరిగే 191 లోక్‌సభ స్థానాల్లో 9 'హాట్ సీట్లు' మాత్రం దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. రసవత్తర పోటీకి వేదికగా మారాయి. ఎందుకంటే వాటిలో కొన్ని స్థానాల్లో ఇండిపెండెంట్లు బరిలో దిగి ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మరికొన్ని చోట్ల అగ్రనేతలకు పెనుసవాలు ఎదురవుతోంది. ఇంకొన్ని చోట్ల సిట్టింగులకు గట్టి ఎదురుగాలి వీస్తోంది. ఆ సీట్లపై ఓ లుక్కేద్దాం...!

\- సాక్షి, నేషనల్ డెస్క్

పప్పూ ప్రతీకార పోటీ!

పూర్ణియా (బిహార్, ఏప్రిల్ 26)

కీలక అభ్యర్థులు: పప్పూ యాదవ్ (స్వతంత్ర), బీమా భారతి (ఆర్జేడీ), సంతోష్‌కుమార్ కుష్వాహా (జేడీ-యూ)



పప్పూ యాదవ్

సీమాంచల్‌లోని ఈ సాదాసీదా లోక్‌సభ స్థానం కాస్తా రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ రంగప్రవేశంతో సంకుల సమరానికి పోటీకి వేదికగా మారి దేశమంతటినీ ఆకర్షిస్తోంది. 1990ల్లో పూర్ణియా ఎంపీగా ఉన్న ఆయన 20 ఏళ్ల అనంతరం ఎన్నికల బరిలో దిగుతున్నారు! ఆర్జేడీ, కాంగ్రెస్ రెండూ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తూ సిట్టింగ్ ఎంపీ కుష్వాహాతో పాటు ఆర్జేడీ అభ్యర్థి బీమా భారతికి చెమటలు పట్టిస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ పప్పూ కంటతడి పెట్టిన తీరు కూడా ఓటర్లను బాగా కదిలించింది.

రాహుల్‌కు గట్టి పోటీ

వయనాడ్ (కేరళ, ఏప్రిల్ 26)

కీలక అభ్యర్థులు: రాహుల్‌గాంధీ (కాంగ్రెస్), అన్నీ రాజా (సీపీఐ), కె.సురేంద్రన్ (బీజేపీ)


రాహుల్‌గాంధీ

కొండ ప్రాంతమైన ఈ లోక్‌సభ సీటు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి సురక్షిత స్థానమని చెప్పేముందు ఇకపై ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిందే. 2019లో ఏకంగా 4.3 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచిన రాహుల్ ఈసారి కేరళ బీజేపీ చీఫ్ కె.సురేంద్రన్, సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు! మైనారిటీ ప్రాబల్య స్థానమైన వయనాడ్‌లో 32 శాతం ముస్లింలు, 13 శాతం క్రైస్తవులున్నారు. ఇండియా కూటమి భాగస్వాములు కాంగ్రెస్, సీపీఐ మధ్య ముఖాముఖి పోరు సాగుతుందని భావించినా బీజేపీ సురేంద్రన్‌ను బరిలో దించడంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఆయనకు మద్దతుగా స్మృతీ ఇరానీ వంటి అగ్ర నేతలు ముమ్మర ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

గొగొయ్ వర్సెస్ గొగొయ్

జోర్హాట్ (అసోం, ఏప్రిల్ 19)

కీలక అభ్యర్థులు: గౌరవ్ గొగొయ్ (కాంగ్రెస్), తపన్‌కుమార్ గొగొయ్ (బీజేపీ)



గౌరవ్ గొగొయ్

ఈ స్థానం కాంగ్రెస్ కంచుకోట. ఒకప్పుడు మాజీ సీఎం తరుణ్ గొగొయ్ ప్రాతినిధ్యం వహించారు. 2019లో మాత్రం బీజేపీ అభ్యర్థి తపన్‌కుమార్ గొగొయ్ గెలుపొందారు. ఈసారి రాష్ట్ర కాంగ్రెస్ దిగ్గజం గౌరవ్ గొగొయ్ బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. తరుణ్ తనయునిగా కూడా ఆయనకు ప్రజల్లో చాలా ఆదరణ ఉంది. దాంతో ఈ స్థానాన్ని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అహోం ప్రతిష్ట ప్రధానాంశంగా ప్రచారం చేస్తోంది. 2019లో కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన సుశాంత బోర్గోహెయిన్ చేరిక బీజేపీకి కలిసొచ్చే అంశం.

యువ నేత జోరు

బార్మేర్-జైసల్మేర్ (రాజస్తాన్, ఏప్రిల్ 26),

కీలక అభ్యర్థులు: కైలాశ్ చౌదరి (బీజేపీ), ఉమేదా రాం బెనీవాల్ (కాంగ్రెస్), రవీంద్రసింగ్ భాటీ (స్వతంత్ర)


రవీంద్రసింగ్ భాటీ

సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరితో పాటు బెనీవాల్‌కు కూడా స్వతంత్ర అభ్యర్థి రవీంద్రసింగ్ భాటీ చుక్కలు చూపిస్తున్నారు. ఆయన సభలకు జనం భారీగా విరగబడుతున్నారు. ఇటీవలి రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బార్మేర్ లోక్‌సభ పరిధిలోని షెవో స్థానం నుంచి మంచి మెజారిటీతో నెగ్గారాయన. అప్పుడూ ఇండిపెండెంట్‌గానే పోటీ చేశారు. చౌదరి పనితీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉండటంతో భాటీ ఈసారి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దాంతో, 'నా కారణంగా ప్రధాని మోదీని శిక్షించకండి' అంటూ ఓటర్లను చౌదరి వేడుకోవాల్సి వస్తోంది! 19 శాతమున్న జాట్లు, 12 శాతముండే రాజ్‌పుత్‌లు ఇక్కడ నిర్ణాయకం కానున్నారు.

కమలం వికసించేనా!

త్రిసూర్ (కేరళ, ఏప్రిల్ 26)

కీలక అభ్యర్థులు: సురేశ్ గోపీ (బీజేపీ), కె.మురళీధరన్ (కాంగ్రెస్), వి.ఎస్.సునీల్‌కుమార్ (సీపీఐ)



సురేశ్ గోపీ

1952 నుంచీ ఒకసారి లెఫ్ట్, మరోసారి కాంగ్రెస్ నెగ్గుతూ వస్తున్న ఈ స్థానంపై బీజేపీ గట్టిగా దృష్టి పెట్టింది. 'ఆపరేషన్ త్రిసూర్'లో భాగంగా ఈ ఆలయ నగరిని ప్రధాని మోదీ ఇప్పటికే పలుమార్లు చుట్టేశారు. మలయాళ సినీ స్టార్ సరేశ్ గోపీని బరిలో దించారు. ప్రత్యర్థులిద్దరూ బలమైన నేతలు కావడంతో త్రిముఖ పోరు నెలకొంది.

ముందస్తు ఎమర్జెన్సీ పరాజయం

సంచలనాల ఐదో లోక్‌సభ

గతం


1975 జూన్ 25న ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్

సొంత పార్టీయే బయటకు పొమ్మంది. అయినా, ఆమె తగ్గలేదు. ఉక్కు సంకల్పంతో పోరాడారు. ప్రజాక్షేత్రంలోనే బలం నిరూపించుకున్నారు. తిరుగులేని ఎత్తులతో ప్రతిపక్షాలతో పాటు స్వపక్షంలోని తన్మదీయులనూ చిత్తు చేశారు. లోక్‌సభను ఏడాది ముందే రద్దు చేసి ప్రజాతీర్పు కోరిన ఇందిరాగాంధీ అనుకున్నది సాధించారు. ఘర్షణకు దిగిన పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పడమే గాక పోఖ్రాన్ అణు పరీక్షతో మన శక్తిని ప్రపంచానికి చాటారు. కానీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత చీకటి కోణంగా చెప్పదగ్గ ఎమర్జెన్సీ విధింపు నిర్ణయంతో చెరగని మచ్చ మిగుల్చుకున్నారు. ఇలాంటి ఎన్నో విశేషాలకు 1971-77 ఐదో లోక్‌సభ కాలం సాక్షిగా నిలిచింది...

\- సాక్షి, నేషనల్ డెస్క్

నాలుగో లోక్‌సభను ప్రధాని ఇందిర 1970 డిసెంబర్‌లో ఏడాది ముందే రద్దు చేయడం వెనుక గట్టి కారణాలే ఉన్నాయి. కాంగ్రెస్ అప్పటికే రెండుగా చీలింది. ఇందిర తీరు నచ్చని వ్యతిరేక వర్గం సిండికేట్‌గా ఏర్పడ్డారు. రాష్ట్రపతి ఎన్నిక ఇరు వర్గాల బలపరీక్షకు వేదికైంది. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా సిండికేట్ ప్రకటించింది. తన విశ్వాసపాత్రుడే ఆ పదవిలో ఉండాలని ఇందిర భావించారు. ఉప రాష్ట్రపతి వి.వి.గిరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దింపారు. విప్ జారీ చేయకున్నా, ఆత్మ ప్రబోధానుసారం ఓటేయాలంటూ పార్టీ నేతలకు పిలుపునిచ్చి అనుకున్నది సాధించారు. గిరిని గెలిపించుకున్నారు. కాంగ్రెస్ నుంచి ఇందిర బహిష్కరణ తర్వాత 68 ఎంపీలు కాంగ్రెస్ (ఓ) వైపు నిలిచారు. దాంతో లోక్‌సభలో ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ (ఆర్) బలం 220 మంది ఎంపీలకు పడిపోయింది. డీఎంకే, అకాలీదళ్, లెఫ్ట్, స్వతంత్రుల మద్దతుతో అధికారాన్ని నిలబెట్టుకోవాల్సి వచ్చింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ముందస్తు ఎన్నికలకు వెళ్లారు ఇందిర.

ఐదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 521)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్(ఆర్)	352
సీపీఎం	25
సీపీఐ	23
డీఎంకే	23
భారతీయ జనసంఘ్	22
కాంగ్రెస్ (ఓ)	16
తెలంగాణ ప్రజాసమితి	10
ఇతరులు	36
స్వతంత్రులు	14

విపక్షాలు గుంపుగా వచ్చినా...

ఇందిరను ఏకాకిని చేసేందుకు భారతీయ జనసంఘ్, స్వతంత్ర, సోషలిస్టు పార్టీలతో కాంగ్రెస్ (ఓ) చేతులు కలిపినా లాభం లేకపోయింది. 238 స్థానాల్లో పోటీ చేసి కాంగ్రెస్ (ఓ) గెలిచింది 16 మాత్రమే. బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణం రద్దు వంటి నిర్ణయాల ప్రాతిపదికన ప్రజామోదం కోరి ఇందిర ఘనవిజయం సాధించారు. అభ్యర్థులను కాకుండా తనను చూసి ఓటేయాలన్న ఆమె పిలుపు బాగా క్లిక్కయింది. అలాగే 'గరీబీ హటావో, దేశ్ బచావో' నినాదమూ సూపర్‌హిట్టయింది. ఇందిరా కాంగ్రెస్43.68 శాతం ఓట్లతో ఏకంగా 352 సీట్లు సొంతం చేసుకుంది. ప్రాంతీయ పార్టీల ఎదుగుదలను మాత్రం ఇందిర అడ్డుకోలేకపోయారు. సీపీఎం 25, సీపీఐ 23, భారతీయ జనసంఘ్ 22 సీట్లు నెగ్గగా స్వతంత్ర పార్టీ 8 స్థానాలతో సరిపెట్టుకుంది. డీఎంకే 23 లోక్‌సభ స్థానాలతో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలదొక్కుకుంది.

విశేషాలు...

- ఐదో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 1971 మార్చి 1 నుంచి 10 మధ్య కేవలం పది రోజుల్లోనే పూర్తయింది.
- 1952 నుంచి లోక్‌సభ, దేశవ్యాప్తంగా అసెంబ్లీలకు జమిలిగా కొనసాగుతూ వస్తున్న ఎన్నికలకు ఇందిర ముందస్తు నిర్ణయంతో తొలిసారి తెర పడింది.
- దేశ ఆర్థిక పరిస్థితి మెరుగైంది. హరిత విప్లవ ఫలాలు అందివచ్చాయి.
- 1971లో పాక్ మనపై యుద్ధానికి తెగబడింది. తూర్పు పాకిస్తాన్ ప్రజల స్వతంత్ర పోరాటానికి మద్దతుగా భారత బలగాలు బరిలో దిగి 13 రోజుల్లోనే పాక్ పీచమణిచాయి. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ నియాజీ ఏకంగా 93,000 మంది సైనికులతో లొంగిపోయారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్ అవతరించింది.
- 1974 మే 18న రాజస్తాన్‌లోని పోఖ్రాన్‌లో తొలి అణ్వస్త్ర పరీక్షలు విజయవంతంగా జరిగాయి. అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా తర్వాత అణు సామర్థ్యమున్న దేశంగా భారత్ అవతరించింది.

చెరగని మరక... ఎమర్జెన్సీ

1975 జూన్ 25. ఎమర్జెన్సీ విధిస్తూ ఇందిర నిర్ణయం తీసుకున్న రోజు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే దుర్దినంగా మిగిలిపోయింది. ప్రజల సాధారణ హక్కులనూ కర్కశంగా కాలరాసిన ఈ కఠిన నిర్ణయానికి ఇందిర మొగ్గు చూపడానికి పలు కారణాలు చెబుతుంటారు. వాటిలో ముఖ్యమైంది మాత్రం 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా ఆమె గెలుపు చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పే! అధికార యంత్రాంగాన్ని ఇందిర దుర్వినియోగం చేశారని, అనుమతించిన పరిమితికి మించి ఖర్చు చేశారని ఆమె చేతిలో ఓడిన రాజ్ నారాయణ్ కోర్టుకెక్కారు. ఇందిర ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారంటూ 1975 జూన్ 12న కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆమె ఎన్నికను రద్దు చేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ సిన్హా ప్రకటించారు. ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా, ఏ పదవినీ చేపట్టకుండా నిషేధం విధించారు. ఇందిర సుప్రీంకోర్టుకు వెళ్లగా కొన్ని షరతులతో హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ జూన్ 24న తీర్పు వెలువరించింది. మర్నాడే లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో కూడిన ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీని ఉద్దేశించి ఉగ్రూతలూగించే ప్రసంగం చేశారు. దాంతో అదే రోజు ఇందిర ఎమర్జెన్సీ విధించారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా వెనక్కు తగ్గలేదు.



1977 మార్చి 21 దాకా ఎమర్జెన్సీ అరాచకాలు కనీ వినీ ఎరగని రీతిలో కొనసాగాయి. ఫలితంగా 1977 ఎన్నికల్లో ఇందిర ఘోర ఓటమి చవిచూడటంతో కేంద్రంలో తొలి కాంగ్రెసేతర సర్కారు గద్దెనెక్కింది.

సుప్రియా సులే ఆల్‌రౌండర్



శరద్ పవార్ వంటి రాజకీయ దిగ్గజానికి ఏకైక సంతానం. గారాలపట్టి. అలా తండ్రి నీడలోనే రాజకీయాల్లో ప్రవేశించినా తొందర్లోనే బలమైన నాయకురాలిగా ఎదిగి తనదైన ముద్ర వేశారు సుప్రియా సులే. బారామతి ఎంపీ, ఎన్సీపీ (ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ తాను సాధారణ పార్టీ కార్యకర్తనే అని గర్వంగా చెప్పుకుంటారు. అంతకుముందు జర్నలిస్టుగా సామాజిక సమస్యలపై లోతైన అవగాహన పెంచుకున్నారు. ఊపిరి సలపని రాజకీయాల నడుమ కూడా కుటుంబానికి చాలా ప్రాధాన్యమిస్తారు. ఆల్‌రౌండర్‌గా అన్ని పాత్రలకూ సమ న్యాయం చేస్తుంటారు.

పరిచయం

ఉత్తమ పార్లమెంటేరియన్

పుట్టిందే రాజకీయ కుటుంబం. దాంతో చిన్నప్పట్నుంచే రాజకీయ వ్యవహారాలపై సుప్రియకు లోతైన అవగాహన ఉంది. అయినా తొలుత రాజకీయాలను కెరీర్‌గా ఎంచుకోలేదు. కొంతకాలం జర్నలిస్టుగా చేశారు. పెళ్లి తర్వాత పదేళ్లు విదేశాల్లోనే ఉన్నారు. తండ్రి, మామ అనారోగ్యం బారిన పడటంతో తిరిగొచ్చారు. 2006లో రాజకీయ రంగప్రవేశం చేసి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బారామతి లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తండ్రి రాజ్యసభకు వెళ్లడంతో 2009 ఎన్నికల్లో అక్కడ బరిలో దిగారు 3 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లోనూ నెగ్గి బారామతిని బలమైన కోటగా మార్చుకున్నారు. ఎన్సీపీలో చీలిక నేపథ్యంలో ఈసారి మాత్రం వదిన సునేత్ర నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

ఉమన్ ఆఫ్ ద డెకేడ్..

ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే కొద్దిమంది నేతల్లో సుప్రియ ఒకరు. స్వయం సహాయక సంఘాలతో కలిసి పని చేశారు. గిరిజనులు, ఆదివాసీల కోసం పాఠశాలల నిర్మాణానికి, వికలాంగుల హక్కుల సాధనకు కృషి చేశారు. మహిళల సమస్యలపై నిత్యం గొంతెత్తుతుంటారు. భ్రూణహత్యలు, వరకట్న వ్యవస్థపై పలు ఉద్యమాలు జరిపారు. మహిళా సాధికారతకు పోరాటం, సామాజిక సేవకు ప్రతిష్టాత్మక 'ముంబై ఉమన్ ఆఫ్ ద డెకేడ్' అవార్డు అందుకున్నారు. పలుమార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

నేల విడిచి సాము చేయొద్దని...

రాజకీయాలు, కుటుంబం మధ్య సుప్రియ చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటారు. బంధుత్వానికి చాలా విలువిస్తారు. "మా అమ్మ బలమైన వ్యక్తి. నాన్న కంటే గట్టిది. నాన్న పబ్లిక్ లైఫ్‌ను ఎక్కువగా ఇష్టపడతారు. అమ్మ అజ్ఞాతాన్ని ప్రేమిస్తుంది. జీవన పోరాటంలో మాకెప్పుడూ అండగా నిలుస్తూ వచ్చింది. రాజకీయాలు, సామాజిక సవాళ్లను అధిగమించడమెలాగో నాన్న చూపితే, ఎప్పుడూ నేల విడిచి సాము చేయొద్దని అమ్మ నేర్పింది. అందుకే కుటుంబం పట్ల నేను బాధ్యతగా ఉంటా. ఎంపీగా ప్రజల సమస్యలను చర్చిస్తున్నప్పుడు కూడా.. కొడుకు చదువు, కూతురు పుట్టినరోజు కేక్ ఎలా ఉండాలి వంటిని నా మనసులో మెదులుతూ ఉంటాయి" అంటారామె. సుప్రియకు నచ్చే నేత సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి. పార్టీ, సిద్ధాంతాల పట్ల ఆయన నిబద్ధత తనకు ప్రేరణనిస్తాయంటారు. పార్లమెంటేరియన్లుగా దివంగత అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్‌లనూ బాగా ఇష్టపడతారు.

ప్రేమ వివాహం

చిరునవ్వుతో వెలిగే బక్కపలుచని ముఖం. మాటల్లో మృదుత్వంతో ఇట్టే ఆకట్టుకునే సుప్రియ 1969 జూన్ 30న జన్మించారు. బర్కిలీలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో నీటి కాలుష్యంపై అధ్యయనం చేశారు. ఓ దినపత్రికలో జర్నలిస్టుగా చేస్తుండగా ఫ్యామిలీ ఫ్రెండ్ ఇంట్లో సదానంద్ బాలచంద్ర సులేతో జరిగిన పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. వారికిద్దరు పిల్లలు.